www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

తెలంగాణ డిజిటల్ మీడియా
మాజీ డైరెక్టర్‌పై కేసు
కొణతం దిలీప్‌తోపాటు మరొకరిపై కూడా
టీజీఎస్ఆర్టీసీ నకిలీ లోగో వివాదం
సోషల్ మీడియాలో దుష్ప్రచారం ఆరోపణ
ఆర్టీసీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు
13

శుక్రవారం | 24-5-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 | సంచిక (Issue) : 38
శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతఋతువు, వైశాఖమాసం, బహుళపక్షం; తిథి: పాడ్యమి రా. 7.25 తదుపరి విదియ; నక్షత్రం: అనూరాధ ఉ. 10.10 తదుపరి జ్యేష్ఠ; వర్జ్యం: మ. 3.52-5.29; దుర్ముహూర్తం: ఉ.9.19-9.11, మ.12.37-1.29; అమృతఘడియలు: రా.1.38-3.16; రాహుకాలం: ఉ.10.30-12.00; సూర్యోదయం: 5.44; సూర్యాస్తమయం: 6.39 | హైదరాబాద్ సిటీ
Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

2047 వరకు కష్టపడతా!

దేవుడు నాకప్పటివరకు టైమిస్తాడు.. నన్ను ప్రత్యేక కార్యం మీద పంపాడు
వికసిత్ భారత్ కల నెరవేరుస్తా.. ప్రధాని మోదీ సంచలన వ్యాఖ్యలు
మరో 2 దశాబ్దాలు క్రియాశీల రాజకీయాల్లో.. ప్రజలకు ప్రధాని సంకేతం


పటియాలాలో ఎన్నికల ప్రచారం సందర్భంగా కరవాలంతో ప్రధాని మోదీ

న్యూఢిల్లీ, మే 23: వికసిత్ భారత్ కల సాకారం కోసం 2047 వరకు నిరంతరం శ్రమించే బాధ్యతను దేవుడు తన మీద పెట్టాడని ప్రధాని మోదీ అన్నారు. ఇండియా టీవీ సలాం ఇండియా షోలో ఆయన మాట్లాడారు. దేవుడు తననో ప్రత్యేక కార్యం మీద పంపాడని తనకు అనిపిస్తోందన్నారు. దేవుడు తనకు దారిచూపించడమే కాకుండా శక్తినిచ్చాడని, 2047 కల్లా వికసిత్ భారత్ లక్ష్యం నెరవేర్చే వరకు దేవుడు తనను పైకి పిలవడని విశ్వాసం ఉందని చెప్పారు. ఈ భూమ్మీద ఇంకా తాను ఎక్కాల్సిన మెట్లేవీ లేవన్నారు. ప్రస్తుతం 74 ఏళ్ల వయసున్న మోదీ ఈ వ్యాఖ్యల ద్వారా మరో రెండు దశాబ్దాలు దేశ రాజకీయాల్లో క్రియాశీలంగా ఉంటానని పరోక్షంగా సంకేతాలు ఇచ్చారు. 400 సీట్ల నినాదం బీజేపీది కాదని, జనం నుంచి వచ్చిందని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. గత ఐదేళ్ల పాలనలో ఇతర పార్టీల నుంచి వచ్చిన మద్దతును గమనిస్తే తాము 400 బలాన్ని ఎప్పుడో సంతరించుకున్నామని స్పష్టమవుతుందని

మిగతా 2వ పేజీలో...


సీఎంకు బుద్ధుడి ప్రతిమ అందిస్తున్న బౌద్ధభిక్షువు

పనే ధ్యానం

బుద్ధుడి బోధనలే స్ఫూర్తి.. వాటిని ఆచరిస్తున్నా
2,500 ఏళ్ల తర్వాత కూడా ఆదర్శంగా బౌద్ధం
నేటి విద్వేష వాతావరణంలో ఎంతో అవసరం
ప్రపంచ స్థాయి కార్యక్రమం ఏర్పాటుచేయండి
వ్యక్తిగా, ముఖ్యమంత్రిగా సహకారం అందిస్తా
బుద్ధ పౌర్ణమి వేడుకల్లో సీఎం రేవంత్‌రెడ్డి

మారేడుపల్లి, నాగార్జునసాగర్, మే 23 (ఆంధ్రజ్యోతి): గౌతమ బుద్ధుడు చేసిన బోధనల్లో 'ధ్యానాన్ని ఒక పనిగా చేయడం కాదు.. ప్రతీ పనిని ధ్యానంగా చేయాలి' అనే బోధన తనకు ఎంతో ఇష్టమైనదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పారు. ఇది పైకి రెండు లైన్లుగా కనిపిస్తుందిగానీ, అర్థం చేసుకుంటే ప్రపంచ పరిజ్ఞానమంతా అందులో ఉందన్నారు. ఈ బోధన నుంచి తాను ఎంతో స్ఫూర్తి పొందానని, పని చేసేటప్పుడు పూర్తిస్థాయిలో కాకపోయినా, కొంతమేరకైనా ధ్యానంగానే పని చేస్తానని తెలిపారు. గౌతమ బుద్ధుడు బోధించిన శాంతి, సహనం, అనురాగం, ప్రేమ, ఐకమత్యం అనే భావనలను తాను

మిగతా 12వ పేజీలో...

బిల్లులన్నీ పెండింగ్

గత ప్రభుత్వం నుంచి క్లియర్ కాని బకాయిలు

విద్యార్థులకు ఐదేళ్లుగా ఫీజులు, స్కాలర్‌షిప్‌లు పెండింగ్
రూ. 6 వేల కోట్లకు చేరిన ఫీజు రీయింబర్స్‌మెంట్
వైద్య ఆరోగ్యశాఖ బిల్లుల బకాయి రూ. 3 వేల కోట్లు
సర్కారు దవాఖానాల మందులకూ చెల్లింపులు శూన్యం
ఉద్యోగుల సప్లిమెంటరీ బిల్లులకు 4 వేల కోట్లు అవసరం
ఖజానాలో సొమ్ములేక క్లియర్ చేయని సర్కారు
ఒక్కో నెలలో మైనస్‌లోకి జారుకుంటున్న ఖజానా
అప్పుల అసలు, వడ్డీలు, వేతనాల భారమే ఎక్కువ



హైదరాబాద్, మే 23 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు అందడంలేదు. ఉద్యోగుల సప్లిమెంటరీ బిల్లులు క్లియర్ కావడంలేదు. ప్రభుత్వ ఆస్పత్రులకు మందులు సరఫరా చేసే కంపెనీలకు బిల్లుల చెల్లింపు జరగడంలేదు. ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులకూ చెల్లింపుల్లేవు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో పేరుకుపోయిన బిల్లులు ఇప్పటికీ క్లియర్ కావడం లేదు. ఖజానాలో సొమ్ములేక ప్రభుత్వం వీటిని పెండింగ్‌లో పెడుతోంది. దీంతో ఆయా వర్గాలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నాయి. కాలేజీ యాజమాన్యాల నుంచి విద్యార్థులకు సమస్యలు ఎదురవుతుండగా, ఆస్పత్రుల్లో మందులు లభించక, ఆరోగ్యశ్రీ సేవలు సవ్యంగా అందక రోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అయితే.. విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు సంబంధించిన బకాయిలు చెల్లించకపోవడంతో కాలేజీల నిర్వహణ కష్టంగా మారిందని యాజమాన్యాలు వాపోతున్నాయి. కాలేజీలను మూసేసుకునే పరిస్థితి దాపురిస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. మరోవైపు ఔషధ కంపెనీలు తమకు బకాయిలు చెల్లించకపోతే ప్రభుత్వ ఆస్పత్రులకు మందులు సరఫరా చేయలేమంటూ చేతులెత్తేస్తున్నాయి. ఇక ఆరోగ్యశ్రీ బిల్లులు పది నెలలుగా క్లియర్ కావడం లేదని నెట్‌వర్క్ ఆస్పత్రుల సంఘం అంటోంది. అయితే రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రంగానే ఉండడం, నెలవారీగా సమకూరుతున్న రాబడులు.. నెలవారీ వ్యయాలకే సరిపోతుండడంతో ప్రభుత్వ ఖజానాలో సొమ్ము మిగలడం లేదు. పైగా పార్లమెంటు ఎన్నికల కోడ్ కారణంగా బిల్లుల చెల్లింపుల్లో కొంత సమస్య ఎదురైందని ప్రభుత్వ వర్గాలు అంటున్నాయి. ఆర్థిక సంవత్సరం రెండో

మిగతా 13వ పేజీలో...

పారిశ్రామిక ప్రగతి
కొత్తపుంతలు
6 విధానాలపై కసరత్తు
బీఆర్ఎస్ హయాంలో బకాయిలు 3736 కోట్లు
కొన్ని పరిశ్రమలకు ఇచ్చిన 684 కోట్ల చెక్కులు బౌన్స్
ఇకపై జాప్యం లేకుండా ప్రోత్సాహకాలు మంజూరు
సర్కారు సన్నాహాలు 13



హేమ రక్తనమూనాలో
డ్రగ్స్ జాడ
మరో నటి ఆషి రాయ్ బ్లడ్ శాంపిల్‌లోనూ!
బెంగళూరు రేవ్ పార్టీకి హాజరైన 86 మంది రక్త నమూనాల్లో సైతం!
పరీక్షల్లో నిర్ధారణ అయిందన్న పోలీసులు
త్వరలో నోటీసులు! 12



ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్
ఏడుగురు మావోయిస్టుల మృతి.. సంఖ్య పెరిగే చాన్స్
మృతుల్లో ఇంద్రావతి ఏరియా కమిటీ, పీఎల్‌జీఏ టూన్-16 సభ్యులు 14
గత 70 రోజుల్లో 101 మంది మావోయిస్టుల హతం
సైలెన్స్ డ్రోన్లను వినియోగించి అనుమానుల గుర్తింపు

25 మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు
కాంగ్రెస్‌లోకి..

లోక్‌సభ ఫలితాల తర్వాత ఇది జరగడం పక్కా
గులాబీ ముఖ్య నేతలూ ఆ పార్టీలో ఉండరు
కేంద్రం డబ్బులిస్తున్నా ధాన్యం కొనలేరా?
బోనస్ అంటే ధాన్యం మొలకెత్తడమా: కిషన్‌రెడ్డి


బీబీనగర్ మండలం రాఘవాపురంలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న కిషన్‌రెడ్డి

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)
లోక్‌సభ ఎన్నికల ఫలితాల తర్వాత 25 మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరడం పక్కా అని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి తెలిపారు. రాష్ట్రంలో ఇప్పటికే బీఆర్ఎస్‌కు చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు.. ముఖ్యమంత్రి, మంత్రులను కలిసి ఫోటోలు దిగుతున్నారని, లోక్‌సభ ఎన్నికల ఫలితాల తర్వాత వారంతా

మిగతా 12వ పేజీలో...



ఐఐటియన్లకు ఉద్యోగాలు కరువు

ఈ ఏడాది 7 వేల మందికి దొరకని కొలువులు
ఏటా పెరుగుతున్న సమస్య.. బిట్స్‌లోనూ ఇదే పరిస్థితి
చాట్ జీపీటీ, పలు దేశాల్లో ఎన్నికల ప్రభావంతోనే..!
పూర్వ విద్యార్థుల సాయం కోరుతూ ఐఐటీల లేఖలు

న్యూఢిల్లీ, మే 23: ఐఐటీలో సీటు లభించిందంటే ఇక బంగారు భవిష్యత్తే అని అనుకుంటాం. కోర్సు పూర్తి కావస్తుండగానే స్వయంగా కంపెనీలే వచ్చి లక్షలు, కోట్లలో వార్షిక వేతనాలు ఆఫర్ చేస్తూ ఉద్యోగాల్లోకి తీసుకుంటాయని వింటాం. కానీ, ఐఐటీల ప్రభ క్రమంగా మసకబారుతోందని తాజా పరిణామాలు వెల్లడిస్తున్నాయి. దేశవ్యాప్తంగా ఉన్న 23 ఐఐటీల్లో 2023-24 బ్యాచ్‌కు చెందిన విద్యార్థుల్లో 38 శాతం మందికి (7 వేల మందికిపైగా) ఇంకా ఉద్యోగాలు దొరకలేదని తాజాగా వెల్లడైంది. ఐఐటీ కాన్పూర్ పూర్వ విద్యార్థి

మిగతా 2వ పేజీలో...

వనపర్తి జిల్లాలో బీఆర్ఎస్ నేత హత్య

కల్లం వద్ద నిద్రిస్తుండగా నరికి చంపిన దుండగులు
రాజకీయ కక్షలే కారణమంటూ కుటుంబ సభ్యుల ఫిర్యాదు
మంత్రి జూపల్లి, అనుచరుల ప్రమేయం ఉందన్న బీఆర్ఎస్
మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించిన కేటీఆర్
హత్యకు భూతగాదాలు, ఆర్థిక లావాదేవీలే కారణం 14
పరాకాష్ఠకు చేరిన బీఆర్ఎస్ శవరాజకీయాలు: జూపల్లి


హతుడు శ్రీధర్‌రెడ్డి (ఫైల్)

మేడిగడ్డ కింద అగాధం?

12000-15000 క్యూబిక్ మీటర్ల ఖాళీ

బ్యారేజీ పొడవునా బొరియలాగా విస్తరణ!
పునాదిలో ఇసుక కొట్టుకుపోవడం వల్లే..
ఏడో బ్లాకు వద్ద భూగర్భంలో ప్రకంపనలు
16వ నంబరు గేటు ఎత్తుతో భారీ శబ్దాలు
ప్రెషర్ గ్రౌటింగ్ పద్ధతితో ఇసుక సిమెంట్‌తో అగాధం పూడ్చిన తర్వాతే ఎత్తాలని నిర్ణయం
దాన్ని నింపకుండా పనులు నిర్వహిస్తే బ్యారేజీ మరింతగా లోపలికి కుంగే ప్రమాదం 13


నాలుగైదు రోజుల్లో మేడిగడ్డకు సీఎం: మంత్రి ఉత్తమ్

పారిశుధ్య కార్మికురాలితో అసభ్య చేష్టలు


కిషన్

మహిళా కార్మికులతో అసభ్యకర ప్రవర్తన
వీడియో తీసి వారికి చూపిస్తూ వేధింపులు
ఇద్దరు శానిటరీ ఫీల్డ్ అసిస్టెంట్ల నిర్వాకం
సామాజిక మాధ్యమాల్లో వీడియో వైరల్
జీహెచ్ఎంసీ కమిషనర్ సీరియస్
ఆ ఇద్దరూ విధుల నుంచి తొలగింపు 14

ఎన్నికల బరిలో 121 మంది నిరక్షరాస్యులు

న్యూఢిల్లీ, మే 23: లోక్‌సభ ఎన్నికల బరిలో 121 మంది నిరక్షరాస్యులు ఉన్నట్లు ది అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్) నివేదిక వెల్లడించింది. 1263 మంది తాము బడికి వెళ్లకపోయినా చదవడం రాయడం వచ్చని చెప్పారని, 2436 మంది 5 నుంచి 12వ తరగతుల మధ్య చదివినట్లు తెలిపారని పేర్కొంది. 18వ లోక్‌సభ ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థుల విద్యార్హతలను అధ్యయనం చేసిన ఏడీఆర్ సంస్థ గురువారం ఆ వివరాలను వెల్లడించింది. 42 మంది డిప్లొమా చదివినట్లు చెప్పారని, 1303 మంది 12వ తరగతి పూర్తి చేసినట్లు చెప్పారని పేర్కొంది. 4211 మంది డిగ్రీ ఆపై చదివినట్లు చెప్పారని వెల్లడించింది. 198 మంది అభ్యర్థులు డాక్టరేట్ పట్టా పొందినట్లు పేర్కొంది. 23 మంది తమ విద్యార్హతలకు సంబంధించిన వివరాలు చెప్పేందుకు ఇష్టపడలేదని వెల్లడించింది. కాగా, ఇప్పటివరకు ఐదు దశల పోలింగ్ ముగియగా, ఆరో దశ మే 25న, ఏడో దశ పోలింగ్ జూన్ 1న జరగనుంది.



ఏపీ, తెలంగాణ భవన్‌లలో రాహుల్ సందడి

» పార్టీ నేతలతో భోజనం.. అభిమానులతో సెల్ఫీలు

న్యూఢిల్లీ, మే 23(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ గురువారం ఢిల్లీలోని ఏపీ, తెలంగాణ భవన్‌లలో సందడి చేశారు. ఢిల్లీ లోక్‌సభ ఎన్నికల ప్రచారం చివరిరోజున బిజీబిజీగా ఉన్న రాహుల్ మధ్యాహ్న భోజనం చేసేందుకు ఏపీ, తెలంగాణ భవన్‌లకు వచ్చి ఆశ్చర్యపరిచారు. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, పార్టీ స్థానిక నేతలతో కలిసి మెస్‌లో భోజనం చేశారు. అనంతరం అభిమానులతో సెల్ఫీలు దిగారు. అభిమానంతో ఇచ్చిన మామిడి పండ్లను సంతోషంగా స్వీకరించారు. అనంతరం మీడియాతో రాహుల్ మాట్లాడుతూ.. జూన్ 4 తర్వాత ఇండియా కూటమి కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని ధీమా వ్యక్తం చేశారు. దేశంలోని 90% పేద వర్గాలకు చెందిన ప్రజలు ఎన్నికల్లో తమ వెంటే ఉన్నారన్నారు. ఢిల్లీలోని మొత్తం ఏడు ఎంపీ సీట్లు ఇండియా కూటమే గెలుచుకుంటుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. అనంతరం రాహుల్ గాంధీ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి మల్లు రవిని వెంటపెట్టుకుని కన్నాట్ ప్లేస్‌లో ఒక ఐస్‌క్రీం పార్లర్‌కు వెళ్లారు. మల్లు రవికి ఐస్‌క్రీం తినిపించారు.

మోదీని మానసిక వైద్యుడికి చూపించాలి

తాను సత్కారణంతో దేవుని సాధనంగా భూమిపైకి వచ్చానంటున్న ప్రధాని మోదీని మానసిక వైద్యుడి వద్దకు తీసుకెళ్లాలని రాహుల్‌గాంధీ అన్నారు. మహిళలు రెండో తరగతి పౌరులని బీజేపీ నమ్ముతోందని, ఆ పార్టీ మాతృసంస్థ అయిన ఆర్ఎస్ఎస్ తన శాఖల్లోకి మహిళలను అనుమతించదని విమర్శించారు. గురువారం ఢిల్లీలో జరిగిన పలు సమావేశాల్లోనూ, మెట్రో రైలులో ప్రయాణికులతోనూ ఆయన మాట్లాడారు. "కరోనా కాలంలో ప్రజలు గంగాతీరంలో చనిపోయారు. వేలాదిమంది ఆస్పత్రుల ముందు కన్నుమూశారు.. మరి భగవంతుడు పంపిన మోదీ ఆ సమయంలో ఏం చేశారు?" అని రాహుల్ ప్రశ్నించారు.

గంగలా గోదావరి, కృష్ణా!

» నదుల సంరక్షణపై కేంద్ర జలశక్తి దృష్టి

» 31న షెడ్యూల్ అడ్వైజరీ కమిటీ భేటీ

అమరావతి, మే 23 (ఆంధ్రజ్యోతి): దేశంలోని ప్రధాన నదులు గోదావరి, కృష్ణా, నర్మదా, మహానది, కావేరి, పెరియార్‌లను గంగా నది తరహాలోనే పరిశుభ్రం చేసి సంరక్షించాలన్న యోచనలో ఉన్నట్టు కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ వెల్లడించింది. ఆయా నదీ ప్రాంత రాష్ట్రాలకు ఈ విషయాన్ని తెలియజేసింది. గంగా నది తరహాలో ప్రధాన నదులను సంరక్షించాలన్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకుంది. ఈ నెల 31వ తేదీన షెడ్యూల్ అడ్వైజరీ కమిటీ సమావేశాన్ని నిర్వహిస్తున్నామని తెలిపింది. ఈ సమావేశానికి ఏపీ నుంచి ప్రతినిధిని పంపాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్ రెడ్డికి ఈ నెల 20వ తేదీన కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రటరీ ప్రదీప్‌కుమార్ అగర్వాల్ లేఖ రాశారు. నదీ సంరక్షణ అధ్యయన బాధ్యతలను ఐఐటీలకు అప్పగించారు. గోదావరి నదీ జలాల సంరక్షణను నాగపూర్ ఎన్ఈఈఆర్ఐకు అప్పగించారు. ఈ సంస్థ అధ్యయన వివరాలను తెలుసుకునే బాధ్యతలను ఐఐటీ హైదరాబాద్‌కు అప్పగించారు. అలాగే కృష్ణా నదీ సంరక్షణపై అధ్యయన బాధ్యతను వరంగల్ ఎన్ఐటీకి, పరిశీలనా బాధ్యతను ఎన్ఐటీ సూరత్‌కల్‌కు అప్పగించారు.



నైట్ విజన్ గాగుల్స్‌తో విమానం ల్యాండింగ్

» చిమ్మచీకట్లో వాయుసేన ఫీట్.. ఇదే తొలిసారి

న్యూఢిల్లీ, మే 23: భారత వాయుసేన మరో అరుదైన ఘనత సాధించింది. తొలిసారిగా రాత్రివేళ నైట్ విజన్ గాగుల్స్ (ఎన్‌వీజీ) సాయంతో సీ-130జే విమానాన్ని తూర్పు సెక్టార్‌లోని అడ్వాన్స్‌డ్ ల్యాండింగ్ గ్రౌండ్‌లో విజయవంతంగా దింపింది. ఈ విషయాన్ని వాయుసేన 'ఎక్స్'లో వెల్లడిస్తూ రెండు వీడియో క్లిప్‌లను జత చేసింది. ఒక క్లిప్‌లో ఎన్‌వీజీ సహాయంతో విమానం దిగడం కనిపించింది. రెండో క్లిప్‌లో విమానం లోపలి నుంచి బయటి ప్రాంతం ఎలా కనిపిస్తుందో ఉంది. దేశ సార్వభౌమత్వ పరిరక్షణకు ఎల్లవేళలా సంసిద్ధంగా ఉంటామని, తమ సామర్థ్యాలను పెంపొందించుకునేందుకు కట్టుబడి ఉన్నామని ఐఏఎఫ్ ఆ పోస్టులో పేర్కొంది. రాత్రివేళల్లో కూడా వాయుసేన ఆపరేషన్లు నిర్వహించడంలో ఎన్‌వీజీ సాంకేతిక కీలక పాత్ర పోషించనుంది. వాయుసేన కొన్నాళ్ల కిందట నియంత్రణ రేఖ వద్ద కార్గిల్ ఎయిర్‌స్ట్రిప్ మీద ఇదే విమానాన్ని రాత్రివేళ విజయవంతంగా దింపింది. తక్కువ స్థలంలోనే ల్యాండింగ్, టేకాఫ్ కావడం సీ-130జే ప్రత్యేకత. ఒడిసా, ఝార్ఖండ్, సిక్కిం, పశ్చిమ బెంగాల్, బిహార్ రాష్ట్రాలు తూర్పు సెక్టార్ పరిధిలోకి వస్తాయి.


బూత్‌ల వారీ పోలింగ్ శాతం వెల్లడించలేం

ఈసీ వెబ్‌సైట్లో పెడితే ఇబ్బందులు.. ఫామ్ 17(సి) పబ్లిక్ డాక్యుమెంటు కాదు

» దాన్ని బయట పెట్టాలని చట్టంలో లేదు.. పోలింగ్ తర్వాత కాపీ పొందొచ్చు

» సుప్రీంలో ఎన్నికల సంఘం అఫిడవిట్

న్యూఢిల్లీ, మే 23: పోలింగ్ కేంద్రాల వారీగా పోలింగ్ శాతం తెలపడం, దాన్ని వెబ్‌సైట్లో పెట్టడం కుదరదని కేంద్ర ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. ఇందువల్ల ఎన్నికల యంత్రాంగంలో గందరగోళం ఏర్పడుతుందని చెప్పింది. ఒక పోలింగ్ కేంద్రంలో ఎన్ని ఓట్లు పోల్ అయ్యాయో తెలియజేసే ఫామ్ 17(సి)ని బయటపెట్టాలని చట్టంలో ఎక్కడా లేదని గుర్తు చేసింది. వాటిని బయట పెడితే ఎవరైనా కొంటె పనుల్లో భాగంగా గణాంకాల ఫొటోలను దిద్ది తప్పుడు ప్రచారం చేస్తే మొత్తం ఎన్నికల ప్రక్రియకు అవాంతరం ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేసింది. తాజా ఎన్నికల మొదటి రెండు దశల్లో పోలింగ్ నాడు చెప్పిన శాతానికి తర్వాత ప్రకటన విడుదల చేసినప్పుడు పేర్కొన్న శాతానికి మధ్య 5-6 శాతం తేడా ఉందని వస్తున్న ఆరోపణలను ఎన్నికల సంఘం తోసిపుచ్చింది. పోలింగ్ ముగిసిన 48 గంటల్లో బూత్‌లో పోలింగ్ శాతాన్ని తెలిపే ఫామ్ 17(సి)ని ఎన్నికల సంఘం వెబ్‌సైట్లో పెట్టాలని కోరుతూ ఏడీఆర్ స్వచ్ఛంద సంస్థ సుప్రీంకోర్టులో వేసిన పిటిషన్‌కు స్పందనగా ఎన్నికల సంఘం బుధవారం ప్రమాణపత్రాన్ని దాఖలు చేసింది. వెబ్‌సైట్లో పెట్టాల్సి వస్తే అది చట్టం తమకు ఇచ్చిన అధికారాలకు వ్యతిరేకమే కాకుండా ఇప్పటికే సగం పూర్తయిన లోక్‌సభ ఎన్నికల ప్రక్రియను గందరగోళంలో పడేస్తుందని పేర్కొంది. 2019 లోకసభ ఎన్నికల సందర్భంగా పోలింగ్ శాతం అవకతవకలు జరిగినట్లుగా ఒక్క అభ్యర్థి గానీ, ఒక్క ఓటర్ గానీ పిటిషన్ వేయలేదని గుర్తు చేసింది. ప్రస్తుత పిటిషన్ ఆధారం లేని తప్పుడు పిటిషన్ అని పేర్కొంది. చట్ట ప్రకారం పోలింగ్ ఏజెంటు పోలింగ్ పూర్తయ్యాక బూత్‌లో పోలింగ్ శాతాన్ని సూచించే ఫామ్ 17(సి) నకలును తీసుకోవచ్చని గుర్తు చేసింది. ఫామ్ 17(సి) అసలు ప్రతి ఈవీఎంలు ఉంచే గదిలో ఉంటుందని, పోలింగ్ ఏజెంట్లు అందుకొనే నఖలు మీద ఏజెంటు సంతకం ఉంటుందని వెల్లడించింది. అంటే బయటకు వచ్చే ప్రతీ 17(సి) కాపీకి సంతకం ఉన్న సంబంధిత ఏజెంటు బాధ్యుడు అవుతాడని చెప్పింది. ఈ వివరాలను వెబ్‌సైట్లో పెట్టడం, వాటికి



(CHAPTER 23, PARA 29.1.4)
FORM 17C
SEE RULES 49S AND 56C (2)
PART I-ACCOUNT OF VOTES RECORDED

తుంటరులు తప్పుడు నకలు తయారు చేయడం వల్ల మొత్తం ఎన్నికల ప్రక్రియ మీద ప్రజల్లో అనుమానాలకు తావిచ్చినట్లు అవుతుందని వివరించింది. పిటిషనర్ వాదనను సుప్రీంకోర్టు అంగీకరిస్తే ఏ ఓటరైనా పోలింగ్ కేంద్రానికి వచ్చి, 17(ఎ) ప్రజా బాహుళ్య పత్రం కాబట్టి తనకు కాపీ కావాలని అడిగే పరిస్థితి ఏర్పడుతుందని, దాంతో మొత్తం ఎన్నికల ప్రక్రియే గందరగోళంలో పడుతుందని ఆందోళన వ్యక్తం చేసింది. ఈ నెల 17న స్వచ్ఛంద సంస్థ పిటిషన్‌కు సుప్రీంకోర్టు స్పందిస్తూ వారం రోజుల్లోగా ఎన్నికల సంఘం స్పందన తెలపాలని ఆదేశించింది. ఆ మేరకు ఈసీ బుధవారం ప్రమాణపత్రాన్ని సమర్పించింది. 2019లో కూడా ఏడీఆర్ ఎన్నికల ప్రక్రియ ముగిశాక పోలింగ్ బూత్‌ల వారీగా ఫామ్ 17(సి) సమాచారాన్ని ఎన్నికల సంఘం వెబ్‌సైట్‌లో ఉంచాలని సుప్రీంకోర్టును కోరింది.


అప్పుడు వేగంగా పోలింగ్ శాతం!

న్యూఢిల్లీ, మే 23 (ఆంధ్రజ్యోతి): పోలింగ్ జరిగిన తీరుకంటే కేంద్ర ఎన్నికల సంఘం పోలింగ్ శాతాన్ని ప్రకటిస్తున్న తీరుపైనే అందరూ సందేహాలు లేవనెత్తున్నారు. తొలి దశ పోలింగ్ శాతం ప్రకటించడానికి ఎన్నికల సంఘానికి 11 రోజుల సమయం పట్టింది. పోలింగ్ ముగిసిన రోజున 60 శాతం పోలింగ్ జరిగిందని తెలపగా, 11 రోజుల తర్వాత ఏకంగా 66.14 శాతమని ప్రకటించింది. అంటే సుమారు ఆరు శాతానికి పైగా వ్యత్యాసం ఉంది. మిగిలిన మూడు దశల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. రెండో ఫేజ్‌లో పోలింగ్ ముగిసిన రోజున 60.69 శాతం పోలింగ్ జరిగిందని వెల్లడించగా, తర్వాత 66.7 శాతం పోలింగ్ జరిగిందని ప్రకటించింది. ఫేజ్ 3, ఫేజ్ 4 పోలింగ్ పరిస్థితీ అదే. ఇక.. ఇటీవలే జరిగిన ఫేజ్-5 పోలింగ్ శాతానికి సంబంధించిన వివరాలను గురువారం కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. పోలింగ్ జరిగిన రోజున 60 శాతమని వెల్లడించగా, గురువారం మాత్రం 62.2 శాతమని ప్రకటించింది. ఇలా ప్రతి ఫేజ్ ఎన్నికలకు సంబంధించి పోలింగ్ శాతాల్లో వ్యత్యాలపై పలువురు అనేక సందేహాలు లేవనెత్తున్నారు. 2019 ఎన్నికల సమయంలో ఈసీ పోలింగ్ ముగిసిన కొద్దిసేపటికే వివరాలన్నీ ప్రకటించింది. స్త్రీ, పురుషుల ఓటింగ్ శాతంతో సహా స్పష్టంగా వివరాలు వెల్లడించింది. కానీ ఇప్పుడెందుకు పోలింగ్ శాతాల్లో భారీ వ్యత్యాసాలు వస్తున్నాయన్నది అంతుచిక్కని ప్రశ్న?

అనుమానాస్పదంగా ఉంది: సిబల్

పోలింగ్ రోజు సాయంత్రమే పోలింగ్ ఏజెంట్లకు ఫామ్ 17(సి) కాపీని ఇస్తున్నప్పుడు అదే వివరాలను వెబ్‌సైట్‌లో ఉంచడానికి అభ్యంతరం ఏమిటని సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ ప్రశ్నించారు. ఈసీ ప్రమాణపత్రం మీద గురువారం ఆయన స్పందించారు. ఈసీ వెనుకంజ వేయడాన్ని బట్టి చూస్తుంటే ఏదో అనుమానాస్పదంగా ఉందని రాజకీయ పార్టీలు భావిస్తున్నాయని చెప్పారు. పోలింగ్ పూర్తయిన తర్వాత ప్రిసైడింగ్ ఆఫీసర్ సంతకంతో ఫామ్ 17(సి) ఇప్పటికే ఏజెంట్లకు ఇస్తున్నారని గుర్తు చేశారు. ఏజెంట్లకు ఇవ్వడమే కాకుండా ఎన్నికల సంఘానికి కూడా నేరుగా పంపిస్తారని, వాటి ఆధారంగానే పోలింగ్ శాతాన్ని లెక్కిస్తారని ప్రస్తావించారు. అలాంటప్పుడు అందుబాటులో ఉన్న పత్రాలను వెబ్‌సైట్లో పెట్టడానికి వచ్చిన ఇబ్బందేమిటని ప్రశ్నించారు.

లోకం తీరు



2047 వరకు కష్టపడతా!

(మొదటి పేజీ తరువాయి)



చెప్పారు. ఎన్నికల సంఘం సమానావకాశాలు ఇవ్వడం లేదని కాంగ్రెస్ చేసిన విమర్శలకు స్పందిస్తూ 1991లో రాజీవ్ గాంధీ హత్యకు గురైనపుడు అప్పటి ఎన్నికల కమిషనర్ టీఎన్ శేషన్ పోలింగ్‌ను 22 రోజుల పాటు వాయిదా వేశారని ప్రధాని గుర్తు చేశారు. అది సమానావకాశాల కిందకు వస్తుందా? అని ప్రశ్నించారు. అదే శేషన్ 1999లో కాంగ్రెస్ అభ్యర్థిగా అద్వాణీ మీద పోటీ చేశారని గుర్తు చేశారు. ఢిల్లీ, జార్ఖండ్ ముఖ్యమంత్రులను తాను జైలుకు పంపలేదని, కోర్టులు పంపాయని చెప్పారు. యూపీఏ పదేళ్ల పాలనలో ఈడీ 34 లక్షల రూపాయలు పట్టుకుందని, అవి పిల్లాడి స్కూల్ బ్యాగులోకి కూడా రావని అన్నారు. అదే, తన పదేళ్ల పాలనలో ఈడీ 2200 కోట్ల రూపాయలు పట్టుకుందని, వాటిని తరలించడానికి 70 టెంపోలు కావాలని వ్యాఖ్యానించారు. 2014లో అవినీతిని అంతం చేస్తానని చెప్పి అధికారంలోకి వచ్చానని, ఆ విషయంలో ఎంత పెద్ద వాళ్లనైనా వదిలేదని లేదని స్పష్టం చేశారు. కేజ్రీవాల్ ప్రభుత్వం చిన్న పిల్లల చేత కూడా వన్ ప్లస్ వన్ ఆఫర్‌తో పెద్ద ఎత్తున మద్యం తాగించేందుకు పథకం వేసిందని చెప్పారు.

నా ఓపికను పరీక్షించకు ఎక్కడున్నా వచ్చేయ్

» మనవడు ప్రజ్వల్‌కు దేవెగౌడ హెచ్చరిక

బెంగళూరు, మే 23(ఆంధ్రజ్యోతి): విదేశాలకు పరారైన హాసన్ ఎంపీ, మనవడు ప్రజ్వల్‌ను మాజీ ప్రధాని దేవెగౌడ తీవ్రంగా హెచ్చరించారు. ఎక్స్ ద్వారా గురువారం ఓ లేఖను పోస్టు చేశారు. 'ప్రజ్వల్ రేవణ్ణకు హెచ్చరిక..! నా ఓపికను పరీక్షించవద్దు. ఏ దేశంలో ఉన్నా తక్షణమే వచ్చేయ్' అని లేఖను ప్రారంభించారు. 'ఈ నెల 18న దేవాలయానికి వెళ్లిన సందర్భంలో ప్రజ్వల్ రేవణ్ణ గురించి తొలిసారి మాట్లాడాను. చట్టప్రకారం తప్పు చేసి ఉంటే అత్యంత కఠిన శిక్ష విధించాలని. ఈ నిర్ణయాన్ని నాతో పాటు జేడీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు, నా కుమారుడు కుమారస్వామి ఇదివరకే ప్రకటించారు. కొన్ని వారాలుగా కొందరు నా గురించి, నా కుటుంబ సభ్యుల గురించి అత్యంత అవమానకరంగా మాట్లాడుతున్నారు. నేను వారి మాటలను అడ్డుకోను. వారిని విమర్శించేందుకు ప్రయత్నించేది లేదు. వివాదానికి సంబంధించి వాస్తవాలు బయటకు వచ్చేదాకా వేచి ఉండాలని వారితో వాదనకు దిగలేదు. ప్రజ్వల్ వ్యవహారాల గురించి నాకు ఎటువంటి సమాచారం లేదు. అతడిని రక్షించాలనే ఆలోచనే లేదు. మేం చేసిన పనులకు తగిన గుణపాఠం ఉంటుందనే నమ్మకం కలిగి ఉన్నాను. భారాన్ని భగవంతుడి పాదాల వద్ద ఉంచాను. ప్రజ్వల్ ఎక్కడ ఉన్నా వచ్చి పోలీసులకు లొంగిపోయి విచారణను ఎదుర్కోవాలి. వాడు చేసిన తప్పులను తీర్మానించేందుకు చట్టం ఉంది. నేనుగాని, నా కుటుంబంగాని దర్యాప్తులో జోక్యం చేసుకునేది లేదని హామీ ఇస్తున్నా. 60 ఏళ్ల పాటు నా రాజకీయ అభివృద్ధిలో ప్రజలు నాకు అండగా ఉన్నారు. వారికి నేను రుణపడి ఉన్నా. తుది శ్వాసదాకా వారి అభిమానాన్ని మరువలేను' అంటూ దేవెగౌడ లేఖ ముగించారు.

రాజీనామా చేయను

తప్పుడు సంప్రదాయానికి నాంది పలికినట్లవుతుంది

» ప్రతిపక్ష సీఎంలను టార్గెట్ చేసేందుకే బీజేపీకి పనికొస్తుంది: కేజ్రీవాల్

న్యూఢిల్లీ, మే 23(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి పదవికి తాను ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీనామా చేయబోనని ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ తేల్చిచెప్పారు. అదొక తప్పుడు సంప్రదాయానికి నాంది పలికినట్లవుతుందని, మమత, స్టాలిన్ సహా ప్రతిపక్ష పార్టీలకు చెందిన ము ఖ్యమంత్రులను లక్ష్యంగా చేసుకోవడానికి బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వానికి అవకాశం ఇచ్చినట్లే అవుతుందని, ఈ ధోరణి ప్రజాస్వామ్యానికి చాలా ప్రమాదకరమని పేర్కొన్నారు. ఢిల్లీ సీఎంగా తన బాధ్యతలను జైలు నుంచి నిర్వహించడానికి అనుమతించాలని కోర్టు ను ఆశ్రయిస్తానని తాజాగా పీటీఐ వార్తాసంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో కేజ్రీవాల్ తెలిపారు. "గతంలో ఐటీ కమిషనర్ పదవికి రాజీనామా చేసి, ఢిల్లీ మురికివాడల్లో పనిచేశాను. సీఎం అయిన తర్వాత 49 రోజుల్లో(2013లో)నే పదవీ విరమణ చేశాను. ఎందుకు రాజీనామా చేశావని అప్పుడెవరూ అడగలేదు. చిన్న ఫ్యూన్ ఉద్యోగాన్ని కూడా వదులుకోవడానికి ఎవరూ ఇష్టపడరు.. కానీ నేను మాత్రం సీఎం పీఠాన్ని తృణప్రాయంగా వదిలేశా" అని ఆయన చెప్పారు. ప్రజల కోసం చేస్తున్న పోరాటంలో భాగంగా ఈసారి ఉద్దేశపూర్వకంగానే తాను సీఎం పదవికి రాజీనామా చేయడం లేదన్నారు. ఆమ్ ఆద్మీ పార్టీకి 2015లో 67 సీట్లు, 2020లో 62 సీట్లు వచ్చాయని గుర్తుచేశారు. ఢిల్లీ ఎన్నికల్లో ఆప్‌ను ఓడించడం సాధ్యంకాదని భావించినందుకే తనను అరెస్టు చేసేందుకు ప్రధా ని మోదీ కుట్ర పన్నారని ఆరోపించారు. 'అరెస్టు చేస్తే నేను రాజీనామా చేస్తానని, అప్పుడు నా ప్రభుత్వాన్ని పడగొట్టాలని అనుకున్నారు. ఈ కుట్రను విజయవంతం కానివ్వను. వారి ఉచ్చులో పడను. ఇదో బూటకపు కేసు. ఏదైనా తప్పు చేసి, అక్రమంగా సంపాదించి ఉంటే.. బహుశా ఈపాటికి నేను కూడా బీజేపీలో చేరిపోయేవాడిని' అని ఆయన వ్యాఖ్యానించారు. తనను బలవంతంగా జైల్లో బంధించారని ఆరోపించారు. 'ముందు రూ.100కోట్ల మద్యం కుంభకోణం అన్నారు. కొన్ని వారాల నుంచి రూ.1,100 కోట్లు అంటున్నారు. ఈ డబ్బంతా ఎటుపోయింది? ఒక పైసా నగదు గానీ నగలు గానీ రికవరీ చేశారా? ఎటువంటి ఆధారాలు లేకపోయినా మమ్మల్ని అరెస్టు చేయడానికి ఒక బూటకపు కేసు పెట్టారు' అని ఆయన మండిపడ్డారు. జైల్లో నుంచే సీఎం బాధ్యతలు నిర్వర్తించడానికి అవకాశం కల్పించాలని కోర్టును కోరతామని కేజ్రీవాల్ చెప్పారు.



తల్లిదండ్రులతో ఢిల్లీ సీఎం కేజ్రీవాల్

నా తల్లిదండ్రులను ఎందుకు వేధిస్తున్నారు?

ప్రధాని మోదీకి కేజ్రీవాల్ ప్రశ్న

ఆప్ ఎంపీ స్వాతీ మాలివాల్‌పై దాడి వ్యవహారంలోకి అస్వస్థులైన తన తల్లిదండ్రులను లాగొద్దని ప్రధాని మోదీకి కేజ్రీవాల్ విజ్ఞప్తి చేశారు. 'మీ యుద్ధం నాతోనే. నన్ను దెబ్బతీసేందుకు ఎన్నో ప్రయత్నాలు చేశారు. అరెస్టు చేసి, జైల్లో రకరకాలుగా వేధించారు. అయినా నేను లొంగలేదు. కానీ ఈరోజు మీరు అన్ని హద్దులు దాటారు. నన్ను వేధించడానికి అనారోగ్యంతో బాధపడుతున్న వృద్ధులైన నా తల్లిదండ్రులను టార్గెట్ చేశారు. నా తల్లి అనేక అనారోగ్య సమస్యలతో బాధపడుతోంది. నన్ను అరెస్టు చేసిన మార్చి 21నే ఆమె ఆసుపత్రి నుంచి డిశ్చార్జి అయింది. నా తండ్రికి 85ఏళ్లు. ఆయనకు వినికిడి సమస్యలున్నాయి. వారినెందుకు వేధిస్తున్నారు? ఆ దేవుడు మిమ్మల్ని క్షమించడు' అంటూ ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఢిల్లీ పోలీసులు తన తల్లిదండ్రులకు ఫోన్ చేసి, విచారించేందుకు సమయం కోరారని తెలిపారు. కాగా ఢిల్లీ సీఎం పీఏ బిభవ్ కుమార్ ఈనెల 13న తనపై దాడి చేసిన సమయంలో కేజ్రీవాల్ ఇంట్లోనే ఉన్నారని ఆప్ ఎంపీ స్వాతి మాలివాల్ పేర్కొన్నారు. రాజ్యసభ ఎంపీ పదవికి రాజీనామా చేసే ప్రసక్తే లేదని ఓ టీవీ చానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె ప్రకటించారు.

రాజధాని ఓటెటు?

ఢిల్లీలో రేపు ఏడు నియోజకవర్గాల్లో పోలింగ్

» 80% పైగా ఉద్యోగులు, కార్మిక వర్గాలే..

» మూడోసారీ క్లీన్‌స్వీప్ చేసేలా బీజేపీ పట్టు

» ఇండియా కూటమిలో కాంగ్రెస్-ఆప్ పోరాటం

న్యూఢిల్లీ, మే 23: వరుసగా రెండుసార్లు క్లీన్ స్వీప్ చేసిన బీజేపీ.. మూడోసారీ అదే లక్ష్యంతో కదులుతోంది. ఆ పార్టీని ఎలాగైనా నిలువరించాలని ఆప్-కాంగ్రెస్ పట్టుదలగా పోరాడుతున్నాయి..! దేశ రాజధాని ఢిల్లీలో వీటి మధ్య సామాన్యుడి సమస్యలు ప్రధాన పాత్ర పోషిస్తున్నాయి. పక్కా ఇళ్ల నిర్మాణం, తాగునీరు సమృద్ధిగా అందకపోవడం, విద్యుత్తు సరఫరాలో ఇబ్బందులు, ధరల పెరుగుదల వంటివి ఎన్నికల్లో ఓటరు నిర్ణయాన్ని ప్రభావితం చేయనున్నాయి. శనివారం ఢిల్లీలోని ఏడు సీట్లకూ పోలింగ్ జరగనుంది. 2014, 2019లో వీటన్నిటినీ గెల్చుకున్న బీజేపీ ఈసారి నాలుగుచోట్ల అభ్యర్థులను మార్చడం గమనార్హం. డాక్టర్ హర్షవర్ధన్ వంటి సీనియర్ నాయకుడినీ పక్కనపెట్టింది. గతంలో విడివిడిగా పోటీ చేసి భంగపడిన ఆప్, కాంగ్రెస్ ప్రస్తుతం ఇండియా కూటమిలో భాగంగా పొత్తుపెట్టుకుని బరిలో దిగాయి. ఢిల్లీలో అధికారంలో ఉన్న ఆప్4, కాంగ్రెస్ 3 స్థానాల్లో పోటీ చేస్తున్నాయి. గురువారం సాయంత్రంతో ఢిల్లీలో ప్రచారం ముగిసింది.

కీలక సమయంలో..

మద్యం కుంభకోణంలో బెయిల్ లభించిన సీఎం కేజ్రీవాల్ కీలకమైన ప్రచారానికి అందుబాటులోకి రావడం ఆప్ శ్రేణులను ఉత్తేజపరిచింది. గత రెండు లోక్‌సభ ఎన్నికల్లోనూ బీజేపీకి పట్టం కట్టిన హస్తిన ఓటర్లు, శాసనసభకు మాత్రం ఆప్‌నే ఆదరించారు. కాగా, ఢిల్లీ ఓటర్లలో 80 శాతం ఉద్యోగులు, కార్మికవర్గాల వారే. వీరంతా ఇప్పుడు తమ సమస్యలపై గట్టిగా ప్రశ్నిస్తున్నారు. బంగ్లాదేశ్ నుంచి వచ్చిన కాందిశీకులకు తోడు దుకాణాల్లో పని చేసేవారు, రిక్షా పుల్లర్లు అధికంగా ఉండే ఈశాన్య ఢిల్లీలో పక్కా ఇళ్లనిర్మాణం ప్రధాన అంశంగా మారింది. '20ఏళ్లుగా ఇక్కడ ఉంటున్నాం. అభివృద్ధి ఏమీలేదు. ధరలు విపరీతంగా పెరిగిపోయాయి' అని బిహారీ కార్మికురాలు భోలాదేవి వాపోయింది. వాయవ్య ఢిల్లీ నియోజకవర్గం కిందకు వచ్చే జహంగీర్‌పురిలో డ్రైనేజీలు నిత్యం పొంగిపొర్లుతూ మురుగంతా వీధుల్లోకి వస్తోందని, పిల్లలు తరచూ అస్వస్థతకు గురవుతున్నారని మహిళలు ఫిర్యాదు చేస్తున్నారు. స్వచ్ఛమైన తాగునీరు చాలా తక్కువ సమయమే సరఫరా అవుతోంది. డ్రగ్స్, హింస, చోరీలు వంటివి చాలా సాధారణం మారాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. కాగా, రాష్ట్రపతి భవనం, పార్లమెంటు, సుప్రీంకోర్టు, ప్రధానమంత్రి నివాసం సహా ప్రముఖులు ఉండే న్యూఢిల్లీ నియోజకవర్గంలోనూ కొన్ని ప్రాంతాల్లో కనీస సదుపాయాలు కొరవడ్డాయి.



అభ్యర్థుల మార్పిడితో..

చాందినీ చౌక్‌లో డాక్టర్ హర్షవర్ధన్‌నుకాదని వ్యాపారవేత్త ప్రవీణ్ ఖండేల్వాల్‌కు బీజేపీ టికెట్ ఇచ్చింది. కాంగ్రెస్ నుంచి జైప్రకాశ్ అగర్వాల్ పోటీ చేస్తున్నారు. తూర్పు ఢిల్లీ టికెట్‌ను మాజీ క్రికెటర్ గౌతమ్ గంభీర్ స్వయంగా వద్దని చెప్పడంతో హర్ష్ మల్హోత్రాను బరిలో దింపింది. ఇక్కడ ఆప్ కుల్దీప్‌కుమార్ నిలిచారు. న్యూఢిల్లీ స్థానంలో కేంద్ర మంత్రి మీనాక్షి లేఖిని కాదని దివంగత అగ్రనేత సుష్మాస్వరాజ్ కుమార్తె బంసూరీ స్వరాజ్‌ను దింపింది. ఈమె ఆప్ అభ్యర్థి సోమ్‌నాథ్ భారతిని ఢీకొంటున్నారు. అత్యంత జనసాంద్రత ఉండే ఈశా న్య ఢిల్లీలో మనోజ్ తివారీ (బీజేపీ), విద్యార్థి నాయకుడు కన్హయ్యకుమార్ (కాంగ్రెస్) మధ్య పోటీ ఆసక్తి రేపుతోంది. బిహారీలు ఎక్కువగా ఉండే ఇక్కడ కన్హయ్యకు ఆదరణ కనిపిస్తున్నా ఆప్ నుంచి మద్దతు పెద్దగా లేదు. తివారీ బోజ్‌పురీ నటుడు. దక్షిణ ఢిల్లీలోనూ బీజేపీ అభ్యర్థిని మార్చింది. కన్నాట్‌ప్లేస్ (ఎస్సీ)లోబీజేపీ-ఆప్ హోరాహోరీ తలపడుతున్నాయి.

బెంగాల్లో 77 ముస్లిం వర్గాలకు రిజర్వేషన్లు రద్దు

» మరో 37 ఇతర ఓబీసీ కులాలకు కూడా..

» కలకత్తా హైకోర్టు సంచలన తీర్పు

కోల్‌కతా, మే 23: పశ్చిమ బెంగాల్‌లో 2010 నుంచి గత 14 ఏళ్లలో రాష్ట్ర ప్రభుత్వాలు దాదాపు 114 వర్గాలను ఓబీసీల్లో చేర్చడాన్ని కలకత్తా హైకోర్టు తప్పుపట్టింది. ఆయా వర్గాలకు ఇచ్చిన రిజర్వేషన్లను కొట్టేసింది. 2010 ఏప్రిల్ నుంచి ఆర్నెల్ల వ్యవధిలో అప్పటి కమ్యూనిస్టు ప్రభుత్వం 77 ముస్లిం వర్గాలకు(క్లాసెస్) రిజర్వేషన్లు ఇచ్చింది. వీటిని కోల్‌కతా హైకోర్టు కొట్టేసింది. మొత్తం ముస్లిములను ఓబీసీలుగా పరిగణించే ప్రయత్నం జరిగిందని జస్టిస్ తపబ్రత చక్రవర్తి, జస్టిస్ రాజశేఖర మంథాలతో కూడిన ధర్మాసనం అభిప్రాయపడింది. రాజకీయ కారణాలతోనే ఈవర్గాలను బీసీలుగా పరిగణించే ప్రయత్నం జరిగిందని పేర్కొంది. 77వర్గాలను ఓటుబ్యాంకుగా పరిగణించే ఓబీసీలుగా గుర్తించారనేది జరిగిన సంఘటనల క్రమం స్పష్టం చేస్తోందని చెప్పింది. ఆ తర్వాత 2012 ఓబీసీ రిజర్వేషన్ చట్టం కింద తృణమూల్ ప్రభుత్వం గత పుష్కరకాలంలో మరో 37 వర్గాలను ఓబీసీలుగా గుర్తించడాన్నీ హైకోర్టు కొట్టేసింది. 1993నాటి ఓబీసీ కమిషన్ చట్టాన్ని అనుసరించి వీరిని ఓబీసీలుగా గుర్తించలేదని చెప్పింది. గత పద్నాలుగేళ్లుగా 114వర్గాలకు ఇచ్చిన దాదాపు 5లక్షల ఓబీసీ కులధ్రువీకరణ పత్రాలను ధర్మాసనం రద్దు చేసింది. ఇప్పటికే ఆయా వర్గాలు రిజర్వేషన్ల కింద అందుకున్న ఫలాలను వెనక్కి తీసుకోరాదని చెప్పింది.

ఐఐటియన్లకు ఉద్యోగాలు కరువు

మొదటిపేజీ తరువాయి

ధీరజ్‌సింగ్ సమాచారహక్కు చట్టం కింద దాఖలు చేసిన దరఖాస్తుకు లభించిన సమాచారం ద్వారా ఈ వివరాలు తెలిశాయి. కోర్సు పూర్తయిన విద్యార్థులకు ఉద్యోగాలు దొరకని పరిస్థితుల నేపథ్యంలో పలు ఐఐటీలు.. వివిధ కంపెనీల్లో ఉన్నత ఉద్యోగాలుగా ఉన్న తమ పూర్వ విద్యార్థులకు లేఖలు రాసి, వారి సహకారాన్ని అర్థించినట్లు వెల్లడైంది. ప్రస్తుత బ్యాచ్‌లో దాదాపు 400 మంది ఇంజనీరింగ్ పట్టభద్రులకు ఇంకా ఉద్యోగాలు లభించలేదని, వారికి తమ తమ కంపెనీల్లో అవకాశాలు లభించేలాగానీ, ఇతర కంపెనీలకు సిఫార్సు చేయటంగానీ, అప్రెంటిషిప్ దొరికేలాగానీ సహకరించాలని పేర్కొంటూ ఢిల్లీ ఐఐటీలోని కెరీర్ సర్వీస్ కార్యాలయం తమ పూర్వ విద్యార్థులకు మెయిల్ చేసింది. 2023-24 బ్యాచ్‌కు చెందిన పట్టభద్రుల్లో దాదాపు 10 శాతం (250) మందికి ఇంకా ప్లేస్‌మెంట్లు లభించలేదని పేర్కొంటూ ఐఐటీ బాంబే కూడా పూర్వ విద్యార్థుల సాయం కోరింది. కాగా, ఐఐటీ బాంబేలో ఇంజనీరింగ్ పూర్తి చేసిన గత ఏడాది బ్యాచ్‌కు చెందిన 329 మందికి, 2022 బ్యాచ్‌కు చెందిన 171 మందికి క్యాంపస్ ప్లేస్‌మెంట్లలో ఉద్యోగాలు లభించలేదని ఆర్‌టీఐ సమాచారం వెల్లడించింది. మరో ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థ బిట్స్ రెండు నెలల కిందటే పూర్వ విద్యార్థుల సాయం కోరుతూ మెయిల్ చేసిందని, ఇదే బాటలో ఐఐటీలు లేఖలు పంపుతున్నాయని తెలిసింది. దీనిపై ధీరజ్‌సింగ్ మాట్లాడుతూ, రెండేళ్ల కిందట ప్లేస్‌మెంట్ దొరకని ఐఐటీ విద్యార్థుల సంఖ్య 3,400 కాగా, ఈ ఏడాది అది 7 వేలకుపైగా పెరిగిందన్నారు. ఈ పరిణామంపై బిట్స్ గ్రూపుసంస్థల వీసీ వీ రాంగోపాల్‌రావు స్పందిస్తూ.. 'ఈ ఏడాది చాట్ జీపీటీ తదితర లార్జ్ లాంగ్వేజ్ మోడళ్ల ప్రభావం గణనీయంగా ఉంది. ముగ్గురు పని చేసే చోట ఇద్దరితో నడుస్తోంది. అదీగాక ప్రపంచవ్యాప్తంగా పలుదేశాల్లో ఈ ఏడాది ఎన్నికలు జరుగుతున్నాయి. దీంతో అనేక సంస్థలు నియామకాల విషయంలో వేచి చూసే ధోరణితో ఉన్నాయి. అందువల్లే ప్లేస్‌మెంట్లు 20 నుంచి 30 శాతం తగ్గాయి' అని విశ్లేషించారు.


సుందిళ్ల బ్యారేజీని పరిశీలిస్తున్న నిపుణుల బృందం

సుందిళ్ల బ్యారేజీని పరిశీలించిన నిపుణుల బృందం

మంథనిరూరల్, మే 23: పెద్దపల్లి జిల్లా మంథని మండలం సిరిపురం వద్ద గోదావరినదిపై నిర్మించిన సుందిళ్ల బ్యారేజీని కేంద్ర జల, విద్యుత్ పరిశోధన సంస్థ (సీడబ్ల్యూపీ ఆర్ఎస్) నిపుణుల బృందం గురువారం సందర్శించింది. మహారాష్ట్రలోని పుణే నుంచి వచ్చిన బృంద సభ్యులు జేఎస్ ఎడ్ల బాధ్కర్, డాక్టర్ ధనుంజయ్ నాయుడు, డాక్టర్ ప్రకాష్ పాలె మొదట బ్యారేజీ వద్ద ఉన్న ఇంజనీరింగ్ కార్యాలయానికి వెళ్లి అధికారుల వద్ద సమాచారాన్ని సేకరించారు. అనంతరం బ్యారేజీ దిగువ ప్రాంతానికి వెళ్లి పరిశీలించారు. అధికారులను పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. బ్యారేజీ 61వ గేట్ వద్ద కుంగిపోయిన గాడర్లను పరిశీలించారు. అరగంట పాటు బ్యారేజీని పరిశీలించి వెళ్లిపోయారు.

గగనతలంలో విమానం డోర్ తీసే యత్నం

» ప్రయాణికుడిపై కేసు నమోదు

శంషాబాద్ రూరల్, మే 23 (ఆంధ్రజ్యోతి): గగనతలంలో విమాన తలుపులు తీసేందుకు యత్నించిన ప్రయాణికుడిపై రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయ (ఆర్జీఐఏ) పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. హైదరాబాద్‌లోని గాజులరామారం ప్రాంతానికి చెందిన జిమ్ ట్రైనర్ అనిల్ ఈ నెల 21న మధ్యప్రదేశ్‌లోని ఇండోర్ నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు విమానంలో వస్తున్నాడు. ఈ క్రమంలో అతడు మిగతా ప్రయాణికులతో పాటు విమానంలో ఉన్న సిబ్బందితో దురుసుగా ప్రవర్తించడమే కాకుండా గగనతలంలో విమాన తలుపులు తెరిచేందుకు యత్నించాడు. అతడిపై వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

ఆనకట్టలు పదిలమేనా?

వానాకాలంలోపు ఒకసారి, పూర్తయ్యాక మరోసారి క్షుణ్ణంగా పరిశీలించండి

» వాటి స్థితిగతులపై నివేదికలివ్వండి

» డ్యామ్‌ల చీఫ్ ఇంజనీర్లకు రాష్ట్ర ఆనకట్టల భద్రతా సంస్థ లేఖ

హైదరాబాద్, మే 23 (ఆంధ్రజ్యోతి): వానాకాలంలోపు ఒకసారి, వానాకాలం పూర్తయ్యాక మరోసారి రాష్ట్రంలోని ఆనకట్టలన్నింటినీ క్షుణ్ణంగా పరిశీలించాలని ఆయా డ్యామ్‌ల చీఫ్ ఇంజనీర్లకు రాష్ట్ర ఆనకట్టల భద్రతా సంస్థ (స్టేట్ డ్యామ్‌సేఫ్టీ ఆర్గనైజేషన్-ఎస్‌డీఎస్‌వో) ఆదేశించింది. ఈ మేరకు గురువారం చీఫ్ ఇంజనీర్లకు లేఖలు రాసింది. ఆనకట్టలను పరిశీలించి, వాటి స్థితిగతులపై రెండు వేర్వేరు నివేదికలివ్వాలంటూ లేఖల్లో స్పష్టం చేసింది. ఏడాది క్రితం మేడిగడ్డ బ్యారేజీ కుంగిపోవడం, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లో లోపాలు బయటపడటం, డ్యామ్ సేఫ్టీయాక్ట్ -2021లోని సెక్షన్-31 ప్రకారం వానాకాలం ముందు, తర్వాత తనిఖీలపై కేంద్రం నిలదీయడం... అధికారులను బాధ్యుల్ని చేయడంతో ఎస్‌డీఎస్‌వో అప్రమత్తమై ఈ మేరకు లేఖలు రాసింది. రాష్ట్రంలో భారీ, మధ్యతరహా ప్రాజెక్టుల డ్యామ్‌లు 38, చిన్న డ్యామ్‌లు 184 ఉన్నాయి. డ్యామ్ సేఫ్టీ చట్టం అమల్లోకి వచ్చాక.. భూ ఉపరితలం నుంచి 15 మీటర్ల ఎత్తుతో నిర్మాణం జరిగినవి, 500 మీటర్ల పొడవైన క్రెస్ట్ కలిగి ఉన్నవి, ప్రతి సెకనుకు 2వేల క్యూబిక్ మీటర్ల నీటిని విడుదల చేసే సామర్థ్యం కలిగి ఉన్న డ్యామ్‌లు దాని పరిధిలోకి వెళ్లిపోయాయి. ఫలితంగా నాగార్జునసాగర్ నుంచి పాలేరు దాకా డ్యామ్‌లన్నీ కూడా ఈ చట్టపరిధిలోకి వచ్చేశాయి. వీటిలో ఏ మాత్రం లోపాలున్నా.. వాటిని మరమ్మతు చేయించే బాధ్యత సంబంధిత చీఫ్ ఇంజనీర్ (సీఈ)దే. సీఈలను డ్యామ్‌లకు ఓనర్లుగా చట్టం గుర్తించింది. దాంతో డ్యామ్‌ల రక్షణలో ఏ మాత్రం నిర్లక్ష్యం వహించినా సంబంధిత యంత్రాంగంపై కఠిన చర్యలుంటాయి. నిర్వహణ లోపంతో ప్రాణనష్టం జరిగితే రెండేళ్ల జైలుశిక్ష పడేలా చట్టాన్ని రూపకల్పన చేశారు. స్టేట్ డ్యామ్ సేఫ్టీ ఆర్గనైజేషన్/అథారిటీ ఆదేశాలను పాటించకపోతే ఏడాది జైలుశిక్ష లేదా జరిమానా రెండింటిలో ఏదైనా ఒకటి లేదా రెండు కలిపి విధించే అధికారం ఈ చట్టం ఇచ్చింది. దాంతో స్టేట్ ఆర్గనైజేషన్.. కాళేశ్వరం బ్యారేజీల అనుభవంతో అప్రమత్తమై, తక్షణమే వానాకాలం ముందు పరిశీలన చేసి, కట్టల స్థితిగతులపై నివేదికను సమర్పించాలని, అలాగే వానాకాలం పూర్తయ్యాక అక్టోబరు 1 నుంచి నవంబరు 30 లోపు మరోసారి పరిశీలన చేసి కట్టల్లో లోపాలపై నివేదికలు ఇవ్వాలని నిర్దేశించింది. అలాగే ఇంజనీర్లు, టెక్నికల్ ఉద్యోగులు వానాకాలం అంతా కూడా డ్యామ్‌లపై నిరంతరం పర్యవేక్షణ చేయాలని నిర్దేశించారు.



కాళేశ్వరంపై కమిషన్‌కు నిపుణుల కమిటీ సహాయం

» ఐదుగురితో ఏర్పాటు చేసిన ప్రభుత్వం

కాళేశ్వరం ఎత్తిపోతల్లోని బ్యారేజీల్లో లోపాలు వెలికితీయడంతోపాటు బాధ్యులను గుర్తించేందుకు జస్టిస్ పినాకి చంద్రఘోష్ తో ఏర్పాటు చేసిన విచారణ కమిషన్‌కు సాంకేతిక అంశాల్లో సహాయం చేసేందుకు ఐదుగురు నిపుణులతో కూడిన కమిటీని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఇందులో భాగంగా సివిల్ స్ట్రక్చరల్ అంశాల కోసం ఎన్ఐటీ వరంగల్ పూర్వ ప్రొఫెసర్ సి.బి.కామేశ్వరరావు, మెకానికల్ రంగంపై డ్యామ్ సేఫ్టీ రివ్యూ ప్యానల్ నిపుణుడు మాజీ చీఫ్ ఇంజనీర్ కె.సత్యనారాయణ, జియో టెక్నికల్ అంశాలపై ఎన్ఐటీ వరంగల్ ప్రొఫెసర్ కె.రమణమూర్తి, హైడ్రాలజీ/ప్లానింగ్‌పై ఐఐటీ హైదరాబాద్‌కు చెందిన టి.శశిధర్, క్షేత్రస్థాయి నిపుణుడిగా, కమిటీ కన్వీనర్‌గా మాజీ చీఫ్ ఇంజనీర్ కె.శ్రీకాంత్‌ను నియమిస్తూ ఈఎన్‌సీ(జనరల్) జి.అనిల్‌కుమార్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కమిటీ మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలను సందర్శించి లోపాలపై జస్టిస్ చంద్రఘోష్‌కు సహాయం అందించనుంది. కాగా, కాళేశ్వరం బ్యారేజీలపై ఫిర్యాదులు సమర్పించడానికి కమిషన్ ఈ నెల 31 దాకా అవకాశం ఇచ్చింది. ఆయా బ్యారేజీలపై విచారణ జరిపి జూన్ 30లోపు నివేదిక అందించాలని కమిషన్‌ను ప్రభుత్వం కోరింది. ప్రత్యక్ష విచారణ జూన్/జూలై నెలల్లో జరగనుండగా నివేదిక ఆగస్టు లేదా సెప్టెంబరులో ప్రభుత్వానికి చేరే అవకాశం ఉంది.



నిమ్స్‌లో మహిళకు గుండె మార్పిడి

» డైలేటెడ్ కార్డియోమయోపతి రోగికి పునర్జన్మ

హైదరాబాద్ సిటీ, మే 23(ఆంధ్రజ్యోతి): డైలేటెడ్ కార్డియోమయోపతితో బాధపడుతున్న ఓ మహిళకు నిమ్స్ వైద్యులు బుధవారం గుండె మార్పిడి శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించారు. ములుగు జిల్లా ఏటూరునాగారం ప్రాంతానికి చెందిన షేక్ షనాజ్ (29) రెండేళ్లుగా గుండె ఎడమ జఠరిక వద్ద ఏర్పడిన సమస్య (డైలేటెడ్ కార్డియోమయోపతి)తో బాధపడుతున్నారు. ఆమె ఇటీవల నిమ్స్ కార్డియోథొరాసిక్ వైద్యులు అమరేశ్వరరావు, గోపాల్‌ను సంప్రదించారు. వారు పరీక్షించి.. గుండెమార్పిడి చేయాల్సి ఉంటుందని తెలిపారు. దాని కోసం ఆమె 'జీవన్‌దాన్'లో పేరు నమోదు చేయించుకున్నారు. రెండు రోజుల క్రితం సికింద్రాబాద్ యశోదా ఆస్పత్రిలో ఓ యువకుడి బ్రెయిన్‌డెడ్ అయినట్లు సమాచారం అందింది. అతని, షనాజ్ రక్తనమూనాలు సరిపోలడంతో వైద్యుల బృందం గుండె మార్పిడి శస్త్రచికిత్స నిర్వహించింది. ఆరోగ్యశ్రీలో పైసా ఖర్చు లేకుండా ఆపరేషన్ పూర్తయింది. అత్యంత సంక్లిష్టమైన ఈ ఆపరేషన్‌ను విజయవంతంగా నిర్వహించిన వైద్యుల బృందాన్ని నిమ్స్ డైరెక్టర్ నగరి బీరప్ప అభినందించారు.

నేటి నుంచి ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు

హైదరాబాద్, మే 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు శుక్రవారం (24వ తేదీ) నుంచి ప్రారంభం కానున్నాయి. జూన్3వ తేదీ వరకు జరగనున్నాయి. ఈ పరీక్షలకు అన్ని ఏర్పాట్లను అధికారులు పూర్తి చేశారు. ఈ పరీక్షలు రాసేందుకు సుమారు 4.27 లక్షల మంది విద్యార్థులు ఫీజు చెల్లించారు. మొదటి, రెండో ఏడాది విద్యార్థుల కోసం రోజూ రెండు సెషన్లలో పరీక్షలు నిర్వహిస్తారు. మొదటి సెషన్‌ను ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు, రెండో సెషన్‌ను మధ్యాహ్నం 12.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు నిర్వహిస్తారు.

రాష్ట్రంలో శుక్రవారం పాలీసెట్ ప్రవేశ పరీక్షను నిర్వహించనున్నారు. శుక్రవారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు పరీక్ష నిర్వహిస్తారు.

ఎస్సీ గురుకుల ఇంటర్ కాలేజీల్లో అడ్మిషన్లు

» నేటి నుంచి 31వరకు దరఖాస్తుకు అవకాశం

ఎస్సీ గురుకుల పరిధిలోని ఇంటర్మీడియట్ కాలేజీల్లో మొదటి ఏడాది (సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లు మినహా) అడ్మిషన్లను ప్రారంభించినట్లు కార్యదర్శి సీతాలక్ష్మి తెలిపారు. దరఖాస్తుకు శుక్రవారం నుంచి 31వ తేదీ వరకు అవకాశం కల్పిస్తున్నట్టు పేర్కొన్నారు. ఎంపీసీ, బీపీసీ, ఎంఈసీ, సీఈసీ, హెచ్ఈసీతో పాటు ఒకేషనల్ గ్రూపుల్లో మిగిలిన సీట్లకు ఈ ఏడాది మార్చిలో పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

రేవంత్‌పై పిటిషన్‌ను స్వీకరించేలా ఆదేశించండి

» హైకోర్టును ఆశ్రయించిన బీజేపీ

హైదరాబాద్, మే 23 (ఆంధ్రజ్యోతి): కేంద్ర హోంమంత్రి అమిత్ షాపై ఫేక్ వీడియోను వైరల్ చేసిన సీఎం రేవంత్‌రెడ్డిపై బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు దాఖలు చేసిన ప్రైవేట్ కంప్లైంట్‌ను నాంపల్లి కోర్టు స్వీకరించలేదు. దాంతో కింది కోర్టుకు తగిన ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ ఆయన హైకోర్టును ఆశ్రయించారు. సీఆర్పీసీ సెక్షన్ 299, 300 ప్రకారం ప్రైవేట్ ఫిర్యాదు దాఖలు చేశామని, దానిని పరిశీలించకుండానే దిగువ కోర్టు కొట్టేసిందని తెలిపారు. దాంతో ఫిర్యాదును స్వీకరించేలా ఆదేశాలివ్వాలని పేర్కొన్నారు. బీజేపీ నేతల వ్యాఖ్యలను వక్రీకరించడంతోపాటు, రిజర్వేషన్లు ఎత్తివేస్తారంటూ రేవంత్‌రెడ్డి రెచ్చగొట్టేలా ప్రసంగాలు చేశారని ఆరోపించారు.

ఆ ఉత్తర్వులతో విధుల్లో కొనసాగుతున్న వారిని తొలగించాలి

» హైదరాబాద్ ఇంజనీర్స్ అసోసియేషన్ డిమాండ్

హైదరాబాద్, మే 23 (ఆంధ్రజ్యోతి): పదవీ విరమణ చేసినా తదుపరి ఉత్తర్వులు వచ్చే దాకా కొనసాగుతారనే ఉత్తర్వులతో విధుల్లో కొనసాగుతున్న వారిని తక్షణమే రిలీవ్ చేయాలని హైదరాబాద్ ఇంజనీర్స్ అసోసియేషన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈమేరకు గురువారం సచివాలయంలో నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఏఎస్ఎన్ రెడ్డి, చక్రధర్ నేతృత్వంలోని ప్రతినిధులు కలిసి వినతిపత్రమిచ్చారు. పదవీ విరమణ తర్వాత కొనసాగింపులో ఉన్న ఐదుగురు ఇంజనీర్లను తొలగించినందుకు ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. పదవీ విరమణ చేసిన వేణు, పి.శ్రీనివాసరావు, ఆర్.గోపాల్‌రెడ్డిలను తదుపరి ఉత్తర్వులు వెలువడేవరకు కొనసాగించేందుకు గత ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చిందన్నారు. వీరు కేడర్ పోస్టుల్లో ఉండటంతో దిగువ శ్రేణిలో అర్హులైన వారికి పదోన్నతులు దక్కని పరిస్థితి నెలకొందని, తక్షణమే వీరిని తొలగించి కొత్తవారికి అవకాశమివ్వాలని కోరారు.



ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

సునాక్ సాహసం

వర్షం జోరుగా కురుస్తున్న వేళ, లండన్‌లోని తన అధికారిక నివాసం 10 డౌనింగ్ స్ట్రీట్ మెట్లమీద నిలబడి, చినుకులు మీదపడుతూండగానే బుధవారం బ్రిటన్ ప్రధాని రిషి సునాక్ సార్వత్రిక ఎన్నికల ప్రకటన చేశారు. జూలై 4న చాలాముందుగా ఎన్నికలు జరపాలన్న ఆ నిర్ణయం అత్యధికులకు ఆశ్చర్యం కలిగించింది. ముందస్తు ఎన్నికలకు పోవాలన్న నిర్ణయాన్ని రాజుగారికి చెప్పానని, పార్లమెంట్ రద్దుకు ఆయన అనుమతించారని సునాక్ తన ప్రసంగంలో తెలియచేశారు. నిబంధనల ప్రకారం, వచ్చే ఏడాది జనవరిలోగా సార్వత్రిక ఎన్నికలు నిర్వహిస్తే చాలు. అందువల్ల, ఈ ఏడాది చివర్లో ఉండవచ్చునని అంతా అనుకున్నారు. భారతీయ మూలాలున్న తమ ప్రధాని బుర్రలో ముందస్తు ఆలోచన మెదులుతోందని అనుమానం వచ్చి, బుధవారమే పార్లమెంటులో కొందరు ఎన్నికలు ఎప్పుడు అని ఓ ప్రశ్న వేశారు కూడా. ఈ ఏడాది ద్వితీయార్థంలో అని సునాక్ సమాధానం చెప్పారు. ఏడాదిలో రెండో సగం అంటే కనీసం జూలై కావాలి కానీ, ఇలా ఆరువారాల్లోగానే ఆయన ఎన్నికలకు పోతారని ఎవరూ ఊహించలేదు. హడావుడిగా మంత్రివర్గ సమావేశాన్ని ఏర్పాటు చేసి, అందుకోసం దేశవిదేశాల్లో ఉన్న మంత్రులందరినీ రప్పించి, చర్చించి ఈ ముందస్తు ముచ్చటను సునాక్ దేశ ప్రజలకు తెలియచేశారు.

సునాక్ ఈ ప్రకటన చేయగానే, ఆయన భార్య, ఇన్ఫోసిస్ నారాయణ మూర్తి కుమార్తె అక్షతామూర్తి సామాజిక మాధ్యమాల్లో దంపతులిద్దరి ఫోటోతో పాటు 'నీవు వేసే ప్రతీ అడుగులోనూ నీ వెంటే ఉంటా' అంటూ ఓ వ్యాఖ్యను పోస్టుచేశారు. దేశ ప్రజలు కూడా తన వెంటే ఉండాలన్న లక్ష్యంతో సునాక్ ఈ ముందస్తు నిర్ణయం తీసుకున్నమాట నిజం. పద్నాలుగేళ్ళుగా బ్రిటన్‌లో కన్సర్వేటివ్ పార్టీ అధికారంలో ఉంది. వరుస ప్రధానులు చేసిన తప్పిదాలతో ఆ పార్టీ ఇప్పటికే అప్రదిష్టపాలైంది. ఉద్ధరిస్తాడనుకున్న సునాక్ కూడా పార్టీకి నష్టం చేశాడని, ఆయన పాపులారిటీ తగ్గుతోందని కొందరు నమ్ముతున్నారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో విపక్ష లేబర్ పార్టీ మంచి ఫలితాలు సాధిస్తుందని ఒపీనియన్ పోల్స్ అన్నీ ఢంకా బజాయిస్తున్న తరుణంలో, సునాక్ ఈ అడుగు వేశారు. దేశాన్ని ఆర్థికంగా ఒడ్డునపడేస్తానన్న హామీ నెరవేరి, ద్రవ్యోల్బణం నియంత్రణలో ఉన్న ఈ సమయంలో ఎన్నికలకు పోయినప్పుడే విజయావకాశాలు మెరుగుపడతాయని ఆయన నమ్మినట్టు ఉంది. బ్రిటన్ తన భవిష్యత్తును ఎంచుకోవాల్సిన తరుణమిది అంటూ తనను ఎన్నుకోవాల్సిన గురుతరబాధ్యత బ్రిటిషర్లపై ఉందని ఈ ప్రసంగంలో సునాక్ గుర్తుచేశారు. ఇదీ నా గ్యారంటీ అంటూ ఉజ్వలమైన భవిష్యత్తుకు, చక్కని భద్రతకు హామీ పడ్డారు. ఆర్థికమంత్రిగా, ప్రధానమంత్రిగా తాను దేశానికి చేసిందేమిటో చెప్పుకొచ్చారు. ఫ్రాన్స్, జర్మనీ, అమెరికా కంటే బ్రిటన్ ఆర్థికం ఎంతో బాగుందని, కష్టపడి సాధించినదంతా సుస్థిరపడి, మరింత మెరుగ్గా కొనసాగడానికే తాను ముందస్తుకు పోతున్నానని ఆయన చెప్పుకొచ్చారు.

2022 అక్టోబర్‌లో నలభైరెండేళ్ల వయసులో సునాక్ బ్రిటన్ ప్రధాని అయ్యారు. 2010లో టోరీలు అధికారంలోకి వచ్చాక ఈయన ఐదో ప్రధాని. ఈ పద్నాలుగేళ్ళకాలంలో టోరీల ఏలుబడిలో, డేవిడ్ కెమెరూన్ తీసుకున్న కీలకమైన బ్రెగ్జిట్ నిర్ణయం సహా చాలా సమస్యలను, వివాదాలను దేశం ఎదుర్కొంది. యూరోపియన్ యూనియన్‌నుంచి వేరుపడే ఆ సుదీర్ఘ ప్రక్రియ తెరీసా మే వంటి నాయకులను రాజకీయంగా బలితీసుకుంది. బోరిస్ జాన్సన్ సంగతి చెప్పనే అక్కరలేదు. బ్రెగ్జిట్‌ను ఒక కొలిక్కి తీసుకువచ్చినప్పటికీ, కొవిడ్ నిబంధనలను ఉల్లంఘించి లిక్కర్ పార్టీలు చేసుకొని ఆయన అప్రదిష్టపాలైనారు, తప్పుకోవడానికి ఒప్పుకోకుండా పార్టీ పరువు తీశారు. తనపై తిరుగుబాటు చేసిన సునాక్‌ను ప్రధానిగా ఎన్నుకోవద్దని టోరీలను జాన్సన్ ఒత్తిడి చేయడంతో లిజ్‌ట్రస్ రంగప్రవేశం చేసినప్పటికీ, ఇల్లు చక్కదిద్దడం చేతకాక ఆమె కొద్దిరోజుల్లోనే తప్పుకున్నారు. చివరకు అన్యథా శరణం నాస్తి అన్నట్టుగా బరిలో ఎవ్వరూ నిలవకుండా అధికారపక్ష ఎంపీలంతా సునాక్‌కే పగ్గాలు అప్పగించారు.


వర్షం వల్ల సునాక్ చెబుతున్నది చాలామందికి సరిగా వినబడలేదు. దీనికి తోడు ఆయన మాట్లాడుతున్నంత సేపూ, అధికారిక నివాసానికి కొంతదూరంలో నిరసనకారులు లౌడ్ స్పీకర్లలో 1977నాటి విపక్ష లేబర్ పార్టీ విజయగీతికను వినిపిస్తూనే ఉన్నారు. తాను చెబుతున్నది మీడియా ప్రతినిధులకు వినబడటానికి వీలుగా సునాక్ గట్టిగా మాట్లాడాల్సి వచ్చిందట. ఆయన చెబుతున్నదీ, ఏడాదిన్నరగా దేశానికి చేసిందీ ప్రజలకు అర్థమైందో లేదో ఎన్నికల్లో తేలుతుంది.

ఫ్రెంచ్ దర్పణంలో మోదీ భారత్!

పారిస్ కేంద్రంగా పనిచేసే 'ప్రపంచ అసమానతల పరిశోధనశాల' (World Inequality Lab) ఈ ఏడాది మార్చిలో '1922–2023 మధ్య భారతదేశంలో ఆదాయం, సంపదల అసమానతలు : ఆవిర్భవించిన ధన స్వామ్యం' అనే డాక్యుమెంట్‌ను విడుదల చేసింది. ప్రసిద్ధ ఫ్రెంచ్ ఆర్థికవేత్త థామస్ పికెటీ సారథ్యంలో నలుగురు పరిశోధకులు జరిపిన ఈ అధ్యయనం భారతదేశంలో ధనికులకూ పేదలకూ మధ్య ఆర్థిక అంతరం విపరీతంగా పెరిగిందని అది ఇప్పుడు అగ్రభాగాన ఉన్న ఒక శాతం ధనికుల వద్ద దేశ సంపదలో 40 శాతం పోగుపడిందని, జనాభాలో పైన ఉన్న 10 శాతాన్ని తీసుకుంటే అది 60 శాతానికి చేరిపోయిందనీ ఆ అధ్యయనం తేల్చింది. మిగిలిన తొంభైశాతంలో ఉన్న నలభై శాతం మధ్యతరగతి వద్ద 29 శాతం జమ కాగా అడుగున ఉన్న యాభై శాతం ప్రజలకు 6 నుంచి 7 శాతం మాత్రమే మిగిలిందని వివరించింది.

ఈ పరిశీలన స్థూలంగా ఫ్రెంచ్ విప్లవానికి ముందు ఫ్రాన్సు దేశ ఆర్థిక పరిస్థితిని పోలి ఉంది. ఇదేకాదు అనేక ఇతర అంశాల్లో కూడా ఇప్పుడు మనదేశం అప్పటి ఫ్రాన్సులానే ఉందనిపిస్తుంది. 1789లో జరిగిన ఫ్రెంచ్ విప్లవం ఫ్రాన్స్‌లో రాచరిక వ్యవస్థతో పాటు భూస్వామ్య వ్యవస్థను కూల్చివేసి మొదటిసారి మధ్యతరగతి సామాజిక వర్గాల ప్రజాస్వామ్యాన్ని నెలకొల్పింది. ఇది రెండు వందల ఏళ్ల ఫ్రాన్సును పాలించిన బూర్బన్ రాజవంశ నిరంకుశత్వాన్ని పెకలించింది. మనుషులకు మొదటిసారి స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వాలను పంచి ఇచ్చింది.

ఫ్రెంచ్ సమాజంలో రెండు అంతరాలు ఉండేవి. ఒకటి అవకాశాలు ఉన్న వర్గం (Privileged Class), రెండు అవకాశాలు లేని వర్గం (unprivileged class). మొదటి వర్గంలో భూస్వాములూ, మతాచార్యులూ ఉండగా మధ్య తరగతి, సామాన్యులు రెండవ వర్గంలో ఉన్నారు. మొత్తం జనాభాలో ఒక శాతం ఉన్న అవకాశాలున్న వర్గం దేశ సంపదలో నలభై శాతం కైవసం చేసుకుని ఉంది. తొంభై తొమ్మిది శాతం ఉన్న అవకాశాలులేని వర్గం మిగిలిన అరవై శాతం పంచుకోవలసి వచ్చింది. అసలు తేడా అది కాదు. నలభై శాతం సంపద కలిగిన వర్గానికి పన్నుల చెల్లింపునుంచి మినహాయింపు ఉండగా దేశ పన్నుల భారాన్నంతా సామాన్యులూ, మధ్యతరగతే మోయవలసి వచ్చింది. అందుకే ఫ్రాన్సులో 'భూస్వాములు యుద్ధాలు చేస్తారు. మతాచార్యులు ప్రార్థనలు చేస్తారు. ప్రజలు పన్నులు చెల్లిస్తారు' అనే నానుడి వచ్చింది. ఇది అటుంచితే ఫ్రాన్సులో అప్పుడున్నది రాజ్యాంగబద్ధ రాచరికం. కానీ, అది నామమాత్రమే. నిజానికి నెలకొన్నది నిరంకుశ రాచరికం. రాజ్యాన్ని ప్రశ్నించినవాళ్లు వెలుతురే కనిపించని బాస్టైల్ అనే జైలులో మరణించేదాకా నిర్బంధించబడేవారు. రాజ్యాంగాన్ని అనుసరించి ఎస్టేట్స్ జనరల్ అనే పార్లమెంట్ ఉండేది. చట్టాలు చేయడంలో రాజు దాని అనుమతి పొందవలసి ఉంది. కానీ బూర్బన్‌లు 175 సంవత్సరాలుగా దానికి ఎన్నికలు జరపలేదు. విప్లవానికి రెండేళ్ల ముందునాటికి ఆడంబరాలతో, యుద్ధాలతో ఖజానా ఖాళీ అయిపోవడంతో ధనిక వర్గంపై పన్నులు విధించక తప్పదనే ప్రతిపాదన వచ్చినపుడు ఆ వర్గం తీవ్రంగా వ్యతిరేకించింది. రాజు సైతం ఆ వర్గాన్నే



విప్లవానికి ముందు ఫ్రాన్సులో ఒక ఉక్కపోత వాతావరణం ఉండేది. స్వేచ్ఛగా మాట్లాడలేని, నచ్చింది తినలేని, నిజం మాట్లాడలేని, నేనీ దేశ పౌరుణ్ణి అని ప్రకటించుకోలేని ఊపిరాడనితనం ఇప్పుడు ఇక్కడ కూడా ఆవహించింది. మాంటెస్క్యూ, వోల్టేర్, రూసో, డిడిరో లాంటి మేధావులు ఫ్రెంచ్ సమాజంలో కదలిక తెచ్చారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు కర్ణాటకలో పౌరసమాజం సృష్టించిన చైతన్యం లాంటిది ఇప్పుడు దేశమంతా వ్యాపించడమే మిగిలి ఉంది.

సమర్థించడంతో సామాన్యులు వెంట నడవగా మధ్యతరగతి నాయకత్వంలో విప్లవం చెలరేగి రాజకీయ, సామాజికవ్యవస్థల్ని పడగొట్టింది.

ఎవరు ప్రజలు? ప్రభుత్వం ఎవరి సంక్షేమం కోసం ఉంది? అనే ప్రశ్నలు ఫ్రెంచ్ రాజవంశానికి అర్థం కాలేదు. విప్లవం నాటి ఫ్రెంచ్ చక్రవర్తి 16వ లూయీ భార్య మేరీకి ఎప్పుడూ తమను పరివేష్టించి ఉండే ధనిక వర్గాలు కాక అసలు ప్రజలు వేరే ఉంటారని తెలియదట. అందుకే ఆమెకు ప్రజలు బ్రెడ్డు లేక అలమటిస్తున్నారని చెబితే 'బ్రెడ్డు దొరకకపోతే కేకులు తినవచ్చు కదా' అని అన్నదని అంటారు. తన రాజ్యాన్ని ఆర్థిక దుస్థితినుంచి బయట పడెయ్యడానికి, జనాన్ని ఆకలి నుంచి రక్షించడానికి తన ప్రభుత్వమే భూస్వాముల మీద మతాచార్యులమీద పన్ను విధించటానికి సిద్ధపడితే వారితో కలిసి తనకు తానే అడ్డుపడి చివరికి బలి కావడం ఫ్రాన్సు చక్రవర్తికి ఆత్మహత్యా సదృశమైంది. ఆ ఫ్రెంచ్ సందర్భం పికెటీ బృందం పరిశీలనలో తేలిన ఒక్క శాతం మంది నలభై శాతం సంపద కలిగి ఉన్న అంశంతో మొదలై ధరల పెరుగుదల, నిరుద్యోగం, పన్నులతో ప్రజలు కుదేలౌతుంటే, కార్పొరేట్లకిచ్చిన లక్షల కోట్ల రుణాలను మాఫీచేసి దేశ ఆర్థిక వ్యవస్థను ఆ వర్గాలకు కట్టబెట్టడుతున్న ఇప్పటి భారతీయ సందర్భంతో సరితూగుతున్నది. తమ మీద విధించిన పన్నులు చెల్లించడానికి నిరాకరించి, ప్రజల దాడులు తప్పించుకోవడానికి దేశంనుంచి పారిపోయిన ఫ్రెంచ్ భూస్వాములతో – కోట్లాది రూపాయల బ్యాంకు రుణాలు ఎగ్గొట్టి విదేశాలకు పలాయనం చేసిన పెద్దమనుషులను పోల్చవచ్చు. 2014 తర్వాత పైస్థాయి వ్యాపారస్తులతో ప్రభుత్వం జట్టుకట్టడం బాగా పెరిగిపోయిందని ఈ అధ్యయనం ధ్రువీకరించడం రెండు సందర్భాల మధ్య సారూప్యతను పెంచుతున్నది.

బూర్బన్ చక్రవర్తి 14వ లూయీ సర్వ మంత్రాంగాన్ని నిర్వీర్యం చేసి అధికారాన్నంతా తన చేతుల్లోనే కేంద్రీకృతం చేసుకున్నాడు. కాలు దువ్వి మరీ యుద్ధాలు చేశాడు. తన అంత్యక్రియలకు కూడా మిగలకుండా డబ్బును దుబారా చేశాడు. 'నేనే రాజ్యాన్ని' (I am the state) అని హుంకరించాడు. ఇప్పుడు కూడా మన దేశంలో అన్నిటా అంతటా తానై వ్యవహరించే నాయకత్వాన్ని చూస్తున్నాం. అన్ని చోట్లా ఒక్క రూపాన్నే దర్శిస్తున్నాం. అనుచరుల్ని తప్ప సహచరుల్ని అనుమతించని ప్రజాస్వామ్యంలో ఉన్నాం. దేశంలో ఒక వర్గాన్ని తమ వాళ్లుగా, మరికొన్ని వర్గాల్ని ఇతరులుగా చూసే వివక్షాపూరిత పరిపాలనను గమనిస్తున్నాం. ఈ నియంతృత్వ ధోరణి గత పదేళ్లలో బాగా బలపడిన వైనాన్ని అసమానతల డాక్యుమెంట్ నిర్ద్వంద్వంగా ప్రస్తావించింది.

విద్య, వైద్యం, న్యూట్రిషన్ వంటి రంగాలలో ప్రజల పెట్టుబడిని ప్రభుత్వం ప్రోత్సహిస్తే దేశంలో సామాన్యులే కాదు, శిష్ట వర్గంకూడా ప్రయోజనం పొందుతుందని భావించిన పికెటీ బృందం దేశంలోని 167 అత్యంత ధనిక కుటుంబాల మీద రెండు శాతం సూపర్ టాక్స్‌ను విధించాలని ప్రతిపాదించింది. ఇది ఫ్రాన్సులో విప్లవానికి తక్షణ కారణమైన ధనిక వర్గాలమీద విధించబూనుకున్న పన్నును తప్పక గుర్తుకు తెస్తుంది.

పారిస్‌ను భీకర క్షామం కమ్ముకోగా, చిన్న బ్రెడ్డు ముక్క కోసం 'అలగా జనం' కాట్ల కుక్కల్లా కొట్లాడుకుంటున్నపుడు వేల మంది పారిస్ స్త్రీలు దాదాపు పాతిక మైళ్ల దూరం ఆకలియాత్ర చేసి 'వర్సే' రాజభవనాన్ని ముట్టడించారు. తేరిపార చూస్తే ప్రభుత్వం నిర్దేశించిన మార్కెట్ స్థలాల్లోనే రైతులు తమ పంటలను విక్రయించాలని నిర్దేశించిన రైతు చట్టాలకు వ్యతిరేకంగా రాజధాని ఢిల్లీ మీద సంవత్సరం పైగా రైతులు చేసిన ముట్టడి అటువంటిదే. చట్టాలు రద్దయినా కనీస మద్దతుధర కోసం ఇప్పుడు జరుగుతున్నదీ దానికి కొనసాగింపే. ఈ సందర్భంలోనే సిఎఎ, యన్ఆర్‌సిలకు వ్యతిరేకంగా ఢిల్లీ షహీన్ బాగ్‌లో మహిళలు చేసిన ఆందోళన గుర్తుకు రాకుండా ఎలా ఉంటుంది? 'ఒక వ్యక్తి పుట్టుక, పుట్టిన చోటు, పౌరసత్వం గురించి మాట్లాడడానికి మహిళలకన్నా అర్హులెవరుంటారు?' అని రొమిలాథాపర్ వేసిన అర్థవంతమైన ప్రశ్నకు, తమ బిడ్డల, భర్తల, తల్లిదండ్రుల ఆకలి తీర్చేందుకు రాజు మీద దాడి చెయ్యడానికి పారిస్ స్త్రీల కంటే మించిన అవసరమెవరికి ఉంటుంది అనే ప్రశ్నతో అనుసంధానం సరిగ్గా కుదురుతుంది.

'కళ్లు మిరుమిట్లు గొలిపే సంపదల్ని చూపించి నాగరికత అంటున్నారు. తప్పులు జ్ఞానంగా చలామణి అవుతున్నాయి. అణచివేతకు అదుపు అనే పేరు పెట్టారు. ఊడ్చిపారెయ్యండి ఈ వ్యవస్థ అక్రమ నిర్మాణాన్ని. అసమానతల్ని సమం చెయ్యండి. ఈ సంకెళ్లని తెంచండి' అంటూ విప్లవానికి ముందు ఫ్రెంచ్ తత్వవేత్త రూసో ప్రజలకు పిలుపు ఇచ్చాడు. కొద్దిమంది దగ్గరున్న సంపద చూపించి దేశం అభివృద్ధి చెందిందని చెప్పటం, ఐదు ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థ గురించి మాట్లాడటం, అభూత కల్పనల్ని చరిత్రగా నమ్మబలకటం, ప్రభుత్వ వ్యవస్థల్ని ఉపయోగించి అనుకూలంగా లేనివారిని అణగద్రొక్కడం రూసో మాటల్ని ఇక్కడ ప్రాసంగికం చేస్తున్నాయి. Error miscalled knowledge అన్న ఆయన మాట ఇప్పుడు ఎంత సత్యమో కదా.

విప్లవానికి ముందు ఫ్రాన్సులో నెలకొన్న పరిస్థితులు ఇంచుమించుగా యూరప్ అంతా ఉన్నవే. కానీ విప్లవాన్ని ఫ్రాన్సులో సాధ్యంచేసింది మటుకు ఆ దేశానికి మాత్రమే పరిమితమైన మధ్యతరగతి మేధావి వర్గం. భారతదేశంలో ఒకప్పుడు బెంగాల్‌కు ఉన్న స్థానం యూరప్‌లో ఫ్రాన్సుకు ఉండేది. ఇవి రెండూ సమకాలికులకంటే ఒకరోజు ముందుంటాయి. విప్లవానికి ముందు ఫ్రాన్సులో ఒక ఉక్కపోత వాతావరణం ఉండేది. స్వేచ్ఛగా మాట్లాడలేని, నచ్చింది తినలేని, నిజం మాట్లాడలేని, నేనీ దేశ పౌరుణ్ణి అని ప్రకటించుకోలేని ఊపిరాడనితనం ఇప్పుడు ఇక్కడ కూడా ఆవహించింది. మాంటెస్క్యూ, వోల్టేర్, రూసో, డిడిరో లాంటి మేధావులు ఫ్రెంచ్ సమాజంలో కదలిక తెచ్చారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు కర్ణాటకలో పౌరసమాజం సృష్టించిన చైతన్యం లాంటిది ఇప్పుడు దేశమంతా వ్యాపించడమే మిగిలి ఉంది.

ప్రజాస్వామ్యంలో ఎన్నికలే విప్లవాలు. ఫ్రెంచ్ విప్లవం మనకు సాధించి పెట్టింది అదే. సందర్భం మారినపుడు రూపం మారుతుంది. ఐదు దశల ఎన్నికలు పూర్తయ్యేటప్పటికి రంగులు వెలిసిపోయి అసలు రూపాలు బయట పడుతున్న నేపథ్యాన, ప్రజలు సత్యాసత్యాలను గుర్తించగలుగుతున్న దశలో, దేశం మరో విప్లవం అంచుకు నడుస్తోందనే వార్తల మధ్య చరిత్ర పునరావృతిగా మిగల కూడదు, కొత్త అర్థంలో పునరావృతమే కావాలి.


■ కొప్పర్తి వెంకటరమణమూర్తి

విశ్వవిద్యాలయాలకు పునర్వైభవం ఎలా?

దేశం, రాష్ట్రాలు సమగ్ర ప్రగతి దిశగా అడుగులు వేయాలంటే.. నాణ్యమైన విద్య అందుబాటులో ఉండటం అవశ్యం. ప్రస్తుతం ప్రభుత్వ రంగంలో పనిచేస్తున్న విద్యావ్యవస్థ క్రమేణా తన పూర్వవైభవాన్ని కోల్పోతూ వస్తోంది. నూతన ప్రభుత్వాలు ఏర్పడినప్పుడల్లా నాణ్యమైన విద్యను అందిస్తామని హామీలే తప్ప కార్యాచరణ కనిపించటం లేదు. విశ్వవిద్యాలయాలను పటిష్టపరిచే అవకాశం ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వానికి వచ్చింది. ఈ నెల 21తో రాష్ట్రంలోని అన్ని విశ్వవిద్యాలయాల ఉపకులపతుల పదవీకాలం ముగిసింది.

గత పదేళ్లలో రాష్ట్రంలో ఉన్నత విద్య క్రమేణా కుంటుపడుతూ వచ్చింది. ఒక్కటంటే ఒక్క అధ్యాపకుడినీ ఈ పదేళ్లలో నియమించలేదు. ప్రైవేటు విశ్వవిద్యాలయాలకూ విచ్చలవిడి అనుమతులు ఇవ్వటం, ప్రభుత్వ విశ్వవిద్యాలయాలను గాలికి వదిలేయటంతో పేద, బలహీనవర్గాల విద్యార్థులకు నాణ్యమైన ఉన్నత విద్య క్రమంగా దూరమవుతూ వచ్చింది. అందుకే విశ్వవిద్యాలయాలను పటిష్ఠపరచాలంటే, వాటికి సమర్థులైన నాయకత్వాన్ని ఎంపిక చేయటం అవసరం. స్వయంప్రతిపత్తితో సాగే విశ్వవిద్యాలయాల్లో రాజకీయ జోక్యం తగ్గించి నాణ్యత, ఉపాధి కల్పించే నూతన కోర్సులు, మౌలిక వసతులు, అధ్యాపకుల నియామకాలపై దృష్టి సారించాల్సి ఉంది.

వాస్తవానికి ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఆకాంక్షను బలంగా వినిపించింది విశ్వవిద్యాలయాలే. తొలిదశ, మలిదశ ఉద్యమాలకు ఊతమిచ్చింది, సైద్ధాంతిక పునాది వేసింది, ప్రత్యేక రాష్ట్ర ఆకాంక్షను సజీవంగా నిలిపిందీ విశ్వవిద్యాలయాలే. మలి దశ ఉద్యమంలో క్షేత్రస్థాయి పోరాటాలు మొదలు అప్పటి ప్రభుత్వాలతో ఢీ అంటే ఢీ అనేలా ఉద్యమాలు నిర్మించాయి. విద్యార్థుల పోరాటాల ద్వారా వచ్చిన తెలంగాణ రాష్ట్రంలో, అదే ఉద్యమ స్ఫూర్తితో అధికారంలోకి వచ్చిన పాలకవర్గం విశ్వవిద్యాలయాలను పట్టించుకోలేదు. రాజకీయ కారణాల సాకుతో విభిన్న రంగాల్లో భవిష్యత్తు నాయకత్వాన్ని అందించాల్సిన విశ్వవిద్యాలయాలను వాటంతటవే ఆత్మహత్య చేసుకునే విధానాన్ని పాటించారు. ప్రస్తుతం అన్ని యూనివర్శిటీలు కనీసం 20శాతం పూర్తి స్థాయి అధ్యాపకులు కూడా లేకుండానే నడుస్తున్నాయి. ఇకపోతే చాలాకాలం పాటు ఉపకులపతుల నియామకమే చేపట్టలేదు. పదేళ్లలో కేవలం రెండు పర్యాయాలు మాత్రమే ఉపకులపతులను నియమించారు. రాజకీయ నాయకుల జోక్యంతో కొంతమంది ఉపకులపతుల తీరు వివాదాస్పదమైంది. తిరిగి అలాంటి పరిస్థితి తలెత్తకుండా మచ్చలేని, అందరినీ కలుపుకునిపోయే, విశ్వవిద్యాలయాలకు ప్రపంచస్థాయి గుర్తింపు తీసుకొచ్చే ముందుచూపున్న అధ్యాపకులకు వీసీలుగా అవకాశం ఇవ్వాలి.



రాష్ట్ర ప్రభుత్వం విశ్వవిద్యాలయాలను పటిష్టపరిచే దిశగా చర్యలు తీసుకోవాలి. వెంటనే సమస్యలపై సమగ్ర అధ్యయనం జరపాలి. బోధన, బోధనేతర సిబ్బందిని నియమించే దిశగా అడుగులు వేయాలి. భవిష్యత్తు తరాలకు నాణ్యమైన ఉన్నత విద్యను అందించే దిశగా చర్యలు ప్రారంభించాలి. శతాబ్ది ఉత్సవాలు జరుపుకుని ప్రపంచ స్థాయి గుర్తింపు దక్కించుకున్న ఉస్మానియా విశ్వవిద్యాలయ ప్రతిష్ఠను నిలబెట్టాలి.

యూనివర్సిటీలకు కొత్త వీసీల ఎంపిక కోసం ఇప్పటికే సెర్చ్ కమిటీలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. దీంతో ఆశావహుల హడావుడి కూడా పెరిగింది. పైరవీకారులకు, అనర్హులకు కాకుండా నీతి నిజాయితీ, దూరదృష్టి, పరిశోధనలు, విద్యార్థుల శ్రేయస్సే లక్ష్యంగా పనిచేసే వారికి అవకాశం ఇవ్వాలి. ఏటికేడు ప్రొఫెసర్ల పదవీవిరమణతో యూనివర్శిటీల్లోని ఎన్నో విభాగాలు మూతపడే పరిస్థితికి చేరాయి. తెలంగాణ ఉద్యమానికి కేంద్ర బిందువుగా నిలిచిన ఉస్మానియా విశ్వవిద్యాలయంలో పరిస్థితి మరీ అధ్వానంగా మారింది. ప్రపంచవ్యాప్తంగా తనకంటూ గుర్తింపు దక్కించుకుని లక్షలాది విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పిన ఓయూ, పూర్తి స్థాయి అధ్యాపకులు లేక వెలవెలబోతోంది. సగానికి పైగా విభాగాలు కనీసం ఒక్క ప్రొఫెసర్ కూడా లేకుండానే నడుస్తున్నాయి. ఫలితంగా రోజురోజుకూ విద్యా ప్రమాణాలు పడిపోతున్నాయి. పరిస్థితి ఇలాగే కొనసాగితే మరో రెండు సంవత్సరాల్లోనే విశ్వవిద్యాలయాలు దాదాపుగా మూతపడే పరిస్థితికి చేరుతాయి. ఆ దశ నుంచి పునర్వైభవం దిశగా విశ్వవిద్యాలయాలను మళ్లించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే. లేదంటే పేద, మధ్యతరగతి, గ్రామీణ యువకులకు ఉన్నత విద్య అందిస్తున్న ఉస్మానియా, కాకతీయ సహా పదిహేను రాష్ట్రీయ విశ్వవిద్యాలయాలు ఉనికి కోల్పోతాయి. నాణ్యమైన ఉన్నత విద్య కోసం ఇక ప్రైవేటు విశ్వవిద్యాలయాలవైపే చూడాల్సి ఉంటుంది. అప్పుడు పేద, గ్రామీణ విద్యార్థులు ఉన్నతవిద్యకు దూరమయ్యే ప్రమాదం ఉంది.

రాష్ట్రంలోని యూనివర్సిటీలలో దాదాపుగా 2,828 పోస్టులు ఉండగా.. వాటిలో 1,869 అధ్యాపకుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఓయూలో– 845, కేయూలో– 298, జేఎన్టీయూలో– 232, ఆర్జీయూకెటీ– 128, మహాత్మాగాంధీ– 35, పాలమూరు– 73, తెలంగాణ– 73, శాతవాహన– 45, బిఆర్ అంబేద్కర్– 48, జేఎన్టీయూ ఫైన్ ఆర్ట్స్– 31, పొట్టి శ్రీరాములు యూనివర్సిటీలో 61 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అంటే విశ్వవిద్యాలయాల్లో దాదాపుగా 80 శాతం అధ్యాపకులు లేకుండానే నడుస్తున్నాయి. ఈ లెక్కలు కూడా ఏడాది క్రితం తీసుకున్నవే. ప్రతి నెలా పది మందికి పైగా అధ్యాపకులు ఆయా విశ్వవిద్యాలయాల్లో పదవీ విరమణ పొందుతున్నారు. అంటే ఈ ఖాళీల సంఖ్య మరింత పెరుగుతుంది. అధ్యాపకుల నియామకాలతో పాటు కనీస మౌలిక వసతులు కల్పించటంలోనూ ప్రభుత్వాలు విఫలమవుతూ వచ్చాయి. ఆధునిక సాంకేతికత ప్రపంచాన్నే శాసిస్తున్న ప్రస్తుత తరుణంలో పరిశోధనలకు అవసరమైన మౌలిక వసతులను కల్పించాల్సి ఉంది.

విద్యార్థులు, నిరుద్యోగుల పోరాటాలు, ప్రజల సరికొత్త ఆకాంక్షలతో అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం ప్రభుత్వరంగంలోని విశ్వవిద్యాలయాలను పటిష్టపరిచే దిశగా చర్యలు తీసుకోవాలి. వెంటనే సమస్యలపై సమగ్ర అధ్యయనం జరపాలి. బోధన, బోధనేతర సిబ్బందిని నియమించే దిశగా అడుగులు వేయాలి. భవిష్యత్తు తరాలకు నాణ్యమైన ఉన్నత విద్యను అందించే దిశగా చర్యలు ప్రారంభించాలి. శతాబ్ది ఉత్సవాలు జరుపుకుని ప్రపంచ స్థాయి గుర్తింపు దక్కించుకున్న ఉస్మానియా విశ్వవిద్యాలయ ప్రతిష్ఠను నిలబెట్టాలి. ఇందు కోసం విద్యార్థి సంఘాలుగా సంపూర్ణ సహకారం అందించేందుకు సిద్ధంగా ఉంటాం.

○ జీవన్
ఏబీవీపీ స్టేట్ యూనివర్సిటీస్ కన్వీనర్

ఉపాధ్యాయ సంఘాలకు గుర్తింపు ఉన్నట్టా? లేనట్టా?

తెలంగాణ రాష్ట్రంలో చిన్నవి, పెద్దవి మొత్తం కలసి 50కి పైగా ఉపాధ్యాయ సంఘాలున్నాయి. వీటిలో ఏ సంఘానికి ప్రభుత్వ గుర్తింపు ఉందో, లేదో తెలియడం లేదు. జిల్లా స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి అధికారుల వరకు ఎవరూ ఫలానా సంఘానికి ప్రభుత్వ గుర్తింపు ఉందని కాని, లేదని కాని చెప్పడం లేదు. అందుబాటులో ఉన్న ప్రభుత్వ ఉత్తర్వులను పరిశీలించినా సంఘాల గుర్తింపుపై స్పష్టత రావడం లేదు. దీనితో తెలంగాణలో ఉపాధ్యాయ సంఘాలకు ప్రభుత్వ గుర్తింపు ఉన్నట్లా? లేనట్లా? అనే సంశయం ఉపాధ్యాయ వర్గాల్లో నెలకొంది.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కొన్ని ఉపాధ్యాయ సంఘాలకు గుర్తింపు ఉండేది. ఆ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలతో జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ కూడా ఏర్పాటయ్యేది. ఈ కౌన్సిల్‌లో కొన్ని సంఘాలకు శాశ్వత సభ్యత్వం, కొన్నిటికి రొటేషన్ పద్ధతిలో సభ్యత్వం ఉండేది. గుర్తింపు ఉండి, జాయింట్ స్టాఫ్ కౌన్సిల్‌లో సభ్యత్వం కలిగిన సంఘాల రాష్ట్ర బాధ్యులకు ఓడీ సౌకర్యం, జిల్లా బాధ్యులకు 21 రోజుల ఆకస్మిక సెలవులను కొన్ని నిబంధనలకు లోబడి వాడుకునే సౌకర్యాన్ని ప్రభుత్వం కల్పించింది. కాని తెలంగాణ ఏర్పడిన తర్వాత రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయ సంఘాలకు గుర్తింపు ఇచ్చినట్లు కాని, జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ ఏర్పాటు చేసినట్లు కాని ఎక్కడా ఆధారాలు లేవు. తెలంగాణ ప్రభుత్వ సాధారణ పరిపాలనా శాఖ విడుదల చేసిన మెమో సంఖ్య 63753/SW/A1/2018–1, తేదీ 8.6.2018 ప్రకారం ఆనాటికి ఏ సంఘానికీ గుర్తింపు లేదు. ఆ తర్వాత విడుదలైన మెమో సంఖ్య 63753/SW/A1/2018–2, తేదీ 11.6.2018 ప్రకారం ఉమ్మడి రాష్ట్రంలో గుర్తింపు పొంది, ప్రస్తుతం తెలంగాణ పేరుతో నడుస్తున్న సంఘాలన్నీ గుర్తింపు పొందినట్లుగానే భావించాలని తెలుస్తోంది. అలానే మరో మెమో సంఖ్య 63753/SW/A1/2018–3, తేదీ 14.6.2018 ప్రకారం ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ పేరుతో గుర్తింపు పొందిన సంఘాలన్నింటినీ కూడా గుర్తించబడినట్లుగానే పరిగణించాలని తెలుస్తున్నది. కానీ ఈ రెండు మెమోలకు భిన్నంగా ఆ తర్వాత ప్రభుత్వం వివిధ సందర్భాల్లో సంఘాల రాష్ట్ర ప్రధాన బాధ్యులకు ఓడీ సౌకర్యాన్ని కల్పిస్తూ ఇచ్చిన పలు ఉత్తర్వులు GO Rt. No.2069, తేదీ 3.11.2022, GO Rt. No.2369, తేదీ 19.11.2022, GO Rt. No.2285, తేదీ 3.12.2022, GO Rt. No.2302, తేదీ 5.12.2022లలో జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ ఏర్పాటును, సంఘాల గుర్తింపును పెండింగ్‌లో పెట్టినట్లుగా ఉంది. కాబట్టి జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ ఏర్పాటు కాలేదని, సంఘాలకు గుర్తింపు ఇవ్వలేదని స్పష్టంగా తెలుస్తున్నది. అయినా కొన్ని ఉపాధ్యాయ సంఘాల జిల్లా ప్రధాన బాధ్యులు 21 రోజుల ప్రత్యేక ఆకస్మిక సెలవులను వాడుకుంటున్నారు. ఒక్కో జిల్లాలో కనీసం ఐదు సంఘాల బాధ్యులు (5X2= 10 మంది) 21 రోజుల చొప్పున (10X21= 210 రోజులు) 33 జిల్లాల్లో (33X210) 6930 రోజుల ఆకస్మిక సెలవులు వాడుకునే అవకాశం ఉంది. అది కూడా నిబంధనలకు విరుద్ధంగా వాడుకుంటున్నారనే అభిప్రాయం లేకపోలేదు. ఇక సంఘాలకు గుర్తింపు లేకపోతే ఇలా వాడుకోవడం సి అండ్ డిఎస్‌ఇ లేఖ సంఖ్య 572/C2-2/96, తేదీ 10.10.1997కు విరుద్ధం. ఒక విద్యా సంవత్సరంలో ఇన్ని పని దినాలను కోల్పోవడం బోధనాభ్యసన కార్యక్రమాలకు పెద్ద నష్టం.

తెలంగాణ ప్రభుత్వం చేత గుర్తింపు పొందిన ఉపాధ్యాయ సంఘాల లిస్టుతో పాటు గుర్తింపు ఇస్తూ జారీచేసిన ఉత్తర్వులు ఇవ్వాలని డిటిఎఫ్ జనగాం జిల్లా కమిటీ సి అండ్ డిఎస్‌ఇ, హైదరాబాద్‌కి సమాచార హక్కు చట్టం క్రింద దరఖాస్తు చేసినా జవాబు రాలేదు. ఏతావాతా ఉపాధ్యాయ సంఘాలకు ప్రభుత్వ గుర్తింపును తేల్చాల్సిన బాధ్యత సి అండ్ డిఎస్‌ఇపై ఉంది. మరి వారు ఉపాధ్యాయ సంఘాలకు ప్రభుత్వం గుర్తింపు ఇచ్చిందని చెప్తారో, ఇవ్వలేదని చెప్తారో వేచి చూడాలి.

– రావుల రాజేశం, హైదరాబాద్

మాలలపై ఎందుకీ అకారణ ద్వేషం?

కులకోణం ఎంతటి వ్యక్తినైనా సంకుచిత స్థాయికి దిగజారుస్తుందనటానికి సాహితీవేత్త పసునూరి రవీందర్ రాసిన వ్యాసం నిదర్శనం ('సామాజిక న్యాయానికి సమాధి కడుతున్నదెవరు?', ఆంధ్రజ్యోతి, ఏప్రిల్ 10). పూర్వపు రాజరికపు ప్రభుత్వాలైనా, ఆధునిక ప్రజాస్వామ్య ప్రభుత్వాలైనా నామినేటెడ్ నియామకాల్లో సామాజిక న్యాయం కంటే కూడా సమర్థతకు, పార్టీ ప్రయోజనాలకు, ప్రతిష్ఠకు మాత్రమే ప్రాధాన్యతనిస్తాయి. ఇది పాలితుల ఇష్టం. తమకు నష్టం జరిగిందనే కులంవారు ఆ ప్రభుత్వాల్నీ పార్టీనీ ప్రశ్నించాలి గాని, పక్క కులం వారిపై నిందమోపడం సరికాదు.

తెలంగాణలో అతిపెద్ద 'కులం' మాదిగలు అని, వారిని విస్మరించడం చారిత్రక ద్రోహమే అవుతుందని వాపోతున్నారు రవీందర్. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో కేసీఆర్ వెంట నిలిచిన మాదిగలెందరూ, పదేళ్ల కేసీఆర్ పాలనా కాలంలో కాంగ్రెస్‌ను కాపాడిన మాదిగలెందరనే అంశంపై వారు ఆత్మవిమర్శ చేసుకోవాలి. కోదండరాం ఆధ్వర్యంలో జేఏసీ ఉద్యమం చేస్తుండగా సికింద్రాబాద్ సిగ్మా హాస్పిటల్‌లో స్టీరింగ్ కమిటీ మీటింగ్‌పై ఎమ్మార్పీయస్ నేతలు దాడి చేసిన సందర్భం చరిత్రాత్మక ద్రోహం కాకమరేమిటి? చేసేది ద్రోహం, ఆపై అన్యాయమంటూ అరవడం... ఇదేంనీతి? అయినప్పటికీ తెలంగాణ తొలి ఉపముఖ్యమంత్రిగా మాదిగ వ్యక్తినే కదా కేసీఆర్ నియమించింది? వచ్చిన అవకాశాన్ని కూడా నిలుపుకోకపోతే రెండవ వ్యక్తిని కూడా మాదిగనే నియమించారన్న విషయమూ మర్చిపోయారా?

1985 కారంచేడు ఊచకోతకు వ్యతిరేకంగా జరిగిన ఐక్య ఉద్యమ ఫలితంగానే 1989 ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ నిరోధక చట్టం వచ్చింది. 1991 చుండూరు ఊచకోత సంఘటనలో ఐక్య ఉద్యమం అగ్రకులాలను దోషిగా నిలబెట్టింది. పైరెండు ఉద్యమాలు మాలల నాయకత్వంలో జరిగి, ఫలితంగా ఆంధ్ర అగ్రవర్ణాలకు మాలలు శత్రువులైనారు. 1994లో బీఎస్పీ అధినేత కన్షీరాం ఆంధ్ర మాలల సహకారంతో దక్షిణ భారతంలో తన రాజకీయ విస్తరణ చేస్తున్న రోజుల్లో ఆనాటి ఒంగోలు ఎంపీ మాగుంట సుబ్బిరామిరెడ్డి ఆంధ్ర మాలలతో తనకున్న వైరం కారణంగా బీఎస్పీని నిలువరించడానికి ఎమ్మార్పీఎస్ అండదండలు తీసుకోవటంతో మొదలుకొని, 2023లో మాదిగ వ్యక్తి తన ఉన్నతోద్యోగం వదులుకొని బీఎస్పీ పగ్గాలు చేపట్టి తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు వెళ్తే మాదిగలే ఓట్లేయని సందర్భం దాకా మాదిగల రాజకీయ, సామాజిక ద్రోహం అనేకమార్లు బుజువైంది. బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడైన మాదిగ నేత రాత్రికిరాత్రే గులాబీ గూటికిచేరి బహుజన ఉద్యమానికి చేసింది ద్రోహం కాదా? ఎమ్మార్పీఎస్ ఏర్పాటు అనంతరం జరిగిన 1998 వేంపేట, 2012 లక్ష్మీపేట ఊచకోత సంఘటనల్లో దళిత ఐక్య ఉద్యమం నీరు కారడానికి మాలలతో మాదిగలు కలసిరాకపోవడమే కారణం. ఇలా సామాజిక ఐక్య ఉద్యమాలకు ద్రోహం చేసిన చరిత్రను చూడలేకపోతే ఎలా?

ఒకవైపు ఛత్తీస్‌గఢ్ దండకారణ్యంలో గ్రీన్ హంట్ పేరుతో నరమేధం సృష్టిస్తున్న కేంద్రంలోని అధికార పార్టీ గత ఏడాది నవంబర్ 7న మాదిగ విశ్వరూప 'ఎన్నికల ముసుగు' సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చిన అనైతిక వాదిది ఏకులం? ఇది ఖచ్చితంగా రాజకీయ, సామాజిక, విప్లవ ఉద్యమద్రోహమే! ఈసారి 400 ఎంపీ సీట్లు ఇస్తే రాజ్యాంగాన్నే మార్చివేసి రిజర్వేషన్లనే తొలగిస్తామని ఒకవైపు కాషాయపు పార్టీ ఎంపీలు బహిరంగంగానే ప్రకటిస్తుంటే, లక్షలాదిమంది సాక్ష్యంగా అదే పార్టీ అగ్రనేత కాళ్లుపట్టుకొని, అదే కాషాయపు పార్టీకి కర్ణాటకలో ఓట్లువేయమని బరితెగించి బహిరంగంగా ప్రచారంచేసిన మిమ్మల్ని మేమేమీ అనలేదే? కేంద్రంలో కాషాయ పార్టీకే ఓట్లు వేయమని ప్రచారం చేస్తూ, గతంలో గాంధీ భవన్‌ను తగులబెట్టే ప్రయత్నం చేసి, గాంధీ భవన్ కాంగ్రెస్ మీడియా వేదికపైనే కూర్చుని వారినే దూషిస్తూ, మరలా కాంగ్రెస్ పార్టీని సీట్లు ఇవ్వమని అడగడమంటే గాడిదకు గడ్డివేసి ఆవుకు పాలుపిండుతామన్న చందంగా లేదూ! ఆ ఆవు తన్నకుండా ఉండదూ!

ఒక దఫాలో ఒక ఎంపీ సీటు, ఒక వీసీ పదవి రాకపోతేనే సామాజిక న్యాయం సమాధి అవుతున్నదని నిందలేస్తున్న మీరు తెలంగాణలో సర్పంచులు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, ఎంపీపీలు, జడ్పీలు, మున్సిపల్ చైర్మన్లు తదితర పదవులను మీ జనాభా శాతం కంటే ఎక్కువే పొందారు. పసలేని వాదనలు చేసి పసునూరి పలుచన కారాదు.




గులాబీ సర్కార్ హయాంలో మాదిగలకు అన్ని రంగాల్లో అన్యాయమే జరిగింది అనడం పచ్చి అబద్ధం. ఉపముఖ్యమంత్రి పదవితోపాటు రెండు పర్యాయాలు ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్, ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ పదవి ఇచ్చారు కదా! ఎస్సీ కార్పొరేషన్ రుణాలన్నీ మాదిగలకు ఇస్తాను అన్న ఆనాటి చైర్మన్ ప్రకటనలు మీరు మర్చిపోయినా సమాజం మర్చిపోదు. గులాబీ పార్టీ సర్కార్ అండతో ఎమ్మార్పీఎస్‌కు పోటీగా మరో ఎమ్మార్పీఎస్ నిర్మాణంలో మీరు లేరా? ఇది ద్రోహం కదా? 2014లో సాంఘిక సంక్షేమ శాఖ మంత్రిపదవి ఇచ్చింది జగదీశ్వర్ రెడ్డికి. అతనేమైనా మాలనా? కొప్పుల ఈశ్వర్ కంటే సీనియర్ ఎస్సీ నేత గులాబీ పార్టీలో లేనప్పటికీ, మాదిగలే ఉన్నత పదవులు పొందారు. ఒక ఇతర పార్టీ (బీఎస్పీ) రాష్ట్ర అధ్యక్షుడిని కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం టీఎస్‌పీఎస్‌సీ చైర్మన్‌గా నియమించజూపినా ఆ పదవిని తిరస్కరించింది మాదిగ కులం వ్యక్తే! ఇక ఉన్నతవిద్య మండలి చైర్మన్, యూనివర్సిటీ వీసీ పదవులు ఏ మాత్రం సాధారణ ప్రజలకు సంబంధం లేనివి. వాటితో మాల కులానికి ఒరిగిందేమీ లేదు. రాజకీయాల్లో సామాజిక న్యాయం గురించి మాట్లాడవలసివస్తే ముందుగా ముదిరాజ్, పద్మశాలి కులాల గురించి మాట్లాడాలి. జనాభాలో గణనీయమైన సంఖ్యాబలం కలిగిన వారి ప్రాతినిధ్యం చట్టసభల్లో దాదాపు కనుమరుగవుతున్నది.

అన్ని రాజకీయ పార్టీల్లో అగ్ర కులాలవారు ఒకే కుటుంబం నుంచి రెండు పదవులు పొందినా మెదలని నోళ్ళు మాలల విషయంలో మాత్రం విషం కక్కుతున్నాయి! ఎమ్మార్పీఎస్ ఏర్పాటు నుండి వర్గీకరణ చట్టం తెచ్చేవరకు తెరవెనుక అన్నీతానై నిర్వహించిన ఆనాటి సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి కడియం శ్రీహరి కుటుంబం మాదిగ కాదు అంటున్న మీరు, సంఖ్యాబలం విషయంలో ఉపకులాలను కలుపుకోవడం మీ ద్వంద్వబుద్ధికి నిదర్శనం. గులాబీ పార్టీ అధికారంలో ఉన్న పదేళ్ళపాటు కాంగ్రెస్ పార్టీ అచేతనంగా పడి ఉన్నప్పుడు దానికి ఆక్సిజన్ మాదిరి ఊపిరులూది బతికించిన అద్దంకి దయాకర్‌కు దక్కాల్సిన తుంగతుర్తి సీటు ఒక మాదిగకే దక్కింది. ఎమ్మెల్సీ ప్రకటించి దక్కకపోయినా, రాజ్యసభ ఊహాగానాలు దూరమైనా, వరంగల్ ఎంపీ సీటు అంటూ దోబూచులాడి చివరకు అది గులాబీ మాదిగకే వెళ్ళిపోయినా మేము ఏమీ అనుకోలేదు. కొప్పుల రాజు మాదిగల కోసం చేసిన త్యాగాన్ని గుర్తు చేసిన మీరు తుంగతుర్తి మాలల కోసం త్యాగం చేయాలని ఎందుకు అడగలేదు? మాలలు త్యాగాలు చేయాలి, మేము తన్నుకుపోతాం అన్నట్లుంది పసునూరి వాదన!

ఒక దఫాలో ఒక ఎంపీ సీటు, ఒక వీసీ పదవి రాకపోతేనే సామాజిక న్యాయం సమాధి అవుతున్నదని నిందలేస్తున్న మీరు తెలంగాణలో సర్పంచులు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, ఎంపీపీలు, జడ్పీలు, మున్సిపల్ చైర్మన్లు తదితర పదవులను మీ జనాభా శాతం కంటే ఎక్కువే పొందారు. దళితబంధు మూడెకరాల భూమి, ఎస్సీ కార్పొరేషన్ రుణాలు కూడా తమ జనాభా శాతం కంటే ఎక్కువే పొందుతున్నారు. ఒక్క సూర్యాపేట జిల్లాలో 45మందిలో 44మంది మాదిగలకు, కేవలం ఒకే ఒక్క మాల ఉపకులం వ్యక్తికి మాత్రమే మూడెకరాల భూమి లభించింది. 2014 నుండి 2024 వరకు సంక్షేమ పథకాల లబ్ధిదారుల లెక్కలకై ప్రభుత్వాన్ని శ్వేతపత్రం డిమాండ్ చేస్తే ఇలాంటివెన్నో నమ్మలేని నిజాలు బయటపడతాయి. అశాస్త్రీయంగా మాకు అన్యాయం జరుగుతున్నదని గగ్గోలు చేస్తూ, ఉద్యమాలు చేస్తామని బెదిరిస్తూ, దగా పడ్డామనే ముసుగులో చాప కింద నీరులా రాజకీయ, ఆర్థిక, విద్యా, ఉద్యోగ రంగాల్లో విస్తరిస్తున్న మాదిగ వర్గం వాదనలు ఇంకెంతో కాలం నిలబడలేవు. ఇలాంటి పసలేని వాదనలు చేసి పసునూరి పలుచన కారాదు.

• మామిడి నారాయణ





తనిఖీ చేస్తున్న తెలంగాణ వైద్య మండలి సభ్యులు

పప్పన్నం.. మహా ప్రసాదం



భారీగా పెరిగిన పప్పుల ధరలు

- రిటైల్ మార్కెట్‌లో కందిపప్పు కిలో రూ.180
- శనగపప్పు కిలో రూ.90కి చేరిన వైనం
- అదే స్థాయిలో మినప్పప్పు, చింతపండు..
- పేదలపై నిత్యావసర వస్తువుల భారం

నిత్యావసరాల ధరలు కొండెక్కి కూర్చుంటున్నాయి. నిన్న, మొన్నటి వరకు కూరగాయల రేట్లతో పరేషాన్ అయిన పేద, మధ్య తరగతి ప్రజలు ప్రస్తుతం అమాంతంగా పెరిగిన పప్పుల ధరలతో హడలి పోతున్నారు. కంది, పెసర, శనగ, మినప్పప్పు లాంటివి కిలోకు రూ.30 నుంచి 40 వరకు పెరగడంతో సామాన్యులు ఇబ్బందులు పడుతున్నారు.



హైదరాబాద్ సిటీ, మే 23 (ఆంధ్రజ్యోతి): పప్పుల ధరలు భారీగా పెరిగాయి. సాధారణంగా మార్కెట్‌లో వంట నూనెలు, కూరగాయలు, కాస్మోటిక్స్ ధరలు తరచూ పెరుగుతూ.. తగ్గుతూ ఉంటాయి. ఈసారి విచిత్రంగా వంటనూనెల కంటే పప్పుల రేట్లు గరిష్టస్థాయికి పెరగడం ఆందోళనకరంగా మారింది. మార్చి నెలలోని రేట్లతో పోల్చితే ప్రస్తుతం వివిధ రకాల పప్పుల ధర రూ.30కి పైగా పెరిగింది. వాస్తవంగా ప్రతి కుటుంబంలో కూరగాయలతో సమానంగా పప్పులను వినియోగిస్తుంటారు. పెరిగిన ధరలతో పప్పు కూరలను తగ్గించి కూరగాయలపై దృష్టి సారిస్తున్నారు. పప్పు కూరలు కావాలని పిల్లలు మారాం చేస్తున్నప్పటికీ.. సర్దిచెబుతూ కూరగాయలతో భోజనం అందిస్తున్నారు.

ధరల పెరుగుదల ఎందుకు?

కందిపప్పు నగరంతోపాటు ఇతర ప్రాంతాలకు ఆస్ట్రేలియా నుంచి ఎక్కువగా దిగుమతి అవుతుందని వ్యాపారులు చెబుతున్నారు. లోకల్ పప్పులతో పోల్చితే విదేశీ సరుకు రేట్లు తక్కువగా ఉండడంతో 2 నుంచి 3 శాతం లాభం చూసుకుని అమ్మకాలు చేపడుతుంటామని పేర్కొంటున్నారు. రెండు నెలలుగా ఆస్ట్రేలియా నుంచి కంది పప్పు దిగుమతి బాగా తగ్గడంతో మహారాష్ట్ర, లాతూరు నుంచి వచ్చే పప్పులకు డిమాండ్ పెరిగింది. ఈ క్రమంలో హోల్‌సేల్ వ్యాపారులు కిలోకు రూ.10 చొప్పున పెంచి అమ్ముతుండగా, రిటైల్ మార్కెట్‌లో కిలోకు రూ.20-30 వరకు అదనంగా పెంచి దండుకుంటున్నారు. నగర శివారు, గ్రామీణ ప్రాంతాల్లోనైతే అదనంగా రూ.40 వరకు పెంచి అమ్ముతున్నారు. కాగా, కందిపప్పుతో పాటు మినపపప్పు, శనగపప్పు, చింతపండు ధరలు పెరగడంతో ప్రజలు పరేషాన్ అవుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించి ధరల నియంత్రణపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

నగరంలో పప్పుల ధరలు ఇలా.. (కిలో-రూపాయల్లో)

రకం	(మార్చి)	(మే)
హోల్‌సేల్- రిటైల్		
కందిపప్పు	135-150	170-180
పెసరపప్పు	105-120	108-130
మినపపప్పు	125-140	130-150
శనగపప్పు	65-75	80-90
చింతపండు	110-130	125-150
వంటనూనె (బ్రాండెడ్)	108-110	106-108

ధరలు భారంగా మారాయి



కిరాణ సామాను ధరలు భారంగా మారాయి. రేట్లు పెరగడంతో కూలీ, నాలీ చేసుకునే మాలాంటి కుటుంబాలు తట్టుకోలేక పోతున్నాయి. ఉప్పు నుంచి పప్పు వరకు అన్నీ పెరుగుతున్నాయి. కంది పప్పును కొనే పరిస్థితి కనిపించడం లేదు.

- భాగ్యరేఖ, గృహిణి, బోయినపల్లి

తక్కువ కొనుగోలు చేస్తున్నారు

రెండు నెలలుగా పప్పుల రేట్లు గరిష్ఠంగా పెరిగాయి. కిలోకు రూ.20 నుంచి 30 వరకు పెరిగింది. దీంతో గతంలో నెలకు 5 కిలోల వరకు తీసుకునే కందిపప్పును కొంతమంది రెండు కిలోలే తీసుకుంటున్నారు. ధరలు ఎప్పుడు అందుబాటులోకి వస్తాయో చెప్పలేం.



- జగన్‌మోహన్, హోల్‌సేల్ వ్యాపారి, మలక్‌పేట్

50 మంది నకిలీ వైద్యులు

- తనిఖీల్లో గుర్తించిన అధికారులు

హైదరాబాద్ సిటీ, మే 23 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ వైద్య మండలి సభ్యులు ఐడీపీఎల్, చింతల్, షాపూర్‌నగర్ ప్రాంతాల్లో నిర్వహించిన తనిఖీల్లో 50 మంది నకిలీ వైద్యులను గుర్తించారు. ఎనిమిది మంది సభ్యులు వేర్వేరు బృందాలుగా ఒకేసారి తనిఖీలు జరిపారు. నకిలీ వైద్యులు తమ ఆరోగ్య కేంద్రాల్లో రోగులను చేర్చుకుని పెద్ద సంఖ్యలో యాంటీబయాటిక్స్ ఇస్తున్నట్లు గుర్తించారు. తాము వైద్యులుగా పేర్కొంటూ బోర్డు పెట్టుకోవడమే కాక, వారికి అనుసంధానంగా మెడికల్ షాపులు, డయాగ్నొస్టిక్ సెంటర్లు కూడా పెట్టుకున్నారని అధికారులు తెలిపారు. దాదాపు యాభై మంది నకిలీ వైద్యులపై ఎఫ్ఐఆర్‌లు నమోదు కాగా, ఇద్దరిని జైలుకు పంపినట్లు వెల్లడించారు. తనిఖీల్లో డాక్టర్ ప్రతిభాలక్ష్మి, డాక్టర్ కిరణ్ కుమార్, డాక్టర్ సన్నీ డేవిస్, డాక్టర్ ఇమ్రాన్ అలీ, డాక్టర్ కే. విష్ణు, పాండు తదితరులు పాల్గొన్నారు.

వరదనీటిలో మహిళ నిరసన

రోడ్డును బాగు చేయాలని డిమాండ్ ● అధికారుల హామీతో విరమణ

వనస్థలిపురం, మే 23(ఆంధ్రజ్యోతి): నాగోల్ డివిజన్ ఆనంద్‌నగర్ చౌరస్తాలోని రోడ్డుపై వర్షం పడిన ప్రతిసారీ నీరు నిలవడంతో రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నామని ఆవేదనలో కుంట్లూర్‌కు చెందిన నిహారిక వరద నీటిలో బైఠాయించారు. ఈ సందర్భంగా తన ఆవేదనను ఇలా వెలిబుచ్చారు. 'నాగోల్‌లోని ఓ పాఠశాలలో ఇద్దరు పిల్లలు విద్యను అభ్యసిస్తున్నారు. బైక్‌పై పిల్లలను తీసుకుని స్కూల్‌కు ఆనంద్‌నగర్ చౌరస్తా నుంచి కుంట్లూర్ వెళ్లే ప్రధాన రహదారిపై రాకపోకలు కొనసాగిస్తాం. రోడ్డు గుంతలమయం కావడంతో తాము

మిగతా 6వ పేజీలో..



వర్షపునీటిలో కూర్చుని నిరసన తెలుపుతున్న నిహారిక

ఘనంగా బుద్ధజయంతి వేడుకలు

- సాగర్ మధ్యలో గౌతముడి వద్ద ప్రార్థనలు




సాగర్ మధ్యలో బుద్ధుడి విగ్రహం వద్ద బౌద్ధ భిక్షువులతో శైలజా రామయ్యర్, నిఖిల

ఖైరతాబాద్, మే 23 (ఆంధ్రజ్యోతి):సర్వమానవాళికి శాంతి సందేశాన్ని అందించిన అహింసావాది గౌతమ బుద్ధుడి 2,568వ జయంతి వేడుకలు వైభవంగా జరిగాయి. తెలంగాణ పర్యాటక శాఖ ఆధ్వర్యంలో నాంపల్లి స్టేట్ మ్యూజియంలో బుద్ధ భగవానుడి పవిత్ర అవశేషాలను ప్రదర్శనకు ఉంచారు. హుస్సేన్‌సాగర్ మధ్యనున్న బుద్ధుడి విగ్రహం వద్ద ప్రముఖ బౌద్ధ భిక్షువులతో కలిసి పర్యాటక శాఖ అధికారులు, బుద్ధ ప్రేమికులు ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం స్కైలాంతర్లను ఎగురవేశారు. కార్యక్రమంలో పర్యాటక శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యార్, సంచాలకులు కె.నిఖిల, మేనేజింగ్ డైరెక్టర్ రమేష్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.



లుంబినీపార్క్‌కు గురువారం సందర్శకులు పోటెత్తారు. బోటింగ్ చేసేందుకు ఎగబడ్డారు. కిక్కిరిసిన క్యూను చిత్రంలో చూడొచ్చు.

'స్మార్ట్'గా పనిచేస్తలేవ్!



- మొరాయిస్తున్న మీటర్లు
- అడ్డగోలుగా నీటి బిల్లుల జారీ

నగరంలోని తాగునీటి నల్లాలకు మెకానికల్ మీటర్ స్థానంలో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన ఆటోమేటిక్ మీటర్ రీడర్ (ఏఎంఆర్) స్మార్ట్ మీటర్లు మొరాయిస్తున్నాయి. అడ్డగోలుగా నీటి బిల్లులు జారీ అవుతున్నాయి. మరమ్మతులు చేయాల్సిన ఎంప్యానల్ ఏజెన్సీలు చేతులెత్తేస్తున్నాయి.

హైదరాబాద్ సిటీ, మే23 (ఆంధ్రజ్యోతి): ఏఎంఆర్ మీటర్లు సరిగ్గా పనిచేయకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. వాటర్‌బోర్డు కొన్నేళ్ల క్రితమే ఈ మీటర్లను ప్రవేశ పెట్టింది. మీటర్ రీడింగ్ ఆధారంగానే నీటి బిల్లులను వసూలు చేస్తున్నారు. గ్రేటర్ ఎన్నికల సందర్భంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన గృహ కనెక్షన్లకు నెలకు 20వేల లీటర్ల ఉచిత తాగునీటి పథకం నేపథ్యంలో జీహెచ్ఎంసీ పరిధిలోని మురికివాడల్లో మినహా ప్రతీ గృహ కనెక్షన్‌కు నీటి మీటర్ తప్పనిసరి చేశారు. పథకం అందుబాటులోకి వచ్చిన తర్వాత జీహెచ్ఎంసీ పరిధిలో సుమారు 3లక్షల గృహ కనెక్షన్లు సరికొత్తగా నీటి మీటర్లను ఏర్పాటు చేసుకున్నాయి.

నాణ్యతలేని మీటర్లు

వాటర్‌బోర్డు పరిధిలోని నీటి కనెక్షన్లకు మీటర్లను అందజేయడానికి మూడేళ్ల క్రితం పలు ఏజెన్సీలతో ఎంప్యానల్ చేశారు. ఇందులో సుమారు 18 కంపెనీల వరకు ఉన్నాయి. ఇందులో కొన్ని కంపెనీలు నాణ్యతాలోపం గల ఏఎంఆర్ మీటర్లను నల్లాలకు బిగించేస్తున్నాయి. అవి తరచూ మొరాయిస్తున్నాయి. మీటర్లకు గ్యారంటీ, వారంటీలు ఇచ్చినా, పాడైన సందర్భంలో వర్తించవని నిర్వాహకులు దాటవేస్తున్నారు. మీటర్‌పై కొన్ని నీళ్ల పడినా డిజిటల్ స్క్రీన్ పాడవుతోంది. కొన్ని మీటర్లు నీళ్ల రాకపోయినా తిరుగుతున్నాయి. నీళ్ల వచ్చే ముందు గాలికి కూడా తిరుగుతుండడంతో రీడింగ్ నమోదవుతోంది. ఈ విషయాన్ని మీటర్ రీడర్ల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదు. మీటరు పనిచేయకపోతే గత నెల ఆధారంగా నీటి బిల్లును జారీ చేయాల్సి ఉండగా, అందుకు భిన్నంగా అదనంగా చార్జీలు విధిస్తున్నారు.

కొత్త మీటర్ పెట్టాల్సిందే

ఏఎంఆర్ మీటర్లు పాడైతే ఎంప్యానల్ ఏజెన్సీల సిబ్బంది స్పందించడం లేదు. మరమ్మతులు చేయకుండా కొత్తవి బిగించుకోవాలని ఒత్తిడి చేస్తున్నారు. సంబంధిత అధికారులకు పెద్దఎత్తున కమీషన్లు చెల్లించిన సంస్థలు వినియోగదారులకు నాణ్యతలోపం గల మీటర్లను అందించి అడ్డగోలు చార్జీలు విధిస్తున్నాయి. మీటర్ మార్పు చేసినప్పుడు 15 ఎంఎం నల్లా కనెక్షన్ నీటి మీటర్‌కు రూ.1298కి బదులుగా అదనంగా వివిధ రకాల చార్జీల పేరుతో రెండు వేల వరకు వసూలు చేస్తున్నారు. ఇక 20ఎంఎం నల్లా కనెక్షన్ నీటి మీటర్‌కు రూ.1947కాగా, అదనంగా మరిన్ని చార్జీలతో రూ.3వేలకు పైగా దోపిడీ చేస్తున్నారు. ఇక 20ఎంఎం సైజు కంటే ఎక్కువ కలిగిన నల్లా కనెక్షన్ల మీటర్లకు అడ్డగోలుగా చార్జీలు విధిస్తున్నారు. దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందుతున్నా ఏజెన్సీలపై చర్యలు తీసుకోకపోవడం గమనార్హం.

తుదిదశకు చర్లపల్లి టెర్మినల్ పనులు
వచ్చేనెలలో ప్రారంభించే చాన్స్
8

27 వారాలకే ప్రసవం.. శిశువు బరువు 560 గ్రాములే!

52 రోజుల చికిత్సతో చిన్నారిని సాధారణస్థితికి తెచ్చిన నిలోఫర్ వైద్యులు


హైదరాబాద్ సిటీ, మే 23 (ఆంధ్రజ్యోతి): పేగు బంధం తెంచుకుని 27 వారాలకే తక్కువ బరువుతో పుట్టిన ఓ నవజాత శిశువుకు నిలోఫర్ వైద్యులు 52 రోజుల పాటు

మిగతా 6వ పేజీలో..

లెక్చరర్లు కావలెను!

ప్రభుత్వ కాలేజీల్లో అధ్యాపకుల కొరత

- ఇంగ్లీష్, ఎకనామిక్స్, ఫిజిక్స్ బోధించే వారు లేక ఇబ్బందులు
- తగ్గుతున్న ఉత్తీర్ణత శాతం



నగరంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల నిర్వహణ అధ్వానంగా మారింది. తగినంత మంది అధ్యాపకులు లేక, సకాలంలో సిలబస్ పూర్తికాక వార్షిక పరీక్షల సమయంలో విద్యార్థులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. సుదూర ప్రాంతాల నుంచి కాలేజీలకు వస్తున్నప్పటికీ బోధనలు అందించే అధ్యాపకులు లేకపోవడంతో వారు అసంతృప్తికి లోనవుతున్నారు.

హైదరాబాద్ సిటీ, మే 23 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కళాశాలల్లో సబ్జెక్టు లెక్చరర్లు లేకపోవడంతో బోధన కుంటుపడుతున్నది. గ్రేటర్ పరిధిలోని హైదరాబాద్‌జిల్లాలో 22, రంగారెడ్డిజిల్లాలో 218, మేడ్చల్‌జిల్లాలో ఐదు ప్రభుత్వ జూనియర్, ఒకేషనల్ కాలేజీలు నడుస్తున్నాయి. ప్రైవేట్ కళాశాలల్లో ఫీజుల భారాన్ని మోసే ఆర్థిక స్థోమత లేని తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ కాలేజీలకు పంపిస్తున్నారు. అక్కడ నాణ్యమైన విద్య లభించని పరిస్థితి నెలకొంటున్నది. ఈ క్రమంలో కొందరు మధ్యలోనే కాలేజీలు మారుతుండగా.. మరికొందరు చదువుకే దూరమవుతున్నారు.

సబ్జెక్టు లెక్చరర్ల కొరత

సబ్జెక్టు లెక్చరర్ల కొరత, విద్యా సంవత్సరం ప్రారంభమైన మూడు, నాలుగు నెలల వరకు కూడా పాఠ్యపుస్తకాలు అందకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. పలు కాలేజీల్లో ఫస్ట్ లాంగ్వేజ్ ఇంగ్లిష్‌తో పాటు ఎకనావిక్స్, కామర్స్, ఫిజిక్స్, బోటనీ పాఠాలను బోధించే వారు లేరు. ఒకేషనల్ కోర్సుల విభాగాల్లో పరిస్థితి మరీ దారుణంగా మారింది. విద్యార్థులకు ఏటా 40 శాతం క్లాసులు కూడా జరగడం లేదు.

జిల్లాలో ఇంటర్ ఫలితాలు ఇలా..

		హాజరైనవారు	పాసైనవారు	శాతం
ఫస్టియర్	2021-22	77,369	47,485	61.37
ఫస్టియర్	2022-23	77,432	45,958	59.35
ఫస్టియర్	2023-24	76,581	46047	60.13
సెకండియర్	2021-22	65,868	42,170	64.02
సెకండియర్	2022-23	72,343	43,594	60.26
సెకండియర్	2023-24	73,133	48,135	65.82

గెస్ట్ లెక్చరర్ల నియామకంలో జాప్యం

అధ్యాపకుల పోస్టులను రాష్ట్ర ప్రభుత్వం భర్తీ చేయకపోవడంతో కాంట్రాక్టు, గెస్ట్ లెక్చరర్లను నియమించి విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్నారు. ఏటా విద్యా సంవత్సరం ప్రారంభమైన రెండు నెలల్లోపు ఖాళీలు ఉన్న చోట గెస్ట్ లెక్చరర్లను తీసుకుని బోధన ప్రక్రియను ప్రారంభించాల్సి ఉంటుంది. రెండేళ్లుగా విద్యా సంవత్సరం ప్రారంభమైన తర్వాత అక్టోబర్ మొదటివారం వరకు కూడా నియామకాలు జరగకపోవడంతో బోధనలు అంతంతమాత్రంగానే సాగుతున్నాయి. ఏటా మార్చి మొదటి వారంలో వార్షిక పరీక్షలు నిర్వహించేందుకు ఇంటర్‌బోర్డు అధికారులు చర్యలు చేపడుతున్నప్పటికీ.. అప్పటివరకు 70 శాతం సిలబస్ కూడా పూర్తి కావడం లేదు. ఫలితంగా చాలామంది ఆయా సబ్జెక్టుల్లో ఫెయిలవుతున్నారు. గెస్ట్ లెక్చరర్లను సకాలంలో నియమిస్తేనే విద్యార్థులకు ప్రయోజనం చేకూరుతుందని తల్లిదండ్రులు చెబుతున్నారు. ప్రధానంగా నూతన విద్యాసంవత్సరం ప్రారంభమయ్యేలోపు ఇంగ్లిష్, గణితం, బోటనీ, ఫిజిక్స్ లాంటి సబ్జెక్టులకు సంబంధించిన ఖాళీలను గెస్ట్ లెక్చరర్ల ద్వారా పూరించి విద్యార్థులకు మెరుగైన బోధనలు అందించాలని వారు కోరుతున్నారు.

ఐదేళ్లలో అమెరికాతో 500 బిలియన్ డాలర్ల వాణిజ్యం

- యూఎస్ కాన్సుల్ జనరల్ జెన్నిఫర్ లార్సన్
- హిమాయత్‌నగర్‌లో ఎఫ్ఎల్ఓ సదస్సు



ఎఫ్ఎల్ఓ సదస్సులో పాల్గొన్న యూఎస్ కాన్సుల్ జనరల్ జెన్నిఫర్ లారెన్స్, బ్రిటిష్ డిప్యూటీ హై కమిషనర్ గారెన్ ఓవెన్ తదితరులు

హైదరాబాద్ సిటీ, మే 23 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో ప్రస్తుతం 200కు పైగా అమెరికన్ కంపెనీలు ఉన్నాయని, రానున్న ఐదేళ్లలో రెండు దేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం 500 బిలియన్ అమెరికన్ డాలర్లకు చేరవచ్చని యూఎస్ కాన్సుల్ జనరల్ జెన్నిఫర్ లార్సన్ అన్నారు. ఫిక్కీ లేడీస్ ఆర్గనైజేషన్ (ఎఫ్ఎల్ఓ) ఆధ్వర్యంలో హిమాయత్‌నగర్ పార్క్ హోటల్‌లో గురువారం ఏర్పాటు చేసిన "గ్లోబల్ అలయెన్స్- స్ట్రెంథెనింగ్ ఎకనామిక్ బ్రిడ్జెస్" పేరుతో ఏర్పాటు చేసిన సదస్సులో జెన్నిఫర్ లార్సన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇరు దేశాల మధ్య మంచి స్నేహపూర్వక వాతావరణం ఉందని, అమెరికాలో ఏటా భారతీయ విద్యార్థుల సంఖ్య పెరుగుతోందన్నారు. వారిలో 40 శాతం మంది తెలుగు రాష్ట్రాలకు చెందిన వారేనని తెలిపారు. బ్రిటిష్ డిప్యూటీ హై కమిషనర్ గారెన్ ఓవెన్ మాట్లాడుతూ దేశాల మధ్య విద్య, సాంస్కృతిక మార్పిడి ద్వారా వాణిజ్య సంబంధాలు మెరుగవుతాయని, యూకేలో దాదాపు 1.30 లక్షల భారతీయ విద్యార్థులు చదువుకుంటున్నారని తెలిపారు. ఎఫ్ఎల్ఓ చైర్‌పర్సన్ ప్రియాగజ్దర్ మాట్లాడుతూ ఇరు దేశాల మధ్య వాణిజ్యం గతం కంటే సరళంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో దాదాపు 150 మంది ఎఫ్ఎల్ఓ సభ్యులు హాజరై తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు.



భూమేష్ కుమార్‌కు గిన్నిస్ వరల్డ్ రికార్డు సర్టిఫికెట్‌ను అందజేస్తున్న ఆ సంస్థ నిర్వాహకులు

గిన్నిస్ వరల్డ్ రికార్డు సాధించిన ఐఏడీవీఎల్

అడ్డగుట్ట, మే 23 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ డెర్మటాలజిస్ట్స్, వెనిరాలజిస్ట్స్ అండ్ లెప్రాలజిస్ట్స్ (ఐఏడీవీఎల్) ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా చర్మవ్యాధులపై అవగాహన కల్పించి, ఇప్పటి వరకు 9,405మంది వైద్యులతో ప్రతిజ్ఞ చేయించామని ఆ సంస్థ జాతీయ కార్యదర్శి డాక్టర్ కటకం భూమేష్‌కుమార్ తెలిపారు. దేశ వైద్య చరిత్రలో చర్మవ్యాధిపై తమ సంస్థ ఆధ్వర్యంలో చేపట్టిన అవగాహనా కార్యక్రమాలను గుర్తించిన గిన్నిస్ వరల్డ్ రికార్డు సంస్థ ప్రతినిధి రిషినాథ్ బుధవారం ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో వరల్డ్ రికార్డు సర్టిఫికెట్‌ను తనకు అందజేశారని ఆయన తెలిపారు. గురువారం గాంధీ ఆస్పత్రిలో నిర్వహించిన కార్యక్రమానికి భూమేష్‌కుమార్ హాజరై మాట్లాడారు. గల్లీ నుంచి ఢిల్లీ వరకు చర్మవ్యాధులపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ర్యాలీలు, అవగాహన సదస్సులు, ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించామని తెలిపారు. చర్మవ్యాధులతో బాధపడుతున్న వారు మెడికల్‌షాపులకు వెళ్లి మందులు తీసుకోకుండా ముందుగా వైద్యుల్ని సంప్రదించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఐఏడీఈఎల్ అధ్యక్షుడు డాక్టర్ మంజునాథ్ షేనయ్, ప్రతినిధులు రాజీవ్‌శర్మ, విజయ్‌జవార్, కవిత, వికాస్‌శంకర్ పాల్గొన్నారు.



నవజాత శిశువు, తల్లితో నిలోఫర్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఉషారాణి తోట, వైద్యులు

27 వారాలకే ప్రసవం..
శిశువు బరువు 560 గ్రాములే!

(5వ పేజీ తరువాయి)

చికిత్స అందించి తల్లికి ఆరోగ్యంగా అందించారు. ఆదిలాబాద్ జిల్లాకు చెందిన ముస్కాన్‌కు 27 వారాలకే ప్రసవం అయింది. పుట్టిన సమయంలో శిశువు బరువు కేవలం 560 గ్రాములు మాత్రమే ఉండడంతో మూడు గంటల తర్వాత శ్వాసకోశ సమస్య ఉత్పన్నమైంది. దీంతో శిశువును నిలోఫర్ ఆస్పత్రికి తీసుకువచ్చారు. ఆ చిన్నారికి రెస్పిరేటరీ డిసెస్ సిండ్రోమ్ (ఆర్‌డీఎస్) ఉన్నట్లు గుర్తించిన వైద్యులు చికిత్స అందించడంతో పాటు శ్వాస మెరుగుదల కోసం సీపాప్ అమర్చారు. అనంతరం చిన్నారి తగినంత బరువు పెరగడం కోసం తల్లి ఒడిలో చేర్చి కంగారో మదర్ కేర్ సేవలు పొందే విధంగా జాగ్రత్తలు తీసుకున్నారు. మరోవైపు చిన్నారికి అన్ని పోషక పదార్థాలు అందించారు. ప్రీ మెచ్యూరిటీ రక్త హీనతకు ఎర్రరక్తకణాల మార్పిడీ చేశారు. ప్రీ మెచ్యూరిటీ రెటినోపతి ప్లస్ వ్యాధి దృష్ట్యా యాంటీ వీఈజీఎఫ్ ఇంట్రావిట్రియల్ ఇంజక్షన్ ఇచ్చారు. దాదాపు 52 రోజుల పాటు చికిత్సలు అందించగా శిశువు బరువు 1.460 కిలోలకు పెరిగి ఆరోగ్యంగా ఉండటంతో గురువారం చిన్నారిని డిశ్చార్జి చేసినట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ ఉషారాణి తోట తెలిపారు. శిశువుకు చికిత్స అందించిన ఆస్పత్రి వైద్యులను ఆమె అభినందించారు.

వరదనీటిలో మహిళ నిరసన

(5వ పేజీ తరువాయి)

ఇప్పటికే రెండు, మూడుసార్లు కిందపడి గాయాలపాలయ్యాం. బుధవారం అర్ధరాత్రి కురిసిన భారీ వర్షానికి ఇదే రోడ్డుపై వరదనీరు చేరడంతో విసుగెత్తి నిరసన తెలుపుతున్నా' అని వివరించారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు రోడ్డును బాగుచేయాలని డిమాండ్ చేశారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని నిహారికకు సర్దిచెప్పి దీక్ష విరమించేందుకు యత్నించగా ఆమె ససేమిరా అన్నారు. రోడ్డు బాగుచేస్తామని జీహెచ్ఎంసీ అధికారులు స్పష్టమైన హామీ ఇవ్వడంతో దీక్ష విరమించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉండడంతో రోడ్డు అభివృద్ధి పనులు చేపట్టలేకపోయామని, కోడ్ ముగిసిన వెంటనే ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా శాశ్వత పరిష్కారం చేపడుతామని డిప్యూటీ కమిషనర్ తిప్పర్తి యాదయ్య వెల్లడించారు.

ఇరాన్ అధ్యక్షుడు ఇబ్రహీం రైసీ మృతిపై అంతర్జాతీయ న్యాయస్థానంలో విచారణ జరిపించాలి

● ఐక్యరాజ్య సమితికి కవి అబ్బాసీ మెయిల్ ద్వారా ఫిర్యాదు

చార్మినార్ మే 23 (ఆంధ్రజ్యోతి): ఇరాన్ దేశ అధ్యక్షుడు ఇబ్రహీం రైసీ, ఆ దేశ విదేశాంగశాఖ మంత్రి మృతిపై అంతర్జాతీయ న్యాయస్థానంలో సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని ప్రముఖ న్యాయవాది, ఏఐఎం ఐఎం ఇంక్విలాబ్ పార్టీ ప్రధాన కార్యదర్శి మహ్మద్ అబ్దుల్ కవి అబ్బాసీ డిమాండ్ చేశారు. ఈమేరకు గురువారం ఐక్యరాజ్యసమితికి మెయిల్ ద్వారా ఫిర్యాదు చేశారు. ఇటీవల ఇజ్రాయెల్‌పై ఇరాన్ దాడి చేసిన నేపథ్యంలో ప్రతీకార చర్యగా ఇజ్రాయెల్ ఈ ఘాతుకానికి పాల్పడి ఉండవచ్చని ఆయన అనుమానం వ్యక్తం చేశారు. ఐక్యరాజ్య సమితిలోని అగ్రదేశాలు చొరవ తీసుకుని విచారణ చేసి దోషులను గుర్తించి బాధ్యులను గుర్తించి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన లేఖలో కోరారు.



రోడ్డుపై నిలిచిన మురుగు నీటిని చూపుతున్న స్థానికులు

చిన్న వర్షానికే పొంగిపొర్లుతున్న డ్రైనేజీలు

పహాడిషరీఫ్ మే 23 (ఆంధ్రజ్యోతి): చిన్నపాటి వర్షానికే డ్రైనేజీలు పొంగిపొర్లి మురుగు నీరు రోడ్లపై ప్రవహిస్తుంది. ఇటీవల కురిసిన వర్షాలకు జలపల్లి మున్సిపాలిటీ పరిధి, శ్రీరామ్ కాలనీలోని బృందావన్, కాలనీ, ప్రభుత్వ పాఠశాల పరిసరాలలో డ్రైనేజీ నీరు రోడ్ల పారుతుంది. అయినా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడంలేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. శ్రీరామ్‌కాలనీ, బృందావన్‌కాలనీ, ప్రభుత్వ పాఠశాల పరిసరాలలో మురుగు నీరు రోడ్లపై నిలిచిందని అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. రోడ్లపై నిలిచిన మురుగునీటిలో పందులు సంచరిస్తుండడంతో దోమలు, ఈగలు వృద్ధి చెందుతున్నాయని ఆందోళన చెందుతున్నారు. అనారోగ్యాల భారినపడకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు షేర్‌సింగ్, యోగి, విజయ్, వికాస్, మహదేవ్, గోపాల్ కోరుతున్నారు.



జలమండలి జీఎంకు సమస్యను వివరిస్తున్న కార్పొరేటర్ భాగ్యలక్ష్మి

మురుగునీరు, డ్రైనేజీ సమస్యను పరిష్కరించండి

చాంద్రాయణగుట్ట, మే 23 (ఆంధ్రజ్యోతి): బస్తీల్లో డ్రైనేజీ మురుగునీటి సమస్యను పరిష్కరించాలని గౌలిపురా కార్పొరేటర్ ఆలే భాగ్యలక్ష్మి జలమండలి అధికారులను కోరారు. గురువారం కంచన్‌బాగ్‌లోని జలమండలి కార్యాలయంలో జనరల్ మేనేజర్ సుబ్బారాయుడును కలిసి సమస్యను వివరించారు. డివిజన్‌లోని మేకలమండి, సర్దార్ పటేల్‌నగర్, అంబికానగర్, హరిజనబస్తీ, గౌలిపురా నుంచి ఛత్రినాక మెయిన్‌రోడ్డు, హనుమాన్‌నగర్ తదితర బస్తీలలో డ్రైనేజీ మురుగునీరు రోడ్డుపై నిలిచి స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రజలకు ఇబ్బందులు కలగకుండా వెంటనే సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్పొరేటర్ వెంట బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర మాజీ అధ్యక్షుడు ఆలే భాస్కర్, సీనియర్ నాయకులు కొడి సురేందర్, ఈ.సుమన్ కుమార్, జి.రఘుకాంత్, ఎ.మహేందర్, గిరి, మల్లేష్, ఎ.శ్రీనివాస్, రవి, సత్తప్ప, సంగ్రామ్, వికాస్, సాకేత్, డి.రాజు, కె.వెంకటేశ్ తదితరులు ఉన్నారు.



దివంగత శంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న పలువురు ప్రముఖులు

శంకర్ మృతి పాతబస్తీకి తీరని లోటు

చాంద్రాయణగుట్ట, మే 23 (ఆంధ్రజ్యోతి): గౌలిపురా మాజీ కార్పొరేటర్ శంకర్ మృతి పాతబస్తీకి తీరనిలోటు అని పలువురు ప్రముఖులు అన్నారు. బుధవారం రాత్రి గౌలిపురా శ్రీమహంకాళి మాతేశ్వరి భారతమాత దేవాలయం, కోట మైసమ్మ దేవాలయం కమిటీ అధ్యక్షుడు ఎర్మని కైలాష్ గంగపుత్ర ఆధ్వర్యంలో ఆరె కటిక సంఘంలో శంకర్ సంతాపసభ జరిగింది. ఈ సందర్భంగా దివంగత శంకర్ చిత్రపటానికి వారు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గౌలిపురా కార్పొరేటర్ ఆలే భాగ్యలక్ష్మి, ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ అధ్యక్షుడు ఆలే భాస్కర్‌రాజ్, ప్రతినిధులు ఎస్.మల్లేశంగౌడ్, జ్ఞానేశ్వర్‌గౌడ్, జె.మధుసూదన్ గౌడ్, కెఎస్ ఆనంద్‌రావు, ఆదర్ల మహేశ్, రూప్‌రాజ్, ఆలే జితేంద్ర, మావిడి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో చేవెళ్లను నంబర్‌వన్‌గా నిలబెడతాం

● కాంగ్రెస్ గెలవాలని మాణిక్‌రావు రుద్రాభిషేకం

అఫ్జల్‌గంజ్, మే 23 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో కాంగ్రెస్ అత్యధిక ఎంపీ స్థానాలు గెలవడంతోపాటు చేవెళ్లలో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి భారీ మెజార్టీతో గెలుపొందాలని హైదరాబాద్ వ్యవసాయశాఖ మార్కెటింగ్ కమిటీ మాజీ డైరెక్టర్ పి.మాణిక్‌రావు ఆకాంక్షించారు. గురువారం వైద్యనాథ్ ఆలయంలో ఆయన మహా శివుడికి రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం మాణిక్‌రావు మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటిని అమలు చేస్తున్నారన్నారు. చేవెళ్లలో కాంగ్రెస్ అభ్యర్థి రంజిత్‌రెడ్డి గెలవగానే ఆ పార్లమెంట్ పరిధిలోని అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేసి తెలంగాణ రాష్ట్రంలో నంబర్ వన్ పార్లమెంటుగా నిలబెడతామన్నారు.



శివుడికి రుద్రాభిషేకం చేస్తున్న మాణిక్‌రావు

స్విమ్మింగ్‌లో సత్తాచాటిన పుల్లారెడ్డి

రాజేంద్రనగర్, మే 23 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్‌లో జరుగుతున్న స్విమ్మింగ్ పోటీలలో హైదర్‌గూడకు చెందిన గంగిడి పుల్లారెడ్డి(52) సత్తాచాటారు. 400 మీటర్ల మెడ్లీరిలే స్విమ్మింగ్ పోటీలో ప్రథమ స్థానంలో నిలిచారు. పాన్ ఇండియా మాస్టర్స్ గేమ్స్ ఫెడరేషన్(ఆర్) సహకారంతో మాస్టర్స్ గేమ్స్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో సికింద్రాబాద్‌లోని బీవీ గురుమూర్తి(జీహెచ్ఎంసీ) స్విమ్మింగ్ పూల్‌లో ఈ నెల 22 నుంచి 24 వరకు పోటీలు జరుగుతున్నాయి. ఫస్ట్ ఫెడరేషన్ కప్ నేషనల్ మాస్టర్స్ గేమ్స్-2024లో పాల్గొన్న పుల్లారెడ్డి పలు విభాగాలలో రాణించారు. బుధవారం జరిగిన 400 మీటర్ల మెడ్లీ రిలే స్విమ్మింగ్‌లో మొదటి స్థానంలో నిలిచిన పుల్లారెడ్డి, బ్రీస్ట్ స్ట్రోక్ 200 మీటర్లలో మొదటి స్థానం, బటర్‌ఫ్లై 100 మీటర్ల విభాగంలో మొదటిస్థానం, ఫ్రీస్టైల్ 200 మీటర్ల స్విమ్మింగ్‌లో ద్వితీయ స్థానంలో నిలిచారు. గురువారం జరిగిన 50 మీటర్ల ఫ్రీ స్టైల్ స్విమ్మింగ్ పోటీలలో ద్వితీయ స్థానంలో నిలిచారు. నిర్వాహకులు జగన్మోహన్‌రెడ్డి, డాక్టర్ మధుసూదన్ మెడల్స్ సర్టిఫికేట్లు పుల్లారెడ్డికి అందజేశారు. హైదర్‌గూడ, అత్తాపూర్‌కు చెందిన స్నేహితులు, క్రీడాభిమానులు, కుటుంబ సభ్యులు పుల్లారెడ్డిని అభినందించారు.



పుల్లారెడ్డికి మెడల్ సర్టిఫికేట్లు అందజేస్తున్న నిర్వాహకులు

చెరువులు, కుంటలు మాయం

● తాజాగా నర్సబాయికుంటలో 6 ఎకరాలు పూడ్చిన అక్రమార్కులు
● అనేక చెరువులు, బఫర్ జోన్‌లలో అక్రమ నిర్మాణాలు
● శిలాన్ చెరువు కబ్జాచేసి మెకానిక్ షెడ్‌లు



నర్సబాయికుంటను చదును చేసిన స్థానికులు

రాజేంద్రనగర్, మే 23 (ఆంధ్రజ్యోతి): రాజేంద్రనగర్ మండలం గొలుసు కట్టు చెరువులకు ప్రసిద్ధి. ఇక్కడి గొలుసుకట్టు చెరువుల ద్వారా వ్యవసాయం జోరుగా సాగేదని పూర్వీకులు చెబుతుంటారు. అయితే ఆ చెరువులు నేడు కనుమరుగవుతున్నాయి. వాటి గురించి ఎవరూ పట్టించుకోవడంలేదు. వివిధ శాఖల మధ్య కొరవడిన సమన్వయం, తమకెందుకులే అన్న భావన కారణంగా ఇప్పటికే చాలా చెరువులు అన్యాక్రాంతం అయిపోయాయి. ఉన్న చెరువులనైనా కాపాడుకోకపోతే భవిష్యత్తులో రాజేంద్రనగర్ మండలంలో నివసించే ప్రజలు నీటి కోసం ఇబ్బందులు పడే ప్రమాదం ఉంది. వరదలు వచ్చినప్పుడు లోతట్టు ప్రాంతాలలోని ఇళ్లు నీట మునిగే ప్రమాదం ఉంది.

మైలార్‌దేవుపల్లి డివిజన్ పరిధిలోని మార్కండేయనగర్, ఆదర్శ కాలనీని ఆనుకుని నర్సబాయి కుంట ఉంది. రెవెన్యూ రికార్డుల ప్రకారం 9 ఎకరాల విస్తీర్ణంలో చెరువు ఉంది. నర్సబాయి కుంటను ఆనుకుని మార్కండేయనగర్, సాయిబాబానగర్, ఆదర్శనగర్, బాబుల్‌రెడ్డినగర్ బస్తీలు ఉంటాయి. కాలక్రమేణా కబ్జాలు జరిగి 6 ఎకరాలు అన్యాక్రాంతం కాగా ప్రస్తుతం మూడెకరాలు మాత్రమే ఉంది. నర్సబాయి కుంట ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ పరిధిలో అక్రమ నిర్మాణాలను తొలగించాల్సిన అవసరం ఉంది. ఉన్న స్థలాన్ని కాపాడి అక్కడ పార్కును ఏర్పాటు చేస్తే ఆ ప్రాంత వాసులకు ఉపయోకరంగా ఉంటుంది.

చెరువు చుట్టురా ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలి

ఎగువ ప్రాంతాలైన బాబుల్‌రెడ్డినగర్, ప్రగతి కాలనీ, టాటానగర్ ప్రాంతాల నుంచి నర్సబాయి కుంటలోకి వరదనీరు వచ్చి చేరుతుంది. అక్కడి నుంచి రాందేవ్‌బాబా దేవాలయం పక్క నుంచి శివరాంపల్లిలోని ఊర చెరువుకు చేరుకుంటుంది. ఆ తర్వాత మీరాలం చెరువులోకి వెళుతుంది. నర్సబాయి కుంటను అభివృద్ధి చేసి చెరువుచుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేసి, అక్కడ వాకింగ్‌ట్రాక్ నిర్మించి పార్కుగా మార్చితే స్థానికులకు ఉపయోగకరంగా ఉంటుంది. పార్కులో పిల్లలు, వృద్ధులకు అవసరమైన సదుపాయాలు కల్పించితే ఉదయం, సాయంత్రం వేళలలో పిల్లలు ఆడుకోవడానికి, సీనియర్ సిటిజన్స్ సేద తీరడానికి వీలుగా ఉంటుంది.

రాజేంద్రనగర్‌లోని పలు చెరువుల దుస్థితి

రాజేంద్రనగర్ మండలంలో మైలార్‌దేవుపల్లి పల్లె చెరువుతో పాటు లక్ష్మీగూడ బుల్‌బుల్‌కుంట, ఎర్ర కుంట, శివరాంపల్లి శిలాన్ చెరువు, ఊరచెరువు, గగన్‌పహడ్ అప్పచెరువు, పెద్దచెరువు, మామిడి కుంట, ఉప్పర్‌పల్లి మల్కచెరువు ఇలా అనేక చెరువులు ఉండేవి. వాటిలో చాలా వరకు నేడు అన్యాక్రాంతమయ్యాయి. మైలార్‌దేవుపల్లి పల్లెచెరువు శిఖం పట్టా అంటూ చాలా వరకు చెరువులో నిర్మాణాలు వెలిశాయి. లక్ష్మీగూడ బుల్‌బుల్‌కుంట ఆనవాలు కోల్పోయింది. ఎర్రకుంట శిఖం కనిపించకుండా పోయింది. గగన్‌పహడ్ అప్పచెరువులో అనేక అక్రమణలు చోటుచేసుకున్నాయి. పెద్దచెరువు కుంచించుకు పోయింది. శివరాంపల్లి శిలాన్ చెరువు కబ్జాచేసి మెకానిక్ షెడ్‌లను ఏర్పాటు చేసి అద్దెకు ఇచ్చారు. శివరాంపల్లి ఊరచెరువు చిన్న కుంటగా మారింది. చెరువుకున్న ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లలో పెద్దపెద్ద గోదాములు వెలిశాయి. వీటన్నింటిపై చర్యలు తీసుకోవాలంటే ధైర్యం ఉన్న అధికారి రావాల్సి ఉంటుందని పలువురు గుర్తు చేస్తున్నారు.

నర్సబాయికుంటను కాపాడాలని అధికారులకు సూచించిన కమిషనర్

ఇటీవల గ్రేటర్ కమిషనర్ రోనాల్డ్ రోస్ నర్సబాయి కుంటను సందర్శించారు. ఆ సందర్భంలో చెరువు చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేసి మొక్కలు నాటాలని అధికారులకు సూచించారు. ఈ లోగా ఎన్నికల కోడ్ రావడంతో పనులు ముందుకు సాగలేదు. నర్సబాయి కుంట పరిధిని సర్వేచేసి ఎన్ని ఎకరాలు ఉందో చూసి ఆ స్థలాన్ని కాపాడాల్సిన అవసరం ఉంది.

ఫెన్సింగ్ ఏర్పాటుకు ప్రణాళిక తయారు చేశాం

గ్రేటర్ కమిషనర్ రోనాల్డ్ రోస్ ఆదేశాల మేరకు నర్సబాయి కుంట చుట్టురా కబ్జాలు కాకుండా ఫెన్సింగ్ వేయడానికి ప్రణాళికలు తయారు చేశాం. ఎన్నికల కోడ్ రావడంతో పనులు ఆగిపోయాయి. నర్సబాయి కుంట స్థలం కబ్జా కాకుండా చర్యలు తీసుకుంటాం. నా పరిధిలో లక్ష్మీగూడ బుల్‌బుల్‌కుంట కూడా ఉంది. బుల్‌బుల్‌కుంటను కాపాడటానికి అన్ని చర్యలు తీసుకుంటున్నాం.

- పేరాల స్వరాజ్యం, ఏఈఈ, హుస్సేన్‌సాగర్ లేక్స్ డెవలప్‌మెంట్ విభాగం



మార్కండేయనగర్, ఆదర్శ కాలనీని ఆనుకుని ఉన్న నర్సబాయికుంట

నూతన కోర్సులను సద్వినియోగం చేసుకోవాలి

బీఏ సోషియాలజీలో కొత్తగా హెచ్‌ఎస్‌జీ, పీఎస్‌పీ, పీఎస్‌ఎం, ఎస్‌యూపీ కోర్సులు: నిజాం కాలేజీ ప్రిన్సిపాల్ బీమా

బర్కత్‌పుర, మే 23 (ఆంధ్రజ్యోతి): సోషియాలజీలో నూతనంగా ప్రవేశపెట్టిన కోర్సులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని నిజాం కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్. బీమా సూచించారు. గురువారం కళాశాలలో సోషియాలజీ కోర్సుల బ్రోచర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోషియాలజీలో కోర్సులను పూర్తిచేసిన విద్యార్థులు మెరుగైన ఉపాధి అవకాశాలు పొందవచ్చన్నారు. నిజాం కళాశాల సోషియాలజీ విభాగం ఇన్‌చార్జి హెడ్ డాక్టర్. డి. తిరుపతి మాట్లాడుతూ బీఏ సోషియాలజీలో (హెచ్‌ఎస్‌జీ, పీఎస్‌పీ, పీఎస్‌ఎం, ఎస్‌యూపీ) నాలుగు గ్రూప్‌లతో నూతన కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఎంఏ సోషియాలజీలో పీజీ డిప్లొమా ఇన్ క్రిమినాలజీ అండ్ కరక్షనల్ అడ్మినిస్ట్రేషన్, పీజీ డిప్లొమా ఇన్ డెవలప్‌మెంట్ మేనేజ్‌మెంట్ అండ్ రీసెర్చ్ మెథడాలజీ, హ్యూమన్ రైట్స్ అండ్ పర్సనాలిటీ డెవలప్‌మెంట్ కోర్సులను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ఈ విద్యా సంవత్సరం నుంచే విద్యార్థులు నూతన కోర్సులలో చేరవచ్చని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్. పి.మాలతి, డాక్టర్. సీహెచ్. పరంధాములు, స్టూడెంట్ అడ్వయిజర్ మహ్మద్ ఆలీ తదితరులు పాల్గొన్నారు.



కోర్సుల బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న నిజాం కాలేజీ ప్రిన్సిపాల్ బీమా తదితరులు

అన్నమయ్య పదానికి పర్యాయ పదంగా నిలుస్తోన్న వెంకట్ : కేవీ రమణాచారి



పుస్తకాలను ఆవిష్కరిస్తున్న రమణాచారి, మామిడి హరికృష్ణ తదితరులు

రవీంద్రభారతి, మే 23 (ఆంధ్రజ్యోతి): తాళ్లపాక పద సాహిత్యానికి వెంకట్ గరికపాటి చేస్తున్న సేవలు అద్వితీయమని, తెలుగు సాహితీ వనంలో వెంకట్ గరికపాటి వ్యాఖ్యాన గ్రంథాలు చిరకాలం పారిజాతాలై పరిమళిస్తాయని రిటైర్డ్ ఐఏఎస్ కేవీ.రమణాచారి అన్నారు. గురువారం రవీంద్రభారతిలో శ్రీరామ సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో తాళ్లపాక అన్నమయ్య 616వ జయంతి మహోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన రమణాచారి కళాకారులను సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా వెంకట్ గరికపాటి వ్యాఖ్యానం, విశ్లేషణ చేసిన మాధవ పదమయూఖ, శ్రీసామీరి సంకీర్తన సమీరం పుస్తకాలను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఒక పుస్తకం రాయడమే ఘనమని భావించే ఈ రోజుల్లో 22 పుస్తకాలకు వెంకట్ గరికపాటి కృతి కర్త కావడం అభినందనీయమన్నారు. అన్నమయ్య అనే పదానికి పర్యాయ పదంగా వెంకట్ నిలుస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో ప్రముఖ సాహితీవేత్త సుధామ, ప్రకాష్ చంద్రబరోడ్, మామిడి హరికృష్ణ, చంద్రశేఖర్ గొర్తి తదిరతులు పాల్గొన్నారు. సభకు ముందు ప్రదర్శించిన శ్రీరామాంజనేయ రమ్యగీతిక (వ్యాఖ్యాన సహిత గాత్రగోష్ఠి) కార్యక్రమం ప్రేక్షకుల్ని సమ్మోహన పరిచింది. ద్విజావంతి రాగంలో రామచంద్రుడితడు రఘువీరుడు అనే సంకీర్తనతో ప్రారంభమైన ఈ గాత్రగోష్ఠి మొక్కరో మొక్కరో వాడే, దేవదేవం భజే దివ్యప్రభావం, పెగిరినాడు చూడరో పెద్ద హనుమంతుడు, సీతపడును వంటి సంకీర్తనలకు వ్యాఖ్యాన గాత్రగోష్ఠి నిర్వహించారు. తమదైన శైలిలో వెంకట్ గరికపాటి వ్యాఖ్యానం, రామాచారి గానం చేసి శ్రోతల్ని మైమరిపించారు.

సాహితీ చంద్రిక గ్రంథావిష్కరణ

రవీంద్రభారతి, మే 23 (ఆంధ్రజ్యోతి): సమకాలీన సమాజ దృక్కోణాన్ని రచయిత్రి విజయలక్ష్మి చక్కగా ఆవిష్కరించారని రిటైర్డ్ ఐఏఎస్ రమణాచారి అన్నారు. గురువారం రవీంద్రభారతిలో తెలంగాణ భాషా సాంస్కృతికశాఖ సహకారంతో సాహితీ జగీష సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో డా.పులిగడ్డ విజయలక్ష్మి రచించిన సాహితీ చంద్రిక గ్రంథావిష్కరణ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన రమణాచారి పుస్తకాన్ని ఆవిష్కరించి రచయిత్రిని అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సాహితీ చంద్రిక పుస్తకం ఆనంద చంద్రిక, అక్షర చంద్రిక వంటిదని అభివర్ణించారు. విజయలక్ష్మి వ్యాసాలలో 'అదితి, ద్రౌపది, ఆగస్త్యుడు వంటి పురాణ పాత్రలపైన మాత్రమే కాక వృద్ధాప్యం ఒక శాపమా' వంటి ప్రత్యేక వ్యాసాలు ఆమెలోని ఆధ్యాత్మిక, ఆస్తిక భావాలని తెలియజేస్తోందని అన్నారు. విజయలక్ష్మి నిరంతర అధ్యయనశీలి అని కొనియాడారు. కార్యక్రమంలో ప్రముఖ సాహితీవేత్త ఓలేటి పార్వతీశం, ఎం.దత్తాత్రేయశర్మ, ఆచార్య వెలుదండ నిత్యానందరావు, ఆచార్య టి.గౌరీశంకర్, శంకరనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రమ్నస్‌పురాలో డ్రైనేజీ ఓవర్ ఫ్లో

● చౌరస్తాలో నిలిచిన మురుగునీరు ● యుద్ధ ప్రాతిపదికన సమాంతర లైన్ తవ్వకాలు

మదీన, మే 23 (ఆంధ్రజ్యోతి): బహదూర్‌పురా చౌరస్తా సమీపంలోని కమేళా జంతు వ్యర్థాల కారణంగా అండర్ లైన్ డ్రైనేజీ జామ్ అయింది. దీంతో చౌరస్తాలో మురుగునీరు భారీగా నిలిచిపోయింది. జంతు వ్యర్థాలు నాలాలో ఇరుక్కుపోవడంతో నాలా ఓవర్ ఫ్లో అయింది. సాధారణ సమస్యగానే స్థానికులు భావించారు. సాయంత్రం ఓవర్ ఫ్లో తీవ్రంగా కావడంతో చౌరస్తాలో మురుగునీరు నిలిచిపోయింది. పరిసర ఇళ్లల్లోకి కూడాచేరే అవకాశముండడంతో అధికారులు సత్వర చర్యలకు ఉపక్రమించారు. బెంగళూరు జాతీయ ప్రధాన రహదారి కావడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కలిగాయి. జలమండలి ఏజీఎం మహ్మద్ హకీం నేతృత్వంలో అధికారులు, సిబ్బంది హుటాహుటిన ఎక్స్‌కవేటర్‌లతో డ్రైనేజీ లైన్‌లను పగులగొట్టి మురుగునీరు సజావుగా సాగడానికి కృషి చేశారు. రాత్రి 10 గంటల సమయంలో సమాంతర కాలువలను తవ్వించారు.

విషయం తెలుసుకున్న బహదూర్‌పురా ఎమ్మెల్యే మహ్మద్ ముబీన్, కార్పొరేటర్లు హుసేనిపాషా, మహ్మద్ సలీం సంఘటనా స్థలానికి చేరుకుని పనులను పర్యవేక్షించారు. జంతు వ్యర్థాలతో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తం కావడంవల్లనే ఈ సమస్య తలెత్తిందని, శాశ్వత పరిష్కారం కనుగొంటామని జీహెచ్ఎంసీ, జలమండలి అధికారులు తెలిపారు.



ఎక్స్‌కవేటర్‌తో సమాంతరంగా తవ్వకాలు పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ముబీన్, కార్పొరేటర్లు



చౌరస్తాలో నిలిచిన మురుగు

రూ. 1.20 కోట్లు మోసం చేసిన జీఎస్ఆర్ ఇన్‌ఫ్రాపై కేసు

బంజారాహిల్స్, మే 23 (ఆంధ్రజ్యోతి): ఫార్మ్ స్థలాల్లో పెట్టుబడి పెడితే రెండింతల లాభం ఇస్తామని నమ్మబలికి రూ.1.20 కోట్లు తీసుకొని తిరిగి చెల్లించకుండా మోసం చేసిన జీఎస్ఆర్ ఇన్‌ఫ్రా ఎండీ గుంటుపల్లి శ్రీనివాసరావు, డైరెక్టర్ శిల్పపై పోలీసులు కేసు నమోదు చేశారు. నారాయణ్‌ఖేడ్‌లో ఫార్మ్ స్థలాల్లో పెట్టుబడి పెడితే రెండు సంవత్సరాల్లో రెండింతలు లాభం వస్తుందని జీఎస్ఆర్ ఇన్‌ఫ్రా ప్రచారం చేసింది. దీనికి ఆకర్షితులైన కూకట్‌పల్లికి చెందిన వి.పవన్‌కుమార్ కుటుంబ సభ్యులు 2022లో రూ. 1.20 కోట్లు పెట్టుబడి పెట్టారు. కంపెనీ డైరెక్టర్ శిల్పకు డబ్బు అందజేశారు. 2024లో రెట్టింపు డబ్బు డ్రా చేసుకునేలా కంపెనీ వారికి ఐదు చెక్కులు అందజేసింది. ఇటీవలే గడువు ముగియడంతో డబ్బు కోసం మాదాపూర్ కార్యాలయానికి వెళ్లగా మూసేసి ఉంది. వారు జూబ్లీహిల్స్ కార్యాలయాన్ని సంప్రదించగా స్పందించలేదు. మోసపోయినట్టు గ్రహించిన బాధిత కుటుంబం జూబ్లీహిల్స్ పోలీసులను ఆశ్రయించింది. పోలీసులు జీఎస్ఆర్ ఇన్‌ఫ్రా ఎండీ గుంటుపల్లి శ్రీనివాసరావు, డైరెక్టర్ శిల్పపై సెక్షన్ 420 ఐపీసీ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మరిన్ని మెహిదీపట్నం జోన్ వార్తల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్
https://ejyothy.com/I62I9LAలో చదవండి.
Note: Andhrajyothi.com/editions/hyd/set-6 abids, mehadipatnam, charminarలో చూడగలరు.
నోట్: htpps://epaper.andhrajyothy.comలో లాగిన్ అయిన తరువాత క్యూఆర్‌కోడ్‌ని స్కాన్ చేయగలరు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

రాజేంద్రనగర్, మే 23 (ఆంధ్రజ్యోతి): శివరాంపల్లి విద్యుత్ సెక్షన్ పరిధిలో చెట్లకొమ్మల నరికేవేత కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు అధికారులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆదర్శకాలనీ ఫీడర్ పరిధిలో శుక్రవారం ఉదయం 11 గంటల నుంచి 12:30 గంటల వరకు ఆదర్శనగర్, మంజు బార్, ఆరాంఘర్ పిస్తాహౌజ్, కింగ్స్ సరెన్య, లక్ష్మీనారాయణ విల్లాస్, మెట్రో కన్వెన్షన్ ప్రాంతాలలో విద్యుత్ ఉండదన్నారు.

డ్రీమ్‌వ్యాలీ మిక్స్‌డ్ ఫీడర్ పరిధిలో...

డ్రీమ్‌వ్యాలీ మిక్స్‌డ్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 2:30 గంటల వరకు నైజర్ ఫంక్షన్‌హాల్, ఆరాంఘర్ పోలీస్ స్టేషన్ వీధిలో విద్యుత్ ఉండదన్నారు. భవానీ కాలనీ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 3:30 గంటల నుంచి సాయంత్ర 5 గంటల వరకు భవానీ కాలనీ, ప్రేమావతిపేట్, పిల్లర్ నెంబర్ 285 పరిసర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

పలు కాలనీల్లో వెలగని వీధి దీపాలు

● రాకపోకలకు ఇబ్బందులు

పహాడిషరీఫ్ మే 23 (ఆంధ్రజ్యోతి): సమస్యలు పరిష్కరించాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవరిస్తుండడంతో చీకట్లో రాకపోకలు సాగించాల్సి వస్తుందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జల్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలోని కొత్తపేట గ్రామం, మహమూద్ కాలనీ, ఉస్మాన్‌నగర్, షాహీన్ నగర్, వాదీ ఏ ముస్తఫా, శ్రీరాం కాలనీ తదితర ప్రాంతాలలో రోడ్ల పక్కన విద్యుత్ స్తంభాలకు ఏర్పాటు చేసిన వీధిలైట్లు వెలగడం లేదు. అసలే రోడ్లు అంతంత మాత్రంగా ఉన్నాయని, రాత్రుళ్లు గుంతలు ఎక్కడ ఉన్నాయో తెలియక ప్రమాదాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. విద్యుత్ సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా కొన్ని చోట్ల పట్టపలే వీధి దీపాలు వెలుగుతున్నాయని, దాంతో విలువైన విద్యుత్ వృథా అవుతుందని అన్నారు. అధికారులు స్పందించి వెంటనే కాలనీలలో వీధి దీపాలకు మరమ్మతులు చేయాలని వారు కోరుతున్నారు.



వివరాలను వెల్లడిస్తున్న ఏసీపీ శంకర్

మైనర్ కిడ్నాప్, పెళ్లి.. యువకుడి అరెస్ట్

మంగళ్‌హాట్, మే 23 (ఆంధ్రజ్యోతి): మైనర్ బాలికను కిడ్నాప్ చేసి పెళ్లి చేసుకున్న యువకుడిని సుల్తాన్‌బజార్ అరెస్ట్ చేశారు. గురువారం సుల్తాన్‌బజార్ పోలీస్‌స్టేషన్‌లో విలేకర్ల సమావేశంలో ఏసీపీ శంకర్ వివరాలను వెల్లడించారు. నల్గొండ జిల్లాకు చెందిన హరికృష్ణ (30) ఈ నెల 11వ తేదీన సుల్తాన్ బజార్ మెట్రో స్టేషన్ వద్ద ఓ బాలికకు మాయమాటలు చెప్పి కిడ్నాప్ చేసి విజయవాడకు తీసుకెళ్లాడు. అక్కడ హనుమాన్ మందిరంలో పెళ్లి చేసున్నాడు. అనంతరం లాడ్జికి తీసుకెళ్లి బాలికపై అత్యాచారం చేశాడు. బాలిక కనిపించకపోవడంతో తల్లిదండ్రులు సుల్తాన్‌బజార్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. విశ్వసనీయ సమాచారం మేరకు ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితుడు హరికృష్ణపై పోక్సో చట్టం కింద కేసు నమోదుచేసి జైలుకు తరలించారు. కార్యక్రమంలో సుల్తాన్‌బజార్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస చారి, ఎస్సైలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన అమ్జదుల్లాఖాన్‌కు పరామర్శ

చాంద్రాయణగుట్ట, మే 23 (ఆంధ్రజ్యోతి): ఇటీవల రోడ్డుప్రమాదంలో గాయపడ్డ ఎంబీటీ అధికార ప్రతినిధి అమ్జదుల్లా ఖాన్‌ను ఆ పార్టీ సంయుక్త కార్యదర్శి బుంగ శివకుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. గురువారం ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించి యోగక్షేమాలు అడిగితెలుసుకున్నారు. ఆయన వెంట ఎంబీటీ నాయకులు మహ్మద్ ముస్తఫా, బుంగ యాదగిరి, బుంగ శ్రావణ్‌కుమార్, సందీప్ కుమార్ తదితరులు ఉన్నారు.

గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యం

చార్మినార్, మే 23 (ఆంధ్రజ్యోతి): మూసీ నదిలో గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యమైంది. హైకోర్టు గేటు 1కి ఎదురుగా ఉన్న మూసీలో మహిళ మృతదేహాన్ని గుర్తించిన పారిశుధ్య కార్మికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. మృతదేహం కుళ్లినస్థితిలో ఉండడంతో 4 రోజుల క్రితమే మృతిచెంది ఉండవచ్చని పోలీసులు తెలిపారు. మహిళకు సంబంధించిన వారు చార్మినార్ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని వారు కోరారు.

కాపీరైట్ చట్టాన్ని ఉల్లంఘిస్తూ పాటలు

● రెండు పబ్‌ల నిర్వాహకులపై కేసు

బంజారాహిల్స్, మే 23(ఆంధ్రజ్యోతి): కాపీరైట్ చట్టాన్ని ఉల్లంఘిస్తూ పబ్‌లో పెద్దపెద్ద శబ్దాలతో సంగీతం, పాటలు పెడుతున్న నిర్వాహకులపై పోలీసులు కేసు నమోదు చేశారు. బంజారాహిల్స్ రోడ్డు నంబరు-1లో నివసించే బానోత్‌కార్తిక్ నాయక్ ఫోనోగ్రాఫిక్ పర్ఫామెన్స్ లిమిటెడ్ కంపెనీ(పీపీఎల్)లో సీనియర్ ఎగ్జిక్యూటివ్ లైసెన్సింగ్ అధికారిగా వ్యవహరిస్తున్నాడు. వివిధ బాషల్లో ఉన్న సినిమాల పాటలు, ప్రైవేట్ ఆల్బమ్స్ ఇలా సుమారు 45 లక్షల పాటలకు సంబంధించి కాపీరైట్స్ వ్యవహారం ఈ పీపీఎల్ పర్యవేక్షిస్తూ ఉంటుంది. పీపీఎల్ నుంచి లైసెన్స్ తీసుకొని వారి ఆధీనంలో ఉన్న పాటలను పబ్‌లు, ఇతర పార్టీల్లో వాడాల్సి ఉంటుంది. జూబ్లీహిల్స్‌లో ఉన్న బాబీలాన్ కిచెన్, రెస్టారెంట్, అమ్నీషియా పబ్ నిర్వాహకులు ఎలాంటి లైసెన్స్ పొందకుండా ఇష్టానుసారంగా పాటలు, సంగీతాన్ని ఉపయోగిస్తున్నారు. ఇది గమనించి పీపీఎల్ సిబ్బంది గతేడాది సెప్టెంబర్ 5న రెండు పబ్‌ల నిర్వాహకులకు నోటీసులు జారీ చేసింది. స్పందన లేకపోవడంతో అదే నెల 15న లీగల్ నోటీసులు జారీ చేశారు. డిసెంబర్ 15, ఈ యేడాది జనవరి, ఫిబ్రవరిలో మరోసారి నోటీసులు జారీ చేశారు. అయినా వారు పట్టించుకోలేదు. దీంతో కార్తిక్‌నాయక్ ఇది పీపీఎల్ కాపీరైట్స్ 36 చట్టాన్ని అతిక్రమించినట్టేనని పేర్కొంటూ జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు బాబీలాన్ నిర్వాహకులు కుమార్‌లాల్, సుశీల్ అగస్టిన్, నీరజ్ మలానీ, మెరిన్‌బాబు, బిందియాజవార్‌తోపాటు అమ్నేషియా నిర్వాహకులు రాజశేఖర్ రామనాథ్ పురం, కునాల్‌కు క్రేజాపై సెక్షన్ 406,420 ఐపీసీ కాపీ యాక్ట్ 53,63,69 కింద కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మూత్రాశయ కేన్సర్ అవగాహన కోసం

'ఆర్ట్ ఎగైనెస్ట్ కేన్సర్' ఎగ్జిబిషన్



'ఆర్ట్ ఎగైనెస్ట్ కేన్సర్' ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న వైద్యులు

హైదరాబాద్ సిటీ, మే 23 (ఆంధ్రజ్యోతి): బసవ తారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ ఆస్పత్రి రీసెర్చ్ ఇనిస్టిట్యూట్, మెర్క్ స్పెషాలిటీ ప్రైవేట్ లిమిటెడ్ మద్దతుతో 'ఆర్ట్ ఎగైనెస్ట్ కేన్సర్' పేరిట మూత్రాశయ క్యాన్సర్‌పై అవగాహన పెంచడానికి పెయింటింగ్ ఎగ్జిబిషన్‌ను నిర్వహించారు. రెండు రోజుల పాటు జరిగిన ఈ ప్రదర్శన గురువారం ముగిసింది. భారతదేశంలోని పలు ఆర్ట్ స్కూళ్ల నుంచి ప్రతిభావంతులైన కళాకారులు రూపొందించిన విభిన్న కళాకృతులను ప్రదర్శించారు. బ్లాడర్ క్యాన్సర్‌పై అవగాహన పెంచడానికి చేస్తున్న ప్రయత్నాలలో భాగంగా ఈ ఎగ్జిబిషన్‌ను నిర్వహించామని, ఈ పోరాటంలో మాతో చేరాలని బసవ తారకం ఇండో అమెరికన్ ఆస్పత్రి సీఈఓ డాక్టర్ కూరపాటి కృష్ణయ్య అన్నారు. మెడికల్ ఆంకాలజీ సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ సెంథిల్ రాజప్ప మాట్లాడుతూ ఎరుపు, గులాబీ, నారింజ లేదా గోధుమ రంగుతో సహా మూత్రం రంగులో మార్పు మూత్రాశయ క్యాన్సర్ సాధారణ లక్షణాలలో ఒకటని, దీనిని ముందుగా గుర్తించడం ద్వారా చికిత్సలో కీలక పాత్ర పోషిస్తుందన్నారు.

స్టార్ ఆస్పత్రిలో మహిళకు అరుదైన సర్జరీ



డాక్టర్ విపిన్ గోయెల్

హైదరాబాద్ సిటీ, మే 23 (ఆంధ్రజ్యోతి): నగరానికి చెందిన ఓ మహిళకు ఫైనాన్సియల్ డిస్ట్రిక్ట్‌లోని స్టార్ ఆస్పత్రిలో అరుదైన సర్జరీ చేశారు. మల్టీపుల్ ఎండోక్రైన్ నియోప్లాసియాస్ సమస్యతో బాధపడుతున్న ఆమెకు వైద్యులు సర్జరీ చేసి థైరాయిడ్ గ్రంధి వద్ద కేన్సర్ కణితులను తొలగించారు. యాభై సంవత్సరాల మహిళ కొంతకాలంగా ఆర్థోపెడిక్ సమస్యలతో బాధపడుతోంది. ఫైనాన్సియల్ డిస్ట్రిక్ట్‌లోని స్టార్ ఆస్పత్రిలోని ఆర్థోపెడిక్ వైద్యులను సంప్రదించింది. ఆమెకు పలు పరీక్షలు నిర్వహించగా మెన్ 2 సిండ్రోమ్ అని పిలువబడే అరుదైన క్యాన్సర్ ఉందని నిర్ధారించారు. దీనిని మల్టీపుల్ ఎండోక్రైన్ నియోప్లాసియాస్ టైప్ 2 అని కూడా వ్యవహరిస్తారని స్టార్ క్యాన్సర్ సెంటర్ సర్జికల్ ఆంకాలజీ డైరెక్టర్ డాక్టర్ విపిన్ గోయెల్ తెలిపారు. మెన్ 2 సిండ్రోమ్ అనేది చాలా అసాధారణమైన పరిస్థితి అని, నిపుణులైన అంకాలజిస్టులు వారి కెరీర్‌లో ఇటువంటి కేసులను చాలా అరుదుగా ఎదుర్కొంటారని చెప్పారు. ఈ పరిస్థితి 20 లక్షల మందిలో ఒకరిని ప్రభావితం చేస్తుందని వివరించారు.



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న రాచకొండ సీపీ తరుణ్ జోషి

నూతన చట్టాలపై పరిజ్ఞానం ఉండాలి

హైదరాబాద్ సిటీ, మే 23 (ఆంధ్రజ్యోతి): పోలీసులకు నూతన చట్టాలపై సంపూర్ణ పరిజ్ఞానం ఉండాలని రాచకొండ పోలీస్ కమిషనర్ తరుణ్‌జోషి అన్నారు. ఆర్‌సీఐ కేంద్రంలో గురువారం మహేశ్వరం జోన్ పరిధిలోని లా అండ్ ఆర్డర్ విభాగం అధికారులు, సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత ప్రభుత్వ నూతన న్యాయ చట్టాలు 2023 జూలై ఒకటవ తేదీ నుంచి అమలులోకి రానున్న తరుణంలో మన దేశ అంతర్గత భద్రతలో నూతన అధ్యాయం ప్రారంభం కానుందని అన్నారు. అమలులోకి రానున్న నూతన చట్టాలు భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సురక్షాసంహిత, భారతీయ సాక్ష్య అధినియం మనదేశ శాంతిభద్రతల పరిరక్షణలో ఒక మైలురాయి అని తెలిపారు. ప్రతి స్టేషన్లోనూ సిబ్బందితో నూతన చట్టాలకు సంబంధించిన అంశాల మీద అంతర్గత శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ నూతన నేరన్యాయచట్టాల మీద జోన్ల వారీగా సమీక్షా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా రిటైర్డ్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ రాములు నూతన చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మహేశ్వరం డీసీపీ సునీత రెడ్డి, ఏసీపీలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పాక ప్రపంచంలో చెఫ్‌ల పాత్ర ఎనలేనిది

● తెలంగాణ చెఫ్ అసోసియేషన్ అధ్యక్షుడు ధర్మేంద్రలంబా

మాదాపూర్, మే 23 (ఆంధ్రజ్యోతి): పాక ప్రపంచంలో చెఫ్‌ల పాత్ర ఎనలేనిదని తెలంగాణ చెఫ్ అసోసియేషన్ ప్రెసిడెంట్ చెఫ్ ధర్మేంద్ర లంబా చెప్పారు. తెలంగాణ చెఫ్స్ అసోసియేషన్ ఐదవ వార్షికోత్సవాన్ని మాదాపూర్‌లోని వెస్టిన్ రహేజా మైండ్‌స్పేస్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గోవా, చెన్నై, బెంగళూరు, హైదరాబాద్‌కు చెందిన హోటల్ మేనేజ్‌మెంట్ ఇనిస్టిట్యూట్‌ల విద్యార్థులు, పాకశాస్త్ర నిపుణులు, గృహిణులు, ప్రఖ్యాత చెఫ్‌లు హాజరయ్యారు. చెఫ్‌లు వివిధ అంశాలపై చర్చించారు. వంటగది దాటి వంట చేయడంపై అమిత్ వశిష్ట్, హాస్పిటాలిటీ పరిశ్రమలో ఆహారం, నీటి సంక్షోభాన్ని పరిష్కరించడానికి స్థిరమైన విధానాలపై అమీ మరాఠే ఆధ్వర్యంలో ప్యానెల్ చర్చలు జరిగాయి. అనంతరం టీసీఏ క్యూలినరీ లీగ్ 2024 నిర్వహించింది. ఈ సందర్భంగా మూడు విభాగాల్లో పోటీలు నిర్వహించారు. మిల్లెట్లపోటీ, మెయిన్‌కోర్సు మిస్టరీ బాస్కెట్ కాంపిటీషన్, డెజర్ట్ పోటీల్లో రీజెన్సీ కాలేజ్ ఆఫ్ క్యులినరీ ఆర్ట్స్ అండ్ హోటల్ మేనేజ్‌మెంట్ విజేతగా నిలిచింది. 'సేవ్ వాటర్..సేవ్ ఫుడ్' థీమ్ ఆధారంగా నిర్వహించిన వంటల పోటీల్లో కూడా విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఐఎఫ్‌సీఏ ప్రధాన కార్యదర్శి చెఫ్ విజయ్ భాస్కరన్, బ్రిటీష్ డిప్యూటీ హైకమిషనర్ గారెత్ విన్ ఓవెన్, ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్స్, ఎస్టీఐ, ఆక్స్‌ఫర్డ్ విజిటింగ్ ఫెలో, సీయూహెచ్‌కే అంబాసిడర్, బీస్కూల్ గెస్ట్ లెక్చరర్ రామచందర్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

యూకే యూనివర్సిటీలో ఫీజు చెల్లిస్తానని

రూ.10లక్షలకు టోకరా

జీడిమెట్ల, మే 23 (ఆంధ్రజ్యోతి): యూకే యూనివర్సిటీలో ఫీజు చెల్లిస్తానని నగరంలోని ఓ కరెన్సీ ఎక్స్ఛేంజ్ సంస్థ నిర్వాహకులు రూ.10లక్షలు కాజేశారు. బాధితుడు సైఫాబాద్ పోలీసులను ఆశ్రయించడంతో సంస్థ నిర్వాహకులపై జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. కేసును జీడిమెట్ల పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేశారు. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని వల్లభాయ్ పటేల్‌నగర్‌కు చెందిన రాజేందర్‌రెడ్డి సోదరుడు మహేందర్‌రెడ్డి యూకే యూనివర్సిటీలో ఫీజు చెల్లించాల్సి ఉంది. బాబుఖాన్ ఎస్టేట్‌లోని ఫెరోజ్ ఫ్రేమేజ్ సంస్థను గత ఏడాది సెప్టెంబర్‌లో ఆశ్రయించారు. సంస్థ మేనేజర్ రాజు అతని ఖాతాలో రూ.3లక్షలు వేయించుకున్నాడు. ఆ తర్వాత సాంకేతిక సమస్య ఉందని క్రెడిట్ కార్డు ద్వారా పేమెంట్ చేయవచ్చునని నమ్మించాడు. కార్డు వివరాలు చెప్పడంతో అతని కార్డు నుంచి రూ.7లక్షలు బదిలీ చేయించుకున్నాడు. ఇప్పటి వరకు స్పందించకపోవడంతో బాధితుడు లబోదిబోమంటూ పోలీసులను ఆశ్రయించాడు.

సాహితీ ఇన్‌ఫ్రా డైరెక్టర్‌లపై మరో కేసు

● రూ. 1.50 కోట్ల మేర మోసం చేశారని ఫిర్యాదు

హైదరాబాద్ సిటీ, మే 23 (ఆంధ్రజ్యోతి): ప్రీ లాంచ్ పేరుతో కోట్లు కాజేసిన, సాహితీ ఇన్‌ఫ్రా డైరెక్టర్‌లపై మరో మోసం కేసు నమోదైంది. సాహితీ ఇన్‌ఫ్రా డైరెక్టర్‌లు తన తండ్రిని మోసం చేసి రూ.1.50 కోట్లు కాజేశారని విజయవాడకు చెందిన వైద్యుడు రాకేష్ సీసీఎస్‌లో ఫిర్యాదు చేశారు. విజయవాడకు చెందిన వైద్యుడు రాకేష్ తండ్రి ఎంపీపీ బాలనర్సింహులుకు, సాహితీ ఇన్‌ఫ్రా డైరెక్టర్ పూర్ణచంద్రరావుతో పరిచయం ఉంది. ఈ పరిచయంతో నానక్‌రామ్‌గూడలోని 'సాహితీ' ప్రీ లాంచ్ వెంచర్‌లో ప్లాట్ కొనుగోలు చేసేందుకు బాలనర్సింహులు సంస్థ డైరెక్టర్‌లను సంప్రదించారు. ప్రీ లాంచ్ ఆఫర్‌లో ప్లాట్ కోసం పూర్ణచంద్రరావుకు పలు దఫాలుగా రూ.1.50 కోట్లు ఇచ్చినట్లు తెలిపారు. డైరెక్టర్‌లు బూదాటి లక్ష్మీనారాయణ, పూర్ణచంద్రరావు, వరదబేబి స్వాతి, వరదారామారావులు తన వద్ద తీసుకున్న డబ్బును వ్యక్తిగత అవసరాలకు ఖర్చు చేసుకొని, ప్లాట్ ఇప్పిస్తామని మోసం చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన సీసీఎస్ పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

జేఎన్‌టీయూ ఉద్యోగుల మధ్య

ఇంక్రిమెంట్ చిచ్చు..

● కాంట్రాక్టు అధ్యాపకుల ఇంక్రిమెంట్‌కు ఒకే నెలలో రెండు ఆర్డర్లు

● మాజీ వీసీ'కట్టా'తో పాత తేదీతో సంతకాలు..

● చెల్లుబాటు కావంటున్న ఎస్టాబ్లిష్‌మెంట్ సిబ్బంది

● ఇంక్రిమెంట్ ఇవ్వాల్సిందేనని ఆచార్యుల లొల్లి



హైదరాబాద్ సిటీ, మే 23 (ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూ కాంట్రాక్టు అధ్యాపకులు, ఎస్టాబ్లిష్‌మెంట్ ఉద్యోగుల మధ్య ఇంక్రిమెంట్ చిచ్చు రాజుకుంది. పాత తేదీలతో మాజీ వైస్ చాన్సలర్ కట్టా నర్సింహారెడ్డి నోట్ ఫైల్‌పై సంతకాలు చేయగా, ఇన్‌చార్జ్ వీసీ బుర్రా వెంకటేశం అనుమతి లేకుండానే ఈనెల 22న రిజిస్ట్రార్ వెంకటేశ్వరరావు ఉత్తర్వులు జారీచేయడం వివాదాస్పదమైంది. మూడేళ్ల కాలంలో బోధన, బోధనేతర సిబ్బంది సమస్యల గురించి ఆలకించకుండా, పదవీ విరమణ రోజున(ఈనెల 21న) కాంట్రాక్టు అధ్యాపకుల ఇంక్రిమెంట్ నోట్‌ఫైల్‌పై సంతకం చేయడాన్ని నాన్‌టీచింగ్ సిబ్బంది తప్పుపడుతున్నారు. మరోవైపు మాజీ వీసీ కట్టా పదవీ కాలం ముగిసినందున, కొత్తగా ఇన్‌చార్జ్ వీసీగా ఐఏఎస్ అధికారి బాధ్యతలు చేపట్టిన రోజే (ఈనెల 22న) ఆయన అనుమతి తీసుకోకుండానే ఉత్తర్వులు జారీచేయడమేంటని ప్రశ్నిస్తున్నారు. చెల్లుబాటు కాని ఉత్తర్వులతో ఇంక్రిమెంట్లు ఇస్తే, తాము జైలుకు పోవాల్సి వస్తుందని ఉద్యోగులు వాపోతుండగా, రిజిస్ట్రార్ ఆర్డర్లు ఇచ్చాక చెల్లుబాటు కాకపోవడమేంటని కాంట్రాక్టు అధ్యాపకులు గొడవ పెడుతున్నారు. కాంట్రాక్టు ఫ్యాకల్టీ ఇంక్రిమెంట్‌కు సంబంధించి మే 4న ఒక ఆర్డర్ ఇచ్చి, మే 22న మోడిఫికేషన్ ఆర్డర్ మరోటి ఇవ్వడాన్ని కూడా నాన్‌టీచింగ్ సిబ్బంది తీవ్రంగా ఆక్షేపిస్తున్నారు. మూడేళ్లుగా అర్హతలున్న బోధనేతర సిబ్బందికి పదోన్నతులు, ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి వేతనాల పెంపు ఇస్తానని హామీ ఇచ్చిన మాజీ వీసీ చివరికి మొండిచేయి చూపించారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో గురువారం ఈఈఈ సెమినార్ హాల్‌లో జరిగిన మాజీ వీసీ సన్మాన కార్యక్రమాన్ని ఉద్యోగులు బాయ్‌కాట్ చేశారు.

రెగ్యులర్ ప్రొఫెసర్లకు లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ పైనా దుమారం

మరోవైపు రెగ్యులర్ ప్రొఫెసర్లకు సరెండర్ లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్‌పైనా యూనివర్సిటీలో తీవ్ర దుమారం రేగుతోంది. వెకేషన్ డిపార్ట్‌మెంట్‌లో పనిచేసే టీచింగ్ సిబ్బందికి లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ ఉండదని ప్రభుత్వ ఉత్తర్వుల్లో స్పష్టంగా పేర్కొన్నప్పటికీ, ఉత్తర్వులను కాదని మాజీ వీసీ ఆదేశాల మేరకు రిజిస్ట్రార్ చీకటి ఉత్తర్వులు జారీచేసినట్లు ప్రచారం జరుగుతోంది. పదేళ్ల క్రితమే లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ తీసుకున్న ప్రొఫెసర్ల నుంచి ఆ మొత్తాన్ని రికవరీ చేయాలని ఆడిట్ విభాగం అబ్జెక్షన్లు పెట్టినట్లు తెలుస్తోంది. ఆడిట్ అబ్జెక్షన్లు అలా ఉంటే, ప్రభుత్వ అనుమతి లేకుండా సరెండర్ లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్‌కు యూనివర్సిటీ ప్రొఫెసర్లు పెద్దఎత్తున దరఖాస్తులు సమర్పిస్తుండడం చూసి బోధనేతర సిబ్బంది విస్మయానికి గురవుతున్నారు.

అవును.. పొరపాటు జరిగింది

కాంట్రాక్టు ఫ్యాకల్టీకి సంబంధించి ఇంక్రిమెంట్ ఉత్తర్వులు ఈ నెల 22న జారీచేయడం పొరపాటే. ఈనెల 21 మాజీ వీసీ నోట్‌ఫైల్‌పై సంతకం చేశారు. అదేరోజు ఉత్తర్వులు జారీచేసి ఉండాల్సింది. అయితే.. కాంట్రాక్టు అధ్యాపకులకు ఇంక్రిమెంట్ విషయాన్ని ఇన్‌చార్జ్ వీసీ బుర్రా వెంకటేశంకు మౌఖికంగా తెలియజేశాం. అలాగే, రెగ్యులర్ ప్రొఫెసర్లకు సరెండర్ లీవ్‌కు సంబంధించి ఎటువంటి ఉత్తర్వులు ఇవ్వలేదు. ఆచార్యులు సరెండర్ లీవ్ కోసం దరఖాస్తు చేసుకున్న విషయం తన దృష్టికి రాలేదు.

- వేంకటేశ్వరరావు, రిజిస్ట్రార్, జేఎన్‌టీయూ

తుదిదశకు చర్లపల్లి రైల్వే టెర్మినల్ పనులు

● వచ్చేనెలలో టెర్మినల్‌ను ప్రారంభించే అవకాశం ● దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్ కుమార్ జైన్



స్టేషన్‌లో తుదిదశ పనులను పరిశీలిస్తున్న రైల్వే జీఎం, ఉన్నతాధికారులు

హైదరాబాద్ సిటీ, మే 23(ఆంధ్రజ్యోతి): రూ.430 కోట్లతో చేపట్టిన చర్లపల్లి శాటిలైట్ టెర్మినల్ పనులు తుదిదశకు చేరుకున్నాయని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్(జీఎం) అరుణ్ కుమార్ జైన్ తెలిపారు. ఈ టెర్మినల్‌ను వచ్చే నెలలో ప్రారంభించేందుకు రైల్వేశాఖ సన్నాహాలు చేస్తున్న నేపథ్యంలో పెండింగ్ పనులను గురువారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టెర్మినల్‌లోని 5 ప్లాట్‌ఫారాలను విస్తరించామని, మరో 4 అదనపు ప్లాట్‌ఫారాలను కూడా అందుబాటులోకి తెస్తున్నామని చెప్పారు. జంట నగరాల కోసం సరికొత్త, ప్రత్యామ్నాయ కోచింగ్ టెర్మినల్‌గా చర్లపల్లి స్టేషన్‌ను అభివృద్ధి చేస్తున్నట్లు జీఎం తెలిపారు. అంతర్జాతీయ విమానాశ్రయానికి దీటుగా ఆధునిక సౌకర్యాలతో చర్లపల్లిలో కొత్త టెర్మినల్ అభివృద్ధి చేస్తున్నామని స్పష్టం చేశారు. ఇది ఎంఎంటీఎస్ రెండో దశ ప్రాజెక్టు కిందకు వస్తుందని వెల్లడించారు. ఎన్నికల కోడ్ ముగిశాక ఈ టెర్మినల్‌ను ప్రారంభించే అవకాశం ఉన్నట్లు జీఎం అరుణ్‌కుమార్ తెలిపారు. అనంతరం ఆయన చర్లపల్లి, మౌలాలి, అమ్ముగూడ, సనత్‌నగర్ సెక్షన్ల మధ్య పర్యటించి రియర్ విండో తనిఖీ చేపట్టారు. సనత్‌నగర్ రైల్వే స్టేషన్ అభివృద్ధి పనుల పురోగతిపై డివిజన్‌లోని ఉన్నతాధికారులతో సమీక్షించారు. టెర్మినల్ పనుల తనిఖీలో జీఎంతో పాటు చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ నీరజ్ అగ్రవాల్, ప్రిన్సిపల్ చీఫ్ కమర్షియల్ మేనేజర్ కె.ఆర్.కె. రెడ్డి, ప్రిన్సిపల్ చీఫ్ మెకానికల్ ఇంజనీర్ సి.మధుసూధన రావు, ప్రిన్సిపల్ చీఫ్ ఆపరేషన్స్ మేనేజర్ బి.నాగ్య, సికింద్రాబాద్ డీఆర్ఎం భరతేష్ కుమార్ జైన్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



అన్నమయ్య జయంతి సందర్భంగా నగర సంకీర్తన చేస్తున్న పద్మశ్రీ శోభరాజు, శిష్యబృందం

భక్తి శ్రద్ధలతో అన్నమాచార్య జయంతి

కవాడిగూడ, మే 23 (ఆంధ్రజ్యోతి): తొలి తెలుగు వాగ్గేయకారుడు, పదకవితా పితామహుడు అన్నమాచార్య జయంతి ఉత్సవాలు గురువారం అత్యంత వైభవంగా నిర్వహించారు. పద్మశ్రీ శోభరాజు నేతృత్వంలో అన్నమాచార్య, భావనా వాహిణి ఆధ్వర్యంలో ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. గురువారం తెల్లవారు జామున చిక్కడపల్లి వేంకటేశ్వర దేవాలయంలో పూజలు నిర్వహించిన పద్మశ్రీ శోభరాజు తన శిష్యబృందంతో కలిసి అన్నమయ్య కీర్తనలతో మహానగర సంకీర్తన చేస్తూ ట్యాంక్‌బండ్ వరకు ర్యాలీగా సాగారు. అన్నమాచార్య విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పలు కీర్తనలను ఆలపించారు. ఈ కార్యక్రమంలో చిలుకూరు బాలాజీ దేవాలయ ప్రధాన అర్చకులు రంగరాజన్ హాజరై పద్మశ్రీ శోభరాజుతో కలిసి అన్నమచార్యులకు ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అన్నమయ్య తత్వాన్ని వాటిని విశ్వవ్యాప్తం చేస్తున్న శోభరాజు సేవలను కొనియాడారు. త్యాగరాజు ఆరాధనోత్సవాల మాదిరి అన్నమయ్య జయంతి ఉత్సవాలను ప్రతిచోటా వైభవంగా నిర్వహించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త డాక్టర్ అనంతలక్ష్మి మాట్లాడుతూ శోభరాజు భక్తిని అన్ని రకాలలో వివరించి అన్నమయ్య కీర్తనలు ఆలపిస్తూ శ్రీ వేంకటేశ్వరస్వామిని సేవించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ చిత్రకారుడు భీమ్, విద్యావేత్త తిరునగరి జ్యోత్స్న పాల్గొనగా.. వేంకటేశ్వరస్వామి వేషధారణలో సందీప్, అన్నమాచార్య వేషధారణలో మానస్‌పటేల్ అలరించారు.

26న ఆచార్య రవ్వా శ్రీహరి జీవన సాఫల్య పురస్కారాలు

హైదరాబాద్ సిటీ, మే 23 (ఆంధ్రజ్యోతి): మహోపాధ్యాయ ఆచార్య రవ్వాశ్రీహరి జీవనసాఫల్య పురస్కారాన్ని సంస్కృతాంధ్రాలలో విశేష పండితుడైన ఆచార్య శలాక రఘునాథశర్మకు, తెలంగాణ పదకోశాల రూపకర్త నలిమెల భాస్కర్‌కు ఇవ్వనున్నారు. ఈ నెల 26న నాంపల్లిలోని పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఆడిటోరియం వేదికగా ఈ పురస్కారాల ప్రదానోత్సవం నిర్వహించనున్నట్లు ఆచార్య రవ్వా శ్రీహరి సంస్కృతాంధ్ర సారస్వత పరిషత్ ఓ ప్రకటనలో వెల్లడించింది. కార్యక్రమానికి విశ్రాంత న్యాయమూర్తి ఎల్. నరసింహారెడ్డి, సీనియర్ జర్నలిస్టు కె. రామచంద్రమూర్తి, ఆచార్య వెలిచాల కొండలరావు, కసిరెడ్డి వెంకటరెడ్డి, 'ఆంధ్రజ్యోతి' ఎడిటర్ కె. శ్రీనివాస్ తదితరులు పాల్గొననున్నారు.


గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి : కలెక్టర్

హైదరాబాద్ సిటీ, మే 23 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షను అత్యంత పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లో గురువారం పరీక్షల నిర్వహణపై ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జూన్ 9న ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.00 గంటల వరకు పరీక్ష జరుగుతుందన్నారు. ఈ పరీక్షకు హైదరాబాద్ జిల్లాలో 40,569 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నారని, వారికోసం 77 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. పరీక్ష కేంద్రాల్లోకి సెల్‌ఫోన్, బ్లూటూత్, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులకు అనుమతి లేదన్నారు. పరీక్షా కేంద్రంలోకి గుర్తింపు కార్డు లేకుండా ఎవరిని కూడా లోపలికి అనుమతించవద్దని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ పాటిల్ హేమంత కేశవ్, ఫ్లయింగ్ స్క్వాడ్, సూపరింటెండెంట్లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టర్లతో చర్చలు విఫలం

● పనులు చేయాలని కోరిన జీహెచ్ఎంసీ

● పెండింగ్ బిల్లులు ఇవ్వాలన్న కాంట్రాక్టర్లు



కాంట్రాక్టర్లతో మాట్లాడుతున్న ఈఎన్‌సీ జియావుద్దీన్

హైదరాబాద్ సిటీ, మే 23 (ఆంధ్రజ్యోతి): పనులు నిలిపివేసిన కాంట్రాక్టర్లతో జీహెచ్ఎంసీ అధికారులు జరిపిన చర్చలు విఫలమయ్యాయి. వర్షాకాలం నేపథ్యంలో అత్యవసర సేవలందించాల్సిన దృష్ట్యా.. పనులు చేయాలని కోరిన బల్దియా విజ్ఞప్తిని కాంట్రాక్టర్లు తిరస్కరించారు. బకాయిలు చెల్లించే వరకు పనులు చేసేది లేదని స్పష్టం చేశామని కాంట్రాక్టర్ల సంఘం ప్రతినిధులు తెలిపారు. యేడాదిగా రూ.1350 కోట్లు బిల్లులు పెండింగ్‌లో ఉన్నందుకు ఈనెల 18నుంచి కాంట్రాక్టర్లు పనులు నిలిపివేశారు. దీంతో రోడ్ల మరమ్మతు, నాలాల పూడికతీత పనులు నిలిచిపోవడంతో పాటు ఇన్‌స్టంట్ రిపేర్ టీంలూ అందుబాటులో లేకుండా పోయాయి. అకాల వర్షాల నేపథ్యంలో రోడ్లపై నిలిచిన వరద నీరు, కూలిన చెట్ల తొలగింపులో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. జూన్ 1న మాన్‌సూన్ బృందాలను రంగంలోకి దించాలి. కాంట్రాక్టర్లు నిరసన తెలుపుతోన్న నేపథ్యంలో గురువారం ఇంజనీర్ ఇన్ చీఫ్(ఈఎన్‌సీ) జియావుద్దీన్ వారిని పిలిచి మాట్లాడారు. వర్షాకాలంలో ప్రజలు ఇబ్బంది పడే అవకాశమున్న దృష్ట్యా పనులు చేయాలని కోరారు. బకాయిలు త్వరలో చెల్లిస్తామని పేర్కొన్నారు. దీనిపై కాంట్రాక్టర్లు సానుకూలంగా స్పందించలేదు. పెండింగ్ బిల్లులపై కమిషనర్ స్పందించడం లేదని, చెల్లింపులు పూర్తయ్యే వరకు పనులు చేయమని పేర్కొన్నట్టు తెలిసింది.



కేబీఆర్ పార్కు వద్ద స్థలాన్ని పరిశీలిస్తున్న రోనాల్డ్‌రోస్, ప్రకాష్‌రెడ్డి

కేబీఆర్ పార్క్ వద్ద మల్టీలెవల్ పార్కింగ్

● స్థలాన్ని పరిశీలించిన అధికారులు

హైదరాబాద్ సిటీ, మే 23 (ఆంధ్రజ్యోతి): నగరంలో ట్రాఫిక్ కష్టాలు తీర్చేందుకు జీహెచ్ఎంసీ సన్నద్ధమవుతోంది. అందుబాటులో ఉన్న, అనువైన ప్రాంతాల్లో మల్టీలెవల్ పార్కింగ్ సముదాయాల నిర్మాణంపై దృష్టి సారించింది. పబ్లిక్ ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్ (పీపీపీ) విధానంలో నగరంలోని పలు ప్రాంతాల్లో ఈ తరహా ఏర్పాట్లు చేయాలని గతంలో ప్రభుత్వం ఆదేశించింది. ఈ నేపథ్యంలో గురువారం కేబీఆర్ పార్కు వద్ద మల్టీ లెవల్ పార్కింగ్ ప్రతిపాదిత స్థలాన్ని ఈవీడీఎం డైరెక్టర్ ప్రకాష్‌రెడ్డి, ఇంజనీర్ ఇన్ చీఫ్ జియావుద్దీన్, చీఫ్ సిటీ ప్లానర్ రాజేంద్రప్రసాద్ నాయక్‌లతో కలిసి పరిశీలించారు.



హైదరాబాద్‌లోని ఇరాన్ దౌత్యవేత్త మహది షారోఖికి కిషన్‌రెడ్డి విడుదల చేసిన సంతాపపత్రాన్ని అందజేస్తున్న బీజేపీ నాయకులు

ఇరాన్ అధ్యక్షుడి మృతికి కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సంతాపం

చార్మినార్ మే 23 (ఆంధ్రజ్యోతి): ఇరాన్ అధ్యక్షుడు అయతుల్లా సయ్యద్ ఇబ్రహీం రైసీ మరణం బాధాకరమని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. రైసీ మృతికి సంతాపం ప్రకటిస్తూ కిషన్‌రెడ్డి ఓ లేఖ విడుదల చేశారు. ఈ మేరకు గురువారం బీజేపీ నాయకులు మీర్ ఫిరాసత్ అలీ బక్రీ తెలంగాణ రాష్ట్ర మాజీ ప్రతినిధి, కేంద్ర హజ్ కమిటీ ఆఫ్ ఇండియా మాజీ వైస్‌చైర్మన్ సిరాజ్ ఉన్నీసా, సహఫత్ అలీఖాన్ హైదరాబాద్‌లోని ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ ఇరాన్ కార్యాలయ కాన్సులేట్ జనరల్‌లో మహది షారోఖికి కిషన్‌రెడ్డి విడుదల చేసిన లేఖను అందజేశారు.

ఫీర్జాదిగూడ మేయర్‌పై దాడి.. పలువురిపై కేసు

ఘట్‌కేసర్ రూరల్, మే 23(ఆంధ్రజ్యోతి): ఫీర్జాదిగూడ మేయర్ జక్కా వెంకట్‌రెడ్డి కిడ్నాప్‌నకు యత్నించి దాడిచేసిన కార్పొరేటర్ అమర్‌సింగ్, అతడి అనుచరులపై ఘట్‌కేసర్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 19న ఫీర్జాదిగూడ మేయర్ జక్కా వెంకట్‌రెడ్డి, బీఆర్ఎస్ కార్పొరేటర్లు సూర్యాపేట్ నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు మూడు కార్లలో వెళ్తున్నారు. పెద్ద అంబర్‌పేట్ అవుటర్ రింగ్ రోడ్డు వద్ద ఫీర్జాదిగూడ కార్పొరేటర్ అమర్‌సింగ్, డిప్యూటీ మేయర్ శివకుమార్‌గౌడ్ వీరి అనుచరులు మేయర్ జక్కా వెంకట్‌రెడ్డి కారును వెంబడించి కిడ్నాప్‌నకు యత్నించాడు. అదేరోజు రాత్రి ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని టోల్‌ప్లాజా వద్ద వెంకట్‌రెడ్డి కారుకు అడ్డంగా కార్లు ఆపి అమర్‌సింగ్, శివకుమార్‌గౌడ్, శ్రీధర్ రెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, అంజిరెడ్డి, నర్సింహారెడ్డిలతో పాటు పలువురు దాడికి యత్నించారు. తేరుకున్న మేయర్ పోలీసులకు, మీడియాకు సమాచారం అందించడంతో వారు అక్కడి నుంచి వెళ్లిపోయారు. దీంతో జక్కా వెంకట్‌రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో గురువారం పలువురిపై కేసు నమోదు చేశారు. ఈ మేరకు కేసుదర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కేవీఆర్‌లో రెండోరోజూ కూల్చి వేతలు

● సర్వేతోనే సరిపెడతారా? నకిలీలపై చర్యలు తీసుకోరా..

● కబ్జా స్థలాలను కాపాడాలని స్థానికుల విజ్ఞప్తి



ఎక్స్‌కవేటర్‌తో గదిని కూల్చి వేస్తున్న మున్సిపల్ సిబ్బంది

దుండిగల్, మే 23(ఆంధ్రజ్యోతి): దుండిగల్ మున్సిపాలిటీ మల్లంపేట్‌లోని కేవీఆర్ లే-అవుట్‌లో పార్కు స్థలంలో రేకులతో నిర్మించిన ఇంటిని ఎక్స్‌కవేటర్‌తో గురువారం మున్సిపల్ అధికారులు కూల్చివేశారు. కమిషనర్ సత్యనారాయణ ఆదేశాల మేరకు టౌన్‌ప్లానింగ్ సిబ్బంది రెండవ రోజు కూడా ఈ కార్యక్రమాన్ని కొనసాగించారు. మల్లంపేట్‌లో రూ. 100 కోట్లకు పైగా విలువైన పార్కు, ఖాళీ స్థలాలను అక్రమార్కులు కబళించిన విషయంపై 'ఆంధ్రజ్యోతి'లో వరుస కథనాలు ప్రచురితమయ్యాయి. వీటిపై మున్సిపల్ అధికారులు స్పందించారు. కానీ అసలు దీనికి సూత్రధారులు ఎవరు.. దీని వెనక ఎవరున్నారు. నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి రిజిస్ట్రేషన్లు చేయించడం వంటి విషయాలను అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదనేది అర్థం కాని పరిస్థితి. అయితే గురువారం పార్కులో కూల్చివేతల సమయంలో మల్లంపేట్‌కు చెందిన ఓ కౌన్సిలర్ ఆ ఇంటిని కూల్చ వద్దని, కూల్చిన కాడికి చాలు ఆపివేయాలని పలుమార్లు మున్సిపల్ సిబ్బందికి ఫోన్ చేశారు. ఒకానొక దశలో నిలిపి వేయకుంటే పరిస్థితి తీవ్రంగా ఉంటుందనే హెచ్చరికలు కూడా వచ్చినట్లు తెలిసింది. తమ పేర్లు బయటకు రావద్దని సిబ్బందికి సూచించినట్లు తెలుస్తున్నది. అయితే, సిబ్బంది కమిషనర్ ఆదేశాలను పాటిస్తూ కూల్చివేతలు కొనసాగించారు.

గత నెల రోజుల క్రితం సర్వే చేయించిన మున్సిపల్ కమిషనర్ సర్వేయర్ ఇచ్చిన రిపోర్టును మాత్రం బహిర్గతం చేయడం లేదు. 55 ఎకరాల్లో వెలిసిన ఈ కేవీఆర్ లే-అవుట్‌లో దాదాపు 5ఎకరాలకు పైగా పార్కు స్థలాలు, దేవాలయాల స్థలాలు, అక్కడక్కడ ఖాళీ స్థలాను కూడా అప్పట్లోనే వదిలేశారు. ఈ ఫోర్జరీ రిజిస్ట్రేషన్‌ల బాగోతం వెలుగులోకి వచ్చిన తరువాత పూర్తి స్థాయిలో డిజిటల్ సర్వే చేయించిన మున్సిపల్ అధికారులు అసలు ఈ సమస్య ఎక్కడ పుట్టింది. ఇందులో ఖాళీ స్థలాలను, పార్కు స్థలాలను ఎవరెవరు విక్రయించారు.. అన్నీ విక్రయించారా? కొన్నింటినే విక్రయించారా? వీటికి సంబంధించిన వివరాలను తెలుసుకోవాల్సిన మున్సిపల్ అధికారులు ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారు అనే ఆరోపణలు స్థానికంగా విని పిస్తున్నాయి. కేవలం మున్సిపల్ కమిషనర్ మాత్రం సర్వే చేసిన వివరాలను మాత్రమే ఉన్నతాధికారులకు పంపామని చెబుతున్నారు తప్ప.. కబ్జాకు గురైన కనుమరుగైన స్థలాలు, లే-అవుట్‌లో ప్రజావసరాల కోసం వదిలిన ఖాళీ స్థలాలు, ఆక్రమణలపై వివరాలను తేటతెల్లం చెయ్యడంలో అధికారులు వెనుకంజ వేస్తున్నారని ఆరోపిస్తున్నారు. అధికారులు లే-అవుట్‌లో ఉన్న ఆ స్థలాలను ప్రజల అవసరాలకు ఉపయోగపడేలా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

ఆంధ్రజ్యోతి
నవ్య
నివేదన
శుక్రవారం • 24 మే 2024



గీతాసారం

యోగే అత్యున్నతుడు

"తపస్వికన్నా, శాస్త్ర జ్ఞాని కన్నా, కర్మలను ఆచరించేవాడికన్నా ఉన్నతుడు. కాబట్టి ఓ అర్జునా! యోగివి కావడానికి ప్రయత్నించు. యోగుల్లో, ఎల్లప్పుడూ నా మీదే మనసులను ఎవరు లగ్నం చేస్తారో, గొప్ప శ్రద్ధతో, సమర్పణ భావంతో నా భక్తిలో నిమగ్నమవుతారో, వారిని అత్యంత స్థితప్రజ్ఞులుగా నేను పరిగణిస్తాను" అని 'తపస్విభ్యోధికో యోగి', 'యోగినా మపి సర్వేషాం' అనే గీతా శ్లోకాలలో శ్రీకృష్ణుడు చెప్పాడు.

యోగుల వివిధ లక్షణాలను వివిధ సందర్భాల్లో శ్రీకృష్ణుడు వివరించాడు. వీటిలో ద్రువణాలను అధిగవించడం (ద్వంద్వాలకు అతీతంగా ఉండడం- ద్వంద్వాతీతం), గుణాలను అధిగమించడం (గుణాతీతం), గుణాలే అసలైన కర్తలనీ, తను కేవలం సాక్షిని మాత్రమేననీ గ్రహించడం, శత్రువునైనా, మిత్రుడినైనా ఒకేలా చూడడం, పొగడ్తనైనా, విమర్శనైనా ఒకేలా తీసుకోవడం (సమత్వం), ఫలాన్ని ఆశించని యజ్ఞంలాంటి పనులను (నిష్కామ కర్మలను) చేయడం, కర్మ ఫలాపేక్షను వదులుకోవడం లాంటివి ఉన్నాయి. అన్నిటి కన్నా ముఖ్యంగా ఒక యోగి తన ఆత్మలోనే ఆనందాన్ని వెతుక్కుంటాడు, ఆ ఆనందాన్ని ఆస్వాదిస్తాడు. ఏదైనా ఉన్నతమైనదాన్ని సాధించాలనే లక్ష్యంతో కఠినమైన క్రమశిక్షణతో ప్రయత్నించేవాడు, త్యాగాలు చేసేవాడు తపస్వి. సాధారణమైన వ్యక్తులెవరూ సాధారణ జీవనయానంలో చేయలేని దాన్ని తపస్వులు చేస్తారు కాబట్టి ప్రశంసాపాత్రులవుతారు. కానీ, దేన్నో సాధించాలనే కోరిక మాత్రం ఇంకా అలాగే ఉంటుంది. అయితే... పరమాత్మను చూడాలనే కోరికతో సహా అన్ని వాంఛలనూ వదులుకొనేవాడు యోగి. ఆ లక్షణమే యోగి కన్నా తపస్విని తక్కువ స్థాయిలో ఉంచుతుంది.

శాస్త్రజ్ఞాని అంటే విజ్ఞానాన్ని సంపాదించాలనే సంకల్పం కలిగినవాడు. చివరకు ఈ లక్షణం కూడా లోకుల మెప్పును పొందుతుంది, ఎందుకంటే అతనికి సాధారణ వ్యక్తికన్నా ఎక్కువ విషయాలు తెలుసు. కానీ అన్నీ తనలోనే ఉన్నాయనీ, తనే అన్నిటిలోనూ ఉన్నాడనీ తెలియాలి. ఇది తెలుసుకున్నాక భ్రమలన్నీ తొలగిపోతాయి. ఈ సత్యాన్ని తెలుసుకుంటే... అంతకు మించి తెలుసుకోవాల్సినది ఇంకేమీ ఉండదనీ యోగి గ్రహిస్తాడు. కర్మ బంధాలు అతణ్ణి కట్టి ఉంచలేవు. కాబట్టి అందరికన్నా యోగి అత్యున్నతుడు.



కె. శివప్రసాద్
ఐఎఎస్


క్షమాగుణం

మానవుల్లో క్షమాగుణం అత్యున్నతమైనదనీ, అది భగవంతుణ్ణి చేరువ చేసే మార్గం అనీ మహా ప్రవక్త మహమ్మద్ బోధించేవారు. బద్ధ శత్రువునైనా, తీవ్రంగా హాని కలిగించడానికి ప్రయత్నించిన వారినైనా మన్నించడంలోనే మానవత్వం, దైవత్వం ఉన్నాయని చెప్పడమే కాదు... ఆచరించి కూడా చూపేవారు. అలాంటి సంఘటనలు ఆయన జీవితంలో ఎన్నో కనిపిస్తాయి.

ఒకసారి ఆయన తోటలో చెట్టుకు ఆనుకొని విశ్రాంతి తీసుకుంటున్నారు. ఇది గమనించిన ఒక శత్రువు... ఆయనను హతమార్చడానికి ఇదే సరైన సమయం అనుకున్నాడు. కత్తితో ఆయన ముందుకు వచ్చి "ఇప్పుడు నిన్ను ఎవరు రక్షిస్తారు?" అంటూ కత్తి దూశాడు. "నన్ను అల్లాహ్ రక్షిస్తాడు" అని దైవప్రవక్త చెప్పారు. ఆయన ఆ మాట అంటూ ఉండగానే ఆ శత్రువు చేతిలోని కత్తి జారిపోయింది. ఆ కత్తిని దైవప్రవక్త తీసుకొని... "ఇప్పుడు నిన్నెవరు రక్షిస్తారు?" అని అడిగారు. ఆ వ్యక్తి వణుకుతూ "ఎవరూ లేరు" అన్నాడు. "నిన్ను కూడా ఆ అల్లాహ్‌యే రక్షిస్తాడు" అంటూ ఆ వ్యక్తిని క్షమించి వదిలేసారు. తనకు విషం పెట్టాలనుకున్న మహిళను, తన పినతండ్రి హజ్రత్ హంజాను హతమార్చినవారిని, తన కుమార్తె జైనబ్ గర్భంతో ఉన్నప్పుడు ఆమెపై దాడి చేసి, గర్భస్రావం చేసినవారినీ, మక్కా నగరంలో తనపై దౌర్జన్యాలకు పాల్పడినవారిని సైతం ఆయన మన్నించారు.

దైవ ప్రవక్త రోజూ తన ఇంటి నుంచి మసీదుకు వెళ్ళే దారిలో ఒక మహిళ ఇల్లు ఉండేది. ఆమెకు ప్రవక్త అంటే కోపం. ఆయన వీధిలో నడుస్తున్న

సందేశం



ప్పుడు... తన ఇంటి మేడమీద నుంచి ప్రతిరోజూ చెత్తను ఆయనపై కుమ్మరించేది. ఆయన మౌనంగా వెళ్ళిపోయేవారు. ఒక రోజు ఆయన మసీదుకు వెళ్తూండగా... ఆ మహిళ కనిపించలేదు. వెంటనే ఆగి, పొరుగువారిని ఆమె గురించి ఆరా తీశారు. ఆమె అనారోగ్యంతో మంచానపడి ఉందని ఆయనకు తెలిసింది. ఆ ఇంట్లోకి వెళ్ళి... ఆమెను పరామర్శించారు. త్వరగా కోలుకుంటావని ధైర్యం చెప్పారు. దైవప్రవక్త వైఖరి ఆమెపై గొప్ప ప్రభావం చూపించింది. ఆ తరువాత... ద్వేషపూరితమైన పనులేవీ ఆమె చెయ్యలేదు. ఈ విధంగా... మనను ద్వేషించేవారి ప్రవర్తనలో క్షమాగుణంతో మార్పు తీసుకురావచ్చని దైవప్రవక్త నిరూపించారు.

• మహమ్మద్ వహీదుద్దీన్

స్వానుభవం

తిరిగి ఇవ్వడమే అసలైన ఆధ్యాత్మికత





"నాకు ఈ జీవితమే దైవదత్తం. ఎందుకంటే... నేను మా అమ్మకు నెలలు నిండకుండానే... ఏడో నెలలో పుట్టాను. అది 1945. అప్పట్లో యాంటీ బయాటిక్స్ లేవు, ఇంక్యుబెటర్లూ లేవు. అలాంటి పరిస్థితుల్లో జననం, పుట్టిన తరువాత బతికి బైటపడడం కష్టమే. అయినా దేవుడు వైద్యుడి (మా మేన మామే) రూపంలో వచ్చి... అతి క్లిష్ట పరిస్థితుల్లో నన్ను బతికించాడు, నా ప్రాణం నిలబెట్టాడు. ఈ విషయం మా అమ్మ ద్వారా, బంధువుల ద్వారా నేను విన్నప్పుడు... అదంతా దేవుడి సంకల్పమే అనిపించింది. అటువంటి నేను.. యవ్వనంలో చాలా మంది లాగానే 'ఏగ్నస్టిక్' (అజ్ఞేయతావాది)గా ఉండేవాణ్ణి. అంటే దేవుడు ఉన్నాడో లేదా తెలియని వాణ్ణి. నాస్తికుణ్ణి అన్నా పరవాలేదు.

కానీ దైవ శక్తి మీద విశ్వాసం బలపడే అనుభవం ఒకటి నేను బియస్సీ చదివేటప్పుడు ఎదురయింది. కెమిస్ట్రీలో చిన్న పొరపాటు జరగడంతో నాకు ఫస్ట్ క్లాస్ రాకుండా పోయింది. దెబ్బకు కళ్ళు తెరుచుకున్నాయి. తిరుపతి కొండకు నడిచి వస్తానని మొక్కుకున్నాను. మొక్కు తీర్చుకున్నాను కూడా. అప్పటి నుంచి నా జీవితం మారిపోయింది. ఎమ్మెస్సీలో యూనివర్సిటీ ఫస్ట్ వచ్చా. సివిల్స్‌లో మొదటి ప్రయత్నంలోనే ర్యాంక్ సాధించా. దేవుడి కరుణ నిరంతరంగా ప్రసరించడంతో... ఉద్యోగం, వివాహం, సంతానం, తల్లితండ్రులను, అత్తమామలను సేవించుకొనే భాగ్యం - అన్నీ కలిగాయి. దేవుడిపై బ్రహ్మాండమైన గురి కుదిరింది. ప్రతి ఏటా తిరుపతికి కాలినడకన వెళ్ళాను, అంగప్రదక్షిణలు చేశాను.

తిరుపతి వెంకన్ననే కాదు... యాదగిరి నరసింహుణ్ణి, విజయవాడ కనకదుర్గను, అన్నవరం సత్యనారాయణ స్వామినీ... అందరినీ శక్తి ఉన్నంతకాలం కాలినడకనే దర్శించుకున్నాను. ఈ తీర్థయాత్రలు చేసినంత మాత్రాన నాకు కష్టాలేవీ రాలేదని చెప్పను. అయితే, అవి తీరాలని నేను దేవుళ్ళతో ఎప్పుడూ బేరాలు ఆడలేదు. దేవుళ్ళు నా కష్టాలను తొలగించకపోయినా... వాటిని తట్టుకొనే శక్తిని ప్రసాదించారు. నిరుత్సాహం, నిస్పృహ కలిగినప్పుడు నా వెన్ను తట్టారు. 'ప్రతిఫలం ఆశించకుండా నీ విధి నీవు చెయ్యి' అని ప్రేరేపించారు. నా కర్తవ్య నిర్వహణ సజావుగా సాగడానికి ఒక్కోసారి మృత్యుముఖం నుంచి తప్పించారు కూడా. వృత్తిపరంగా ధైర్యంగా, నిజాయితీగా నిలబడడానికి, దుష్ట శక్తుల ప్రయత్నాలను తట్టుకోవడానికి, ధర్మాన్ని తప్పకుండా ఉండడానికి తగిన స్థయిర్యాన్ని ప్రసాదించారు.

ఆధ్యాత్మికత అనగానే సర్వసంగ పరిత్యాగం, జన్మరాహిత్యం కోసం పరితపించడం అనుకుంటారు చాలామంది. నా దృష్టిలో.. ఆధ్యాత్మికత అంటే ప్రకృతి పట్ల, సమస్త జీవరాశుల పట్ల ప్రేమ కలిగి ఉండడం. "మోక్షం కన్నా నేను పునర్జన్మనే కోరుకుంటాను" అన్నాడు రవీంద్ర కవీంద్రుడు. అద్భుతమైన భగవంతుడి సృష్టిని ఆస్వాదించాలంటే జన్మంటూ ఉండాలి కదా! దేవుడు ఇచ్చిన వరం... జీవితం. ప్రకృతి ద్వారా దేవుడు అందిస్తున్న కానుకలకు కృతజ్ఞులమై ఉంటూ, మనకు ఎంతో ఇచ్చిన సమాజానికి కొంతైనా తిరిగి ఇవ్వడం అసలైన ఆధ్యాత్మికత! కార్ల్‌మార్క్స్ చెప్పినట్టు భక్తి 'నల్ల మందు' కాదు... కష్టాలను భరించి, రేపటి రోజుపై నమ్మకాన్ని కలిగించే టానిక్. దేవుడు నేను పుట్టినప్పుడే పెద్ద గండం నుంచి తప్పించాడు. ఆ తరువాత నా జీవితంలో దక్కిన తక్కినవన్నీ బోనస్సే! ఇంగ్లీషులో 'కౌంట్ యువర్ బ్లెస్సింగ్స్' అంటారు. మనకు దక్కినవాటిని లెక్క వేసుకొని చూసుకుంటే... దేవుడిపై ఫిర్యాదు చేయడానికి మనకు అవకాశమే చిక్కదు. ఆ కృతజ్ఞతా భావమే అతి పెద్ద ఆధ్యాత్మిక భావన అని నా ఉద్దేశం.

ఇక... నేను చేసే పూజలన్నీ తగు మోతాదులోనే ఉంటాయి. అన్నహోమం చేయడం కన్నా అన్నదానం చేయడం మేలని నా ఉద్దేశం. "ఆకలితో ఉన్నవాడి ముందర భగవంతుడు కూడా ఒక ముద్ద అన్నం రూపంలో తప్ప... వేరే రూపంలో ప్రత్యక్షమవడానికి సందేహిస్తాడు" అన్నారు గాంధీ మహాత్ముడు. "అన్నం పరబ్రహ్మ స్వరూపం" అన్నారు మన పూర్వులు. సమాజంలో ఆధ్యాత్మికత, భక్తిభావం పెంపొందించాలంటే... సామాన్యుడి కనీస అవసరాలు తీర్చడానికి కృషి చేయాలి. ఆత్మారాముడు సంతృప్తి పడందే... అసలు రాముడి గురించి జీవికి ఆలోచన రాదు."

- డాక్టర్ మోహన్ కందా, ఐఎఎస్
విశ్రాంత ముఖ్యకార్యదర్శి, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్

నా దృష్టిలో మతం అనేది కేవలం వ్యక్తిగతమైన విషయం. సామూహికంగా పూజాది కార్యక్రమాల్లో, భజనల్లో పాల్గొనవచ్చు. కానీ సృష్టికర్తతో మనసువిప్పి సంభాషించడం అనేది ఆంతరంగిక వ్యవహారం. ఇక, పూజ ఫలానా విధంగానే చేసి తీరాలని నిబంధనలు విధించడం, దేవుడి పేరు చెప్పి భయపెట్టాలని చూడడం సరికాదు. "చిత్తశుద్ధి లేని శివపూజలేల?" అన్నాడు వేమన. కర్మల ఫలం అనుభవించక తప్పదని మత గ్రంథాలు బోధిస్తున్నా... అడ్డదారులు చూపిస్తామనే స్వామీజీలను ఆశ్రయించడంలోని విజ్ఞత నాకు అర్థం కాదు. దేవుడి ధ్యానం ద్వారా దైవ సంపర్కం పెంచుకోవడం కన్నా... ఆడంబరం ప్రదర్శిస్తూ, భౌతిక అవసరాల మీద ఆశలు కల్పిస్తున్న గురువుల వెంట పరుగులు పెట్టేవారిని చూస్తే... 'అయ్యో పాపం! చిల్లర రాళ్ళకు మొక్కుతున్నారే?' అనిపిస్తుంది. భారీస్థాయిలో పూజాది క్రతువులు చూసినప్పుడు... 'పాపకర్మలు చేశామేమోనన్న అపరాధ భావనను తుడిచివేసుకోవడానికే అట్టహాసం చేస్తున్నారా?' అనిపిస్తుంది.

సంభాషణ: **కృష్ణశర్మ**

నిజమైన తపస్సు

చింతన

తపస్సు అంటే ఋషులు, మునుల్లా అడవిలో ఏకాంతంగా, ముక్కు మూసుకొని చేసే ధ్యానమని మనం భావిస్తాం. 'తపస్' అనే శబ్దానికి నిజమైన అర్థం... దహించడం. 'కాయేంద్రియ సిద్ధిః అశుద్ధా క్షయాత్ తపసః' అని నిర్వచించాడు పతంజలి మహర్షి... తన 'యోగదర్శనం'లో. 'శారీరకమైన, మానసికమైన కల్మషాలను తొలగించేదే తపస్సు' అని ఈ సూత్ర భావం. ఉదాహరణకు, ఉపవాసం అనే భౌతిక తపస్సుతో మన శరీరంలో ఉండే అధికమైన కొవ్వును, విషపదార్థాలను... అలా పేరుకుపోయిన వాటిని దహించివేస్తాం. అలాగే మానసిక తపస్సుతో... మన మనస్సులో నాటుకొని ఉన్న పాత, పనికిమాలిన భావాలను దహిస్తాం. వాచికమైన తపస్సులో మౌనం పాటిస్తాం. దానివల్ల మన వాగ్ధారను నియంత్రించుకుంటాం. అయితే... వాటిని మనం దహిస్తున్న సమయంలో కొంత వేడి, బాధ కలగడం గమనించవచ్చు. నొప్పికి సైతం లోనవుతాం. కాబట్టి తపస్సు అంటే... 'బాధను అంగీకరించడం' అని కూడా అర్థం. ఒకవేళ ఒక వ్యక్తి వేదనకు గురి అవుతున్నాడంటే... దాంతో అతనిలోని మాలిన్యాలు, కల్మషాలు నశించి... నిష్కల్మషుడు, శుద్ధుడు అయ్యాడని అర్థం.

మన నిత్య జీవితంలో సైతం తపస్సుకు ఎన్నో అవకాశాలు తటస్థపడతాయి. ఒక వస్త్రం కూడా పరిశుభ్రం కావడానికి తపస్సుకు లోనవుతుంది. మన వస్త్రాలను లాండ్రీ అతను ఏం చేస్తాడు? కేవలం మడతపెట్టి, వాటి మీద కాస్త చందనం పొడి చల్లి, మడతల్లో మల్లెపూలు పెట్టి తిరిగి ఇచ్చెయ్యడు కదా? వాటిని మొదట సలసల మరిగే నీళ్ళలో నానబెడతాడు. అందులో సబ్బుపొడి వేస్తాడు. ఆ తరువాత వాటిని బండమీద బాదుతాడు. అనంతరం కింద పడేసి, దొర్లించి, గట్టిగా పిండుతాడు. తరువాత వాటిని ఎండలో ఆరేస్తాడు. ఆరగానే వాటిని వేడి ఇస్త్రీపెట్టెతో ఇస్త్రీ చేస్తాడు. అప్పుడే ఆ వస్త్రాలు తమ మురికిని కోల్పోయి, స్వచ్ఛంగా తయారై, ధరించడానికి అనువుగా ఉంటాయి. అంటే... వస్త్రాలు తీవ్రమైన తపస్సుకు లోనై, శుభ్రంగా, శుద్ధంగా మారుతాయి. లాండ్రీ వ్యక్తికి ఆ వస్త్రాల మీద ద్వేషమేమీ లేదు. పైన చెప్పిన విధానం అంతా వాటి మాలిన్యం తొలగించడానికే.



అదేవిధంగా... మనస్సును ఉతకాలి, పిండాలి. దులపాలి, ఎండవేయాలి. ఇస్త్రీ చెయ్యాలి. ఎవరైనా మనకు బాధ కలిగించినప్పుడు... వారు మనల్ని ద్వేషిస్తున్నారని అనుకోకూడదు. మనల్ని మనం పరిశుద్ధం చేసుకోవడానికి సహాయపడుతున్నారని భావించాలి. అప్పుడే మనం నిజమైన యోగిలా ఆలోచించగలుగుతాం. మన భావాల్ని ఎవరైనా గాయపరచినప్పుడు... వాళ్ళను చూసి చిరునవ్వు నవ్వగలగాలి. "ధన్యవాదాలు. ఇలాంటివి నాకు ఇంకా ఇంకా కావాలి. మీరు నన్ను పవిత్రం చేస్తున్నారని మీకు తెలుసు. మీ మిత్రుల్ని కూడా పిలుచుకురండి. నన్ను గాయపరచాలనే వారి కోరిక నెరవేరుతుంది" అని చెప్పాలి. మనకు ఈ విషయం బోధపడితే... మనల్ని దూషించే, నిందించేవారిని తప్పుపట్టం సరి కదా... వాటన్నిటినీ అంగీకరించి, భరిస్తాం. పొగడ్తలకు ఆనందిస్తూ, అవమానాలకు కుంగిపోతున్నామంటే... మన మనస్సు ఇంకా స్థిరంగా... దృఢంగా లేదన్న మాట. ఒక దూషణ... మన బలహీనతను అర్థం చేసుకోవడానికి ఉపకరిస్తుంది. 'ఒదిగిపో, కుదురుకో, సర్దుకుపో' అనే తత్త్వాన్ని అలవరచుకోవాలి. అవమానాలను భరించాలి, గాయాలను సహించాలి. ఇదే ఉత్తమ సాధకుడి లక్షణం. ఏకాంత ప్రదేశంలో ఉంటూ, ఏదో ఒక మంత్రాన్ని జపిస్తూ కూర్చోవడం ఎవరైనా చేయగలరు.. నిందలనూ, అవమానాలనూ భరిస్తూ... మనస్సును స్థిమితంగా, నిశ్చలంగా, ప్రశాంతంగా ఉంచుకోవడం... జపమాలను వేల సార్లు తిప్పుతూ మంత్రాన్ని ఉచ్చరించడం కన్నా ఎంతో గొప్పది. శరీరాన్ని, ఇంద్రియాలను నియంత్రించడం తపస్సువల్ల లభిస్తుంది. మనం అన్నిటినీ అంగీకరించినప్పుడు... ఏది మనల్ని ప్రభావితం చేస్తుంది? ఎవరో మనల్ని మూర్ఖుడన్నా ఒప్పుకోవాలి. అద్భుతమైన వ్యక్తి అన్నా ఒప్పుకోవాలి.

ఒకప్పుడు ఒక యోగి ఓ ఊరికి వచ్చాడు. ఊరు బయట ఉన్న రావి చెట్టు కింద కూర్చున్నాడు. ఆ ఊరి ప్రజలు ఆయను దర్శించుకొనేవారు. ఆయన వాళ్ళ సందేహాలు తీర్చేవాడు. సాయంత్ర వేళల్లో సత్ప్రవర్తన గురించీ, మంచి చెడుల గురించి బోధించేవాడు. ఆ ఊర్లోనే ఉన్న ఒక ధనవంతుడికి ఇది కంటగింపుగా ఉండేది. ఒకనాడు... యోగి ఒంటరిగా ఉన్న సమయంలో ఆయన దగ్గరకు వచ్చాడు. ఆయనను అవమానించి, కోపం తెప్పించాలనుకున్నాడు. ఆయనను నిందించడం ప్రారంభించాడు.

"ఓరీ దుష్టుడా! వంచకుడా! నీవు జనాలను మోసం చేస్తున్నావు. నీ బోధనల వల్ల ఎంతమంది పనీపాటా లేకుండా నష్టపోయారో తెలుసా?..." ఇలాంటి మాటలతో ఆ ధనికుడు దూషిస్తున్నా.. యోగి మాత్రం చిరునవ్వుతో ప్రశాంతంగా చూస్తున్నాడు.

"నీకు నా భాష అర్థం కావడం లేదా?" అని అడిగాడు ధనికుడు.

"బాగా అర్థం అవుతోంది" అన్నాడు యోగి.

"అంటే నేను నిన్ను అవమానిస్తున్నట్టు తెలుస్తోందా?" అని నమ్మలేనట్టుగా ప్రశ్నించాడు ధనికుడు.

"అవును" అన్నాడు యోగి.

"అయితే, మౌనంగా ఎలా ఉండగలుగుతున్నావు?" అని అడిగాడు ధనికుడు.

అప్పుడు సాధువు "నాయనా! నీవు నా వద్దకు వచ్చేటప్పుడు ఒక పండో, ఫలమో, ఏదైనా కానుకో తెచ్చావనుకుందాం. నేను వాటిని తీసుకోకుండా నిరాకరించానని అనుకుందాం. అప్పుడు నీవేం చేస్తావు?" అన్నాడు.

"వాటిని తిరిగి తీసుకువెళ్తాను."

"అదే విధంగా... ఇంతవరకూ నీవు పలికిన నిందా వాక్యాలు, తిట్లు నేను స్వీకరించడం లేదు. వాటిని నీవే తీసుకువెళ్ళు" అన్నాడు యోగి ప్రశాంతంగా.

ఈ విధంగా వ్యవహరించడం వల్ల... నిజమైన మానసిక శక్తి, ధైర్యం కలుగుతాయి. ఎవరినైనా శారీరకంగా ఎదిరించి, భౌతికంగా పోరాడేవారికి దేహదారుఢ్యం ఉంటుంది. అతను మానసికంగా బలహీనుడన్నమాట. తపస్సువల్ల మానసిక స్థైర్యం లభిస్తుంది. ఇది బాధను సహించడంతో ఏర్పడుతుంది. ఆ స్థితిలో బాధ, నొప్పి ఇక ఉండవు. ఆనందం మిగిలిపోతుంది. వేదనను సహించడం వల్ల కలిగే ప్రయోజనాన్ని మనం వాస్తవంగా గ్రహించడమే దీనికి కారణం.

ఈ లోకంలో మనకు ఒక చిన్న, అందమైన ఉదాహరణ కనిపిస్తుంది. అదే అమ్మ. తనకు ఎదురైన అత్యంత కష్టమైన ప్రసవవేదనను భరించి... బిడ్డకు జన్మను ఇవ్వడంలో ఆనందాన్ని అమ్మ అనుభవిస్తుంది. తనకు ఆ బాధ వద్దని ఆమె అనుకోదు సరికదా... పురిటినొప్పులతో సహా ప్రసవంలో కలిగే ప్రతి బాధనూ ఆహ్వానిస్తుంది. దానికి మూల్యమేమిటో, ప్రతిఫలమేమిటో ఆమెకు బాగా తెలుసు. ఆమెది నిజమైన తపస్సు.

'తపస్' అనే శబ్దానికి నిజమైన అర్థం... దహించడం. 'కాయేంద్రియ సిద్ధిః అశుద్ధా క్షయాత్ తపసః' అని నిర్వచించాడు పతంజలి మహర్షి... తన 'యోగదర్శనం'లో. 'శారీరకమైన, మానసికమైన కల్మషాలను తొలగించేదే తపస్సు' అని ఈ సూత్ర భావం.

• అప్పరుసు విజయరామారావు,
9177086363

దైవమార్గం

మాటే మంత్రమై

ఏసు జననం అద్భుతమైతే, మరణానంతరం ఆయన పునరుత్థానం మహా అద్భుతం. ఈ రెండిటి మధ్యా ఆయన ఎన్నో అద్భుతాలు చేశాడు. వాటిలో వికలాంగునికి స్వస్థత కలిగించే ఘట్టం ఒకటి.

యెరూషలేం దేవాలయ ద్వారం దగ్గర ఒక కోనేరు ఉంది. దాని పేరు బెథెస్డా. అది ఎంత పెద్దదంటే... దానికి అయిదు మండపాలు ఉన్నాయి. బెథెస్డా (బెత్ హెస్ద) అంటే 'దయా నిలయం' అని అర్థం. కొన్ని సమయాల్లో ఒక దేవదూత ఆ కోనేటిలోకి దిగుతుందనీ, అందులోని నీటిని కదిలిస్తుందనీ, అప్పుడు ఆ నీటిలో మొదట దిగిన వ్యక్తికి ఉన్న వ్యాధులు, వైకల్యాలు తక్షణం మటుమాయం అవుతాయని నమ్మకం ఉండేది. అందుకే... ఆ కోనేరు దగ్గర మండపాల్లో అంధులు, వికలాంగులు... ఇంకా రకరకాల దీర్ఘకాల వ్యాధులతో బాధపడేవారూ గుంపులుగా నిరీక్షిస్తూ ఉండేవారు. వారిలో నడవలేని ఒక వ్యక్తి ఉన్నాడు. తను బాగుపడే అవకాశం దొరక్కపోతుందా? అని ముప్పై ఎనిమిది ఏళ్ళుగా అతను అక్కడే ఎదురుచూస్తున్నాడు. అతణ్ణి ఎవరూ పట్టించుకొనేవారు కారు.

ఒకసారి ఏసు ప్రభువు అక్కడికి వచ్చాడు. ఆ వికలాంగుణ్ణి చూశాడు. "నీకు స్వస్థత చేకూరాలని కోరుకుంటున్నావా?" అని అడిగాడు.

"అయ్యా! ఆ కోనేటిలోని నీటిని దేవదూత కదిలించగానే... అందులో దిగాలని ప్రయత్నిస్తూనే ఉన్నాను. కానీ ముందుగా వెళ్ళలేకపోతున్నాను. ఎప్పుడూ ఎవరో ఒకరు నాకన్నా ముందు దిగుతున్నారు. నాకు సాయపడేవాళ్ళు ఎవరూ లేరు. అందుకే ఇలా ఉండిపోయాను" అంటూ అతను మొరపెట్టుకున్నాడు.

తనకు మంచి జరుగుతుందనీ, దైవం తనను కరుణిస్తాడనీ అతనిలో ఉన్న నమ్మకాన్ని ఏసు గమనించాడు. "అయితే సరే! నువ్వు లేచి నిలబడు, నీ పరుపును తీసుకొని నడువు" అని చెప్పాడు.

మామూలుగా లేవడం కష్టమైన ఆ వ్యక్తి... ఏసు మాటలు వినగానే లేచాడు. ప్రభువు మాటే మంత్రమయింది. తక్షణమే అతనికి స్వస్థత లభించింది. తన పరుపు తీసుకొని... గబగబా నడిచాడు. అతని ఆనందానికి అవధులు లేవు. "ఇదంతా ప్రభువు చూపిన దయ" అని చుట్టుపక్కలవారికి చెబుతూ, ఏసుకు మొక్కుతూ అక్కడి నుంచి వెళ్ళిపోయాడు.

ఏసు క్రీస్తు చేసిన అద్భుతాల్లో మూడవదిగా బైబిల్‌లో దీని ప్రస్తావన ఉంది. కాగా.... అది విశ్రాంతి దినం అనీ, ఆ రోజు ఎలాంటి మహిమలూ చేయకూడదనీ కొందరు మూఢులు ఏసును నిలదీశారు. "మానవతను వివంచిన ఆచారం మరొకటి లేదు" అంటూ వారి మాటలను ఏసు ఖండించాడు. మంచి జరగాలనే ఆశ మనలో ఉన్నప్పుడు... ఏదో ఒక రూపంలో దైవం నుంచి సాయం అందుతుందనడానికి ఆ కథ ఒక ఉదాహరణ.



• డాక్టర్ దేవదాసు బెర్నార్డ్ రాజు
9866755024

జెన్ కథ

జ్ఞానోదయం

టిబెట్‌లో ఒక బౌద్ధ సన్యాసి ఉండేవాడు. అతను విపరీతమైన జ్ఞాన తృష్ణ కలిగినవాడు. ఎక్కడైనా జ్ఞాని ఉన్నాడని తెలిస్తే... ఆ ప్రదేశం ఎంత దూరంలో ఉన్నా... తక్షణం అతణ్ణి కలుసుకోవడానికి వెళ్ళేవాడు. ఆ జ్ఞాని బోధను వినాలని ఆత్రుతపడేవాడు. ఒక రోజు అలాంటి జ్ఞాని సమీప గ్రామానికి వచ్చాడని తెలిసింది. అది సూర్యాస్తమయ సమయం. తన వెంట ఏదైనా తీసుకువెళ్ళాలనే ఆలోచనైనా లేకుండా... ఆ సన్యాసి బయలుదేరాడు.

చాలాసేపు నడిచి, నడిచిన సన్యాసి అలసిపోయాడు. అతని గొంతు ఎండిపోతోంది. ఇంతలో చీకటి పడింది. ఆకాశంలో అక్కడక్కడ నక్షత్రాలు మెరుస్తున్నాయి. అది జన సంచారం లేని ప్రదేశం. ఏదీ తినకుండా, తాగకుండా నడుస్తూ ఉండడం వల్ల అతనికి శోష వచ్చినట్టయింది. చీకట్లో అటూ ఇటూ వెతికాడు. ఎక్కడా పండ్లు కానీ, నీరు కానీ, తనకు సాయం చేసేవారు కానీ కనిపించలేదు.

అతను నేల మీద మోకరిల్లి, ఆకాశం వైపు చూసి, చేతులు జోడించి... "భంతే! ఒంటరిగా ఉన్నాను. అలసిపోయాను. దాహంగా ఉంది. నీవే దిక్కు. నన్ను కాపాడు. లేకపోతే నేను మరణిస్తాను. సత్యాన్ని తెలుసుకోకుండానే కన్ను మూస్తే... నా జీవితం వ్యర్థమవుతుంది. కరుణించు. నన్ను కాపాడు" అని బుద్ధ భగవానుణ్ణి ప్రార్థించాడు.

అతను అటు ఇటూ కదులుతూ ఉంటే... చేతికి ఏదో తగిలింది. మూతపడుతున్న కళ్ళను శక్తికొద్దీ తెరచి చూశాడు. అది బంగారు పాత్రలా ఉంది. అందులో నీరు ఉంది. 'బుద్ధ భగవానుడు కరుణాసాగరుడు' అనుకుంటూ అందులోని నీటిని తాగేశాడు. దప్పిక తీరింది. తృప్తిగా, హాయిగా అక్కడే నిద్రపోయాడు.


మరుసటిరోజు సూర్యుడి వెచ్చటి కిరణాలు అతణ్ణి నిద్రలేపాయి. ముందురోజు జరిగింది గుర్తుకువచ్చింది. అతను లేచి, చుట్టూ చూశాడు. అక్కడ బంగారు పాత్రా లేదు, నీరూ లేదు. కొద్దిరోజుల కిందట మరణించిన మనిషి కపాలం ఉంది. బహుశా ఏదో క్రూరజంతువు దాడిలో మరణించిన మనిషిలా అనిపించింది. అక్కడక్కడ రక్తపు మరకలు ఉన్నాయి. కుళ్ళిన మాంసం ముక్కలు ఉన్నాయి. అవి కీటకాలతో నిండి ఉన్నాయి. తను రాత్రి తాగింది ఆ కపాలంలోని నీళ్ళనేనని అతనికి అర్థమయింది. అతను ఆశ్చర్యానికి, ఆందోళనకు గురయ్యాడు. తనకు బాగా దాహంగా ఉండడం వల్ల, రాత్రి చీకటిగా ఉండడం వల్ల అదొక బంగారు పాత్రలా, అందులోని జలం మంచి నీళ్ళలా అనిపించి తాగేశాడు. పగటి వెలుగులో నిజం తెలుసుకున్న అతనికి కడుపులో వికారం మొదలైంది. వాంతి చేసుకున్నాడు. కాసేపు నిశ్చలంగా కూర్చున్నాడు. అతనిలో అనేక ఆలోచనలు కదలాడాయి. తనకు జ్ఞానోదయమైనట్టు, విశ్వరహస్యం తెలుసుకున్నట్టు అనుభూతికి లోనయ్యాడు.


జిజ్ఞాస తీవ్రమైనప్పుడు ఏదో ఒక విధంగా జ్ఞానజ్యోతి వెలుగుతుంది. అజ్ఞానంలో ఉన్నప్పుడు అందంగా, ఆకర్షణీయంగా, విలువైనవిగా కనిపించినవన్నీ జ్ఞానోదయం అయిన వెంటనే జుగుప్సాకరంగా, నిస్తేజంగా, నిర్జీవంగా, నిష్ఫలమైనవిగా గోచరిస్తాయి. అందుకే సాధారణ జనులు సంపదలను, పదవులను, బంధుత్వాలను అంటిపెట్టుకొని ఉంటే... జ్ఞానులు వాటన్నిటినీ తృణీకరిస్తారు. సత్యాన్ని, జ్ఞానాన్ని మాత్రమే అనుక్షణం అనుసరిస్తారు, అనుభవిస్తారు.

• రాచమడుగు శ్రీనివాసులు



'దిక్సూచి' వెబ్ పేజీలో...
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్ఎల్
https://ejyothy.com/oeRMnGNలో చదవండి.







ఘనవిజయం సాధించాలి

అల్లు అరవింద్



ఆశిష్, 'బేబీ' ఫేమ్ వైష్ణవి చైతన్య నటించిన చిత్రం 'లవ్ మీ'. 'ఇఫ్ యు డేర్' అనేది ఉప శీర్షిక. దిల్ రాజు, శిరీష్ సమర్పణలో హర్షిత్ రెడ్డి, హన్షిత, నాగ మల్లిడి నిర్మించారు. అరుణ్ భీమవరపు దర్శకత్వం వహించారు. ఈ శుక్రవారం విడుదలవుతున్న సందర్భంగా చిత్ర బృందం ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన నిర్మాత అల్లు అరవింద్ మాట్లాడుతూ "ఈ మూవీ కోసం చిత్రబృందం చాలా కష్టపడ్డారు. ఈ సినిమా ఘనవిజయం సాధించాలి. 'లవ్ మీ' టీమ్ అందరికీ ఆల్ ది బెస్ట్" అని అన్నారు. "లవ్ మీ' డిఫరెంట్ సినిమా. ఈ చాలెంజింగ్ స్క్రిప్ట్‌ను అరుణ్ తెరకెక్కించిన విధానం సూపర్బ్. కొత్తదనాన్ని కోరుకునే ప్రేక్షకులకి ఈ సినిమా తప్పక నచ్చుతుంది" అని నిర్మాత దిల్‌రాజు చెప్పారు. సంగీత దర్శకుడు కీరవాణి మాట్లాడుతూ "ఈ సినిమాతో దర్శకుడు అరుణ్ నాన్ లీనియర్ నేరేషన్‌కు కొత్త నిర్వచనం ఇచ్చారు" అని అన్నారు. చిత్ర దర్శకుడు అరుణ్ భీమవరపు మాట్లాడుతూ "ఈ సినిమాకు సీక్వెల్‌గా 'కిల్ మీ ఇఫ్ యు డేర్' వస్తుంది" అని చెప్పారు. హీరో ఆశిష్ మాట్లాడుతూ "ఈ సినిమా సక్సెస్‌పై చాలా కాన్ఫిడెంట్‌గా ఉన్నాం. సంగీత దర్శకుడు కీరవాణి, సినిమాటోగ్రాఫర్ పీసీ శ్రీరామ్ వంటి దిగ్గజాలు ఈ సినిమాకు వర్క్ చేయటంతో లక్కీగా ఫీలవుతున్నాం" అని చెప్పారు.

రాజు యాదవ్ ఓ ఎమోషనల్ రైడ్



టెలివిజన్ కామెడీ షో 'జబర్దస్త్'తో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు గెటప్ శ్రీను. తర్వాత పలు చిత్రాల్లో నటించిన ఆయన.. మంచి కామెడీ టైమింగ్‌తో ప్రేక్షకుల మనుసులు గెలుచుకుని పాపులర్ కమెడియన్‌గా మారారు. ఆయన తొలిసారి హీరోగా నటించిన చిత్రం 'రాజు యాదవ్'. కృష్ణమాచారి దర్శకత్వం వహించారు. కె.ప్రశాంత్ రెడ్డి, రాజేశ్ కల్లేపల్లి సంయుక్తంగా నిర్మించారు. ఫన్, ఎమోషనల్ రైడ్‌గా తెరకెక్కిన 'రాజు యాదవ్' ఈ రోజే విడుదలవుతున్న సందర్భంగా హీరో గెటప్ శ్రీను మీడియాతో ముచ్చటించారు.

"దర్శకుడు నన్ను కలిసినప్పుడు మొదట నా పాత్ర గురించి చెప్పారు. భలే అనిపించింది. ఆ తర్వాత కథ వినగానే వెంటనే ఒప్పేసుకున్నా. ఈ కథను డైరెక్టర్ వాస్తవ సంఘటనల ఆధారంగా రాసుకున్నా.. క్యారెక్టర్ మాత్రం కల్పితమే. నేను ఇప్పటి వరకు చేసిన పాత్రల్లో అత్యంత సవాల్‌తో కూడుకున్నది ఇదే. ఎప్పుడూ నవ్వుతూ ఉండటం మామూలు విషయం కాదు. కొన్ని సందర్భాల్లో ఈ పాత్రలో వంద శాతం ఇవ్వలేనేమోనని.. ఒక ఆర్టిస్ట్‌గా ఫెయిల్ అయిపోతానేమో అని అనుకున్న సందర్భాలూ ఉన్నాయి. అటువంటి సమయాల్లో దర్శకుడే నన్ను సపోర్ట్ చేశారు. ఈ సినిమాను దర్శకుడు కృష్ణమాచారి చాలా సహజంగా తెరకెక్కించారు. ప్రస్తుత తరం ప్రేక్షకులు రియలిస్టిక్ సినిమాలనే ఇష్టపడుతున్నారు. ఈ సినిమా కూడా సహజత్వం కోరుకునే ప్రేక్షకులందరికీ తప్పక నచ్చుతుంది" అని చెప్పారు.

'మంజుమ్మెల్ బాయ్స్' నిర్మాతలకు ఇళయరాజా లీగల్ నోటీసులు



మలయాళ బ్లాక్‌బస్టర్ చిత్రం 'మంజుమ్మెల్ బాయ్స్' నిర్మాతలకు ప్రముఖ సంగీత దర్శకుడు ఇళయరాజా లీగల్ నోటీసులు పంపారు. కారణం 'గుణ' చిత్రం కోసం ఇళయరాజా స్వరపరిచిన 'కమ్మని ఈ ప్రేమ లేఖలే' పాటను ఈ సినిమాలో వాడడమే. అనుమతి తీసుకోకుండా, రాయల్టీ ఫీజు చెల్లించకుండా ఇలా పాటను ఉపయోగించడం కాపీరైట్ చట్టాన్ని అతిక్రమించినట్లేనని ఇళయరాజా లాయర్ శరవణన్ అన్నాదురై నిర్మాతలకు పంపించిన నోటీసులో హెచ్చరించారు. ఈ విషయంపై 15 రోజుల్లో నిర్మాతలు తగిన విధంగా స్పందించకపోతే చట్టపరమైన చర్యలు తీసుకోవడానికి వెనుకాడమని ఆయన తెలిపారు. కాగా, రజనీకాంత్ ప్రస్తుతం లోకేశ్ కనగరాజ్ దర్శకత్వంలో నటిస్తున్న 'కూలీ' సినిమాలోనూ తను సంగీతం అందించిన 'తంగా మగన్'(1983) చిత్రంలోని 'వా వా పక్కమ్ వా' పాటను కూడా అనుమతి లేకుండా వాడారని ఇళయరాజా, నిర్మాణ సంస్థ సన్ పిక్చర్స్‌కు ఈ నెల 2న నోటీసులు పంపిన సంగతి తెలిసిందే.

దర్శకుడిగా మరో కొరియోగ్రాఫర్



పలు చిత్రాలకు కొరియోగ్రఫీ నిర్వహించిన సతీశ్‌రాజ్ దర్శకుడవుతున్నారు. స్వీయ దర్శకత్వంలో ఎస్.ఆర్. మూవీ జంక్షన్ బేనరుపై ఓ చిత్రాన్ని నిర్మించనున్నారు. ఈ సంస్థ లోగోను సీనియర్ నటుడు మురళీమోహన్ ఆవిష్కరించారు. తన ఇష్టదైవం సాయిబాబా కావడంతో 'శ్రద్ధ.. సబూరి' పేరుతో రూపొందించిన పాటను కొరియోగ్రాఫర్లు శేఖర్ మాస్టర్, విజయ్ బిన్నీ, నిర్మాత దామోదర ప్రసాద్ రిలీజ్ చేశారు. మూడు నిముషాల పాటలో మొత్తం కథ అర్థమయ్యేలా చూపించే దర్శకుడే కొరియోగ్రాఫర్ అనీ, ప్రతిభావంతుడైన సతీశ్‌రాజ్ దర్శకుడిగా మారడం ఆనందదాయకం అనీ మురళీమోహన్ చెప్పారు. సభలో పాల్గొన్న అతిథులందరూ దర్శకుడిగా కూడా సతీశ్‌రాజ్ విజయం సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో హీరోయిన్ శిరీష, నిర్మాత అర్చన కూడా పాల్గొన్నారు.

కొత్త తేదీన సత్యభామ



కాజల్ అగర్వాల్ ప్రధాన పాత్ర పోషించిన చిత్రం 'సత్యభామ'. ఇందులో ఆమె శక్తిమంతమైన పోలీసాఫీసర్ పాత్ర పోషించారు. ఈ చిత్రం విడుదల కొత్త తేదీకి మారింది. జూన్ 7న 'సత్యభామ'ను విడుదల చేస్తున్నట్లు చిత్రబృందం గురువారం ప్రకటించింది. నవీన్ చంద్ర కీలకపాత్ర పోషించిన ఈ చిత్రానికి సుమన్ చిక్కాల దర్శకత్వం వహించారు. బాబీ తిక్క, శ్రీనివాసరావు తక్కలపల్లి నిర్మించారు. దర్శకుడు శశికిరణ్ తిక్క స్క్రీన్‌ప్లే అందించడంతో పాటు సమర్పకులుగా వ్యవహరిస్తున్నారు. ఈ చిత్రానికి సంగీతం: శ్రీ చరణ్ పాకాల. సినిమాటోగ్రఫీ: బి విష్ణు





సరికొత్త శిఖరాలకు సూచీలు

23,000కు చేరువలో నిఫ్టీ ● మళ్లీ 75,000 ఎగువన సెన్సెక్స్ ● మార్కెట్లకు ఆర్‌బీఐ డివిడెండ్ జోష్

ముంబై: స్టాక్ మార్కెట్ సూచీలు గురువారం సరికొత్త ఉన్నత శిఖరాలను అధిరోహించాయి. గత ఆర్థిక సంవత్సరానికిగాను ఆర్‌బీఐ కేంద్ర ప్రభుత్వానికి రికార్డు స్థాయిలో డివిడెండ్ ప్రకటించడం మార్కెట్ వర్గాల్లో ఉత్సాహం పెంచింది. బ్యాంకింగ్, ఆయిల్ అండ్ గ్యాస్, ఆటో షేర్లలో మదుపరులు భారీగా కొనుగోళ్లు జరిపారు. దాంతో సెన్సెక్స్ 1,196.98 పాయింట్ల లాభంతో 75,418.04 వద్ద సరికొత్త జీవనకాల గరిష్ఠ ముగింపును నమోదు చేసింది. ఈ జనవరి 29 తర్వాత ఒక రోజులో సూచీకిది అతిపెద్ద లాభం. అంతేకాదు, ఒకదశలో సెన్సెక్స్ 1,278.85 పాయింట్ల వరకు ఎగబాకి 75,499.91 వద్ద ఆల్‌టైం ఇంట్రాడే రికార్డునూ నమోదు చేసింది. నిఫ్టీ విషయానికొస్తే ఒకదశలో 395.8 పాయింట్లు పెరిగి 22,993.60 వద్ద సరికొత్త ఇంట్రాడే గరిష్ఠాన్ని, చివరికి 369.85 పాయింట్ల లాభంతో 22,967.65 వద్ద ఆల్‌టైం రికార్డు ముగింపును నమోదు చేసింది. కొనుగోళ్ల జోరుతో బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.4.28 లక్షల కోట్లకు పైగా పెరిగి సరికొత్త జీవనకాల గరిష్ఠ స్థాయి రూ.420.22 లక్షల కోట్లకు (5.05 లక్షల కోట్ల డాలర్లు) చేరుకుంది. అలాగే, నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ తొలిసారిగా 5 లక్షల కోట్ల డాలర్ల (రూ.416.57 లక్షల కోట్లు) మైలురాయిని దాటింది.

30లో 27 లాభపడ్డాయ్.. : సెన్సెక్స్‌లోని 30 కంపెనీల్లో 27 లాభపడ్డాయి. ఎల్ అండ్ టీ షేరు 3.64 శాతం వృద్ధితో సూచీ టాప్ గెయినర్‌గా నిలిచింది. ఎం అండ్ ఎం, యాక్సిస్ బ్యాంక్, మారుతి సుజుకీ షేర్లు సైతం మూడు శాతానికి పైగా పెరిగాయి.



అదానీ షేర్లు జిగేల్

వరుసగా రెండో రోజూ అదానీ గ్రూప్ షేర్లు ర్యాలీ తీశాయి. గ్రూప్ ప్రధాన కంపెనీ అదానీ ఎంటర్‌ప్రైజెస్ షేరు ఏకంగా 8 శాతం పుంజుకుంది. ఈ కంపెనీని సెన్సెక్స్‌లో చేర్చవచ్చున్న అంచనాలు ఇందుకు దోహదపడ్డాయి. కాగా, ఎన్‌డీటీవీ 7.56 శాతం, అదానీ పోర్ట్స్ 4.72 శాతం, ఏసీసీ 2.86 శాతం, అదానీ పవర్ 2.79 శాతం, అదానీ టోటల్ గ్యాస్ 2.30 శాతం, అంబుజా సిమెంట్స్ 2.09 శాతం, అదానీ విల్మర్, అదానీ గ్రీన్ ఎనర్జీ, అదానీ ఎనర్జీ సొల్యూషన్స్ షేర్లు ఒక శాతానికి పైగా పెరిగాయి. దాంతో గ్రూప్‌లోని 10 లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.17.23 లక్షల కోట్లకు చేరుకుంది. బుధవారం గ్రూప్ మార్కెట్ క్యాప్ 20,000 కోట్ల డాలర్ల (రూ.16.9 లక్షల కోట్లు) మైలురాయిని దాటింది.

సెన్సెక్స్‌లోకి అదానీ ఎంటర్‌ప్రైజెస్

తొలిసారిగా అదానీ గ్రూప్ కంపెనీ సెన్సెక్స్‌లో చోటు దక్కించుకోబోతోంది. సెన్సెక్స్ జాబితా నుంచి విప్రోను తొలగించి, దాని స్థానంలో అదానీ ఎంటర్‌ప్రైజెస్‌ను చేర్చే అవకాశం ఉంది. శుక్రవారం నిర్వహించనున్న అర్ధ వార్షిక సమీక్షలో బీఎస్ఈ ఈ విషయాన్ని ప్రకటించే అవకాశం ఉంది. జూన్ 21న సెన్సెక్స్ కంపెనీల సర్దుబాటు అమలులోకి రానుంది.

గో డిజిట్ షేరు తొలిరోజు వృద్ధి 12 శాతం

గో డిజిట్ జనరల్ ఇన్సూరెన్స్ లిమిటెడ్ గురువారం షేర్లను స్టాక్ ఎక్స్ఛేంజ్‌ల్లో లిస్టింగ్ చేసింది. ఐపీఓ ధర రూ.272తో పోలిస్తే, బీఎస్ఈలో కంపెనీ షేరు 3.34 శాతం ప్రీమియంతో రూ.281.10 వద్ద లిస్టయింది. ఒకదశలో 15.44 శాతం వరకు పెరిగి రూ.314 స్థాయికి చేరిన షేరు ధర చివరికి 12.40 శాతం లాభంతో రూ.305.75 వద్ద ముగిసింది. తొలిరోజు ట్రేడింగ్ ముగిసేసరికి కంపెనీ మార్కెట్ విలువ రూ.28,043.46 కోట్లుగా నమోదైంది.

భారీగా తగ్గిన బంగారం, వెండి

దేశీయంగా బంగారం ధరలు వరుసగా రెండో రోజూ తగ్గుముఖం పట్టాయి. ఢిల్లీ మార్కెట్లో 10 గ్రాముల మేలిమి (24 క్యారెట్లు) బంగారం ధర గురువారం రూ.1,050 తగ్గి రూ.73,550 వద్దకు దిగివచ్చింది. కిలో వెండి సైతం రూ.2,500 తగ్గుదలతో రూ.92,600కు పరిమితమైంది. అంతర్జాతీయంగా వీటి ధరలు తగ్గడమే ఇందుకు కారణం. ఇంటర్నేషనల్ కమోడిటీ ఎక్స్ఛేంజ్ సెంటర్‌లో ఔన్స్ (31.10 గ్రాములు) బంగారం మళ్లీ 2,400 డాలర్ల దిగువకు పడిపోయింది. ఒకదశలో రేటు 42 డాలర్లు తగ్గి 2,375 డాలర్ల వద్ద ట్రేడైంది. వెండి సైతం 30.80 డాలర్లకు దిగివచ్చింది.

స్టెరిలైట్ వ్యాపార విభజనకు ఆమోదం

విద్యుత్ సరఫరా వ్యాపారాన్ని విభజించేందుకు తమ వాటాదారులు ఆమోదం తెలిపారని స్టెరిలైట్ పవర్ ట్రాన్స్‌మిషన్ లిమిటెడ్ (ఎస్‌టీపీఎల్) వెల్లడించింది. విభజించిన ట్రాన్స్‌మిషన్ వ్యాపారాన్ని స్టెరిలైట్ గ్రిడ్ 5 లిమిటెడ్‌లో చేర్చనున్నారు. గ్లోబల్ ప్రొడక్ట్స్, ఈపీసీ సేవల విభాగాలు మాత్రం ఎస్‌టీపీఎల్ పరిధిలో కొనసాగనున్నాయి.

ఇండిగో లాభాలు రెట్టింపు



న్యూఢిల్లీ: ఇండిగో కంపెనీ 2023-24 ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసికంలో రూ.17,825.3 కోట్ల ఆదాయంపై రూ.1,894.8 కోట్ల నికర లాభం ఆర్జించింది. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఆదాయం 26 శాతం మాత్రమే పెరిగినా, నికర లాభం మాత్రం మాత్రం రెండు రెట్లకుపైగా పెరిగింది. 2023-24 ఆర్థిక సంవత్సరం మొత్తానికి కంపెనీ రూ.71,200 కోట్ల ఆదాయంపై రూ.8,172.5 కోట్ల నికర లాభం ఆర్జించింది. గత ఆర్థిక సంవత్సరం అన్ని త్రైమాసికాల్లోనూ లాభాలు నమోదు చేసినట్టు కంపెనీ సీఈఓ పీటర్ ఎల్బర్స్ చెప్పారు. ఈ ఆర్థిక సంవత్సరంలో రద్దీగా ఉండే మార్గాల్లో బిజినెస్ క్లాస్ ప్రవేశపెట్టబోతున్నట్టు కంపెనీ తెలిపారు.

అజాద్ ఇంజనీరింగ్‌కు జీటీఆర్ఈ కాంట్రాక్టు

హైదరాబాద్: ప్రెసిషన్ ఇంజనీరింగ్, తయారీలో అగ్రగామి అయిన అజాద్ ఇంజనీరింగ్‌కు డీఆర్‌డీఓ అనుబంధ సంస్థ జీటీఆర్ఈ (గ్యాస్ టర్బైన్ రీసెర్చ్ ఎస్టాబ్లిష్‌మెంట్) నుంచి ప్రతిష్ఠాత్మకమైన కాంట్రాక్టు లభించింది. ఈ కాంట్రాక్టు కింద అజాద్ ఇంజనీరింగ్ రక్షణ అప్లికేషన్లలో ఉపయోగించేందుకు వీలైన ఆధునిక గ్యాస్ టర్బైన్ ఇంజన్ తయారుచేయవలసి ఉంటుంది. తొలి బ్యాచ్ ఇంటిగ్రేటెడ్ ఇంజన్లను 2026 ప్రారంభంలో డెలివరీ చేయాల్సి ఉంటుంది.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	73,420 ▼	67,300 ▼	97,000 ▼
ముంబై	72,830 ▼	66,710 ▼	90,055 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



24వ తేదీ			
హైదరాబాద్	550	విజయవాడ	540
వరంగల్	552	గోదావరి	540
చిత్తూరు	628	విశాఖపట్నం	550
		డజను గుడ్లు రూ.72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	140	గోదావరి	149
వరంగల్	140	విజయవాడ	149
కరీంనగర్	140	గుంటూరు	149
మహబూబ్‌నగర్	142	ఒంగోలు	149
కర్నూలు	142	చిత్తూరు	163
విశాఖపట్నం	141		

నవనామి నుంచి 'మెగాలీవో' ప్రాజెక్టు

ఫ్లాటు ధర రూ8-12 కోట్లు

హైదరాబాద్: ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థ నవనామి ప్రాజెక్ట్స్ హైదరాబాద్‌లో మరో ప్రతిష్ఠాత్మక రెసిడెన్షియల్ ప్రాజెక్టు చేపట్టింది. అప్పా జంక్షన్ వద్ద 'మెగాలీవో' పేరుతో చేపట్టిన ఈ లగ్జరీ రెసిడెన్షియల్ ప్రాజెక్టు కోసం కంపెనీ రూ.800 కోట్ల నుంచి రూ.900 కోట్లు ఖర్చు చేయనుంది. ఇందులో రూ.250 కోట్లు బ్యాంకుల నుంచి రుణంగా, మిగతా మొత్తాన్ని అంతర్గత వనరుల ద్వారా సమకూర్చుకుంటామని కంపెనీ ఎండీ నవీన్ గద్దె చెప్పారు. ఈ ప్రాజెక్టులో భాగంగా 4.1 ఎకరాల్లో 50 అంతస్తుల్లో 150 ఫ్లాట్లతో రెండు టవర్లు నిర్మిస్తామన్నారు. ఒక్కో ఫ్లాటు విస్తీర్ణం 8,888 ఎస్ఎఫ్‌టీ, 9,999 ఎస్ఎఫ్‌టీ, 11,111 ఎస్ఎఫ్‌టీ మధ్య ఉంటాయన్నారు. విస్తీర్ణాన్ని బట్టి ఒక్కో ఫ్లాటు ధర కనిష్ఠంగా రూ.8 కోట్లు, గరిష్ఠంగా రూ.12 కోట్ల వరకు ఉంటుందన్నారు. ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయాలకు 15 నుంచి 20 నిమిషాల డ్రైవింగ్‌తో చేరుకునే 'మెగాలీవో' ప్రాజెక్టు నిర్మాణం నాలుగేళ్లలో పూర్తవుతుందని నవీన్ గద్దె చెప్పారు.

స్వల్పంగా తగ్గిన ఐటీసీ లాభం

ITC Limited

ఒక్కో షేరుపై రూ.7.5 డివిడెండ్

న్యూఢిల్లీ: ఐటీసీ నికర లాభం మార్చి త్రైమాసికంలో స్వల్పంగా తగ్గింది. ఈ కాలానికి కంపెనీ కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన రూ.19,446.49 కోట్ల ఆదాయంపై రూ.5,190.71 కోట్ల నికర లాభం ఆర్జించింది. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఆదాయం రెండు శాతం పెరిగినా నికర లాభం రూ.5,242.59 కోట్ల నుంచి 1.3 శాతం తగ్గి రూ.5,190.71 కోట్లకు చేరింది. ఖర్చులు మూడు శాతం పెరగడం ఇందుకు కారణం. స్టాండ్‌అలోన్ ప్రాతిపదికన క్యూ 4లో ఐటీసీ ఆదాయం ఆరు శాతం పెరిగి రూ.6,534 కోట్లకు చేరింది. ఆర్థిక సంవత్సరం మొత్తాన్ని పరిగణనలోకి తీసుకున్నా కంపెనీ రూ.69,446 కోట్ల ఆదాయంపై రూ.20,422 కోట్ల నికర లాభం ఆర్జించింది. 2022-23 ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఆదాయం 6.8 శాతం, నికర లాభం 8.9 శాతం పెరిగాయి.

రూ.7.5 చొప్పున తుది డివిడెండ్: క్యూ4లో నికర లాభం స్వల్పంగా తగ్గినా 2023-24 ఆర్థిక సంవత్సరానికి రూపాయి ముఖ విలువ ఉన్న ఒక్కో షేరుపై వాటాదారులకు రూ.7.5 చొప్పున తుది డివిడెండ్ చెల్లించాలని ఐటీసీ డైరెక్టర్ల బోర్డు సిఫారసు చేసింది. ఈ ఏడాది జనవరిలో ప్రకటించిన రూ.6.25 మధ్యంతర డివిడెండ్‌ను కూడా పరిగణనలోకి తీసుకుంటే, గత ఆర్థిక సంవత్సరానికి వాటాదారులకు ఒక్కో షేరుపై రూ.13.75 చొప్పున డివిడెండ్‌గా చెల్లించినట్టవుతుంది.

మార్కెట్లో ఐక్యూ జడ్9ఎక్స్ స్మార్ట్‌ఫోన్



హైదరాబాద్: తెలుగు రాష్ట్రాల మార్కెట్లో ఐక్యూ జడ్9ఎక్స్ స్మార్ట్‌ఫోన్లను గురువారం విడుదల చేశారు. అత్యుత్తమ ఫీచర్లతో వచ్చిన ఈ స్మార్ట్‌ఫోన్ల ధర వేరియెంట్‌ను బట్టి రూ.11,999 నుంచి రూ.15,999 మధ్యన ఉంది. 7.99 ఎంఎం మందంతో అతి సన్నగా కనిపించే ఈ హ్యాండ్‌సెట్లకు 6000ఎంఏహెచ్ బ్యాటరీ అమర్చారు. ఎంటర్‌టైన్‌మెంట్, అడ్వెంచర్ ఔత్సాహికులకు ఇది చక్కని స్మార్ట్‌ఫోన్ అని ఐక్యూ సీఈఓ నిపుణ్ మార్యా అన్నారు. అమెజాన్‌లోని ఐక్యూ ఇ-స్టోర్‌లో ఈ హ్యాండ్‌సెట్లు రెండు కలర్ వేరియెంట్లలో అందుబాటులో ఉంటాయి.

తాజ్‌జీవీకే లాభం రూ.26 కోట్లు

హైదరాబాద్: తాజ్ జీవీకే హోటల్స్ మార్చి త్రైమాసికంలో స్టాండ్‌అలోన్ ప్రాతిపదికన రూ.116 కోట్ల ఆదాయంపై రూ.26 కోట్ల నికర లాభం ఆర్జించింది. గత ఏడాది ఇదే కాలంలో కంపెనీ రూ.106 కోట్ల ఆదాయంపై రూ.14 కోట్ల నికర లాభం ఆర్జించింది. 2023-24 ఆర్థిక సంవత్సరం మొత్తాన్ని పరిగణనలోకి తీసుకున్నా తాజ్ జీవీకే హోటల్స్ రూ.410 కోట్ల ఆదాయంపై రూ.74 కోట్ల నికర లాభం నమోదు చేసింది.

జీఓసీఎల్ లాభం రూ.5 కోట్లు

హైదరాబాద్: నాలుగో త్రైమాసికంలో జీఓసీఎల్ కార్పొరేషన్ రూ.237 కోట్ల కన్సాలిడేటెడ్ ఆదాయంపై రూ.5 కోట్ల నికర లాభం నమోదు చేసింది. 2023-24 ఆర్థిక సంవత్సరం మొత్తాన్ని పరిగణనలోకి తీసుకున్నా కంపెనీ రూ.949 కోట్ల ఆదాయంపై రూ.48 కోట్ల నికర లాభం ఆర్జించింది. అసాధారణ మార్కెట్ ఆటుపోట్లు, ప్రధాన ముడి పదార్థాల ధరలు పెరిగి పోవడం, ద్రవ్యోల్బణ ఒత్తిళ్లు ఉన్నా వాటిని తట్టుకుని లాభాలు నమోదు చేసినట్టు కంపెనీ తెలిపింది.

స్పోర్ట్స్



ప్రీతిస్మిత వరల్డ్ రికార్డు

స్వర్ణంతో మెరిసిన భారత లిఫ్టర్

లిమా (పెరూ): భారత వెయిట్ లిఫ్టర్ ప్రీతిస్మిత భోయ్ వరల్డ్ యూత్ చాంపియన్‌షిప్స్‌లో అదరగొట్టింది. గురువారం జరిగిన మహిళల 40 కిలోల విభాగంలో 15 ఏళ్ల ప్రీతిస్మిత క్లీన్ అండ్ జెర్క్‌లో ప్రపంచ రికార్డు తిరగరాసింది. 75 కిలోల గత ప్రపంచ రికార్డును ఆమె 76 కిలోలు ఎత్తడం ద్వారా అధిగమించింది. స్నాచ్‌లో 57 కేజీలు ఎత్తిన ఆమె..టోటల్‌గా 133 కేజీల బరువెత్తి స్వర్ణ పతకం కొల్లగొట్టింది. భారత్‌కు చెందిన జోష్న సబర్ (56+69=125కి.) రజతం, టర్కీ లిఫ్టర్ ఫత్మా (55+65=120కి.) కాంస్యపతకం నెగ్గారు. మహిళల 45 కి.లలో పాయల్ రజతం, పురుషుల 49 కి.లలో బాబూలాల్ కాంస్య పతకం గెలిచారు.

భారత్-పాక్ పోరు..

టిక్కెట్ @ రూ. 16.50 లక్షలా?



న్యూఢిల్లీ: భారత-పాకిస్థాన్ జట్ల మధ్య పోరు..అందునా వరల్డ్ కప్..అదీ టీ20 ప్రపంచ కప్..ఇంకేం ఈ బ్లాక్‌బస్టర్ మ్యాచ్ టిక్కెట్లకు ఉన్న డిమాండ్ అంతా ఇంతాకాదు. సరిగ్గా ఈ డిమాండ్‌నే అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) భారీగా క్యాష్ చేసుకుంటోందట! జూన్ తొమ్మిదిన న్యూయార్క్‌లోని నసౌ స్టేడియంలో జరిగే ఈ మెగా పోరు ఒక్కో టిక్కెట్‌ను ఐసీసీ ఏకంగా రూ. 16.50 లక్షలకుపైగానే అమ్ముతోందని ఐపీఎల్ మాజీ కమిషనర్ లలిత్ మోదీ ఆరోపించాడు. స్టేడియంలోని డైమండ్ క్లబ్ సెక్షన్‌లో సీట్ టిక్కెట్‌కు ఈ రేటు నిర్ణయించడాన్ని అతడు ఆక్షేపించాడు. 'క్రికెట్‌ను మరింత విస్తరించే లక్ష్యంతో అమెరికాలో ప్రపంచ కప్‌ను నిర్వహిస్తున్నారు. కానీ ఐసీసీ మాత్రం కలెక్షన్లకు ఈ టోర్నీని ఉపయోగించుకుంటోంది. ఇతర టిక్కెట్లను కూడా రూ. 2.30 లక్షలకు తక్కువ కాకుండా అమ్మడం లేదు' అని అన్నాడు.

అథ్లెట్లూ మనుషులే: బింద్రా

న్యూఢిల్లీ: అథ్లెట్లూ మనుషులేనని, పతకాలు గెలవాలంటూ వారిపై ఒత్తిడి తేవొద్దని ఒలింపిక్ స్వర్ణ పతక షూటర్ అభినవ్ బింద్రా సూచించాడు. అథ్లెట్లు పతకాలు తెచ్చే రోబోలు కారని, వారితోపాటు కోచ్‌లు, క్రీడా సైకాలజిస్టులు కూడా మానసికంగా ఆరోగ్యంగా ఉండడం ఎంతో ముఖ్యమని చెప్పుకొచ్చాడు.

ఇద్దరికీ ఇదే

నేడు ఐపీఎల్ క్వాలిఫయర్ 2

రాత్రి 7.30 నుంచి స్టార్ స్పోర్ట్స్, జియో సినిమాలో

లాస్ట్ చాన్స్

గెలిచిన జట్టు ఫైనల్‌కు

రాజస్థాన్ x సన్‌రైజర్స్ మధ్య పోరు



కెప్టెన్లు ప్యాట్ కమిన్స్ సంజూ శాంసన్

చెన్నై: ఐపీఎల్ ఫైనల్‌కు ముందు చిట్టచివరి ప్లేఆఫ్స్ మ్యాచ్‌కు రంగం సిద్ధమైంది. అద్భుత హిట్టింగ్‌తో ప్రత్యర్థి జట్లకు చుక్కలు చూపిస్తున్న సన్‌రైజర్స్ హైదరాబాద్ బ్యాటర్లకు.. తమ సుడులు తిరిగే బంతులు, పదునైన పేస్‌తో ఉచ్చులో బిగిస్తున్న రాజస్థాన్ రాయల్స్ బౌలర్ల మధ్య ఆసక్తికర పోరు జరగనుంది. గెలిచిన జట్టు కోల్‌కతాతో ఆదివారం ఫైనల్లో పోటీ పడుతుంది. చెపాక్ స్టేడియం వేదికగా శుక్రవారం క్వాలిఫయర్ 2లో ఇరు జట్లు తలపడబోతున్నాయి. అయితే వరుస విజయాలతో జోరు మీదున్న రైజర్స్‌కు కోల్‌కతాతో క్వాలిఫయర్ 1లో ఎదురుదెబ్బ తగిలింది. ఇప్పుడు ఆ ఓటమిని మరిపిస్తూ ఈ కీలక పోరులో కచ్చితంగా గెలవాల్సిందే. లేనిపక్షంలో లీగ్‌లో ఇప్పటిదాకా రికార్డులను తిరగరాసిన తమ ఆటతీరుకు ఫలితం దక్కకుండా పోతుంది. ఇక రాజస్థాన్ ఆరంభ తొమ్మిది మ్యాచ్‌ల్లోనే 16 పాయింట్లు సాధించినప్పటికీ.. ఆ తర్వాత దాదాపు 25 రోజుల పాటు మరో విజయమే లభించలేదు. కానీ ఎలిమినేటర్‌లో చక్కటి ప్రదర్శనతో బెంగళూరును ఇంటిముఖం పట్టించింది. ఇప్పుడు మరో గెలుపుతో ఫైనల్‌కు అర్హత సాధించి గత ఓటములను మర్చిపోవాలనుకుంటోంది. ఇరు జట్ల మధ్య జరిగిన ఏకైక లీగ్ మ్యాచ్‌లో రైజర్స్ ఆఖరి బంతికి పరుగు తేడాతో నెగ్గింది. మరోవైపు చెన్నై వేదికలో ఈ రెండు జట్లకు మెరుగైన రికార్డు లేదు. సీఎస్‌కేపై రైజర్స్ 134, రాజస్థాన్ 141 పరుగులే చేసి ఓటమిపాలయ్యాయి.

పిచ్, వాతావరణం

శుక్రవారం వర్షం నుంచి ఎలాంటి అంతరాయం లేదు. వేడితో పాటు తేమ ఎక్కువగా ఉండనుంది. రాత్రి మంచు ప్రభావం ఉంటుంది. దీంతో టాస్ గెలిచిన జట్టు ఫీల్డింగ్‌కు మొగ్గు చూపుతుంది. ఈ సీజన్‌లో జరిగిన ఏడు మ్యాచ్‌ల్లో ఐదుసార్లు చేజింగ్ టీమ్ గెలిచింది.

'ట్రావిషేక్' శుభారంభమే కీలకం

సన్‌రైజర్స్ జోరుకు ఆ జట్టు ఓపెనర్లు ట్రావిస్ హెడ్, అభిషేక్ శర్మల మెరుపు ఆటతీరే కారణం. పవర్ హిట్టింగ్‌ను ఈ ఇద్దరూ మరో స్థాయికి తీసుకెళ్లారు. హెడ్ 199.62 స్ట్రయిక్ రేట్‌తో, అభిషేక్ 207.40 స్ట్రయిక్ రేట్‌తో బెంబేలెత్తిస్తూ పవర్‌ప్లేలోనే రెండుసార్లు వంద పరుగులను దాటించారు. జట్టు బాదిన 166 సిక్సర్లలో వీరిద్దరివే 72 ఉండడం విశేషం. వీరి మెరుపు ఆరంభాలు మిడిలార్డర్‌పై ఒత్తిడి పడకుండా కాపాడుతున్నాయి. కానీ చివరి మ్యాచ్‌లో కోల్‌కతాపై ఇద్దరూ విఫలం కావడంతో జట్టు చిత్తుగా ఓడాల్సి వచ్చింది. అందుకే బ్యాటింగ్‌ను మరింత పటిష్ఠపర్చేందుకు మార్‌క్రమ్, ఫిలిప్స్‌లలో ఒకరిని తీసుకోవాల్సి ఉంటుంది. మిడిలార్డర్‌లో త్రిపాఠి, క్లాసెన్ వేగంగా ఆడుతున్నారు. నితీశ్ కుమార్ రాజస్థాన్‌పై 42 బంతుల్లోనే 76 పరుగులతో ఆకట్టుకున్నాడు. అదే ఫామ్‌ను ఈ మ్యాచ్‌లోనూ చూపాల్సి ఉంది. కెప్టెన్ కమిన్స్ ఫినిషర్ పాత్ర పోషిస్తున్నాడు. బౌలింగ్‌లో పేసర్లు కమిన్స్, భువనేశ్వర్, నటరాజన్ కీలకం కానున్నారు. స్పిన్నర్‌గా మార్కండేను ఆడించే అవకాశం ఉంది.

బౌలింగే బలంగా..

సన్‌రైజర్స్‌తో పోలిస్తే రాజస్థాన్ బ్యాటర్లు విధ్వంసకరంగా కనిపించకపోయినా.. వీరి విజయాల్లో బౌలర్లు కీలక పాత్ర పోషిస్తున్నారు. ఆరంభంలో లెఫ్టామ్ పేసర్ బౌల్ట్ వికెట్లను తీస్తుండగా.. వరల్డ్ క్లాస్ స్పిన్నర్లు చాహల్, అశ్విన్‌లతో మధ్య ఓవర్లలో ప్రత్యర్థి జట్లను నిలువరిస్తున్నారు. ఇక డెత్ ఓవర్లలో అవేశ్ ఖాన్, సందీప్ శర్మ పరుగులను కట్టడి చేయగలుగుతుండడం ఆర్ఆర్‌కు కలిసివచ్చే విషయం. బ్యాటింగ్‌లో జైస్వాల్, కెప్టెన్ శాంసన్‌లపై భారం పడుతోంది. అయితే ఉప్పల్‌లో రైజర్స్‌పై 202 పరుగుల ఛేదనలో ఆఖరి బంతికి రెండు పరుగులు చేయలేక ఓడింది. గెలుపు ముంగిట బోల్తా పడిన ఆ మ్యాచ్‌కు బదులు తీర్చుకోవాలనుకుంటోంది. చెపాక్ స్లో పిచ్‌పై మూడో స్పిన్నర్‌గా కేశవ్ మహరాజ్‌ను కూడా బరిలోకి దిగే అవకాశముంది. అయితే అప్పుడు ఇద్దరు పేసర్లతోనే ఆడాల్సి ఉంటుంది.

తుది జట్లు (అంచనా)

రాజస్థాన్ రాయల్స్: జైస్వాల్, క్యాడ్‌మోర్, శాంసన్, పరాగ్, జురెల్, పోవెల్/కేశవ్ మహరాజ్, అశ్విన్, బౌల్ట్, అవేశ్ ఖాన్, సందీప్, చాహల్.

సన్‌రైజర్స్ హైదరాబాద్: హెడ్, అభిషేక్, రాహుల్ త్రిపాఠి, నితీశ్ కుమార్, క్లాసెన్, సమద్, షాబాజ్ అహ్మద్, కమిన్స్ (కెప్టెన్), భువనేశ్వర్, నటరాజన్, మార్కండే.

వర్షంతో రద్దయితే..

రానున్న రోజుల్లో తమిళనాడులో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. అయితే మ్యాచ్ రోజు శుక్రవారం మాత్రం ఆకాశం మేఘావృతంగా కనిపించినా వాన కురిసే చాన్స్ 2 శాతం మాత్రమే ఉంది. ఒకవేళ వర్షంతో మ్యాచ్ వీలు కాకపోతే రిజర్వ్‌డే ఉంటుంది. ఒకవేళ శనివారం కూడా మ్యాచ్ రద్దయితే పాయింట్ల పట్టికలో రెండో స్థానంలో నిలిచిన సన్‌రైజర్స్ జట్టు ఫైనల్‌కు వెళుతుంది.

క్వార్టర్స్‌లో సింధు, అస్మిత



మలేసియా మాస్టర్స్

కౌలాలంపూర్: మలేసియా మాస్టర్స్‌లో డబుల్ ఒలింపిక్ పతక విజేత పీవీ సింధు కష్టంగా ముందంజ వేయగా.. మూడో సీడ్ బీవెన్ జాంగ్‌పై అస్మిత సంచలన విజయం నమోదు చేసింది. గురువారం జరిగిన ప్రీ క్వార్టర్స్‌లో సింధు 21-13, 12-21, 21-14తో సిమ్ యు జిన్ (కొరియా)పై చెమటోడ్చి నెగ్గింది. శుక్రవారం జరిగే క్వార్టర్స్ పోరులో టాప్ సీడ్ హన్ యు (చైనా)తో సింధు అమీతుమీ తేల్చుకోనుంది. కాగా, అస్మిత 21-19, 16-21, 21-12తో బీవెన్ జాంగ్ (అమెరికా)పై పోరాడి గెలిచింది. ఈ క్రమంలో భారత్ నుంచి సింధు, సైనా తర్వాత ఈ టోర్నీలో క్వార్టర్స్ చేరిన మూడో మహిళా ప్లేయర్‌గా అస్మిత రికార్డులకెక్కింది. పురుషుల ప్రీక్వార్టర్స్‌లో కిరణ్ జార్జ్ 13-21, 18-21తో లీ జి జియా చేతిలో ఓడాడు. డబుల్స్‌లో గాయత్రి పుల్లెల-ట్రీసా జాలీ జంట 18-21, 22-20, 14-21తో చైనీస్ తైపీకి చెందిన సంగ్ షు ఇన్-యు చీన్ హుయ్ చేతిలో, సిమ్రన్ సింగ్-రితిక ఠాకర్ 17-21, 11-21తో మలేసియా జంట పియర్లీ టాన్-మురళీధరన్ చేతిలో, కృష్ణప్రసాద్-సాయి ప్రతీక్ జోడీ 11-21, 9-21తో చైనా ద్వయం హి జి టింగ్-రెన్ జియాంగ్ యు చేతిలో పరాజయం పాలయ్యారు. మిక్స్‌డ్‌లో సిక్కిరెడ్డి-సుమీత్ జంట 9-21, 15-21తో మలేసియా జోడీ చెన్ టాంగ్ జి- తి యి వి చేతిలో చిత్తయ్యింది.

జ్యోతి సురేఖ పరాజయం

ఆర్చరీ వరల్డ్ కప్ స్టేజ్-2

యెచియాన్ (కొరియా): ఆర్చరీ వరల్డ్ కప్ స్టేజ్-2లో కాంపౌండ్ ఆర్చర్ జ్యోతి సురేఖకు షాక్ తగిలింది. వరల్డ్ కప్ స్టేజ్-1లో హ్యాట్రిక్ స్వర్ణాలు సాధించిన సురేఖ.. గురువారం జరిగిన కాంపౌండ్ మహిళల వ్యక్తిగత ఈవెంట్ క్వార్టర్స్‌లో సారా లోపెజ్ (కొలంబియా) చేతిలో 142-145తో ఓడింది. పురుషుల విభాగంలో ప్రథమేష్ 146-145తో మాజీ వరల్డ్ చాంపియన్ నికో వీనర్ (ఆస్ట్రియా)పై గెలిచి సెమీస్‌కు చేరుకొన్నాడు. కాగా, రికర్వ్ విభాగంలో పురుషులు, మహిళల జట్లు తీవ్రంగా నిరాశపర్చాయి. రెండో రౌండ్‌లో ధీరజ్ బొమ్మదేవర, తరుణ్‌దీప్, మృణాల్ చౌహాన్‌లతో కూడిన భారత జట్టు 3-5తో కెనడా చేతిలో పరాజయం పాలైంది. దీపిక కుమారి, అంకిత భక్త్, భజన్ కౌర్‌లతో కూడిన మహిళల టీమ్ రెండో రౌండ్‌లో 4-5తో వియత్నాం చేతిలో ఓడింది.

ఇకనైనా.. ఆర్సీబీని వదిలెయ్!

కోహ్లీకి కేపీ సూచన



న్యూఢిల్లీ: ఐపీఎల్ ఆవిర్భావం నుంచి ప్రయత్నిస్తున్నా విరాట్ కోహ్లీకి ట్రోఫీ అందని ద్రాక్షగానే మిగిలింది. ఈ నేపథ్యంలో ఇంగ్లండ్ మాజీ క్రికెటర్, ఐపీఎల్ కామెంటేటర్ కెవిన్ పీటర్సన్ కీలక వ్యాఖ్యలు చేశాడు. 'ఈ మాట నేను గతంలో చెప్పాను. ఇప్పుడూ చెబుతున్నా. కోహ్లీ 17 సంవత్సరాలుగా ప్రయత్నిస్తూనే ఉన్నాడు. కానీ టైటిల్ అందుకోలేకపోయాడు. అయిందేదో అయిపోయింది. విరాట్ ఇప్పటికైనా ఆర్సీబీని వీడి వేరే జట్టుకు వెళితే తన ఐపీఎల్ కప్పు కలను అతడు నిజం చేసుకోగలడు' అని పీటర్సన్ కుండబద్దలుగొట్టాడు. అంతేకాదు..కోహ్లీ ఢిల్లీ క్యాపిటల్స్‌కు ఆడడం ఉత్తమమని సూచించాడు. అందుకు రెండు కారణాలను అతడు చెప్పాడు. 'ఒకటి..ఢిల్లీ విరాట్‌కు సొంత ప్రదేశం. రెండు..ఐపీఎల్ టైటిల్ కోసం ఢిల్లీ జట్టు ఆకలిగొన్న పులిలా ఉండడం' అని కేపీ వివరించాడు.

అర్థమైందా..అతి చేయొద్దని..: చెన్నైతో ఆఖరి లీగ్ మ్యాచ్‌లో విజయం సాధించాక బెంగళూరు ఫ్యాన్స్ చేసిన అతిని టీమిండియా మాజీ ఓపెనర్ కృష్ణమాచారి శ్రీకాంత్ తప్పుపట్టాడు. 'అతి సంబరాల వీడియోలను, ఫొటోలను బెంగళూరు ఫ్యాన్స్ సోషల్ మీడియాలో పోస్ట్ చేయకుండా ఉండాల్సింది. అలా అతి చేసిన వారికి స్పిన్నర్ అశ్విన్ తన బౌలింగ్‌తో బుద్ధి చెప్పాడు. అందువల్ల క్రికెట్‌లో ఒళ్లు దగ్గర పెట్టుకొని ఆడాలి' అని పరోక్షంగా బెంగళూరు జట్టుకు చురకలు అంటించాడు. ఇక కీలక ఎలిమినేటర్ మ్యాచ్‌లో డకౌటైన ఆర్సీబీ ఆల్‌రౌండర్ మ్యాక్స్‌వెల్‌పై మాజీ క్రికెటర్ మనోజ్ తివారీ సెటైర్లు వేశాడు. భారీగా బ్యాంక్ బ్యాలెన్స్ ఉండడం, క్రమం తప్పకుండా చెక్కులు (ఐపీఎల్ జీతం) రావడంతో అతడిలో ఉదాసీనత పెరిగిపోయిందని అన్నాడు.


జగిత్యాల జిల్లా పూడూర్‌లో తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న హరీశ్

ఎస్టీ రిజర్వేషన్ల తగ్గింపునకు రేవంత్ కుట్రలు

» అందుకే హైకోర్టులో సరైన వాదనల్లేవ్..

» అన్ని రకాల వడ్లకు రూ.500 బోనస్ ఇవ్వాలి: హరీశ్

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్): ఎస్టీ రిజర్వేషన్ల తగ్గింపునకు సీఎం రేవంత్‌రెడ్డి కుట్రలు చేస్తున్నారని మాజీ మంత్రి హరీశ్‌రావు ఆరోపించారు. కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు ఎస్టీ రిజర్వేషన్లను 6 నుంచి 10 శాతానికి పెంచారని గుర్తు చేశారు. ఓ వ్యక్తి ఎస్టీ రిజర్వేషన్ల పెంపుపై హైకోర్టుకెళ్లగా రిజర్వేషన్ల తగ్గింపు కుట్రలో భాగంగా ప్రభుత్వం వాదనలు సరిగ్గా వినిపించడం లేదని ఆరోపించారు. గురువారం మహబూబాబాద్ జిల్లా మరిపెడ, తొర్రూరు మండలం వెల్లికట్టె, హనుమకొండ హంటర్ రోడ్‌లో నిర్వహించిన పట్టభద్రుల సమావేశాల్లో ఆయన మాట్లాడారు. ఎన్నికల ముందు రైతులకు, నిరుద్యోగులకు ఇచ్చిన ఒక్క హామీనీ కాంగ్రెస్ నెరవేర్చలేదని మండిపడ్డారు. కాంగ్రెస్, బీజేపీలకు పట్టభద్రులు తగిన బుద్ధి చెప్పాలని, ఎమ్మెల్సీ ఉపఎన్నికలో రాకేశ్ రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. అన్ని రకాల వడ్లకు రూ.500 బోనస్ ఇవ్వాలని సర్కారును హరీశ్ డిమాండ్ చేశారు. అకాల వర్షాలకు కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యాన్ని పరిశీలించి.. రైతుల సమస్యలను తెలుసుకున్నారు. జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలంలోని పూడూర్‌లో, భూపాలపల్లి మండలంలోని కమలాపూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన సందర్శించారు. మంత్రులు క్షేత్రస్థాయిలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించి తడిసిన, మొలకెత్తిన ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్ రెడ్డి గొప్పలు చెప్పుకోవడం తప్ప రైతులకు చేసిందేం లేదని విమర్శించారు. ఈ సందర్భంగా ఉన్నతాధికారులకు ఫోన్ చేసి మాట్లాడారు.

స్వేచ్ఛను హరించే చట్టాలను నిలువరిద్దాం

» రాష్ట్ర ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి

నిజామాబాద్ రూరల్, మే, 23: పత్రికా స్వేచ్ఛను కుదించేలా కేంద్రం నాలుగు కొత్త చట్టాలు తెచ్చేందుకు ప్రయత్నిస్తోందని, వాటిని నిలువరించాలని ప్రెస్ అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి అన్నారు. గురువారం నిజామాబాద్‌లో టీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో 'ప్రజాస్వామ్యం-మీడియా' అంశంపై నిర్వహించిన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ రెడ్డి మాట్లాడారు. జర్నలిస్టులను ఎవరూ గుర్తించాల్సిన అవసరం లేదని, ప్రజలు గుర్తిస్తే సరిపోతుందన్నారు. జర్నలిస్టుల ఇళ్ల స్థలాలు, హెల్త్‌కార్డుల సమస్యలకు త్వరలోనే పరిష్కారం దొరుకుతుందన్నారు. జర్నలిజం విలువలు నానాటికి తగ్గుతున్నాయని, ఒకప్పుడున్న విలువలు ఇప్పుడు లేవని ప్రముఖ కవి నందిని సిధారెడ్డి అన్నారు. మీడియా రంగం కార్పొరేట్ శక్తులు, వ్యాపారుల చేతిల్లోకి వెళ్లడంతో వార్తలు వారికి అనుకూలంగా వస్తున్నాయని ఇవి ప్రజాస్వామ్యానికి మంచిది కాదన్నారు.

కవిత జైలుకెందుకు వెళ్లిందో కేటీఆర్ చెప్పాలి?

» సంపదను దోచిన వారికి ఓటడిగే హక్కులేదు: తీన్మార్ మల్లన్న

మహబూబాబాద్ టౌన్, మే 23: తనపై కేసులున్నాయని చెబుతున్న మాజీ మంత్రి కేటీఆర్ ఎమ్మెల్సీ కవిత జైలుకెందుకు వెళ్లిందో చెప్పాలని నల్లగొండ, వరంగల్, ఖమ్మం పట్టభద్రుల కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న డిమాండ్ చేశారు. మహబూబాబాద్‌లోని బాలాజీ గార్డెన్స్‌లో కాంగ్రెస్ ఆధ్వర్యంలో గురువారం జరిగిన పట్టభద్రుల సమావేశంలో తీన్మార్ మల్లన్న మాట్లాడారు. లిక్కర్ కేసులో జైలుకు పోయిన కవిత.. కడిగిన ముత్యంలా ఎలా బయటకు వస్తుందని ప్రశ్నించారు. హైదరాబాద్ చుట్టుపక్కల భూములను, రాష్ట్ర సంపదను కొల్లగొట్టిన కేసీఆర్ కుటుంబసభ్యులు ఏ ముఖం పెట్టుకుని ఓట్లు అడుగుతున్నారని నిలదీశారు.

విజిలెన్స్ నివేదికలపై చర్యలు తీసుకోండి:ఎఫ్‌జీజీ

హైదరాబాద్, మే 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఇచ్చిన నివేదికలపై ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుని, అవినీతిని అరికట్టాలని ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్(ఎఫ్‌జీజీ) డిమాండ్ చేసింది. ఈమేరకు ఎఫ్‌జీజీ అధ్యక్షుడు ఎం.పద్మనాభరెడ్డి గురువారం సీఎం రేవంత్ రెడ్డి లేఖ రాశారు. ప్రభుత్వ ఉద్యోగులు, అధికారులు అవినీతి, అక్రమాలకు పాల్పడినప్పుడు విజిలెన్స్ అధికారులు విచారణ సాగించి, ప్రభుత్వానికి నివేదిక ఇస్తారని లేఖలో పేర్కొన్నారు. ఇలాంటి నివేదికలపై ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని, కొన్ని సందర్భాల్లో నివేదికలను సంబంధిత శాఖలకు పంపి చేతులు దులుపుకొంటుందని ఆరోపించారు. పదేళ్ల నివేదికలను విశ్లేషించి, తగిన చర్యలు తీసుకోవాలని పద్మనాభరెడ్డి కోరారు.

ఏసీబీకి చిక్కిన చర్ల డిప్యూటీ తహసీల్దార్

» పట్టా మార్పిడికి 20వేలు తీసుకుంటుండగా పట్టివేత

» గతంలోనూ లంచం తీసుకుంటూ అడ్డంగా బుక్

చర్ల, ఎల్‌బీనగర్, మే 23: భూమి పట్టా మార్పిడి కోసం ఓ వ్యక్తి నుంచి లంచం తీసుకుంటూ భద్రాద్రి జిల్లా చర్ల డిప్యూటీ తహసీల్దార్ బీరవెల్లి భరణిబాబు గురువారం ఏసీబీ అధికారులకు చిక్కారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా ఏసీబీ ఇన్‌చార్జ్ డీఎస్పీ వై.రమేష్ వివరాల ప్రకారం.. చర్ల మండలం కొత్తపల్లికి చెందిన కర్ల రాంబాబు, అతని భార్య గిరిజనేతరుల నుంచి మూడెకరాల రెండు గుంటల భూమి కొన్నారు. దాన్ని పట్టా చేయించుకోవడానికి డిప్యూటీ తహసీల్దార్ భరణిబాబుని రాంబాబు సంప్రదించగా.. కే-ఫామ్, ఎల్-ఫామ్ ప్రాసెస్ పూర్తయితే పట్టా మార్పిడి జరుగుతుందని, ఇందుకు రూ.50వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. దాంతో రాంబాబు ఏసీబీని ఆశ్రయించాడు. ఏసీబీ అధికారుల సూచనలతో రూ.20వేలు చర్ల తహసీల్దార్ కార్యాలయంలో భరణిబాబు తీసుకుంటుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నట్టు డీఎస్పీ తెలిపారు. కాగా, భరణి బాబు 2017లో భద్రాద్రి జిల్లా బూర్గంపాడులో ఓ కాంట్రాక్టర్‌ను లంచం డిమాండ్ చేసి ఏసీబీకి చిక్కారు. తర్వాత బదిలీపై చర్ల డిప్యూటీ తహసీల్దార్‌గా వచ్చారు.

బల్దియా రెవెన్యూ ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్ కూడా...


సాయి భార్గవ్‌కృష్ణ

ఆస్తిపన్ను మదింపు విషయంలో రూ.10 వేలు లంచం తీసుకుంటూ జీహెచ్‌ఎంసీ రెవెన్యూ ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్ ఏసీబీ అధికారులకు చిక్కారు. రంగారెడ్డి రేంజ్ ఏసీబీ డీఎస్పీ ఆనంద్‌కుమార్ కథనం ప్రకారం.. సాహెబ్‌నగర్‌కు చెందిన నరసింహారెడ్డి జీహెచ్‌ఎంసీలో అసిస్టెంట్ మునిసిపల్ కమిషనర్‌గా పనిచేసి పదవీ విరమణ పొందారు. ఆయన స్నేహితుడు కర్మన్‌ఘాట్ సమీపంలో ఇంటికి అసెస్‌మెంట్ చేయించుకోవాలని ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని ఫీజు చెల్లించారు. కానీ అసెస్‌మెంట్ కాకపోవడంతో నరసింహారెడ్డితో కలిసి ఎల్‌బీనగర్ సర్కిల్ కార్యాలయంలో రెవెన్యూ ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్ సాయిభార్గవ్ కృష్ణను సంప్రదించారు. రూ.10 వేలు ఇస్తే పని అవుతుందని ఆయన చెప్పారు. దీంతో వారు ఏసీబీని ఆశ్రయించారు. తర్వాత సాయి భార్గవ్‌కృష్ణ రూ.10 వేలు లంచం తీసుకుంటుండగా పట్టుకుని అదుపులోకి తీసుకున్నారు.

నేడు మోస్తరు వర్షాలు

హైదరాబాద్/ఎల్కతుర్తి, మే 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో శుక్రవారం తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. అలాగే ఉరుములు, మెరుపులతో పాటు గంటకు 30-40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని గురువారం వివరించింది. శనివారం పొడి వాతావరణం ఏర్పడే అవకాశముందని పేర్కొంది. ఇటు హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం గోపాల్‌పూర్‌లో పాడి రైతు గొర్రె ఐలయ్య (50) బుధవారం మధ్యాహ్నం వడదెబ్బ తగిలి అస్వస్థతకు గురై ఆస్పత్రిలో చికిత్స పొందాడు. తిరిగి అదే రోజు ఇంటికొచ్చాక అర్ధరాత్రి పరిస్థితి విషమించి మరణించాడు.

25 మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లోకి..

(మొదటి పేజీ తరువాయి)

కాంగ్రెస్‌లో చేరడం ఖాయమన్నారు. బీఆర్ఎస్‌కు చెందిన ముఖ్యులు కూడా ఆ పార్టీలో ఉండే పరిస్థితి లేదన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండూ ఒకటేనన్నారు. గతంలో కూడా కాంగ్రెస్ నుంచి 19మంది ఎమ్మెల్యేలు గెలిస్తే 12 మంది ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు బీఆర్ఎస్‌లో చేరారని గుర్తు చేశారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను రక్షించుకోలేని బీఆర్ఎస్‌కు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలో ఓటు వేయడం వృథా అని అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం ఖమ్మంలో పర్యటించిన కిషన్‌రెడ్డి స్థానిక శ్రీశ్రీ హోటల్‌లో మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో నిజమైన ప్రతిపక్షం బీజేపీనేనని చెప్పారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలో గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. నాడు వరి వేస్తే ఉరి అని కేసీఆర్ అంటే.. నేడు దొడ్డు వడ్లు వేస్తే ఉరి అని రేవంత్‌రెడ్డి అంటున్నారని కిషన్‌రెడ్డి విమర్శించారు. గురువారం యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండలంలోని రాఘవాపూర్, రుద్రవెల్లి గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన పరిశీలించారు. ధాన్యం కొనుగోళ్ల కోసం ప్రతి పైసా కేంద్రమే ఇస్తుంటే.. సకాలంలో కొనేందుకు రాష్ట్ర సర్కారుకు ఏం నొప్పి..? అని ప్రశ్నించారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం మొలకెత్తుతుంటే సీఎంకు సిగ్గనిపించడం లేదా? అని ప్రశ్నించారు. మంత్రులు, ఎమ్మెల్యేలు కనీసం కొనుగోలు కేంద్రాలను పరిశీలించడం లేదన్నారు. బోనస్ అంటే.. వడ్లు మొలకలు రావడమేనా..? ఇదేనా ఇందిరమ్మ రాజ్యం..? అని నిలదీశారు.



రుణమాఫీ చేస్తామని చేయకపోవడంతో బ్యాంకులు రైతులకు కొత్త రుణాలు ఇవ్వడంలేదని తెలిపారు. అన్నదాతలు పంటలు ఎలా సాగు చేయాలో రాహుల్ గాంధీ చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం సన్న వడ్ల సాగును ప్రోత్సహించాలనుకుంటే.. వాటికి రూ.1,000 బోనస్ ఇవ్వాలని, దొడ్డు వడ్లకు రూ.500 బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని, నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిపై త్వరలోనే ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తామని కిషన్‌రెడ్డి హెచ్చరించారు.

కలకత్తా హైకోర్టు తీర్పు కాంగ్రెస్‌కు చెంపపెట్టు: లక్ష్మణ్

పశ్చిమ బెంగాల్‌లో ముస్లిం ఉప కులాలకు ఇచ్చిన ఓబీసీ హోదాను రద్దు చేస్తూ కలకత్తా హైకోర్టు ఇచ్చిన తీర్పు కాంగ్రెస్ పార్టీకి చెంపపెట్టు లాంటిదని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ లక్ష్మణ్ స్పష్టం చేశారు. కోర్టు తీర్పు నేపథ్యంలో ఓటుబ్యాంకు రాజకీయాలు చేస్తున్న మమతాబెనర్జీ ప్రభుత్వంతో పాటు కాంగ్రెస్, విపక్ష పార్టీల నైజం బయటపడిందని ఆయన పేర్కొన్నారు. పౌర సరఫరాల శాఖలో అవినీతి, అక్రమాలపై తాము చర్చకు సిద్ధంగా ఉన్నామని.. మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి రావాలని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి సవాల్ చేశారు. పౌర సరఫరాల శాఖలో అవినీతిపై తాను మాట్లాడితే, మంత్రి ఉత్తమ్, సమాధానం చెప్పలేక మొహం చాటేశారని ఆరోపించారు. ప్రతిపక్ష నేతగా ప్రశ్నిస్తే తనపై పోలీసు కేసు పెట్టించడమేంటని మండిపడ్డారు. పౌర సరఫరాల శాఖలో జరిగిన అక్రమాలపై విచారణకు ఆదేశించాలని డిమాండ్ చేశారు.

హేమ రక్తంలో డ్రగ్స్ జాడలు

మరో నటి ఆషి రాయ్‌తో సహా రేవ్ పార్టీకి హాజరైన 86 మంది రక్త నమూనాల్లో కూడా



బెంగళూరు, హైదరాబాద్ సిటీ, మే 23(ఆంధ్రజ్యోతి): 'అబ్బే నేనసలు బెంగళూరు రేవ్ పార్టీకి ఎప్పుడెళ్లాను? హైదరాబాద్‌లోనే ఉన్నాను' అంటూ బుకాయించిన నటి హేమ అడ్డంగా దొరికిపోయింది. ఆమె, ఆమెతోపాటు మరో నటి ఆషీ రాయ్ సహా.. బెంగళూరు రేవ్ పార్టీలో పట్టుబడినవారిలో 86 మంది డ్రగ్స్ తీసుకున్నట్టు నిర్ధారణ అయ్యిందని పోలీసులు తెలిపారు. వారందరి రక్తనమూనాలూ సేకరించి వైద్యపరీక్షలు చేయగా వాటిలో డ్రగ్స్ ఆనవాళ్లు ఉన్నట్టు వెల్లడైందని పోలీసులు వెల్లడించారు. బెంగళూరు ఎలక్ట్రానిక్ సిటీలోని జీఆర్ ఫాంహౌస్‌లో ఆదివారం రేవ్ పార్టీలో పాల్గొన్న 103 మందిని సీసీబీ పోలీసులు పట్టుకున్న విషయం తెలిసిందే. పార్టీ జరిగిన ప్రాంతంలో ఎండీఎంఏ, కొకైన్, హైడ్రో గాంజాను కూడా వారు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు అదుపులోకి తీసుకున్న 103 మందిలో 73 మంది పురుషులు, 30 మంది మహిళలు ఉన్నారు. వారందరి రక్తనమూనాలను సేకరించి, ల్యాబ్‌కు పంపగా, వైద్య పరీక్షల ఫలితాలు గురువారం వచ్చాయి. పురుషుల్లో 59 మంది, మహిళల్లో 27 మంది డ్రగ్స్ తీసుకున్నారని పరీక్షల్లో తేలింది. ఆదివారం సాయంత్రం ప్రారంభమైన ఈ పార్టీలో 200 మందికిపైగా పాల్గొన్నట్టు సమాచారం. వారిలో చాలామంది రాత్రి పదిగంటల తర్వాత వెళ్లిపోగా.. మిగిలినవారు అర్ధరాత్రి తర్వాత కూడా అక్కడే ఉన్నారు. రాత్రి 12 గంటలైనా డీజే మోతలతో ఆ ప్రాంతం దద్దరిల్లడంతో స్థానికులు హెబ్బగుడి పోలీసులకు సమాచారం ఇచ్చారు. అక్కడికి చేరుకున్న పోలీసులు రేవ్‌పార్టీ జరుగుతున్నట్టు గుర్తించారు. టేబుళ్లపై డ్రగ్స్ ఉన్నట్లు అనుమానించి, సీసీబీ పోలీసులకు సమాచారం ఇచ్చారు. రాత్రి 2 గంటల సమయంలో సీసీబీ బృందాలు అక్కడికి చేరుకుని డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నాయి. పట్టుబడిన 103 మందిని అక్కడే ఉంచి సోమవారం మధ్యాహ్నం వారందరి రక్తనమూనాలను సేకరించారు. డ్రగ్స్ వాడినట్లు నిర్ధారణ అయిన అందరికీ నోటీసులు ఇచ్చేందుకు సీసీబీ పోలీసులు సిద్ధమయ్యారు. బెంగళూరులో త్వరలో జరిగే విచారణకు హాజరుకావాలని నోటీసుల్లో ఆదేశించనున్నట్లు సమాచారం. డ్రగ్ టెస్ట్‌లో పాజిటివ్ వచ్చిన వారిని ఎన్‌డీపీఎస్ యాక్ట్ కింద బాధితులుగా భావించి విచారించనట్లు సమాచారం. కాగా.. 2017 జూలైలో హైదరాబాద్‌లో జరిగిన డ్రగ్స్ కేసు విచారణ సందర్భంగా పలువురు సెలబ్రిటీలను విచారణకు పిలిచిన సంగతి తెలిసిందే. అప్పట్లో హేమ.. డ్రగ్స్ వాడకం అన్ని వర్గాల్లో ఉన్నా, కావాలనే మీడియా టాలీవుడ్‌ను టార్గెట్ చేస్తోందని ఆరోపించారు. 2022 ఏప్రిల్‌లో రాడిసన్ బ్లూ హోటల్‌లో జరిగిన నైట్ పార్టీలోనూ డ్రగ్స్ వాడినట్టు వెలుగులోకి వచ్చిన సంగతి తెలిసిందే. అప్పట్లో కూడా హేమ పేరు ప్రస్తావనకు వచ్చింది. అయితే.. ఆ కేసుతో తనకు సంబంధం లేకున్నా తన పేరును ప్రచారం చేస్తున్నారంటూ ఆమె మీడియాపై మండిపడ్డారు. కొన్ని టీవీ చానళ్లపై బంజారాహిల్స్ ఠాణాలో ఫిర్యాదు చేశారు.

హేమ.. బయటపడ్డ డ్రామా..

బెంగళూరు రేవ్ పార్టీలో నటి హేమ పేరు బయటకు రావడంతో ఆమె జాగ్రత్తపడింది. ఫామ్‌హౌస్‌లో ఉన్న ఖాళీ స్థలంలోకి వెళ్లి నేను బెంగళూరు పార్టీలో ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి. కానీ నేను హైదరాబాద్‌లోని ఫామ్ హౌస్‌లో చిల్ అవుతున్నానంటూ వీడియో విడుదల చేసింది. కానీ బెంగళూరు పోలీసులు ఆమె ఫొటోను విడుదల చేయడమే కాకుండా, ఆమె కృష్ణవేణి(అసలు పేరు)పేరుతో పార్టీకి వచ్చిందని ధ్రువీకరించారు. దర్యాప్తులో భాగంగా బెంగళూరు పోలీసులు నటి హేమ ప్రయాణించిన విమాన టికెట్లు సైతం సేకరించారు.

చెట్ల మధ్యలో డ్రగ్స్ తీసుకుని...

బెంగళూరులో నిర్వహించిన రేవ్ పార్టీకి సంబంధించి, బెంగళూరు సెంట్రల్ క్రైం పోలీసులు ఆధారాలు సేకరించారు. రేవ్ పార్టీని విజయవాడకు చెందిన లంకపల్లి వాసు ఆర్గనైజ్ చేశాడు. ఇందుకోసం పరిచయమున్న జె గోపాల్ రెడ్డి ఫామ్ హౌస్‌ను వినియోగించుకున్నాడు. ఈ పార్టీకి బెంగళూరుతో పాటు రెండు తెలుగు రాష్ట్రాల నుంచి పార్టీ ప్రియులను ఆహ్వానించాడు. హైదరాబాద్‌కు చెందిన పలువురు ఆ పార్టీకి వెళ్లారు. నిర్వాహకుడు వాసు పలువురు మోడల్స్‌ను కూడా బెంగళూరుకు తీసుకెళ్లాడు. పార్టీకి హాజరైన వారిలో కొందరు ఫామ్‌హౌస్‌లోని చెట్ల మధ్యలో కూర్చుని ఎమ్‌డీఎమ్‌ఏ, కొకైన్ వంటి డ్రగ్స్ తీసుకున్నారు. వాటికి సంబంధించిన ఆధారాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పార్టీ నిర్వాహకుడు వాసుతో పాటు మరో నలుగురు ఆర్గనైజర్లు, పార్టీకి డ్రగ్స్ సరఫరా చేసిన ముగ్గురు పెడ్లర్లను అరెస్ట్ చేశారు.

దుష్ప్రచారం చేస్తే.. లీగల్ యాక్షన్

» 'ఏబీఎన్ ఆంధ్రజ్యోతి'తో నటుడు శ్రీకాంత్



హైదరాబాద్ సిటీ, మే 23 (ఆంధ్రజ్యోతి): ఇటీవల బెంగళూరులో జరిగిన రేవ్ పార్టీలో పాల్గొన్నవారిని వదిలిపెట్టవద్దని సినీనటులు శ్రీకాంత్ అన్నారు. గురువారం 'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి'తో మాట్లాడిన ఆయన.. "నిజంగా పార్టీలో నేనుంటే.. నాపై ఎలాంటి చర్యలు తీసుకున్నా సిద్ధమే" అని ఆయన స్పష్టం చేశారు. తనకు, ఆ రేవ్ పార్టీకీ ఎలాంటి సంబంధమూ లేదని తేల్చిచెప్పారు. తనపై దుష్ప్రచారం చేస్తే ఊరుకోనని.. అది మీడియా అయినా, బెంగళూరు పోలీసులైనా న్యాయపరంగా ముందుకు వెళ్తానని శ్రీకాంత్ హెచ్చరించారు.

పనే ధ్యానం



(మొదటి పేజీ తరువాయి)

పూర్తిగా విశ్వసిస్తూ జీవితంలో ఆచరిస్తున్నానని సీఎం వెల్లడించారు. సికింద్రాబాద్‌లోని మహేంద్రహిల్స్‌లో ఉన్న మహాబోధి బుద్ధ విహార్‌లో గురువారం జరిగిన బుద్ధ పౌర్ణమి (బుద్ధుడి జన్మదిన) వేడుకలకు సీఎం రేవంత్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బుద్ధుడి బోధనలు అమూల్యమైన సందేశాన్ని కలిగి ఉంటాయన్నారు. రాజ్యం, అధికారం, కుటుంబం.. అన్నింటినీ 29 ఏళ్ల చిన్న వయసులో సిద్ధార్థుడు తృణప్రాయంగా వదిలేసి సమాజంలో శాంతి స్థాపన కోసం బయల్దేరాడని గుర్తు చేశారు. బిహార్‌లోని గయలో మొదలైన బౌద్ధం 2,500 ఏళ్ల తర్వాత కూడా ప్రపంచానికి నేటికీ ఆదర్శంగా నిలుస్తోందని, బౌద్ధం గొప్పతనం దీని ద్వారా తెలుస్తుందని సీఎం చెప్పారు.

దేశానికి బౌద్ధ సందేశం చాలా అవసరం

ప్రస్తుతం మన దేశంలో, రాష్ట్రంలో భావోద్వేగాల ఆధారంగా మనుష్యుల మధ్య వైషమ్యాలను పెంచే పరిస్థితులు నెలకొన్నాయని ఇటువంటి సందర్భంలో బుద్ధుని సందేశం దేశానికి చాలా అవసరమని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. సమాజంలో పెరుగుతున్న అశాంతి, అసూయ వంటి ధోరణులను అధిగమించి సమాజానికి మేలు చేకూర్చే మంచి ఆలోచనలను పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ మేరకు బుద్ధుడి బోధనలతో కూడిన పాఠశాలలను ఏర్పాటు చేయాలని సూచించారు. బుద్ధుడి సందేశాన్ని సమాజంలో ప్రతీ ఒక్కరికి చేరవేయడానికి తాను వ్యక్తిగతస్థాయిలోనూ, ప్రభుత్వ పరంగానూ అవసరమైన సహాయ సహకారాలను అందిస్తానని సీఎం హామీ ఇచ్చారు. రాష్ట్రంలో బౌద్ధ భిక్షువులకు తగిన గౌరవం ఉంటుందని చెప్పారు. ప్రపంచ దేశాల్లోని బౌద్ధ భిక్షువులతో కలిసి రాష్ట్రంలో ఏదైనా కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తే సహకారం అందిస్తామని తెలిపారు. మహేంద్రహిల్స్ మహాబోధి బుద్ధవిహార్‌కు కావలసిన అభివృద్ధి పనులు, ధ్యానమందిరం నిర్మాణాలకు రూ.కోటి 30 లక్షలు అవుతుందని అంచనాలు వేశారని, ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత ఆ ప్రతిపాదనను పరిశీలించి ప్రభుత్వం నుంచి మంజూరు చేస్తామని సీఎం హామీ ఇచ్చారు. మహాబోధి బుద్ధవిహార్‌కు రావటం ద్వారా గొప్ప క్షేత్రాన్ని సందర్శించిన అనుభూతి కలిగిందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా బౌద్ధ సాధువులను, భిక్షువులను సీఎం సత్కరించారు. అష్టాంగమార్గం అనే పుస్తకాన్ని విష్కరించారు. ఈ కార్యక్రమంలో బౌద్ధ ప్రముఖులు ఆంజనేయరెడ్డి, రావుల ఆంజయ్య భిక్ష గురూజీలతోపాటు అడిషనల్ డీజీపీ శివధర్‌రెడ్డి, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి అద్దంకి దయాకర్, శ్రీగణేశ్ తదితరులు పాల్గొన్నారు. నల్లగొండ జిల్లా నాగార్జున సాగర్ హిల్‌కాలనీలో తెలంగాణ పర్యాటక శాఖ ఆధ్వర్యంలో 2568 బుద్ధ జయంతి వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా పర్యాటక శాఖ ఎండీ రమేష్‌నాయుడు మాట్లాడుతూ, గౌతమ బుద్ధుని బోధనలు ప్రపంచానికి ఆదర్శనీయమని కొనియాడారు. డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి రచించిన బుద్ధుని మొదటి ప్రవచనం, బుద్ధుని చివరి రోజులు అనే పుస్తకాలను రమేష్‌నాయుడు ఆవిష్కరించారు.

ఉత్తమ్ శ్వేతపత్రం లాంటివారు

ఆయనపై ఏలేటి నిరాధార ఆరోపణలు

» రేవంత్ రెడ్డిని ఎవరూ డిస్టర్బ్ చేయరు

» ఐదేళ్లు ఆయనే ముఖ్యమంత్రి : జగ్గారెడ్డి



హైదరాబాద్, మే 23 (ఆంధ్రజ్యోతి): మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి శ్వేత పత్రం లాంటి వారని.. ఆయనపై ఇంక్ చల్లవద్దని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి కోరారు. ఉత్తమ్ మీద బీజేపీ ఫ్లోర్ లీడర్ ఏలేటి మహేశ్వర్ రెడ్డి బట్ట కాల్చి మీద వేస్తున్నారని ఆరోపించారు. గురువారం గాంధీభవన్‌లో జగ్గారెడ్డి విలేకరులతో మాట్లాడారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మీద మహేశ్వరెడ్డికి ఎందుకు కోపమొచ్చిందో..? అర్థం కాలేదన్నారు. మంత్రిపై నిరాధార అభియోగాలు చేస్తున్నారని మండిపడ్డారు. మహేశ్వరెడ్డి ఇప్పటికైనా ఆరోపణలు ఆపితే మంచిదని హితవు పలికారు. కాంగ్రెస్ పార్టీ ప్రజల పక్షపాతి, రైతు పక్షపాతి అని జగ్గారెడ్డి తెలిపారు. రాష్ట్రంలో అకాల వర్షాలు పడి ధాన్యం తడిసిందని.. అయినప్పటికీ తడిసిన ప్రతి గింజనూ ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు చెప్పారని గుర్తు చేశారు. రైతులు, రైస్ మిల్లర్లు ఇబ్బంది పడొద్దని, నష్టపోవద్దని కాంగ్రెస్ ప్రభుత్వం భావిస్తోందని పేర్కొన్నారు. అధికార పార్టీ మీద ప్రతిపక్ష పార్టీలు బురద జల్లడం సహజమేనని ఆయన వ్యాఖ్యానించారు. తెలంగాణ రాష్ట్రానికి ఐదేళ్ల పాటు ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి కొనసాగుతారని.. ఆయనను ఎవరూ డిస్టర్బ్ చేయరని జగ్గారెడ్డి అన్నారు.

ఎంఎన్‌జేలో వంద రోబోటిక్ సర్జరీలు

» కేన్సర్ బాధితులకు కొత్త జీవితం

» ఎంఎన్‌జే డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాసులు



హైదరాబాద్ సిటీ, మే 23 (ఆంధ్రజ్యోతి): ఎంఎన్‌జే ఆస్పత్రిలో రోబోటిక్ శస్త్రచికిత్స విధానం కేన్సర్ రోగుల పాలిట వరంగా మారింది. వారికి కొత్త జీవితం ప్రసాదిస్తోంది. గత సెప్టెంబరులో ఆస్పత్రిలో రోబోటిక్-అసిస్టెడ్ సర్జరీ (ఆర్ఏఎస్) వ్యవస్థను ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి నుంచి వంద సర్జరీలు నిర్వహించినట్టు ఎంఎన్‌జే కేన్సర్ ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ డాక్టర్ ముక్తా శ్రీనివాసులు తెలిపారు. గర్భసంచి, పెద్దపేగు, పురీషనాళం, అన్నవాహిక కేన్సర్‌తో బాధపడుతున్న వారికి రోబోటిక్ సర్జరీలు చేశామని చెప్పారు. గురువారం ఆయన ఆస్పత్రిలో మీడియాతో మాట్లాడారు. ప్రైవేట్, కార్పొరేట్ ఆస్పత్రుల్లో రూ.4 నుంచి 10 లక్షల వరకు ఖర్చయ్యే రోబోటిక్ సర్జరీని ఎంఎన్‌జేలో ఉచితంగా అందిస్తున్నట్లు చెప్పారు. కేన్సర్ మొదటి, రెండు, మూడో దశ బాధితులకు ఈ సర్జరీలు నిర్వహిస్తున్నామన్నారు. ఆస్పత్రిలో రోబోటిక్ సర్జరీలో నిష్ణాతులైన నలుగురు వైద్యులు ఉన్నారని, మరో నలుగురు శిక్షణ పొందుతున్నారని చెప్పారు. వైద్యులు, నర్సులు, ఇతర సిబ్బంది 40 మందితో ప్రత్యేక బృందం ఏర్పాటు చేశామన్నారు. మెడికల్ పోస్టు గ్రాడ్యుయేట్ విద్యార్థులకు రోబోటిక్ సర్జరీలో శిక్షణ ఇవ్వనున్నట్టు డాక్టర్ శ్రీనివాసులు చెప్పారు. వారి పాఠ్యాంశాల్లో ఆర్ఏఎస్ వంటి సాంకేతికతలను చేర్చాలన్నారు.

కేసీఆర్ మతి స్థిమితం కోల్పోయారు

» రేవంత్‌కు భయపడి అసెంబ్లీకి రావట్లే

» దొడ్డు వడ్ల రైతులనూ ఆదుకుంటాం: మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

» అమెరికాకు మంత్రి పయనం



హైదరాబాద్, మే 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ సంక్షేమ పాలన చూసి కేసీఆర్ మతి స్థిమితం కోల్పోయారని, సీఎం రేవంత్‌రెడ్డికి భయపడే ఆయన అసెంబ్లీకి రావడం లేదని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. బీఆర్ఎస్ఎల్పీ బాధ్యతలను కేటీఆర్‌కు అప్పగిస్తే గనక కొత్త దుకాణం పెట్టాలనే ఆలోచనతో హరీశ్‌రావు ఉన్నారని, జూన్ 5 తర్వాత బీఆర్ఎస్ భూస్థాపితం అవుతుందని పేర్కొన్నారు. ఎటువంటి అనుమతుల్లేకుండానే జిల్లాల్లో బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాలను నిర్మించారని ఆరోపించారు. లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రం నుంచి కాంగ్రెస్‌కు 12కు తగ్గకుండా సీట్లొస్తాయని కేంద్రంలోనూ 'ఇండియా కూటమి' అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ఎస్‌కు రెండు, మూడు చోట్ల డిపాజిట్లు వస్తే అదే ఎక్కువన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా దొడ్డు వడ్లు పండించిన రైతులనూ ఆదుకుంటామని స్పష్టం చేశారు. గురువారం కోమటిరెడ్డి తన జన్మదినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లోని మినిస్టర్స్ క్వార్టర్స్‌లో మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. బీజేపీలో సీనియర్ నాయకుడు రాజాసింగ్‌ను కాదని ఏలేటి బీజేపీఎల్పీ పదవిని తీసుకున్నారని, ఆయన పేరు పలకాలంటేనే తనకు అవమానంగా ఉందన్నారు. సీఎం రేవంత్, మంత్రి ఉత్తమ్‌పై బీజేపీ నేతలు అసత్య ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ అధికారం కోల్పోవడంతో, కవిత జైలుకు వెళ్లడంతో కేసీఆర్ నిస్సహాలో ఉన్నారని పేర్కొన్నారు. కేసీఆర్ కుటుంబం ఇక నుంచి బెయిల్ కోసం ప్రయత్నం చేసుకుంటే బెటర్ అని ఎద్దేవా చేశారు. సీఎం రేవంత్‌పై కేటీఆర్ మాటలు అసహ్యంగా ఉన్నాయని, అమెరికాలో చదువుకున్నానని ఆయన చెప్పుకొంటున్నా.. మాటలు మాత్రం అనాగరికంగా ఉన్నాయని విమర్శించారు. దుర్గం చెరువుపై కేబుల్‌బ్రిడ్జి నిర్మించి అభివృద్ధి చేశామని బీఆర్ఎస్ నేతలు అంటున్నారని, మరి.. శంషాబాద్‌లో అంతర్జాతీయ విమానాశ్రయం, పీవీ ఎక్స్‌ప్రెస్ పై ఓవర్‌లాంటివి నిర్మించిన తాము ఇంకెంత చెప్పుకోవాలని ప్రశ్నించారు. రాష్ట్రంలోని ఐఏఎస్‌లను పక్కన పెట్టిన కేటీఆర్.. కేవలం నలుగురైదుగురినే ప్రోత్సహించారని విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలో మద్యం అమ్మకాలు మాత్రమే పెరిగాయి తప్ప.. అభివృద్ధి జరగలేదని, వైన్ షాపుల పేరుమీద అమాయకుల నుంచి రూ.2,500కోట్లను గత ప్రభుత్వం రాబట్టిందని విమర్శించారు. అంతేకాకుండా ఒక్క టానిక్ వైన్‌షాప్ పేరుతోనే రూ.6వేల కోట్లు సంపాదించారని ఆరోపించారు. ఇప్పుడు తాము టెట్‌కు రూ.2వేలు ఫీజు కట్టాలనే నిబంధనను పెట్టామని, అలవికాని పథకాల హామీలను ఇచ్చామని తమను కేటీఆర్ విమర్శిస్తున్నారని.. మరి బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు రూ.500కే గ్యాస్, ఉచిత బస్సు ప్రయాణాన్ని ఎందుకు అమలుచేయలేదని నిలదీశారు. తమ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్నపై కేసులున్నాయని కేటీఆర్ అంటున్నారని, మరి.. కవిత లిక్కర్ కేసు గురించి ఎందుకు మాట్లాడటంలేదని ప్రశ్నించారు. వైఎస్సార్ తరహాలోనే సీఎం రేవంత్ కూడా ప్రజలకు అందుబాటులో ఉంటున్నారని, తామంతా కలిసిమెలిసి పని చేస్తున్నామన్నారు. జూన్ 6, 7, 8వ తేదీల్లో ఐటీ మంత్రి శ్రీధర్‌బాబుతో కలిసి విదేశీ పర్యటనకు వెళ్లి, అక్కడ వివిధ కంపెనీలతో భేటీకానున్నట్టు తెలిపారు. ఎల్బీనగర్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని ఎంసీఏ గైడ్‌లైన్స్‌కు అనుగుణంగా 14 అంతస్తులకు కుదిస్తామని చెప్పారు..

అమెరికా వెళ్లిన మంత్రి కోమటిరెడ్డి

మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి శుక్రవారం తెల్లవారుజామున అమెరికా వెళ్లారు. మే 24 నుంచి 26 వరకు అమెరికాలోని సియాటెల్‌లో జరగనున్న తెలంగాణ అమెరికన్ తెలుగు అసోసియేషన్ (టీటీఏ) మెగా కన్వెన్షన్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ఈ మేరకు ఏప్రిల్‌లోనే అసోసియేషన్ అధ్యక్షులు, క్వాడ్రెంట్ టెక్నాలజీ సీఈవో కంచరకుంట్ల వంశీరెడ్డి బృందం మంత్రిని కలిసి కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరవ్వాలని ఆహ్వానించారు. ఈ కన్వెన్షన్‌లో మంత్రి పలు కంపెనీల ప్రతినిధులతోనూ ప్రత్యేకంగా భేటీకానున్నారు. వారితో మాట్లాడి రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ఉన్న అవకాశాలు, అందుకు ప్రభుత్వం కల్పిస్తున్న పలు సౌకర్యాలను వారికి వివరించనున్నట్టు తెలిసింది. కోమటిరెడ్డి తిరిగి 27న రాష్ట్రానికి రానున్నారు.

కార్పొరేట్ కోసమే బీజేపీ పనిచేస్తోంది

» రిజర్వేషన్లు ఎత్తేసేందుకూ కుట్ర: డిప్యూటీ సీఎం భట్టి



హైదరాబాద్, మే 23 (ఆంధ్రజ్యోతి): దేశ ప్రజల కోసం కాంగ్రెస్ పనిచేస్తుంటే.. బహుళ జాతి కంపెనీల కోసమే బీజేపీ పనిచేస్తోందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ధ్వజమెత్తారు. దేశ వనరులు, సంపద ప్రజలకే చెందాలని తమ నాయకులు మల్లికార్జున్ ఖర్గే, రాహుల్ గాంధీ పోరాడుతుంటే.. దేశంలోని ఆస్తులు, వ్యవస్థలను అమ్మి కొన్ని కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టేందుకు మోదీ సర్కారు యత్నిస్తోందని ఆరోపించారు. బుధవారం రాత్రి నుంచి గురువారం సాయంత్రం వరకు పంజాబ్ రాష్ట్రంలోని ఫరీద్‌కోట్ లోక్‌సభ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి అమర్జిత్ కౌర్‌కు మద్దతుగా ప్రచార సభల్లో భట్టి ప్రసంగించారు. 'భారత రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని, జనాభా దామాషా పద్ధతిన రిజర్వేషన్లు ఉండాలని, ప్రజలకు సంపదను పంచాలని రాహుల్ గాంధీ నాయకత్వంలో పాదయాత్ర నిర్వహించారు. కానీ అధికార బీజేపీ ఓబీసీ, బీసీ, ఎస్సీల రిజర్వేషన్లను ఎత్తివేసేందుకు కుట్ర పన్నుతోంది.' అని ఆరోపించారు.

తల తాకట్టు పెట్టయినా రుణమాఫీ: తుమ్మల



మరిపెడ/ఏన్కూరు, మే 23: తల తాకట్టు పెట్టి అయినా ఆగస్టు 15 లోపు రైతుల రుణ మాఫీని అమలు చేస్తామని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆరునూరైన రైతన్నలకు ఇచ్చిన ప్రతీ హామీ నెరవేరుస్తారని చెప్పారు. గురువారం మహబూబాబాద్ జిల్లా మరిపెడలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచార సభలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. వరి వేస్తే ఉరే నని చెప్పిన కేసీఆర్ ఇప్పుడు రైతుల గురించి మాట్లాడం సిగ్గుచేటన్నారు.

యాదాద్రిలో అందుబాటులోకి ఆన్‌లైన్ సేవలు

భువనగిరి అర్బన్, మే 23: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దివ్య క్షేత్రంలో ఆన్‌లైన్ సేవలు అందుబాటులోకి వచ్చినట్లు ఈవో భాస్కర్‌రావు చెప్పారు. గతంలో బ్రేక్ దర్శనానికి మాత్రమే ఆన్‌లైన్‌లో నమోదుకు అవకాశం ఉండగా, ప్రస్తుతం అన్ని సేవలను ఆన్‌లైన్‌లో అందుబాటులోకి తెచ్చారు. అదేవిధంగా భక్తులు దేవస్థాన వెబ్‌పోర్టల్ (https://yadadritemple.telangana.gov.in)లో ఆన్‌లైన్ బుకింగ్ ద్వారా గంట ముందు దర్శన, పూజ కైంకర్యాలకు బుకింగ్ చేసుకునే అవకాశం కల్పించినట్లు తెలిపారు. ఆన్‌లైన్ బుకింగ్, కౌంటర్‌లో కంప్యూటరైజ్డ్ టికెట్లు పొందిన భక్తులకు తూర్పు రాజగోపురం వద్ద టికెట్లపై ఉన్న క్యూఆర్ కోడ్ స్కాన్‌చేసి ఆలయంలో లోనికి అనుమతిస్తారన్నారు.

మొలకెత్తిన ధాన్యాన్నీ కొంటున్నాం: చౌహాన్

హైదరాబాద్, మే 23 (ఆంధ్రజ్యోతి): యాసంగి ధాన్యం కొనుగోళ్లు, రైస్‌మిల్లర్లకు ధాన్యం కేటాయింపుల ప్రక్రియను అత్యంత పారదర్శకంగా చేపడుతున్నామని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్ తెలిపారు. అకాల వర్షాలతో తడిసిన, మొలకెత్తిన ధాన్యాన్ని తరుగు తీయకుండా కనీస మద్దతు ధరకు కొనుగోలు చేస్తున్నామని చెప్పారు. కొనుగోలు కేంద్రానికి రైతులు తెచ్చిన ఒక్క గింజను కూడా వెనక్కి పంపడం లేదని వెల్లడించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియపై దుష్ప్రచారం చేసి రైతులకు నష్టం కలిగించే వారిపై న్యాయపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కొనుగోళ్లు, టెండర్ల అంశంలో కార్పొరేషన్ అధికారులకు డబ్బు ఇచ్చామని రాష్ట్రంలో ఏ రైస్ మిల్లర్‌తోనైనా చెప్పించగలరా? అని డీఎస్ చౌహాన్ సవాల్ చేశారు. పీపీసీల్లో ధాన్యం కొనుగోళ్లు గతం కంటే వేగంగా, సజావుగా చేస్తున్నామని, ఇప్పటికే 40 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశామని తెలిపారు. పౌర సరఫరాల సంస్థకు ఉన్న రూ.58,623 కోట్ల అప్పులో రూ.6,346 కోట్లను ప్రస్తుత ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత తీర్చామని కమిషనర్ చెప్పారు.

టీజీఎస్ఆర్టీసీ నకిలీ లోగో వివాదం..

» తెలంగాణ డిజిటల్ మీడియా మాజీ డైరెక్టర్‌పై కేసు

» కొణతం దిలీప్‌తోపాటు మరొకరిపై కూడా

హైదరాబాద్, మే 23 (ఆంధ్రజ్యోతి): టీజీఎస్ఆర్టీసీ నకిలీ లోగో వివాదంలో తెలంగాణ రాష్ట్ర డిజిటల్ మీడియా విభాగం మాజీ డైరెక్టర్ కొణతం దిలీప్‌పై కేసు నమోదైంది. ఆర్టీసీ నకిలీ లోగోను సృష్టించి సామాజిక మాధ్యమాల్లో దుష్ప్రచారం చేశారనే ఆరోపణలపై కొణతం దిలీప్‌తోపాటు హరీశ్ రెడ్డి అనే మరో వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. హరీశ్ రెడ్డి బీఆర్ఎస్ పార్టీ ఐటీ విభాగంలో కీలక పాత్ర పోషిస్తారని సమాచారం. టీజీఎస్ ఆర్టీసీ అధికారులు గురువారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు చిక్కడపల్లి పోలీసులు ఈ చర్యలు తీసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం, తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ప్రతిష్ఠకు భంగం కలిగించేలా సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేసిన కొణతం దిలీప్, హరీశ్ రెడ్డిపై చర్యలు తీసుకోవాలని ఆర్టీసీ అధికారులు ఫిర్యాదు చేశారు. నకిలీ లోగో సృష్టించి, ప్రభుత్వానికి వ్యతిరేకంగా అసభ్యపదజాలంతో వీడియోను రూపొందించి ఎక్స్(ట్విటర్)లో పెట్టారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇందుకు స్పందించిన పోలీసులు కొణతం దిలీప్, హరీశ్ రెడ్డిపై ఐపీసీ 469, 504, 505 (1)(బి)(సి)లతో పాటు ఐటీ యాక్ట్ 67 కింద పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఈవీఎం ధ్వంసం కేసులో.. పిన్నెల్లికి ముందస్తు బెయిల్

» 6 వరకు ఆయన్ను అరెస్టు చేయొద్దు: హైకోర్టు

» పిన్నెల్లి వెంట నలుగురికి మించి ఉండకూడదని షరతు

» తాడిపత్రి టీడీపీ, వైసీపీ అభ్యర్థులకూ బెయిల్

అమరావతి, మే 23 (ఆంధ్రజ్యోతి): పోలింగ్ కేంద్రంలోకి వెళ్లి ఈవీఎంను ధ్వంసం చేసిన వ్యవహారంలో మాచర్ల వైసీపీ అభ్యర్థి పిన్నెల్లి రామకృష్ణారెడ్డికి ఊరట లభించింది. ఆయనకు షరతులతో కూడిన మధ్యంతర ముందస్తు బెయిల్‌ను హైకోర్టు మంజూరు చేసింది. జూన్ 6 వరకు ఆయన్ను అరెస్టు చేయవద్దని, తొందరపాటు చర్యలు తీసుకోవద్దని పోలీసులను ఆదేశించింది. ఆయన కదలికలను నిరంతరం పర్యవేక్షించడంతో పాటు నిఘా ఉంచాలని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి (సీఈవో)ని ఆదేశించింది. ఆయన వెంట నలుగురు వ్యక్తులకు మించి ఉండకూడదని తేల్చిచెప్పింది. విచారణను జూన్ 6కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి గురువారం రాత్రి ఆదేశాలిచ్చారు. ఈవీఎం, వీవీప్యాట్‌ను ధ్వంసం చేసిన వ్యవహారంలో పల్నాడు జిల్లా రెంటచింతల పోలీసులు తనపై నమోదు చేసిన కేసులో ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి గురువారం హైకోర్టును ఆశ్రయించారు. వ్యాజ్యంపై అత్యవసరంగా విచారణ జరపాలని అభ్యర్థించారు. కోర్టు విచారణ చేపట్టగా.. ఆయన తరఫున సీనియర్ న్యాయవాది నిరంజన్‌రెడ్డి వాదనలు వినిపించారు. ..

పలువురు అభ్యర్థులకు మధ్యంతర ముందస్తు బెయిల్..

మరోవైపు.. ఎన్నికల సందర్భంగా నమోదైన పలు కేసుల్లో నిందితులుగా ఉన్న టీడీపీ, వైసీపీ, ఇండిపెండెంట్ అభ్యర్థులు తమను పోలీసులు అరెస్టు చేయకుండా రక్షణ కల్పించాలని హైకోర్టును ఆశ్రయించారు. తాడిపత్రి టీడీపీ అభ్యర్థి జేసీ అస్మిత్‌రెడ్డి, వైసీపీ అభ్యర్థి కేతిరెడ్డి పెద్దారెడ్డి, స్వతంత్ర అభ్యర్థి పరిమి సోమశేఖర్‌నాయుడు, దెందులూరు టీడీపీ అభ్యర్థి చింతమనేని ప్రభాకర్, నరసరావుపేట వైసీపీ అభ్యర్థి గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, ఆ రెండు పార్టీలకు చెందిన పలువురు నాయకులు పిటిషన్లు దాఖలు చేశారు. ఈ వ్యాజ్యాలపైనా గురువారం హైకోర్టు విచారణ జరిపింది. ఇరుపక్షాల వాదనలు పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి.. పోటీ చేసిన అభ్యర్థులు ఏజెంట్లను నియమించుకోవాలని.. కౌంటింగ్ ప్రక్రియను పర్యవేక్షించాల్సి ఉందని పిటిషనర్ల తరఫు న్యాయవాదులు వాదనలు వినిపించారని.. ఈ నేపథ్యంలో పిటిషనర్లకు షరతులతో కూడిన మధ్యంతర ముందస్తు బెయిల్ మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. వ్యాజ్యాలపై విచారణను జూన్ 6కి వాయిదా వేశారు.

బిల్లులన్నీ పెండింగ్

(మొదటిపేజీ తరువాయి)

త్రైమాసికంలోనైనా బిల్లుల బకాయిల్లో ఎంతో కొంత విడుదల చేయాలనే యోచనలో సర్కారు ఉన్నట్లు చెబుతున్నాయి. రాష్ట్రంలోని వివిధ ఇంజనీరింగ్ కాలేజీల్లో చదువుతున్న విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల బకాయిలు ఐదేళ్ల నుంచి పెండింగ్‌లో ఉన్నాయి. 2019-20 సంవత్సరం నుంచి ఫీజులను ప్రభుత్వం కాలేజీ యాజమాన్యాలకు చెల్లించకపోవడంతో అవి భారీగా పేరుకుపోయాయి. వీటికి ప్రతి ఏటా కొంత కలుస్తూ ప్రస్తుతం ఈ రెండు పద్దుల కింద రూ.6 వేల కోట్ల దాకా పెండింగ్‌లో ఉన్నాయి. వీటిలో రీయింబర్స్‌మెంట్ బకాయిలే రూ.4 వేల కోట్లకు పైగా ఉన్నట్లు సమాచారం. 2019-20లో రూ.500 కోట్లు, 2020-21లో రూ.2,250 కోట్ల బకాయిలు ఉండగా.. ప్రభుత్వం రూ.1,850 కోట్లు చెల్లించింది. ఆ తర్వాత నుంచి ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదు. దీంతో ఇంజనీరింగ్ కాలేజీలు విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదు. ఫలితంగా ఇంజనీరింగ్ పూర్తి చేసుకుని బయటికెళ్లబోయే విద్యార్థుల పరిస్థితి ఆందోళనకరంగా మారింది. మరోవైపు ఇంటర్, డిగ్రీ పూర్తియిన విద్యార్థులు రెండు మూడేళ్ల క్రితమే కోర్సును పూర్తి చేసినా.. ఫీజు రీయింబర్స్ కాలేదు. స్కాలర్‌షిప్‌ల సొమ్ము విద్యార్థుల బ్యాంకు ఖాతాల్లో జమ కాలేదు. దీంతో కాలేజీల యాజమాన్యాలు సర్టిఫికెట్లు ఇచ్చేందుకు నిరాకరిస్తుండడంతో విద్యార్థుల ఉన్నత చదువులకు ఆటంకంగా మారింది.



టోకెన్ల జారీతోనే సరి..!

కాలేజీలకు ఫీజు రీయింబర్స్‌మెంట్ బిల్లులను క్లియర్ చేసేందుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం టోకెన్లు జారీ చేసింది. కానీ, సొమ్ము మాత్రం కాలేజీలకు అందలేదు. ఈ బకాయిలను ప్రతి మూడు నెలలకు కొంత చొప్పున చెల్లిస్తామంటూ ప్రభుత్వం వాయిదాల పద్ధతిని తీసుకొచ్చింది. దాని ప్రకారం విద్యా ఏడాది ప్రారంభంలో 25 శాతం, మధ్యలో 50 శాతం, చివర్లో మరో 25 శాతం చెల్లిస్తామని పేర్కొన్నది. కానీ, ఈ విధానాన్నీ పాటించలేదు. పర్యవసానంగా పెద్ద మొత్తంలో బకాయిలు పేరుకుపోయాయి. పైగా... ఫీజు రెగ్యులేటరీ కమిటీ ప్రతి మూడేళ్లకోసారి పెంచుతున్న ఫీజుల పద్ధతి కూడా అమలు కావడం లేదు. ఇదివరకు బీటెక్, ఫార్మసీ, న్యాయ విద్య, బీఎడ్ వంటి కోర్సులకు రూ.38 వేలు ఫీజు ఉండేది. ఇది ఇప్పుడు రూ.70 వేలకు పెరిగింది. కానీ, పెరిగిన మేర ఫీజులను ప్రభుత్వం రీయింబర్స్ చేయడం లేదని కాలేజీ యాజమాన్యాలు అంటున్నాయి. స్కాలర్‌షిప్‌లు కూడా పెరిగినా... విద్యార్థులకు అందడం లేదు.



జూన్ మొదటి వారంలో ఆరోగ్యశ్రీ సేవలు బంద్?

ఆరోగ్యశ్రీ పథకం కింద ప్రైవేటు ఆస్పత్రులకు బిల్లులను క్లియర్ చేయకపోవడంతో.. పేద, మధ్య తరగతి ప్రజలకు చికిత్సలు/శస్త్ర చికిత్సలు సవ్యంగా అందడం లేదు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆరోగ్యశ్రీ వైద్య సేవల పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచింది. కానీ, ఆరోగ్యశ్రీ పరిధిలోని నెట్‌వర్క్ ఆస్పత్రులకు ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న రూ.వెయ్యి కోట్ల బకాయిలను క్లియర్ చేయలేకపోతోంది. గత పది నెలలుగా ఈ బిల్లులు క్లియర్ కావడం లేదని నెట్‌వర్క్ ఆస్పత్రుల సంఘం ఆరోపిస్తోంది. జూన్ 1న నెట్‌వర్క్ ఆస్పత్రుల అసోసియేషన్ సమావేశం కావాలని నిర్ణయించింది. అనంతరం జూన్ మొదటి వారం నుంచి ప్రైవేటు ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ సేవలను నిలిపి వేయాలని యోచిస్తున్నట్లు అసోసియేషన్ సభ్యులు వెల్లడించారు. ఇదిలా ఉండగా.. సర్కారు దవాఖానాల్లో డైట్ కాంట్రాక్టర్లకు ఆరు నెలలుగా బిల్లులు చెల్లించడంలేదు. ఈ బిల్లులు సుమారు రూ.30-35 కోట్ల వరకు పెండింగ్‌లో ఉన్నట్లు కాంట్రాక్టర్లు చెబుతున్నారు. ఒక్క సిద్దిపేట మెడికల్ కాలేజీకి సంబంధించిన డైట్ బిల్లే రూ.51 లక్షల మేర పెండింగ్‌లో ఉంది. హైదరాబాద్‌లోని గాంధీలాంటి ఆస్పత్రుల్లో నెలకు డైట్ బిల్లే రూ.కోటి వరకు ఉంటుంది. సకాలంలో బిల్లులు రాకపోవడంతో డైట్ కాంట్రాక్టర్లు రోగులకు నాసిరకపు భోజనం పెడుతున్నారన్న ఆరోపణలున్నాయి. వీటిన్నింటికి తోడు జాతీయ వైద్య ఆరోగ్య మిషన్ పరిధిలో పనిచేస్తున్న సుమారు 60 వేల మందికి వేతనాలు సక్రమంగా చెల్లించడంలేదు. కేంద్రం నుంచి రావాల్సిన నిధులు రాకపోవడంతో వారి జీతాల భారం రూ.వందల కోట్లకు చేరింది.

ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల బకాయిలు ఇలా..

ఆర్థిక సంవత్సరం	బకాయిలు
2019-20	రూ.270 కోట్లు,
2020-21	రూ.300 కోట్లు
2021-22	రూ.1,872 కోట్లు
2022-23	రూ.2,450 కోట్లు



వైద్య ఆరోగ్యశాఖలో 3వేల కోట్ల పెండింగ్..

వైద్య ఆరోగ్యశాఖలోనూ బిల్లులు భారీగా పెండింగ్‌లో ఉన్నాయి. అత్యవసర సేవల కిందకు వచ్చే ఆరోగ్య శాఖలోని వివిధ విభాగాల కింద సుమారు రూ.3 వేల కోట్ల బకాయిలు పేరుకుపోయాయి. తెలంగాణ రాష్ట్ర వైద్య సేవల మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ(టీఎస్ఎంఎస్ఐడీసీ) కింద రూ.1500 కోట్ల బకాయిలు పేరుకుపోయాయి. ప్రైవేటు మందుల కంపెనీల నుంచి టీఎస్ఎంఎస్ఐడీసీ ఔషధాలను కొనుగోలు చేసి రాష్ట్రంలోని ప్రభుత్వ ఆస్పత్రులకు సరఫరా చేస్తుంది. అయితే ప్రైవేటు ఫార్మా కంపెనీలకు ఆ సంస్థ పాత బకాయిలు చెల్లించకపోవడంతో.. తాము మందులను సరఫరా చేయలేమని ఆ కంపెనీలు మొండికేస్తున్నాయి. దీంతో పేద రోగులకు ప్రభుత్వ ఆస్పత్రుల్లో మందులు లభించని పరిస్థితి నెలకొంటోంది. ఒకవేళ లభించినా.. కొన్ని దీర్ఘకాలిక వ్యాధులు, అంటురోగాలు, పాము కాటు, రేబిస్ సంబంధిత అత్యవసర ఔషధాలు అందుబాటులో ఉండడం లేదన్న ఆరోపణలున్నాయి. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ హెచ్‌ఎల్ఎల్ లైఫ్‌కేర్ లిమిటెడ్ బాలికల కోసం శానిటరీ నాప్‌కిన్స్, వాటిని డిస్పోజ్ చేసే వెండింగ్ మిషన్లను సరఫరా చేయగా.. అందుకు సంబంధించిన బిల్లులను గత రెండేళ్లుగా చెల్లించడం లేదు. ఈ బిల్లు కేవలం రూ.2 కోట్ల లోపే ఉన్నా... చెల్లించకపోవడం గమనార్హం.

ఉద్యోగుల సప్లిమెంటరీ బిల్లులకు మోక్షమెప్పుడో?

ఉద్యోగులు, ఉపాధ్యాయుల పరిస్థితి ఎంత తక్కువ చెప్పుకొంటే అంత మంచిది అన్నట్లుగా తయారైంది. వీరికి సంబంధించి గత బీఆర్ఎస్ ప్రభుత్వం నాటి సప్లిమెంటరీ బిల్లులు ఇప్పటికీ క్లియర్ కావడం లేదు. గ్రాట్యుటీ, ప్రభుత్వ జీవిత బీమా, జీపీఎఫ్, సరెండర్ లీవ్స్, కమ్యూటేషన్ వంటి బిల్లులు దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉంటున్నాయి. ఈ బిల్లులను తయారు చేసి, సబ్ ట్రెజరీ కార్యాలయాలకు పంపడం, అక్కడి నుంచి టోకెన్లు జనరేట్ కావడం షరా మామూలుగా మారింది. కానీ, బిల్లుల తాలూకు సొమ్ము మాత్రం ఉద్యోగుల బ్యాంకు ఖాతాల్లో పడడం లేదు. రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 10 వేలకు పైగా సప్లిమెంటరీ బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. వీటన్నింటినీ క్లియర్ చేయాలంటే రూ.3 వేల కోట్ల నుంచి రూ.4 వేల కోట్లు అవసరమవుతాయని అంచనా. ఇంక్రిమెంట్ ఏరియర్స్, ఆటోమేటిక్ అడ్వాన్స్ స్కీమ్, పీఆర్సీ ఏరియర్స్, మెడికల్ రీ-యింబర్స్‌మెంట్ సంబంధిత రూ.25 వేలు, రూ.30 వేల విలువైన బిల్లులను క్లియర్ చేశారు. కానీ.. రూ.లక్షల్లో ఉన్న బిల్లులను మాత్రం క్లియర్ చేయడం లేదు. పలు ఉద్యోగ సంఘాల నేతలు ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డిని, ఆర్థిక శాఖను పర్యవేక్షించే డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కను కూడా కలిసి బిల్లులను క్లియర్ చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఆర్థిక పరిస్థితి బాగా లేకపోవడం వల్లే...

వాస్తవానికి రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఏమంతా బాగా లేదు. నెలవారీగా సమకూరుతున్న రాబడులు... నెలవారీ వ్యయాలకే సరిపోతున్నాయి. ఇందులో ప్రధానంగా అప్పుల అసలు, వడ్డీలు చెల్లించాలంటేనే ప్రభుత్వానికి పెద్ద సమస్యగా మారింది. ప్రతి నెలా అన్ని రకాల రాబడుల ద్వారా రూ.12-14 వేల కోట్ల వరకు నిధులు సమకూరుతున్నాయి. నెలకు మరో రూ.4-5 వేల కోట్ల వరకు రుణాలు తీసుకుంటోంది. ఇలా వచ్చే రూ.18-19 వేల కోట్లను ఉద్యోగుల వేతనాలు, పెన్షన్లు, సంక్షేమ పథకాలు, సబ్సిడీలు, అప్పుల కిస్తులు, వడ్డీ చెల్లింపులకు సర్దుతోంది. పర్యవసానంగా సప్లిమెంటరీ బిల్లుల క్లియరెన్స్‌కు ఖజానాలో సొమ్ము మిగలడం లేదు. అప్పుల అసలు, వడ్డీల కింద 2023-24లో ప్రభుత్వం రూ.53,978 కోట్లను చెల్లించాల్సి వచ్చింది. ఇందులో బడ్జెట్ రుణాల అసలు కిస్తీలు, వడ్డీలకు రూ.32,939 కోట్లను చెల్లించాల్సి రాగా... బడ్జెట్‌కు ఆవల కార్పొరేషన్ల గ్యారెంటీల పేర తీసుకున్న రుణాల అసలు, వడ్డీల కింద రూ.21,039 కోట్లను చెల్లించింది. అంటే... నెలకు సగటున రూ.5 వేల కోట్లు అసలు, వడ్డీలకే సరిపోయాయి. ఏప్రిల్‌తో ప్రారంభమైన 2024-25 ఆర్థిక సంవత్సరంలో కూడా అలాంటి పరిస్థితే నెలకొన్నది. వడ్డీల కిందే నెలకు రూ.2 వేల కోట్ల మేర చెల్లించాల్సి వస్తోంది. ఉద్యోగుల వేతనాలు, పెన్షన్ల కింద రూ.4,500 కోట్లకు పైగా చెల్లించాలి. ఈ వడ్డీలు, వేతనాలే సింహభాగం నిధులను హరిస్తున్నాయి. మధ్యలో సీజన్లవారీగా రైతుభరోసా కార్యక్రమం వచ్చిందంటే... ఖజానా వట్టిపోవాల్సిందే. ప్రస్తుతం రైతుబంధు స్కీమ్ కిందనే సొమ్మును చెల్లించాల్సి వస్తుండడంతో ప్రతి సీజన్‌కు రూ.7,600 కోట్లు అవసరమవుతున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చిన ఎకరానికి రూ.15 వేల స్కీమ్‌ను అమలు చేస్తే ఇంకా ఎక్కువే నిధులు కావాల్సి ఉంటుంది. ఇలాంటి పరిస్థితుల కారణంగా వివిధ సేవలకు సంబంధించిన బిల్లుల బకాయిలు క్లియర్ కావడం లేదని ప్రభుత్వ వర్గాలు వివరిస్తున్నాయి. అయితే... అత్యవసర సేవలు, అధిక సంఖ్యాక ప్రజలకు సంబంధించిన విద్యా, వైద్యం, ఉద్యోగుల బకాయిలను కొంత మేరకైనా చెల్లించేలా ప్రభుత్వానికి ఒక ప్రణాళిక ఉండాలని పలువురు అభిప్రాయపడుతున్నారు.



పారిశ్రామిక ప్రగతి కొత్తపుంతలు తొక్కేలా..

» నూతనంగా ఆరు పారిశ్రామిక విధానాల కార్యాచరణకు కసరత్తు

హైదరాబాద్, మే 23(ఆంధ్రజ్యోతి): సకాలంలో ప్రోత్సాహకాలను అందించి పారిశ్రామిక ప్రగతిని కొత్తపుంతలు తొక్కించేలా ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు వచ్చే ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు, ఇప్పటికే పరిశ్రమలను నిర్వహిస్తున్న వారికి సకాలంలో ప్రోత్సాహకాలు అందించేలా విధానాల రూపకల్పనకు ప్రభుత్వం సిద్ధమైంది. గత ప్రభుత్వం పరిశ్రమలకు రాయితీలు, ప్రోత్సాహకాల కోసం బడ్జెట్‌లో నిధులు కేటాయించినప్పటికీ.. విడుదల చేయలేదు. దీంతో నిర్వహణ భారం భరించలేక చాలా పరిశ్రమలను మూసేశారు. గత ప్రభుత్వ హయాంలో ఇలా సకాలంలో చెల్లించని ప్రోత్సాహకాల బకాయిలు రూ.3736 కోట్ల మేర ఉన్నట్లు ఇటీవల ముఖ్యమంత్రి నిర్వహించిన సమీక్షల్లో వెల్లడైంది. అందులో రూ.3007 కోట్ల చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు సంబంధించినవి కాగా, రూ.728 కోట్లు భారీ, మెగా పరిశ్రమలకు సంబంధించినవిగా ప్రభుత్వం గుర్తించింది. అలాగే.. 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి కొన్ని పరిశ్రమలకు ఇచ్చిన రూ.684 కోట్ల చెక్కులు కూడా బౌన్స్ అయినట్లు గుర్తించారు. ఈ నేపథ్యంలోనే.. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం పరిశ్రమలను ప్రోత్సహించేలా, పెట్టుబడులను ఆకర్షించేలా సరికొత్త పాలసీల రూపకల్పనకు సిద్ధమవుతోంది.గతంలో జరిగిన తరహాలో ఎలాంటి తప్పిదాలకూ తావులేకుండా.. పరిశ్రమలను ప్రోత్సహించేలా నూతనంగా ఆరు పారిశ్రామిక విధానాలను అమలు చేయడానికి అధికారులు కసరత్తు చేస్తున్నారు. గత ప్రభుత్వంలో విధాన పరమైన నిర్ణయాలలో జరిగిన జాప్యం వల్ల.. నిర్దేశిత సమయానికి ప్రోత్సాహకాలు అందించకపోవడంవల్ల పారిశ్రామిక వేత్తలు నిరుత్సాహపడ్డారు. దీంతో పారిశ్రామిక ప్రగతిలో కొన్ని ఒడుదొడుకులు ఎదురైనట్లు ప్రస్తుత ప్రభుత్వ పరిశీలనలో వెల్లడైంది. అలాంటివి పునరావృతం కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకుని నూతన పారిశ్రామిక విధానం అమలు చేయాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులకు దిశానిర్దేశం చేశారు. గత ప్రభుత్వం ఇస్తామన్న ప్రోత్సాహకాలు అందక పరిశ్రమలను మూతవేసుకునే పరిస్థితి ఏర్పడిన నేపథ్యంలో.. ఆ బకాయిలను చెల్లించి పారిశ్రామిక ప్రగతిని గాడిలో పెట్టాలని సూచించారు.

ఆ ఆరు రంగాల్లో..

పారిశ్రామిక అభివృద్ధిలో ప్రపంచ దేశాలతో పోటీపడేలా తెలంగాణ పారిశ్రామిక విధానాలు ఉండాలని సీఎం రేవంత్ రెడ్డి ఇటీవల నిర్వహించిన తెలంగాణ స్టేట్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ (టీఎస్ఐఐసీ) సమావేశంలో ఉన్నతాధికారులకు సూచించారు. ఎంఎస్ఎంఈ, ఎగుమతులు, న్యూ లైఫ్ సైన్సెస్, రివైజ్ ఈవీ, మెడికల్ టూరిజం, గ్రీన్ ఎనర్జీ రంగాల్లో పారిశ్రామిక అభివృద్ధికి సంబంధించి నూతనంగా ఆరు పాలసీలు రూపొందిస్తున్నామని అధికారులు సీఎంకు వివరించారు. రాష్ట్రంలో చేనేత కార్మికులను దృష్టిలో ఉంచుకుని పవర్‌లూమ్, హ్యాండ్‌లూమ్ కార్మికులను ఆదుకునేలా నూతన పాలసీ తయారు చేయాలని సీఎం అధికారులకు దిశానిర్దేశం చేశారు.

మేడిగడ్డ కింద అగాధం?

» 12000-15000 క్యూబిక్ మీటర్ల ఖాళీ

హైదరాబాద్, మే 23 (ఆంధ్రజ్యోతి): మేడిగడ్డ మరమ్మతులకు మరో గండం వచ్చి పడింది. మొత్తం బ్యారేజీ కింద పెద్ద అగాధం ఉన్నట్లుగా నీటిపారుదల శాఖ అధికారులు తేల్చారు. మేడిగడ్డ బ్యారేజీలో పెద్ద ఎత్తున నీటిని నిల్వ చేయడం వల్ల ఆ ఒత్తిడితో బ్యారేజీ కింద నుంచి ఇసుక పెద్ద మొత్తంలో కొట్టుకుపోవడం వల్ల బ్యారేజీ అడుగున పెద్ద అగాధం ఏర్పడిందని అంచనాకు వచ్చారు. ఆ అగాధం సైజు 12000 క్యూబిక్ మీటర్ల నుంచి 15000 క్యూబిక్ మీటర్ల వరకు ఉండొచ్చని ఇటీవల నిర్వహించిన గ్రౌండ్ పెనట్రేటింగ్ రాడార్ టెస్ట్ ఆధారంగా ప్రాథమిక అంచనాకు వచ్చారు. అంటే, కొత్త సచివాలయం సైజులో నాలుగో వంతు అన్నమాట. అయితే, ఈ అగాధం ఒకే చోట కాకుండా బ్యారేజీ పొడవునా కొన్నిచోట్ల పెద్దగా కొన్నిచోట్ల చిన్నగా ఉంటుందని వేస్తున్నారు. అగాధం పెద్దగా ఉన్న ఏడో బ్లాక్‌లో ప్రస్తుతం పియర్లు కుంగిపోయాయి. ఈ బ్లాక్‌లోనే 16వ నంబర్ గేటును తాజాగా పైకి ఎత్తడానికి నీటిపారుదల శాఖ ప్రయత్నించగా, బ్యారేజీ కింద భూగర్భంలో నుంచి పెద్ద ఎత్తున శబ్దాలు, ప్రకంపనలు వచ్చాయి. వెంటనే పనులు నిలిపేశారు. జియోఫిజికల్, జియో టెక్నికల్ పరీక్షలు అగాధం ఉన్న విషయాన్ని ధ్రువీకరించిన నేపథ్యంలో టన్నుల కొద్దీ బరువు ఉన్న భారీ గేటును పైకి ఎత్తే సమయంలో పునాదులపై ఒత్తిడి పెరిగి, బ్యారేజీ మరింత లోతుల్లోకి కుంగే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తమవుతోంది. శబ్దాల నేపథ్యంలో అగాధాన్ని పూడ్చిన తర్వాతే గేట్లను పైకి ఎత్తే పనులు చేపట్టాలని నీటిపారుదల శాఖ నిర్ణయించింది. నిజానికి ఆనకట్టల భద్రత సంస్థ బ్యారేజీ కింద ఖాళీ ఉన్న విషయాన్ని ఎప్పుడో ధ్రువీకరించింది. దాన్ని తీవ్రత తాజా పరీక్షల్లో తెలుస్తోంది. గతేడాది అక్టోబరు 21న



7వ నంబర్ బ్లాకు కుంగిన తర్వాత అక్కడి నుంచి నీటి లీకేజీని ఆపడానికి ఏకంగా 40 వేల ఇసుక బస్తాలను ఖాళీలో వేశారు. తాజాగా 12000-15000 క్యూబిక్ మీటర్ల అగాధం ఉందని అంచనాకు రావడం ఆందోళన కలిగించే పరిణామం.

మొత్తం గేట్లు ఎత్తమనడంతో...

మేడిగడ్డ బ్యారేజీలో మొత్తం ఎనిమిది బ్లాకులు ఉన్నాయి. వాటికి 85 గేట్లు ఉన్నాయి. గతేడాది అక్టోబరు 21న ఏడో బ్లాకు కుంగిన వెంటనే 77 గేట్లను ఎత్తి, బ్యారేజీలో నిల్వ చేసిన నీటిని దిగువకు వదిలేశారు. 7వ బ్లాకు కుంగడంతో 15వ నంబరు నుంచి 22వ నంబర్ వరకు గేట్లు మొరాయించాయి. దాంతో అప్పట్లో ఈ గేట్లను ఎత్తలేక పోయారు. పిల్లర్లకు నిట్టనిలువున పగుళ్లు కూడా రావడంతో వీటిని బలవంతంగా ఎత్తే ప్రయత్నం చేయలేదు. కేంద్ర జల వనరుల సంఘం మాజీ ఛైర్మన్ చంద్రశేఖర్ అయ్యర్ నేతృత్వంలో జాతీయ ఆనకట్టల భద్రతా సంస్థ నిపుణుల కమిటీ ఇటీవల కాళేశ్వరంపై సమర్పించిన మధ్యంతర నివేదికలో వర్షాకాలానికి ముందు నిర్వహించాల్సిన అత్యవసర మరమ్మతుల గురించి చెప్పింది. మేడిగడ్డలో మొరాయించిన గేట్లన్నీ వర్షాకాలానికి ముందే పైకెత్తాలని స్పష్టం చేసింది. ఏడో బ్లాకులోని రెండు పియర్లకు పగుళ్లు ఏర్పడి ఉండడంతో 19, 20, 21 పియర్ల మధ్య ఉన్న గేట్లను అత్యంత జాగ్రత్తగా పైకి ఎత్తాలని సూచించింది. గేట్లను ఎత్తే క్రమంలో పునాదులపై ఒత్తిడి ఏర్పడకుండా ఇతర గేట్ల వద్ద క్రేన్లను ఏర్పాటు చేసి, ఎత్తాలని సూచించింది. నిర్మాణ సంస్థ ఎల్ అండ్ టీతో కలిసి నీటిపారుదల శాఖ అధికారులు ఈ నెల 17న 15వ నంబర్ గేటును విజయవంతంగా పైకి ఎత్తారు. 16వ నంబర్ గేటును ఎత్తడానికి ప్రయత్నించగా, శబ్దాలు, ప్రకంపనలు రావడాన్ని అధికారులు గుర్తించారు.

ఐదేళ్ల క్రితమే సంకేతాలు

మేడిగడ్డ బ్యారేజీ నిర్మాణం 2019 జూలైలో పూర్తయింది. ఆ ఏడాది వరదల సందర్భంగా బ్యారేజీ ప్రమాద సంకేతాలను వెలువరించిందని ఎన్డీఎస్ఏ నిపుణుల కమిటీ తన నివేదికలో స్పష్టం చేసింది. అప్పట్లో పట్టించుకోక పోవడంతోనే బ్యారేజీ పరిస్థితి నానాటికి దిగజారిపోయి చివరకు కుంగిపోవడానికి కారణమయిందని తేల్చిచెప్పింది. మళ్లీ బ్యారేజీ ప్రమాదసంకేతాలు వెలువరిస్తుండటంతో ముస్ముందు ఏం జరుగనుందనే ఆందోళనలు నీటిపారుదల శాఖలో వ్యక్తమవుతున్నాయి. అత్యవసర మరమ్మతులు నిర్వహించే సమయంలో అనుకోని ప్రమాదం సంభవిస్తే పెద్ద ఎత్తున ప్రాణనష్టం జరిగే అవకాశాలున్నాయని ఇంజనీర్లు భయపడుతున్నారు.

పరీక్షల తర్వాతే బొరియపై స్పష్టత

బ్యారేజీ కింద ఖాళీ ప్రదేశాన్ని గుర్తించడానికి భూభౌతిక, భూసాంకేతిక పరీక్షలను నిపుణుల కమిటీ సూచించిన మూడు సంస్థలతో అధ్యయనం చేయిస్తారు. అగాధంపై పూర్తి స్థాయి స్పష్టత వచ్చాక ఇసుక, సిమెంట్ మిశ్రమాన్ని పంపించి పూడుస్తారు. దీన్నే ప్రెషర్ గ్రౌటింగ్ అంటారు.

మేడిగడ్డ పనుల పరిశీలనకు సీఎం

నాలుగైదు రోజుల్లో పర్యటన

» బ్యారేజీ రక్షణకు చర్యలు తీసుకోండి

» వానాకాలంలోపు పనులు పూర్తి చేయాలి

» నిర్మాణ సంస్థ అధికారులకు మంత్రి ఉత్తమ్ నిర్దేశం, సమీక్ష

హైదరాబాద్, మే 23 (ఆంధ్రజ్యోతి): మేడిగడ్డ, అన్నారం బ్యారేజీల వద్ద జరుగుతున్న మరమ్మతు పనులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పరిశీలించనున్నారని, ఈ మేరకు సీఎం నాలుగైదు రోజుల్లో క్షేత్రస్థాయిలో పర్యటిస్తారని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. మేడిగడ్డ, అన్నారం బ్యారేజీల వద్ద జరుగుతున్న పనుల పురోగతిపై మంత్రి సమీక్షించారు. ఈ భేటీలో నిర్మాణ సంస్థ ఎల్ అండ్ టీ డైరెక్టర్ (ఇరిగేషన్) దేశాయ్, ఆ సంస్థకు చెందిన ఇతర ప్రతినిధులు, నీటిపారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. జాతీయ ఆనకట్టల భద్రత సంస్థ (ఎన్డీఎస్ఏ) నిపుణుల కమిటీ ఇచ్చిన మధ్యంతర నివేదిక ప్రకారమే మరమ్మతులు జరపాలని, ఈ పనులన్నీ వానాకాలంలోపు పూర్తిచేసి బ్యారేజీని కాపాడుకోవాలని ఉత్తమ్‌కుమార్ స్పష్టం చేశారు. కుంగిన ఏడో బ్లాకులోని గేట్లను ఎత్తే ప్రక్రియ చేపడుతున్నామని, బ్యారేజీకి గ్రౌటింగ్ పూర్తిచేసి, ఏడో బ్లాకుకు దిగువ భాగంలో షీట్‌పైల్స్ వేస్తామని ఈ సందర్భంగా ఎల్ అండ్ టీ ప్రతినిధులు తెలిపారు. దెబ్బతిన్న పిల్లర్లకు చెందిన గేట్లను కూడా ఎత్తుతామని, షీట్ పైల్స్‌ను ఇప్పటికే దిగుమతి చేసుకున్నామన్నారు. రాత్రనక, పగలనక మేడిగడ్డ బ్యారేజీ వద్ద పనులు చేస్తున్నామని, వానాకాలంలో వరద సాఫీగా వెళ్లిపోయేలా ఏర్పాట్లు చేస్తున్నామని నివేదించారు. అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లో జరుగుతున్న మరమ్మతులను అధికారులు మంత్రికి వివరించారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల మీద తదుపరి అధ్యయనంపై ప్రతిపాదనలను తమ ఉన్నతాధికారులకు నివేదిస్తామని పుణెకు చెందిన కేంద్ర నీటి, విద్యుత్ పరిశోధన సంస్థ (సీడబ్ల్యూపీఆర్ఎస్)కు చెందిన భూభౌతిక, భూసాంకేతిక, నాన్ డిస్ట్రక్టివ్ విభాగాలకు చెందిన ముగ్గురు నిపుణులు నీటిపారుదల శాఖ అధికారులకు తెలిపారు. ఈఎన్‌సీ (జనరల్) జీ అనిల్‌కుమార్, ఈఎన్‌సీ (ఓ అండ్ ఎం) బీ నాగేంద్రరావుతో వారు భేటీ అయ్యారు. 2 రోజుల తమ పర్యటనలో పరిశీలించిన అంశాలపై డైరెక్టర్‌కు ప్రతిపాదనలు అందిస్తామని తెలిపారు.



బ్యారేజీల మరమ్మతులపై ఎల్అండ్‌టీ ప్రతినిధులు, నీటిపారుదల అధికారులతో మంత్రి ఉత్తమ్ సమావేశం

20 నిమిషాలు చీకట్లోనే జిల్లా ఆస్పత్రి

- సెల్‌ఫోన్ టార్చ్ వెలుగులో వైద్య చికిత్సలు
- సాంకేతిక లోపంతో విద్యుత్ సరఫరా నిలిపివేత
- పనిచేయని జనరేటర్.. అధ్వానంగా నిర్వహణ
- 7 నిమిషాల్లో సరఫరా పునరుద్ధరించామన్న సీఎండీ


యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్ర ఆస్పత్రిలో సెల్‌ఫోన్ టార్చ్ వెలుతురులో వైద్య చికిత్సలు అందిస్తున్న సిబ్బంది

భువనగిరి టౌన్, మే 23: యాదాద్రి భువనగిరి జిల్లా ఆస్పత్రిలో బుధవారం రాత్రి 20 నిమిషాల పాటు అంధకారం నెలకొంది. సెల్‌ఫోన్ టార్చ్ వెలుతురులోనే వైద్యులు రోగులకు చికిత్స అందించాల్సి వచ్చింది. వర్షాలతో ఆస్పత్రికి విద్యుత్ సరఫరాలో సాంకేతిక సమస్యలు తలెత్తడంతో ట్రాన్స్‌కో అధికారులు విద్యుత్ సరఫరాను రాత్రి 9.30 గంటలకు నిలిపివేశారు. దాంతో 150 పడకల ఆస్పత్రిలో అంధకారం అలుముకుంది. ఆస్పత్రి సిబ్బంది 10 నిమిషాల తర్వాత జనరేటర్‌ను ఆన్ చేయగా అది కొద్దిసేపటికే ఆగిపోయింది. డయాలసిస్, ప్రసూతి, పిల్లల వార్డులు, ఆపరేషన్ థియేటర్‌లో ఇన్వర్టర్లు ఉండగా ఎమర్జెన్సీ వార్డులోని ఇన్వర్టర్ మాత్రం పనిచేయడం లేదు. దాంతో అక్కడ, ఇతర వార్డుల్లో రెండుసార్లు సుమారు 20 నిమిషాల పాటు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఆ సమయంలో వచ్చిన రోగులకు, ఇన్‌పేషెంట్లకు వైద్యులు, సిబ్బంది సెల్‌ఫోన్ టార్చిలైట్ల వెలుతురులోనే వైద్య సేవలు అందించారు. ఆ వెలుతురులోనే ఇంజక్షన్లు ఇచ్చారు. జనరేటర్‌కు మరమ్మతులు చేసేలోపు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించడంతో సమస్య తాత్కాలికంగా సద్దుమణిగింది. రాష్ట్రంలో కరెంటు కోతలకు ఇంతకంటే నిదర్శనం ఏం ఉంటుందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు తన 'ఎక్స్' ఖాతాలో బుధవారం రాత్రి ట్వీట్ చేశారు. ఆస్పత్రికి 24 గంటలూ నాణ్యమైన విద్యుత్ సరఫరా అయ్యేలా ప్రత్యేక లైన్ ఏర్పాటుకు ట్రాన్స్‌కో ఉన్నతాధికారులతో చర్చిస్తానని ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్ రెడ్డి తెలిపారు. గురువారం ఆస్పత్రిని పరిశీలించిన ఆయన వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ చిన్నానాయక్ స్పందిస్తూ తాత్కాలిక విద్యుత్ అవాంతరాలతో వైద్య సేవలకు ఎలాంటి అంతరాయం కలగలేదన్నారు. గురువారం జనరేటర్‌కు పూర్తిస్థాయి మరమ్మతులు చేయించినట్లు తెలిపారు. టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ ఫరూఖీ మీడియాతో మాట్లాడుతూ సాంకేతిక సమస్యలతో నిలిచిన విద్యుత్ సరఫరాను ఏడు నిమిషాల్లో పునరుద్ధరించామని తెలిపారు.

పారిశుధ్య కార్మికురాలితో

అసభ్య చేష్టలు

- ఇద్దరు ఫీల్డ్ అసిసెంట్ల నిర్వాకం
- సోషల్ మీడియాలోవీడియో వైరల్
- జీహెచ్ఎంసీ కమిషనర్ సీరియస్
- విధుల నుంచి తొలగింపు



హైదరాబాద్ సిటీ, మే 23 (ఆంధ్రజ్యోతి): ఆ ఇద్దరూ శానిటరీ ఫీల్డ్ అసిస్టెంట్లు! వీరిలో ఒకరు మహిళా పారిశుధ్య కార్మికులతో అసభ్యంగా ప్రవర్తిస్తూ ఆ దృశ్యాలను తనకు తానే ఫోన్లో వీడియో తీస్తాడు. తర్వాత ఆ వీడియోలను బాధిత మహిళలకు చూపి లైంగిక వేధింపులకు గురిచేస్తాడు. ఈ వీడియోలు తన చేతికి చిక్కడంతో మరో శానిటరీ ఫీల్డ్ అసిస్టెంట్ బాధిత మహిళలను వేధించాడు. మహిళా పారిశుధ్య కార్మికుల పట్ల అసభ్య చేష్టల తాలూకు వీడియోలు వైరల్ అవడంతో జీహెచ్ఎంసీ వర్గాల్లో ఈ ఘటన తీవ్ర కలకలం సృష్టించింది. గాజులరామారం పరిధిలో వెలుగుచూసిన ఈ ఘటనను జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్ తీవ్రంగా పరిగణించారు. ఫలితంగా మహిళా పారిశుధ్య కార్మికులను వేధింపులకు గురిచేసిన ఇద్దరు శానిటరీ ఫీల్డ్ అసిస్టెంట్లు (ఎస్ఎఫ్ఏలు) కిషన్, ప్రణయ్‌లను విధుల నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. జీహెచ్ఎంసీ వర్గాల సమాచారం ప్రకారం.. కిషన్‌ది మెదక్ జిల్లా. కుటుంబసభ్యులతో కలిసి సూరారం కాలనీలో నివాసం ఉంటున్నాడు. స్థానికంగా ఉన్న ఓ చర్చికి పెద్దగా కూడా వ్యవహరిస్తున్నాడు. జీహెచ్ఎంసీలో ఐదేళ్లుగా ఎస్ఎఫ్ఏగా పనిచేస్తున్న కిషన్, మూడేళ్లక్రితం కూకట్‌పల్లి సర్కిల్ నుంచి గాజులరామారం సర్కిల్‌కు బదిలీపై వచ్చాడు. అతడి వద్ద 21 మంది కార్మికులు ఉండగా, వీరిలో ఎక్కువ మంది మహిళలే ఉన్నారు. మహిళల్లో కొందరిని కిషన్ బెదిరింపులకు గురిచేస్తూ లైంగికంగా వేధిస్తున్నాడు. మహిళా కార్మికుల పట్ల అసభ్యంగా ప్రవరిస్తునే ఆ దృశ్యాలను ఫోన్లో చిత్రీకరించుకునే కిషన్, తర్వాత వాటినే బాధితులకు చూపించి లొంగదీసుకునే ప్రయత్నం చేస్తాడని సమాచారం. కాగా కిషన్, తన కుమార్తె పెళ్లి సమయంలో ఫోన్‌ను మరో ఎస్ఎఫ్ఏ అయిన ప్రణయ్ వద్ద ఉంచాడు. ఫోన్లో మహిళా కార్మికుల పట్ల కిషన్ చేష్టలను చూసిన ప్రణయ్.. ఆ వీడియోలన్నింటినీ తన ఫోన్‌లోకి పంపుకొన్నట్లు తెలుస్తోంది. ఆ వీడియోలే ఇప్పుడు బయటపడుతున్నాయి. ఈ క్రమంలో కూకట్‌పల్లి జోన్‌లోని గాజుల రామారం సర్కిల్ పరిధిలో ఓ పారిశుధ్య కార్మికురాలితో ఎస్ఎఫ్ఏ కిషన్ అసభ్యంగా ప్రవర్తిస్తున్న తాలూకు వీడియో గురువారం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయింది. దీనిపై స్పందించిన జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్ ఘటనపై విచారణ జరిపి వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని జోనల్ కమిషనర్ అభిలాష అభినవ్‌ను ఆదేశించారు. దీంతో సర్కిల్ డిప్యూటీ మునిసిపల్ కమిషనర్, అసిస్టెంట్ మెడికల్ ఆఫీసర్ ఆఫ్ హెల్త్(ఏఎంఓహెచ్) నుంచి ఆమె నివేదిక తెప్పించుకున్నారు. అనంతరం కిషన్, ప్రణయ్‌ను వెంటనే విధుల నుంచి తొలగిస్తూ ఆదేశాలు జారీ చేశారు. తదుపరి చర్యల కోసం ఘటనపై పోలీసులకూ ఫిర్యాదు చేశారు. ప్రణయ్ పట్ల మహిళా కార్మికుల్లో కొందరి నుంచి ఫిర్యాదులు అందడం.. వాటిని వాస్తవం అని నిర్ధారించుకున్నాకే అతడినీ విధుల నుంచి తొలగించినట్లు చెబుతున్నారు. కాగా ఏళ్లుగా ఒకేచోట పాతుకుపోయిన ఎస్ఎఫ్ఏల్లో కొందరు మహిళా కార్మికులపై పెత్త చేస్తున్నారని, విధులకు ఐదు నిమిషాలు ఆలస్యమైనా హాజరు వేయబోమని బెదిరిస్తున్నారని, సెలవులు అడిగితే ఇవ్వకుండా ఇబ్బంది పెడుతూ.. కోరిక తీర్చాలని ఒత్తిడి తెస్తున్నారని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

దాజీకి 'ఫ్రీడమ్ ఆఫ్ ది సిటీ ఆఫ్ లండన్' అవార్డు


అవార్డు అందుకుంటున్న దాజీ

హైదరాబాద్, నందిగామ, మే 23 (ఆంధ్రజ్యోతి): విద్యా, ఆరోగ్యం, పర్యావరణ రంగాల్లో చేసిన విశేష కృషికిగాను శ్రీ రామచంద్ర మిషన్ అధ్యక్షుడు దాజీకి ప్రతిష్ఠాత్మక ఫ్రీడమ్ ఆఫ్ ది సిటీ ఆఫ్ లండన్ అవార్డు లభించింది. గురువారం లండన్‌లోని గిల్డ్‌హాల్‌లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన ఈ అవార్డును అందుకున్నారు. దాజీ అసలు పేరు కమలేశ్ పటేల్. రంగారెడ్డి జిల్లా నందిగామ మండలంలోని కన్హాశాంతివనంలో నిర్వహిస్తున్న రామచంద్ర మిషన్ ద్వారా ప్రజలకు ఆయన సేవా చేస్తున్నారు. దాజీ ప్రపంచంలోని 160 దేశాల్లో గల రామచంద్ర మిషన్ హార్ట్‌ఫుల్ నెస్ సెంటర్లకు గైడ్‌గా వ్యవహరిస్తున్నారు. ఫ్రీడమ్ ఆఫ్ ది సిటీ ఆఫ్ లండన్ అవార్డ్ 'లండన్ నగర' శక్తిని చాటిచెప్పే గొప్ప గౌరవంగా భావిస్తారు. ఈ సందర్భంగా కమలేశ్ పటేల్ సంతోషం వ్యక్తం చేశారు.

నైట్–హెన్నెస్సీ స్కాలర్‌షిప్‌కు

రాహుల్ పెనుమాక ఎంపిక

హైదరాబాద్, మే 23 (ఆంధ్రజ్యోతి): ప్రఖ్యాత నైట్- హెన్నెస్సీ స్కాలర్‌షిప్‌కు హైదరాబాద్ చెందిన రాహుల్ పెనుమాక ఎంపికయ్యారు. ఈ స్కాలర్‌షిప్‌కు ఎంపికైన వారికి స్టాన్‌ఫోర్డ్ విశ్వవిద్యాలయంలోని మొత్తం ఏడు స్కూల్స్‌లో బహుముఖ అవకాశాలు ఇస్తారు. దీని ద్వారా మూడు సంవత్సరాల పాటు ఉపకార వేతనం అందిస్తారు. రాహుల్ పెనుమాక ప్రస్తుతం స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ మెడిసిన్‌లో ట్రాన్స్‌లేషనల్ రిసెర్చ్, అప్లైడ్ మెడిసిన్‌లో మాస్టర్స్ చేస్తున్నారు. లండన్ ఇంపీరియల్ కళాశాల నుంచి ఆయన ఫార్మకాలజీ(ఔషధ శాస్త్రం)లో డిగ్రీ పట్టా పొందారు. రిటైర్డ్ ఐఏఎస్ అధికారి పీవీ రమేష్ కుమారుడైన రాహుల్ పెనుమాక వైద్య రంగంలో పలు అధ్యయనాలు చేశారు.

వనపర్తి జిల్లాలో..

కల్లం వద్ద నిద్రిస్తుండగా నరికి చంపిన దుండగులు

బీఆర్ఎస్ నాయకుడి హత్య

- రాజకీయ కక్షలే కారణమంటూ కుటుంబ సభ్యుల ఫిర్యాదు


శ్రీధర్‌రెడ్డి కుటుంబ సభ్యులను ఓదారుస్తున్న కేటీఆర్

వనపర్తి క్రైం/కొల్లాపూర్/హైదరాబాద్, మే 23 (ఆంధ్రజ్యోతి): వనపర్తి జిల్లా చిన్నంబావి మండలం లక్ష్మీపల్లి గ్రామంలో బొడ్డు శ్రీధర్ రెడ్డి (52) అనే బీఆర్ఎస్ నాయకుడు దారుణ హత్యకు గురయ్యారు. బుధవారం అర్ధరాత్రి తన సొంత పొలంలోని కల్లం దొడ్డి వద్ద నిద్రిస్తున్న శ్రీధర్‌రెడ్డిని దుండగులు గొడ్డలితో నరికిచంపారు. ఈ హత్యకు రాజకీయ కక్షలే కారణమని మృతుడి కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయగా, బీఆర్ఎస్ నేతలు మృతదేహంతో ర్యాలీ నిర్వహించి ఆందోళన చేపట్టారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు ప్రకారం.. శ్రీధర్‌రెడ్డి బీఆర్ఎస్‌లో కీలక నాయకుడిగా, మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డికి ముఖ్య అనుచరుడిగా కొనసాగుతున్నారు. కాగా, కల్లం వద్ద మిర్చి నిల్వలు ఉండటంతో కొద్దిరోజులుగా ఆయన అక్కడే నిద్రిస్తున్నారు. బుధవారం రాత్రి కూడా అక్కడే నిద్రించారు. అయితే.. గురువారం ఉదయం కల్లం వద్దకు పాలు పితకడానికి వెళ్లిన శ్రీధర్‌రెడ్డి తండ్రి శేఖర్‌రెడ్డి.. తన కుమారుడు హత్యకు గురై విగత జీవిగా పడి ఉండటాన్ని గమనించారు. వెంటనే గ్రామస్థుల సాయంతో పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టిన పోలీసులు.. డాగ్‌స్క్వాడ్‌తో పరిసర ప్రాంతాలను తనిఖీ చేయగా, ఒక పాయింట్ వద్దకు వెళ్లి డాగ్‌స్క్వాడ్ తిరిగి వచ్చింది. అయితే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత తన కుమారుడిపై హత్యకు కుట్ర చేశారని మృతుడి తండ్రి శేఖర్‌రెడ్డి ఆరోపించారు. పలుమార్లు తనకు మంత్రి జూపల్లి కృష్ణారావు, మాజీ జడ్పీటీసీ సభ్యుడు కృష్ణప్రసాద్‌ల నుంచి ప్రాణహాని ఉందని చెప్పాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఐపీసీ సెక్షన్ 302 కింద కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని వనపర్తి సీఐ నాగభూషణ్ రావు తెలిపారు.

జూపల్లి బాధ్యత వహించాలి: కేటీఆర్

శ్రీధర్‌రెడ్డి హత్య విషయం తెలుసుకొని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గ్రామానికి చేరుకున్నారు. మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం, స్థానిక మంత్రి జూపల్లి కృష్ణారావు ఈ హత్యకు బాధ్యత వహించాలన్నారు. జూపల్లిని బర్తరఫ్ చేసి జ్యుడీషియల్ లేదా ఎస్ఐబీ ద్వారా విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. తెలంగాణలోని లేని ఫ్యాక్షన్ సంస్కృతిని కొల్లాపూర్‌లో జూపల్లి అమల్లోకి తెచ్చారని, 4 నెలల్లో ఇద్దరు బీఆర్ఎస్ నాయకులు హత్యకు గురయ్యారని అన్నారు. మంత్రిని బర్తరఫ్ చేసి సీఎం రేవంత్ చిత్తశుద్ధి నిరూపించుకోవాలన్నారు.

భూ తగాదాలు, ఆర్థిక లావాదేవీల వల్లే..

బీఆర్ఎస్ నేతల ఆరోపణలను మంత్రి జూపల్లి కృష్ణారావు ఖండించారు. శ్రీధర్‌రెడ్డి హత్యకు దురలవాట్లు, భూ తగాదాలు, ఆర్థిక లావాదేవీలే కారణమన్నారు. వ్యక్తిగత కారణాల వల్ల జరిగిన హత్యను రాజకీయ హత్యగా కేటీఆర్, బీఆర్ఎస్ నాయకులు చిత్రీకరించడం దుర్మార్గమని మండిపడ్డారు. ఏం జరిగిందో తెలుసుకోకుండానే తనపై బురదజల్లేందుకు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్, కేటీఆర్ నీచరాజకీయాలు పరాకాష్ఠకు చేరుకున్నాయని, ఇకనైనా శవరాజకీయాలు చేయడం మానుకోవాలని హితవు పలికారు. శ్రీధర్ రెడ్డి హత్యపై పోలీసులు నిష్పక్షపాతంగా దర్యాప్తు చేస్తున్నారని, విచారణలో అన్ని విషయాలు వెలుగులోకి వస్తాయని అన్నారు.

ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్

- ఏడుగురు మావోయిస్టుల మృతి
- అధునాతన తుపాకుల స్వాధీనం

చర్ల, మే 23: భద్రతా బలగాలు, మావోయిస్టుల మధ్య కాల్పుల మోతతో ఛత్తీస్‌గఢ్ అడవులు మరోసారి దద్దరిల్లాయి.. 'ఆపరేషన్ కగార్' పేరుతో నిర్వహిస్తున్న కూంబింగ్‌లో భాగంగా బీజాపూర్, నారాయణపూర్ జిల్లాల సరిహద్దు అడవుల్లో గురువారం భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. ఈ ఎన్‌కౌంటర్‌లో ఏడుగురు మావోయిస్టులు మృతిచెందారు. తాజాగా బస్తర్ డివిజన్‌లో బలగాలు ప్రత్యేక ఆపరేషన్ కొనసాగిస్తున్నాయి. ఈ క్రమంలో బీజాపూర్, నారాయణపూర్ జిల్లా అడవుల్లో మావోయిస్టు పార్టీకి చెందిన ఇంద్రావతి ఏరియా కమిటీ, పీఎల్‌జీఏ ప్లాటూన్ 16 బెటాలియన్ సభ్యులున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. బీజాపూర్, నారాయణపూర్, దంతెవాడ, జిల్లాలకు చెందిన డీఆర్‌జీ, ఎస్టీఎఫ్, బస్తర్ ఫైటర్స్ చెందిన 800 మంది బలగాలు బుధవారం సాయంత్రం నుంచి సరిహద్దు అడవుల్లో కూబింగ్ చేపట్టాయి. ఈ క్రమంలోనే బలగాలు-మావోయిస్టుల మధ్య ఎన్‌కౌంటర్ జరిగిందని దంతెవాడ ఎస్పీ గౌరవ్‌రాయ్ వెల్లడించారు. ఘటన అనంతరం పరిసరాలను పరిశీలించగా ఏడుగురు మావోయిస్టుల మృతదేహాలు కనిపించాయని, అక్కడి నుంచి ఏడు అధునాతన తుపాకులను బలగాలు స్వాధీనం చేసుకున్నాయని చెప్పారు. మృతులెవరనేది పోలీసులు ఇంకా గుర్తించలేదు. మృతులంతా ఇంద్రావతి ఏరియా కమిటీ, పీఎల్‌జీ-16 బెటాలియన్ సభ్యులని పోలీసులు చెబుతున్నారు. ఈ ఘటనలో చాలామంది మావోయిస్టులు గాయపడ్డారని, మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని బలగాలు చెబుతున్నాయి. తప్పించుకున్న వారికోసం గాలింపు ముమ్మరం చేశామని ఎస్పీ తెలిపారు.

వరుస దెబ్బలు

వరుస ఎన్‌కౌంటర్లు, లొంగుబాట్లతో మావోయిస్టు పార్టీకి కోలుకోలేని దెబ్బతగులుతోంది. గత 70 రోజుల వ్యవధిలో తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర సరిహద్దు అడవుల్లో జరిగిన ఎన్‌కౌంటర్లలో 101 మంది మావోయిస్టులు మృతి చెందారు. బస్తర్ డివిజన్‌లోని దంతెవాడ, సుకుమా, బీజాపూర్ జిల్లాల్లో మావోయిస్టులు లొంగిపోతున్నారు. 70 రోజుల వ్యవధిలో సుమారు 151మంది మావోయిస్టులు లొంగిపోయారు. మరి.. ఈ స్థాయిలో మావోయిస్టుల ఆనుపానులు బలగాలు ఎలా కనుక్కోగలుతున్నాయి? దీనికి బలగాలు వాడుతున్న సాంకేతిక పరిజ్ఞానమే కారణం అని తెలుస్తోంది. సైలెన్స్ డ్రోన్లతో కూడిన కెమెరాలను వినియోగించి వారి కదలికలను గుర్తిస్తున్నట్లు సమాచారం. ఈ డ్రోన్లనే వినియోగించి రెండు నెలల క్రితం తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ సరిహద్దు అడవుల్లోని కర్రిగుట్టలపై మావోయిస్టు నాయకుడు సాగర్ అలియాస్ సంతోష్, అతడి టీమ్ సభ్యులను గుర్తించి ఎన్‌కౌంటర్ చేసినట్లు తెలుస్తోంది. ఇదే విధంగా సైలెన్స్ డ్రోన్‌లను వినియోగించి బస్తర్ అడవుల్లో మావోయిస్టులను కూడా గుర్తిస్తున్నారని తెలుస్తోంది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., printed at Aamoda Press, H.No.5-9-287/10 & 11, Plot No. 53 & 54, Prasanth Towers, Rajeev Gandhi Nagar, Moosapet, Kukatpally (Mandal), Kukatpally Municipality, Ranga Reddy District and Published at Plot No.76, Ashwini Layout, Huda Heights, Road No.70, Jubilee Hills, Hyderabad-500033. Editor: K. Srinivas. Fax No. 23558288, Phone No: 23558233 / 44 / 55, Regd. No.H/HD 674, RNI No.44903 / 86. Managing Director: Vemuri Radha Krishna, Founder: K.L.N.Prasad.

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
హైదరాబాద్ ● శుక్రవారం 24 మే 2024
diksuchi@andhrajyothy.com

ఎంటెక్



పుణె ఐఐఐటీ

పుణెలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐఐఐటీపీ)- ఎంటెక్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగాల్లో ప్రోగ్రామ్ అందుబాటులో ఉంది. సీఎస్ఈలో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, ఈసీఈలో ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ స్పెషలైజేషన్‌లు ఉన్నాయి. ప్రోగ్రామ్‌లో భాగంగా మొదటి ఏడాది కోర్సు వర్క్‌లు; రెండో ఏడాది ప్రాజెక్ట్ వర్క్‌లు, థీసిస్ సబ్మిషన్ ఉంటాయి. సంస్థ నిర్వహించే రాత పరీక్ష, ఇంటర్వ్యూల ద్వారా అభ్యర్థులను ఎంపిక చేసి అడ్మిషన్స్ ఇస్తారు.

సీట్లు: ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ స్పెషలైజేషన్‌లో 24 సీట్లు, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ స్పెషలైజేషన్‌లో 10 సీట్లు చొప్పున మొత్తం 34 సీట్లు ఉన్నాయి. ప్రభుత్వ నిబంధనల మేరకు రిజర్వేషన్లు వర్తిస్తాయి.

అర్హత: ప్రథమ శ్రేణి మార్కులతో సంబంధిత ఇంజనీరింగ్ విభాగాల్లో బీఈ/బీటెక్/ఎమ్మెస్సీ లేదా ఎంసీఏ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఐఐటీలు, నిట్‌లు, ఐఐఐటీలు, సీఎఫ్‌టీఐ సంస్థల నుంచి ఇంజనీరింగ్ డిగ్రీ పూర్తిచేసినవారికి ప్రాధాన్యం ఉంటుంది.

రాత పరీక్ష వివరాలు

- ఈసీఈ విభాగానికి నిర్వహించే ఎగ్జామ్‌లో ఇంజనీరింగ్ మేథమెటిక్స్, నెట్‌వర్క్స్, సిగ్నల్స్ అండ్ సిస్టమ్స్, ఎలక్ట్రానిక్ డివైసెస్, అనలాగ్ సర్క్యూట్స్, డిజిటల్ సర్క్యూట్స్, కంట్రోల్ సిస్టమ్స్, కమ్యూనికేషన్స్, ఎలక్ట్రోమేగ్నటిక్స్ అంశాలనుంచి గేట్ సిలబస్ ప్రకారం ప్రశ్నలు అడుగుతారు.
- సీఎస్ఈ విభాగానికి నిర్వహించే ఎగ్జామ్‌లో ఇంజనీరింగ్ మేథమెటిక్స్, డిజిటల్ లాజిక్, కంప్యూటర్ ఆర్గనైజేషన్ అండ్ ఆర్కిటెక్చర్, ప్రోగ్రామింగ్ అండ్ డేటా స్ట్రక్చర్స్, అల్గారిథమ్స్ థియరీ ఆఫ్ కంప్యూటేషన్, కంపైలర్ డిజైన్, ఆపరేటింగ్ సిస్టమ్, డేటా బేస్, కంప్యూటర్ నెట్‌వర్క్స్, సాఫ్ట్‌వేర్ ఇంజనీరింగ్ అంశాల నుంచి ప్రశ్నలు అడుగుతారు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.590; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.295
- **స్పీడ్ పోస్ట్/రిజిస్టర్డ్ పోస్ట్/కొరియర్ ద్వారా దరఖాస్తు చేరేందుకు చివరి తేదీ:** జూన్ 10
- **చిరునామా:** ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ-పుణె(ఐఐఐటీపీ), పుణె సర్వే నెం.9/1/3, అంబెగాన్ బద్రుక్, సింహగడ్ ఇన్‌స్టిట్యూట్ రోడ్, పుణె-411041
- **వెబ్‌సైట్:** www.iiitp.ac.in

విట్

వెల్లూరు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(విట్)- ఇంటిగ్రేటెడ్ ఎంటెక్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ప్రోగ్రామ్ వ్యవధి అయిదేళ్లు. వెల్లూరు, చెన్నై, ఏపీ, భోపాల్ క్యాంపస్‌లు అందుబాటులో ఉన్నాయి. ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సులో సాధించిన మార్కుల ఆధారంగా ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తారు. అకడమిక్ మెరిట్ ప్రకారం మూడు కేటగిరీల కింద అభ్యర్థులను షార్ట్‌లిస్ట్ చేస్తారు. పురుషులకు, మహిళలకు విడివిడిగా హాస్టల్ సౌకర్యం ఉంది.

క్యాంపస్‌లు - ప్రోగ్రామ్ స్పెషలైజేషన్‌లు

విట్ వెల్లూరు: సాఫ్ట్‌వేర్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్(వర్చ్యూసా సహకారంతో), కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్(డేటా సైన్స్)

- **విట్ చెన్నై:** సాఫ్ట్‌వేర్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్(బిజినెస్ అనలిటిక్స్)
- **విట్ ఏపీ:** సాఫ్ట్‌వేర్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్(వర్చ్యూసా సహకారంతో)
- **విట్ భోపాల్:** ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్(సైబర్ సెక్యూరిటీ), కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్(కంప్యూటేషనల్ అండ్ డేటా సైన్స్)

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి మేథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్/పన్నెండో తరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. కనీసం 65 శాతం మార్కులు తప్పనిసరి. అభ్యర్థులు 2004 జూలై 1న లేదా ఆ తరవాత జన్మించి ఉండాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 55 శాతం మార్కులు చాలు. ఎన్ఐఓఎస్, కరస్పాండెన్స్ అభ్యర్థులు దరఖాస్తుకు అనర్హులు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** రూ.600
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మే 31
- **దరఖాస్తుతోపాటు అప్‌లోడ్ చేయాల్సిన పత్రాలు:** పదోతరగతి సర్టిఫికెట్, ఇంటర్/పన్నెండోతరగతి మార్కుల పత్రాలు, ఆధార్ కార్డ్
- **ఎంపికైన అభ్యర్థుల షార్ట్‌లిస్ట్ విడుదల:** జూన్ 10
- **క్యాంపస్, స్పెషలైజేషన్‌ల ప్రాధాన్యాలు తెలిపే తేదీలు:** జూన్ 10 నుంచి 12 వరకు
- **సీట్ల అలాట్‌మెంట్:** జూన్ 19
- **అడ్వాన్స్ ట్యూషన్ ఫీజు చెల్లించేందుకు చివరి తేదీ:** జూలై 1
- **ట్యూషన్ ఫీజు మొత్తం చెల్లించేందుకు చివరి తేదీ:** జూలై 7
- **వెబ్‌సైట్:** www.vit.ac.in

ఐఐటీ గువహటీలో బీఎస్సీ ఆనర్స్

గువహటీలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీజీ)- 'బ్యాచిలర్ ఆఫ్ సైన్స్ (ఆనర్స్) ఇన్ డేటాసైన్స్ అండ్ ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్' సెప్టెంబరు సెషన్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. దీనిని కోర్సెరా ప్లాట్‌ఫాంలో నిర్వహిస్తున్నారు. ఇది ఆన్‌లైన్ ప్రోగ్రామ్. దీనికి 'మెహతా ఫ్యామిలీ స్కూల్ ఆఫ్ డేటా సైన్స్ అండ్ ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్' సహకారం అందిస్తోంది. క్వాలిఫయర్ టెస్ట్ ద్వారా ప్రవేశాలు కల్పిస్తారు. ఏ సంవత్సరంలోనైనా జేఈఈ(అడ్వాన్స్‌డ్)కు రిజిస్ట్రేషన్ చేసుకున్న అభ్యర్థులకు నేరుగా అడ్మిషన్ ఇస్తారు. ప్రోగ్రామ్ పూర్తిచేసిన అభ్యర్థులకు ప్లేస్‌మెంట్స్ కల్పించడంలో సంస్థ సహకారం అందిస్తుంది. ఆసక్తిగలవారు ఐఐటీ గువహటీ అలూమ్నీ నెట్‌వర్క్‌లో చేరవచ్చు.

ప్రోగ్రామ్ వివరాలు

- ప్రోగ్రామ్ వ్యవధి నాలుగేళ్లు. గరిష్ఠంగా ఎనిమిదేళ్లలో పూర్తిచేయవచ్చు. ఏడాదికి మూడు టర్మ్‌లు ఉంటాయి. ఒక్కో టర్మ్ వ్యవధి 12 వారాలు. టర్మ్‌ల మధ్య రెండు వారాల గ్యాప్ ఉంటుంది. ప్రోగ్రామ్ మొత్తానికి 299 క్రెడిట్లు నిర్దేశించారు. ప్రోగ్రామ్‌లో మల్టీ ఎగ్జిట్ ఆప్షన్స్ ఉన్నాయి. ఏటా నిర్దేశించిన కోర్సులు పూర్తిచేసి సంబంధిత సర్టిఫికెట్‌తో ప్రోగ్రామ్ నుంచి వైదొలగే వీలుంది.
- మొదటి ఏడాది కోర్సు పూర్తిచేసి అడ్వాన్స్‌డ్ సర్టిఫికెట్ ఇన్ డేటాసైన్స్ అండ్ ఏఐ; రెండేళ్ల కోర్సు పూర్తిచేసి డిప్లొమా ఇన్ డేటాసైన్స్ అండ్ ఏఐ; మూడేళ్ల కోర్సు పూర్తిచేసి బీఎస్సీ డిగ్రీ ఇన్ డేటాసైన్స్ అండ్ ఏఐ; నాలుగేళ్లూ పూర్తిచేసి బీఎస్సీ ఆనర్స్ ఇన్ డేటాసైన్స్ అండ్ ఏఐ సర్టిఫికెట్‌లు పొందవచ్చు.
- ఆంగ్ల మాధ్యమంలో బోధన ఉంటుంది. రికార్డెడ్ వీడియోస్, లైవ్ సెషన్స్ ద్వారా సంస్థ ఫ్యాకల్టీ మెంబర్లు తరగతులు నిర్వహిస్తారు. ప్రోగ్రామ్‌లో భాగంగా డిస్కషన్ అవర్స్, ఇండస్ట్రియల్ ఇంటరాక్షన్స్, గెస్ట్ లెక్చర్స్ ఇండస్ట్రీ కోర్సులు, నాలుగు వారాల క్యాంపస్ ఇమ్మర్షన్ ప్లాన్, ఇంటర్న్‌షిప్స్, క్యాప్‌స్టోన్ ప్రాజెక్టులు ఉంటాయి.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి మేథమెటిక్స్ ఒక సబ్జెక్ట్‌గా ప్రథమ శ్రేణి మార్కులతో ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు. మూడేళ్ల డిప్లొమా పూర్తిచేసినవారు, హెచ్ఎస్‌సీ ఒకేషనల్ ఎగ్జామ్ ఉత్తీర్ణులు, ఎన్ఐఓఎస్ అభ్యర్థులు, నేషనల్ డిఫెన్స్ అకాడమీ ఆధ్వర్యంలోని జాయింట్ సర్వీసెస్ వింగ్ నిర్వహించే రెండేళ్ల కోర్సు ఉత్తీర్ణులు, వర్కింగ్ ప్రొఫెషనల్స్ కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

అడ్మిషన్ వివరాలు: ఈ ప్రోగ్రామ్‌లో చేరదలచుకున్న అభ్యర్థులు ముందుగా నాలుగు మాడ్యూళ్ల వ్యవధిగల మేథమెటిక్స్ ప్రిపరేటరీ కోర్సు పూర్తిచేసి బేసిక్ మేథమెటిక్స్ ఆప్టిట్యూడ్ టెస్ట్(క్వాలిఫయర్ టెస్ట్) రాయాల్సి ఉంటుంది. ఇది 80 మార్కులకు ఉంటుంది. పరీక్ష సమయం రెండు గంటలు.

- అభ్యర్థుల దరఖాస్తులు పరిశీలించి అర్హులైన వారికి ఈ మెయిల్ ద్వారా పేమెంట్ లింక్ పంపుతారు. దీని ద్వారా అభ్యర్థులు రూ.2000 చెల్లించాలి. వీరికి వెంటనే ప్రిపరేటరీ కోర్సుకు సంబంధించిన ఆన్‌లైన్ యాక్సెస్ పంపుతారు.
- క్వాలిఫయర్ టెస్ట్ స్కోర్, పదోతరగతి మార్కులు, ఇంటర్/పన్నెండోతరగతి మార్కుల ఆధారంగా రూపొందించిన కాంపోజిట్ స్కోర్ ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** రూ.500
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 20
- **తరగతులు ప్రారంభం:** సెప్టెంబరు 2 నుంచి
- **వెబ్‌సైట్:** iitg.ac.in



రాయ్‌పూర్ ఎయిమ్స్‌లో ఎంపీహెచ్

రాయ్‌పూర్‌లోని ఆలిండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్)- 'మాస్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్(ఎంపీహెచ్)' ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఎంట్రెన్స్ ఎగ్జామ్ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. మొత్తం ఆరు సీట్లు ఉన్నాయి. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. అడ్మిషన్ పొందిన అభ్యర్థులకు రూ.25000ల స్టయిపెండ్ చెల్లిస్తారు.

అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ఎంబీబీఎస్/బీడీఎస్/ బీఏఎంఎస్/ బీహెచ్ఎంఎస్/బీఎన్‌వైఎస్/బీయూఎంఎస్/బీఎస్ఎంఎస్/ బీటెక్/బీఈ/బీవీఎస్సీ ఉత్తీర్ణులు; నర్సింగ్ సైన్సెస్, ఫిజియోథెరపీ, ఆక్యుపేషనల్ థెరపీ, ఫార్మసీ కోర్సులు చేసినవారు; పీజీ(స్టాటిస్టిక్స్/ బయోస్టాటిస్టిక్స్/డెమోగ్రఫీ/పాపులేషన్ స్టడీస్/న్యూట్రిషన్/ సోషియాలజీ/ఎకనామిక్స్/సైకాలజీ/ఆంత్రపాలజీ/సోషల్ వర్క్/మేనేజ్‌మెంట్/లా) ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు.

ఎంట్రెన్స్ ఎగ్జామ్: దీనిని ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహిస్తారు. ఇందులో పాపులేషన్ సైన్సెస్, బయోస్టాటిస్టిక్స్, ఎపిడిమియాలజీ, హెల్త్ ఎకనామిక్స్ నేషనల్ హెల్త్ ప్రోగ్రామ్, కంప్యూటర్ నాలెడ్జ్, ఇంగ్లీష్ అంశాల నుంచి మొత్తం 100 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు అడుగుతారు. ప్రశ్నకు ఒక మార్కు చొప్పున మొత్తం మార్కులు 100. నెగెటివ్ మార్కులు లేవు. పరీక్ష సమయం గంటన్నర. ఈ పరీక్షలో అర్హత పొందాలంటే కనీసం 50 శాతం మార్కులు సాధించాల్సి ఉంటుంది.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ అభ్యర్థులకు రూ.1500; ఈడబ్ల్యూఎస్, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.1200; దివ్యాంగులకు ఫీజు మినహాయింపు వర్తిస్తుంది.
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 2
- **అభ్యర్థుల ఈ మెయిల్‌కు అడ్మిట్ కార్డులు పంపు తేదీ:** జూన్ 17
- **పరీక్ష కేంద్రం:** ఎయిమ్స్ రాయ్‌పూర్
- **ఎంట్రెన్స్ ఎగ్జామ్ తేదీ:** జూన్ 26
- **జాయినింగ్ రిపోర్ట్‌కు చివరి తేదీ:** జూలై 31
- **వెబ్‌సైట్:** www.aiimsraipur.edu.in

జాబ్ కార్నర్

ఏపీ వైద్య కళాశాలల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్లు

ఖాళీలు 29

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, డైరెక్టరేట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్... డైరెక్ట్ ఎంట్రీ, లేటరల్ ఎంట్రీ ద్వారా కొత్త మెడికల్ కాలేజీల్లో కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టు: అసిస్టెంట్ ప్రొఫెసర్

అర్హత: సంబంధిత విభాగంలో మెడికల్ పీజీ(ఎండీ, ఎంఎస్, డీఎన్‌బీ, డీఎం) ఉత్తీర్ణులై ఉండాలి.

స్పెషాలిటీ: మైక్రోబయాలజీ అండ్ ఫార్మకాలజీ, అనాటమీ, బయోకెమిస్ట్రీ, ఫిజియాలజీ

వయోపరిమితి: 42 సంవత్సరాలు మించకూడదు

ఎంపిక విధానం: విద్యార్హతలో సాధించిన మార్కులు, పని అనుభవం, రూల్ ఆఫ్ రిజర్వేషన్ తదితరాల ఆధారంగా ఎంపిక చేస్తారు.

దరఖాస్తు రుసుము: రూ.100. బీసీ, ఎస్సీ, ఈడబ్ల్యూఎస్, ఎస్టీ, పీహెచ్ అభ్యర్థులకు రూ.500.

ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ: మే 25

వెబ్‌సైట్: https://dme.ap.nic.in/



జేకే బ్యాంకులో అప్రెంటిస్‌లు

ఖాళీలు 276

జమ్మూ అండ్ కశ్మీర్ బ్యాంకు... అప్రెంటిస్ ఖాళీల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ/ఇన్‌స్టిట్యూట్ నుంచి గ్రాడ్యుయేషన్ ఉత్తీర్ణులై ఉండాలి. సంబంధిత స్థానిక భాషలో ప్రావీణ్యం కలిగి ఉండాలి. స్థానిక అభ్యర్థుకు ప్రాధాన్యం ఉంటుంది.

వయసు: 2024 జనవరి 1 నాటికి 20-28 ఏళ్ల మధ్య ఉండాలి.

శిక్షణ వ్యవధి: ఒక సంవత్సరం **స్టయిపెండ్:** నెలకు రూ.10,500

ఎంపిక ప్రక్రియ: ఆన్‌లైన్ రాత పరీక్ష, డాక్యుమెంట్ వెరిఫికేషన్ తదితరాల ఆధారంగా

దరఖాస్తు రుసుము: అన్‌రిజర్వ్‌డ్ కేటగిరీకి రూ.700. రిజర్వ్‌డ్ అభ్యర్థులకు రూ.500

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: మే 28

వెబ్‌సైట్: https://www.jkbank.com/

బీఎస్ఎఫ్‌లో కానిస్టేబుల్ పోస్టులు

ఖాళీలు 34

కేంద్ర హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ, డైరెక్టరేట్ జనరల్ బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్... కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి అర్హులైన పురుష, మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టుల వివరాలు

1. ఎస్ఐ(వెహికల్ మెకానిక్): 3 పోస్టులు
2. కానిస్టేబుల్(ఓటీఆర్‌పీ): 1 పోస్టు
3. కానిస్టేబుల్(ఎస్‌కేటీ): 1 పోస్టు
4. కానిస్టేబుల్(ఫిట్టర్): 4 పోస్టులు
5. కానిస్టేబుల్(కార్పెంటర్): 2 పోస్టులు
6. కానిస్టేబుల్(ఏఈ): 1 పోస్టు
7. కానిస్టేబుల్(వెహికిల్ మెకానిక్): 22 పోస్టులు
8. కానిస్టేబుల్(బీఎస్‌టీఎస్): 2 పోస్టులు
9. కానిస్టేబుల్(అప్‌హోల్‌స్టర్): 1 పోస్టు

అర్హత: మెట్రిక్యులేషన్, సంబంధిత ట్రేడులో ఐటీఐ, డిప్లొమా/డిగ్రీ(ఆటో మొబైల్ ఇంజనీరింగ్/మెకానికల్ ఇంజనీరింగ్) ఉత్తీర్ణత తోపాటు పని అనుభవం ఉండాలి.

దరఖాస్తు రుసుము: గ్రూప్-బీకి రూ.200; గ్రూప్-సి పోస్టులకు రూ.100.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: జూన్ 17

వెబ్‌సైట్: https://rectt.bsf.gov.in/

ఐసెక్‌లో రీసెర్చ్ ఫెలో

ఖాళీలు 3

బెంగళూరులోని ఇన్‌స్టిట్యూట్ ఫర్ సోషల్ అండ్ ఎకనామిక్ చేంజ్(ఐఎస్ఈసీ), పాపులేషన్ రీసెర్చ్ సెంటర్‌లో ఒప్పంద ప్రాతిపదికన కింద పేర్కొన్న ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టుల వివరాలు

1. డేటా అసిస్టెంట్: 1 పోస్టు 2. రీసెర్చ్ ఫెలో: 2 పోస్టులు

అర్హత: డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి

జీతం: డేటా అసిస్టెంట్ పోస్టుకు నెలకు రూ.19,352, రీసెర్చ్ ఫెలో పోస్టుకు రూ.25,000

ఎంపిక: షార్ట్‌లిస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా

దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్ ద్వారా

దరఖాస్తుకు చివరి తేదీ: జూన్ 14

వెబ్‌సైట్: https://www.isec.ac.in/

డీఎంఆర్ఎల్‌లో ఐటీఐ అప్రెంటిస్‌లు

ఖాళీలు 127

కాంచన్‌బాగ్(హైదరాబాద్)లోని డీఆర్‌డీవోకి చెందిన డిఫెన్స్ మెటలర్జికల్ రీసెర్చ్ ల్యాబొరేటరీ(డీఎంఆర్ఎల్)...కింద పేర్కొన్న ఐటీఐ అప్రెంటిస్ ఖాళీల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

ట్రేడులు: సంబంధిత ట్రేడ్‌లో ఐటీఐ ఉత్తీర్ణత

దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌లో **చివరి తేదీ:** మే 31

వెబ్‌సైట్: https://www.drdo.gov.in/drdo/

లిటిల్స్



అడవికి రాజు... తెలివిలో ఘనాపాటి!

సింహం చాలా తెలివైనదని అందరూ చెప్పుకునేవాళ్లు. ఎందుకంటే.. చెప్పుడు మాటలు వినదు. పైగా ప్రతి విషయాన్ని ఒకటికి రెండుసార్లు ఆలోచిస్తుంది. మృగరాజు మాట అంటే మాటే. జంతువులన్నీ ఆ మాటకు కట్టుబడి ఉండేవి.


ఒకరోజు రాజుగారు అడవి జంతువులకు అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు. అన్ని జంతువులూ హాజరయ్యాయి. అడవికి రాజు కావాలనే ఆశ పులి, నక్కకు ఉంది. అయితే అవి మనసులోనే





ఎప్పటినుంచో బాధపడుతున్నాయి. మేము మీ సహాయకుడిగా ఉంటానని నక్క అడిగింది రాజుగారిని. 'అవసరం లేదు' అన్నది సింహం. 'మీకు మంత్రిగా ఉంటాను' అనడిగింది పులి. 'మాకేమి కావాలో బాగా తెలుసు. మీరు చెప్పాల్సిన అవసరం లేద'న్నది సింహం. ఎదురుగా గజగజ వణుకుతూ ఉండే కుందేలుని దగ్గరకు రమ్మని సింహం పిలిచింది. 'ఈరోజు నుంచి నువ్వే నా బాగోగులు చూడాలి' అన్నది. నా గుహ దగ్గరే నీ ఇల్లు అని చెప్పింది. అయిష్టంతోనే.. నేను శాకాహారిని.. రాజుగారు అన్నది. 'తెలుసు కాబట్టే నువ్వే మాకు సహాయంగా ఉండాలి' అన్నది. రాజు దగ్గర సహాయకుడిగా కుందేలు ఉండేది. అప్పుడప్పుడు అడవిలోకి వెళ్లి ఇష్టమైన ఆహారం తినేసి వచ్చేది. ఆ సమయంలోనే కుందేలును కలిసి నక్క ఒక ఉపాయం చెప్పింది. రాజుగారికి తెలిస్తే ఎలా? అన్నది కుందేలు. 'అది అసంభవం' అన్నది.


ఒకరోజు కుందేలు పరిగెత్తుకొచ్చింది. 'రాజావారు దగ్గర కొలనులో ఓ సింహం ఉంది. ఈ అడవికి ఇదే రాజంట' అన్నది. కుందేలుతో కలిసి సింహం బయలుదేరింది. కొలనులో సింహం రూపం కనిపించింది. 'నేను ఎంత అందంగా ఉన్నానో కదా!' అని కుందేలును అడిగింది. నీటి కొలను ముందు గాండ్రించింది. దూరంగా ఉండే నక్కకు ఈ మాటలేవీ వినపడలేదు. పరిగెత్తుకుంటూ క్షణాల్లో నక్క వెనకాలే సింహం దగ్గరకు వచ్చి ఆగింది. 'రాజుగారూ.. నీళ్లలో దూకి ఆ పొగరుబట్టిన సింహాన్ని సంహరించండి' అన్నది. నీళ్లలోకి దూకినట్లు ముందుకు ఎగిరి.. క్షణాలో వేగంగా వెనక్కి వచ్చింది. 'ఓహో.. తమరి తర్ఫీదా ఇది' అంటూ నక్క గొంతును కొరికేసింది సింహం. 'చెప్పుడు మాటలు ఇకమీదట వింటే నీకిదే గతి' అంటూ కుందేలుతో అన్నది. గజగజవణుకుతూ 'ఈసారి క్షమించండి' అన్నది. 'నీ మనసు నాకు తెలుసు. నా తెలివి నీకు తెలుసు' అంటూ సింహం నవ్వింది. కుందేలు కూడా గట్టిగా నవ్వింది.

6 తేడాలు గుర్తించండి









డైలీ సుడోకు - 315

8			7			3		
	7			4	1			
2					9			
						5	1	
9			1	7	4			6
	1	4						
			4					1
			8	3			5	
		2			7			9

సుడోకు - 314 సమాధానం

7	9	1	3	8	6	4	5	2
4	6	2	5	9	1	7	8	3
8	5	3	4	7	2	9	1	6
6	1	9	7	5	4	3	2	8
3	4	5	2	6	8	1	7	9
2	8	7	9	1	3	5	6	4
9	3	8	1	2	5	6	4	7
5	2	4	6	3	7	8	9	1
1	7	6	8	4	9	2	3	5

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.